
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 177
మంగళవారం 12-3-2024
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

ఆస్కార్ వేదికపై అణుబాంబు మోత



అణుబాంబు సౌండ్ అదిరింది.. క్రిస్టోఫర్ కల నిజమైంది.. 'ఆర్ఆర్ఆర్' నాటు నాటు ఆకర్షణగా నిలిచింది. ఫేక్ చప్పట్లతో మెస్సీ (శునకం). అమిర్‌ఖాన్ 'పీకే' తరహాలో జాన్ ప్రత్యక్షమవ్వడం చర్చలకు దారి తీసింది. ఇలా ఆనందాలు, విడ్డూరాలతో ఆస్కార్ అవార్డుల వేడుక జరిగింది.
12లో



ఇన్ని రోజులు ఏం చేశారు?
ఎలక్టోరల్ బాండ్ల ద్వారా పార్టీలు పొందిన విరాళాల వివరాలను ఈసీకి ఇవ్వాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.
వివరాలు 6లో ►



సాయిబాబా విడుదల సబబే..
ప్రొఫెసర్ సాయిబాబా విడుదలపై స్టే ఇవ్వాలని కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.
వివరాలు 6లో ►



నారీశక్తి అభివృద్ధికి..
ఎన్డీఏ ప్రభుత్వం హ్యాట్రిక్ ఖాయమని.. గెలిచాక మహిళల అభివృద్ధికి మరింతగా పాటుపడతామని ప్రధాని మోదీ తెలిపారు.
వివరాలు 6లో ►



గాల్లో కుదిపేసిన విమానం
ఆస్ట్రేలియా నుంచి చిలీకి వెళ్తున్న ఒక విమానం గాల్లో ఒక్కసారిగా కుదుపులకు లోనవ్వడంతో 50 మంది గాయపడ్డారు.
వివరాలు 6లో ►

ఫ్యాక్ట్‌చెక్
కుంభకర్ణ నిద్ర మీదే
రామోజీ
- రైతుభరోసాతో రూ.1,078.36 కోట్ల పెట్టుబడి సాయం
- సున్నా వడ్డీ రాయితీ కింద రూ.215.98 కోట్ల చెల్లింపు
- కరువు, మిచాంగ్ తుపాన్ సాయం రూ.1,294.58 కోట్లు
- వారం రోజుల వ్యవధిలోనే రూ.2,588.92 కోట్ల లబ్ధి

5లో

జనసేన సీట్లలో కోత
- బీజేపీకి సీట్ల సర్దుబాటుకు జనసేన అసెంబ్లీ స్థానాల్లో 3 తగ్గించిన బాబు
- జనసేనకు 21 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాలు
- బీజేపీకి 10 అసెంబ్లీ, 6 లోక్‌సభ స్థానాలు
- టీడీపీకి 144 ఎమ్మెల్యే, 17 ఎంపీ సీట్లు

3లో

టీడీపీ, జనసేన సోషల్ మీడియా మృగాల వికృత క్రీడ..
ఓ చెల్లెమ్మను చంపేశారు!
జగనన్న ఇంటి పట్టా ఇచ్చారని సంతోషంతో చెప్పటమే ఆమె నేరం
అమ్మ ఒడి, చేయూత, పింఛన్‌తో కుటుంబం బాగుపడిందనటమే తప్పయ్యింది

- ఓ యూట్యూబ్ చానల్‌కు సంతోషంగా చెప్పిన తెనాలికి చెందిన గీతాంజలి
- సోషల్ మీడియా వేదికలపై వెంటాడి వేధించిన టీడీపీ, జనసేన మూకలు
- ఆమెను దూషిస్తూ... వేషభాషలను ఎగతాళి చేస్తూ దారుణంగా ట్రోలింగ్
- మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం.. ఆనక ఆస్పత్రిలో మృతి
- సీఎం సూచనతో ఆ కుటుంబాన్ని పరామర్శించిన స్థానిక ఎమ్మెల్యే
- బాధితురాలి కుటుంబానికి అండగా నిలిచి ఇద్దరు కుమార్తెలను ఆదుకుంటామని భరోసా

10లో


గీతాంజలిని బూతులు తిడుతూ టీడీపీ, జనసేన అభిమానులు పెట్టిన పోస్టులు, కామెంట్లు.. గీతాంజలి మృతదేహం వద్ద రోదిస్తున్న ఇద్దరు కుమార్తెలు


పులివెందులలో ఆదిత్య బిర్లా రెడీమేడ్ సూట్స్ తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న సీఎం జగన్



ఈ మమకారం ఎప్పటికీ తీరదు
పులివెందుల పర్యటనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్
రూ.861.84 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
2లో

బడుగుల భూచోరుడు చంద్రబాబే..



- అమరావతిలో అసైన్డ్ భూములు కొల్లగొట్టింది పచ్చగద్దలే
- ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను భయపెట్టి మరీ దోపిడీ
- బినామీల పేరిట అక్రమ జీపీఏ రిజిస్ట్రేషన్లతో దందా
- రూ.4,400 కోట్ల విలువైన 1,100 ఎకరాలు హస్తగతం
- కోర్టులో సీఐడీ చార్జిషీట్.. ఏ–1గా బాబు, ఏ–2గా నారాయణ

14లో

అమల్లోకి సీఏఏ



- లోక్‌సభ ఎన్నికల ముంగిట వివాదాస్పద చట్టంపై కేంద్రం కీలక నిర్ణయం..
- నిబంధనలతో నోటిఫికేషన్ విడుదల..
- 2014 డిసెంబర్ 31కి ముందు పాక్, బంగ్లా, అఫ్గాన్ నుంచి వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం

6లో

ముంపు ప్రాంతానికి రక్షణ కవచం
విజయవాడలో 80 వేల మందికి కృష్ణానది వరద నుంచి రక్షణ


వారధి నుంచి రామలింగేశ్వరనగర్ వైపు రిటైనింగ్ వాల్‌పై ఏర్పాటు చేసిన పార్కు

- సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధతో రిటైనింగ్ వాల్ నిర్మాణం
- రూ.369.89 కోట్లతో నదిలో 2.26 కిలోమీటర్ల మేర నిర్మాణం
- 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ముంపు భయం లేదిక
- రూ.12.3 కోట్లతో గోడ వెంబడి ఆహ్లాదకరంగా రివర్ ఫ్రంట్ పార్కు
- నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదగా ప్రారంభం

లబ్బీపేట (విజయవాడ తూర్పు): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో విజయవాడలో ప్రకాశం బ్యారేజికి దిగువన ఉన్న కృష్ణా నదిని ఆనుకొని ఉన్న కాలనీల్లోని 80 వేల మందికి వరద ముంపు బాధ తప్పింది. కృష్ణా నదికి కొద్దిపాటి వరద వచ్చి బ్యారేజి నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారంటేనే నగరంలోని కృష్ణలంక రణధీర్‌నగర్, కోటినగర్, తారకరామనగర్, భూపేష్‌గుప్తానగర్, పోలీస్‌కాలనీ, రామలింగేశ్వరనగర్ ప్రాంతాల ప్రజలు వణికిపోయేవారు. 3 లక్షల క్యూసెక్కుల వరద వస్తే ఈ ప్రాంతాలు మునిగినట్టే. దీంతో వరద మొదలవగానే ఈ ప్రాంతాల ప్రజలు సామాన్లతో సహా సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు తరలిపోయేవారు. నేడు 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా చుక్క నీరు కూడా ఇళ్లలోకి రాకుండా రూ.369.89 కోట్లతో 2.26 కిలోమీటర్ల రక్షణ గోడ నిర్మించారు. అంతేకాదు.. ఆ రక్షణ గోడ వెంబడి రూ.12.3 కోట్లతో రివర్‌ఫ్రంట్ పార్కును అభివృద్ధి చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణంతో, వాకింగ్ ట్రాక్‌తో కూడిన ఈ పెద్ద పార్కు ఇప్పుడు నగరవాసులకు మంచి సందర్శనీయ ప్రాంతంగా మారనుంది. రక్షణ గోడను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంగళవారం జాతికి అంకితం చేసి, రివర్ ఫ్రంట్ పార్కును ప్రారంభించనున్నారు.

దశాబ్దాలుగా ముంపు సమస్య
నగరంలో కృష్ణా నది దిగువన ఉన్న ఈ కాలనీలకు ముంపు సమస్య దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉంది. విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని కృష్ణలంక రణధీర్‌నగర్, కోటినగర్, తారకరామనగర్, భూపేష్‌గుప్తానగర్, పోలీస్‌కాలనీ, రామలింగేశ్వరనగర్ ప్రాంతాలు ముంపుకు గురయ్యేవి. వాటిలో తారకరామనగర్, రణధీర్‌నగర్, భూపేష్ గుప్తా కాలనీలు 3 లక్షల క్యూసెక్కులు వరదకే మునిగిపోయేవి. పోలీస్‌కాలనీ, రామలింగేశ్వర్‌నగర్ తదితర ప్రాంతాలు ఏడు లక్షల క్యూసెక్కులు దాటితే ముంపునకు గురయ్యేవి. ఎన్ని ప్రభుత్వాలు మారినా పాలకులు పట్టించుకోలేదు. ఉమ్మడి రాష్ట్రానికి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తొలిసారిగా ఈ సమస్యపై దృష్టి సారించారు. కృష్ణా నది రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని తలంచారు. తొలి విడతగా రూ. 100 కోట్లు కూడా మంజూరు చేశారు. ఆయన మరణం తర్వాత దానిని ఎవరూ పట్టించుకోలేదు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ, తూతూమంత్రంగా నాసిరకంగా చేశారు. దీంతో చిన్నపాటి వరదకే కాలనీలన్నీ మునిగిపోయాయి. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పటిష్టమైన రక్షణ గోడ నిర్మించి, ఈ కాలనీలకు వరద నుంచి శాశ్వత రక్షణ కల్పించాలని నిర్ణయించారు. అందులో భాగంగా రెండో దశలో రూ. 134.43 కోట్లు వెచ్చించి కోటినగర్ నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు రిటైనింగ్ వాల్ నిర్మించారు. అంతేకాకుండా కనకదుర్గమ్మ వారధి ఎగువ ప్రాంతంలో పద్మావతి ఘాట్ నుంచి వారధి వరకు మూడో దశలో రూ.235.46 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మించారు.

ముస్తాబైన రివర్ ఫ్రంట్ పార్కు
కృష్ణానది ముంపు ప్రాంత వాసుల కష్టాలు తీర్చడమే కాకుండా, నగర వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు రూ. 12.3 కోట్లతో రివర్ ఫ్రంట్ పార్కును కూడా అభివృద్ధి చేశారు. ఈ పార్కులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ట్రీ కెనాఫీ, వాకింగ్ ట్రాక్, సిట్టింగ్ ఏరియా, ఓపెన్ జిమ్, ప్లే ఏరియాతో సుందరంగా రూపొందించారు. సందర్శకుల వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాన్ని ఏర్పాటు చేశారు. ఈ పార్కును కుటుంబ సమేతంగా వెళ్లి వీక్షించే విధంగా ముస్తాబు చేశారు.


రాత్రి వేళ విద్యుత్ వెలుగుల్లో పార్కు

ముంపు సమస్యకు పరిష్కారం



ఒకప్పుడు కృష్ణానదికి వరద వచ్చిందంటే కరకట్ట ప్రాంతాల వారు ఆందోళనకు గురయ్యేవారు. ఇళ్లను ఖాళీ చేసి పునరావాస శిబిరాలకు తరలి వెళ్లాల్సి వచ్చేది. ఎంతో మంది పాలకులు వచ్చినా పట్టించుకోలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత రిటైనింగ్ వాల్‌ను చిత్తశుద్ధితో పూర్తి చేశారు. తొలుత వారధి దిగువన నిర్మాణం చేపట్టారు. హామీ ఇవ్వని ఎగువ ప్రాంతంలో కూడా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టారు. అంతే కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కును సైతం ఏర్పాటు చేశారు.
– దేవినేని అవినాష్, వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు ఇన్‌చార్జి

వరద ప్రాంతాలకు రక్ష
కృష్ణానది పరివాహక ప్రాంతాలు వరద ముంపుకు గురికాకుండా ప్రభుత్వం రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టింది. రూ. 369.89 కోట్లతో రెండు దశల్లో పనులు పూర్తయ్యాయి. దీంతో ముంపు ప్రాంతాలైన రణధీర్‌నగర్, భూపేష్‌గుప్తా నగర్, తారకరామ నగర్ తదితర ప్రాంతాలకు రక్షణ ఏర్పడింది. ఇప్పుడు కృష్ణా నదికి వరద వచ్చినా ముంపు సమస్య ఉండదు. అంతే కాకుండా నగర వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు పార్కును కూడా అభివృద్ధి చేశాం. వాటిని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారు.
– ఎస్ దిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

ప్రత్తిపాటి శరత్ కస్టడీ అనివార్యం

- రాజధానిలో రోడ్డు నిర్మాణంలో పెద్ద కథ నడిచింది
- జీఎస్టీ ఎగవేత, నిధుల మళ్లింపు తదితర విషయాలు తేల్చాల్సి ఉంది.. నిధులు ఎక్కడికి వెళ్లాయో అతనికి బాగా తెలుసు
- అంతిమ లబ్ధిదారు ఎవరో కూడా తెలుసు
- అందువల్ల అతన్ని విచారించాల్సిన అవసరం ఉంది
- హైకోర్టుకు నివేదించిన సీఐడీ
- రాతపూర్వక వాదనల సమర్పణకు ఆదేశం



సాక్షి, అమరావతి: జీఎస్టీ ఎగవేత, బోగస్ ఇన్వాయిస్‌లతో నిధుల మళ్లింపు తదితర విషయాలు తేలాలంటే ప్రత్తిపాటి శరత్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించడం తప్పనిసరి అని సీఐడీ తరఫు న్యాయవాది వైఎల్ శివకల్పనారెడ్డి హైకోర్టుకు నివేదించారు. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌ను పది రోజులు కస్టడీకి ఇవ్వాలన్న పిటిషన్‌ను విజయవాడ కోర్టు తిరస్కరించడంతో సీఐడీ అధికారులు హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు సోమవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా సీఐడీ తరఫున శివకల్పనారెడ్డి వాదనలు వినిపిస్తూ శరత్‌పై ఉన్నవి తీవ్రమైన ఆరోపణలని, ఆయనకు పలు కీలక విషయాలు తెలుసునని, అందువల్ల ఆయన్ని కస్టడీలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాజధానిలో రోడ్డు నిర్మాణ పనులను బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు దక్కడం వెనుక పెద్ద కథ నడిచిందన్నారు. టెండర్ నిబంధనలకు విరుద్ధంగా, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి ముందస్తుగా అనుమతులు తీసుకోకుండానే అవెక్సా కంపెనీకి సబ్ కాంట్రాక్టు ఇచ్చారన్నారు. బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా నుంచి అవెక్సాకు, అక్కడి నుంచి పలు షెల్ కంపెనీలకు నిధుల మళ్లింపు జరిగిందన్నారు. ఆ సమయంలో అవెక్సా కంపెనీలో శరత్ డైరెక్టర్‌గా ఉన్నారని తెలిపారు. నిధులు ఎక్కడికి వెళ్లాయి, అంతిమ లబ్ధిదారు ఎవరో ఆయనకు తెలుసునని చెప్పారు. అందుకే ఆయన్ని కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందన్నారు. శరత్ తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. ప్రైవేటు కంపెనీల మధ్య జరిగిన లావాదేవీలకు కుట్రకోణం ఆపాదించడం సరికాదన్నారు. జీఎస్టీ ఎగవేత ఉంటే ఆ శాఖ అధికారులు చూసుకుంటారని, ఇందులో సీఐడీ అధికారులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రాతపూర్వక వాదనలు సమర్పించాలని ఇరుపక్షాలను ఆదేశించారు. ఈ నెల 13న నిర్ణయం వెలువరిస్తామన్నారు.

వారిని అరెస్టు చేయబోమన్న సీఐడీ
ఇదిలా ఉంటే, ఇదే కేసులో నిందితులుగా ఉన్న ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన సతీమణి వెంకాయమ్మ, కుమార్తె స్వాతి తదితరులను అరెస్ట్ చేయబోమని సీఐడీ సోమవారం హైకోర్టుకు హామీ ఇచ్చింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

ఏసీబీ వలలో అవినీతి అధికారులు
లంచం తీసుకుంటూ పట్టుబడిన నరసాపురం టౌన్ ఎస్ఐ, కడప కలెక్టరేట్ సూపరింటెండెంట్




ఏసీబీకి పట్టుబడిన ప్రమీల, ఎస్ఐ ప్రసాద్, రైటర్ నాగేశ్వరరావు

నరసాపురం/కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్రంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో లంచం తీసుకుంటూ ముగ్గురు ఉద్యోగులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం టౌన్ ఎస్ఐ బీఎస్‌డీఆర్ ప్రసాద్, రైటర్ జె.నాగేశ్వరరావు ఓ విడాకుల కేసునుంచి నిందితుల పేర్లు తొలగించేందుకు రూ.25వేలు లంచం తీసుకుంటూ పట్టుబడగా.. చుక్కల భూమిని జిరాయితీ భూమిగా మార్పు చేసేందుకు ఓ రైతునుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటూ కడప కలెక్టరేట్ సి–సెక్షన్ సూపరింటెండెంట్ శెట్టిపల్లి ప్రమీల రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడకు చెందిన విజయ్‌కి భార్యతో విభేదాలు వచ్చాయి. అతని భార్య స్వస్థలం నరసాపురం. వారి మధ్య గొడవలు జరుగుతున్న నేపథ్యంలో విజయ్‌పై, అతని బంధువులపై 498ఏ సెక్షన్ కింద కేసు నమోదైంది. ఈ కేసులో కొన్ని పేర్లు తొలగించాలంటే రూ.25 వేలు లంచం కావాలని ఎస్ఐ బీఎస్‌డీఆర్ ప్రసాద్, రైటర్ జె.నాగేశ్వరరావు మూడు నెలలుగా డిమాండ్ చేస్తున్నారు. హెడ్ కానిస్టేబుల్ కొడుకైన విజయ్ ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచన మేరకు విజయ్ సోమవారం రూ.25 వేలు తీసుకెళ్లి ఎస్ఐ జీపు డ్రైవర్ ప్రసాద్ (హోంగార్డు)కు అందించాడు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ ప్రసాద్ పరారయ్యాడు. టౌన్ ఎస్ఐ, రైటర్ కూడా పరారయ్యే ప్రయత్నం చేయగా, పాలకొల్లు రోడ్డులో వారిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే కడప జిల్లా వీరపునాయునిపల్లె మండ లం వెల్దుర్తి గ్రామానికి చెందిన వీరపు శేఖర్ అనే రైతుకు సర్వే నంబరు 451లో 6.64 ఎకరాల చుక్కల భూమి ఉంది. ఆ భూమిని జిరాయితీ భూమిగా మార్పు చేసేందుకు కడప కలెక్టరేట్ సి–సెక్షన్ సూపరింటెండెంట్ శెట్టిపల్లి ప్రమీల తొలుత రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తున్నది. ఆ తర్వాత రూ.1.50 లక్షలు చెల్లించాలని ఆమె సూచించారు. దీంతో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అందులో భాగంగా రూ.50 వేలు అడ్వాన్సుగా చెల్లిస్తుండగా హఠాత్తుగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించామని అధికారులు తెలిపారు.

అశ్వవాహనంపై మల్లికార్జునుడు

శ్రీశైలం టెంపుల్: జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ఒకటైన శ్రీశైలం మహాక్షేత్రంలో వైభవంగా నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరిరోజు మల్లికార్జున స్వామి, భ్రమరాంబదేవికి పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ ఘనంగా నిర్వహించారు. ముందుగా అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన అశ్వవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపు చేయించి ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజాదికాలు జరిపారు. అనంతరం స్వామివారికి వివిధ రకాల సుగంధ పుష్పాలతో పుష్పోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అద్దాల మండపంలో(శయనమందిరం)లో శయనోత్సవం జరిపారు. ఆ తర్వాత ఏకాంత సేవ నిర్వహించారు. ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

నేటి నుంచి ఆర్జిత సేవల పునరుద్ధరణ
ఆలయంలో మంగళవారం నుంచి జరిగే సామూహిక అభిషేకం, కుంకుమార్చన, చండీహోమం, రుద్రహోమం, స్వామి, అమ్మవారి కల్యాణం తదితర అన్ని ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. ఆర్జిత సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు.


స్వామివార్లకు పుష్పోత్సవ సేవ

ఈ మమకారం ఎప్పటికీ తీరదు

పులివెందుల పర్యటనలో సీఎం జగన్ ■ రూ.861.84 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

సాక్షి ప్రతినిధి, కడప: అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనంగా తీర్చిదిద్దిన పులివెందుల పట్టణం రాష్ట్రానికే ఆదర్శనీయమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత గడ్డపై సగర్వంగా ప్రకటించారు. ఒక్క రోజు పర్యటనలో భాగంగా సోమవారం వైఎస్సార్ కడప జిల్లాకు చేరుకున్న సీఎం జగన్ పులివెందుల నియోజకవర్గ పరిధిలో రూ.861.84 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. ఈ రోజు సొంత గడ్డపై ముఖ్యమంత్రిగా నిలుచున్నానంటే మీ అందరి అభిమానం, ఆశీస్సులు, దీవెనలే కారణమన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పులివెందులలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టానని, సొంతగడ్డపై మమకారం ఎప్పటికీ తీరేది కాదని వ్యాఖ్యానించారు.

సీఎం జగన్ ప్రారంభించినవి ఇవీ..



వైఎస్ జయమ్మ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ భవన సముదాయాన్ని ప్రారంభించిన సీఎం జగన్

పులివెందుల మోడల్ టౌన్ ప్రాజెక్టులో భాగంగా రూ.20.69 కోట్లతో అధునాతన వసతులతో 4,595 చదరపు మీటర్లలో నిర్మించిన వైఎస్ జయమ్మ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ భవన సముదాయాన్ని సీఎంజగన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్‌లో 58 షాపులు, మొదటి ఫ్లోర్ లో 32 షాపులతో పాటు టాయిలెట్ బ్లాకులను ఏర్పాటు చేశారు.



డాక్టర్ వైఎస్సార్ మినీ సెక్రటేరియేట్ కాంప్లెక్స్ భవనాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్

పులివెందులలో 2.79 ఎకరాల్లో రూ.38.15 కోట్లతో ఆధునిక హంగులతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ మినీ సెక్రటేరియేట్ కాంప్లెక్స్ భవనాన్ని సీఎం ప్రారంభించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆర్డీవో, స్పందన హాల్, అగ్రికల్చర్, పే-అకౌంట్స్, సబ్‌ట్రెజరీ, 3 కాన్ఫరెన్స్ హాళ్లు, రెండు టాయిలెట్ బ్లాక్స్ ఏర్పాటు చేశారు. ఫస్ట్ ఫ్లోర్‌లో పాడా ఆఫీస్, పీఆర్, ఆర్‌డబ్ల్యూస్ ఇంజనీరింగ్, సీడీపీవో కార్యాలయాలు, రెండు కాన్ఫరెన్స్ హాళ్లున్నాయి.



పులివెందులలో డాక్టర్ వైఎస్సార్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) ఎదుట సిబ్బంది, అధికారులతో సీఎం వైఎస్ జగన్

రూ.500 కోట్లతో నాబార్డ్, ఆర్ఐడీఎఫ్-37 నిధులతో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) భవనాలను ముఖ్యమంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఏటా 150 మంది వైద్య విద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రవేశాలు కల్పిస్తారు. 627 పడకల కెపాసిటీతో టీచింగ్ హాస్పిటల్, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలను ఏర్పాటు చేశారు. మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ప్రధానంగా ఓపీడీ బ్లాక్, ఐపీడీ బ్లాక్, 24/7 అక్యూట్ కేర్ బ్లాక్ భవనాలున్నాయి.

- పులివెందుల మైన్స్ సమీపంలో అరటి ప్రాసెసింగ్ యూనిట్ వద్ద రూ.20.15 కోట్లతో అత్యాధునిక సదుపాయాలతో 5 ఎకరాల్లో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ బనానా ప్యాక్ హౌస్ (పులివెందుల మార్కెట్ కమిటీ) భవనాన్ని సీఎం ప్రారంభించారు. ఇందులో 600 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యమున్న నాలుగు (4/150) కోల్డ్ రూములు, 126 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఆరు (6/21) ప్రీ కూలింగ్ ఛాంబర్లు, లేబర్ క్వార్టర్స్, మిషనరీ రూమ్స్, 60 మెట్రిక్ టన్నుల వేయింగ్ బ్రిడ్జితో పాటు బనానా, స్వీట్ లైమ్‌కు సంబంధించి వేర్వేరుగా నాలుగు గ్రేడింగ్, క్లీనింగ్, ప్యాకింగ్ లైన్స్ ఏర్పాటయ్యాయి.
- పులివెందుల పట్టణం నడిబొడ్డున రూ.70 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ జంక్షన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఇందులో ఆకర్షణీయంగా ల్యాండ్ స్కేప్ మధ్యలో చూపరులను ఆకట్టుకునేలా డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహాన్ని ప్రతిష్టించారు.
- పులివెందుల మోడల్ టౌన్ ప్రాజెక్ట్‌లో భాగంగా రూ.11.04 కోట్లతో అభివృద్ధి చేసిన సెంట్రల్ బౌలే వార్డుకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం నిర్వహించారు. వైఎస్ఆర్ జంక్షన్‌కు 500 మీటర్ల దూరంలో అభివృద్ధి చేసిన ఈ మార్గంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్, రోడ్డుకు ఇరువైపులా 3 మీటర్ల ఫుట్‌పాత్, 2.25 మీటర్ల సీటింగ్ ఏరియా, బెంచ్‌లు, 3 మీటర్ల పార్కింగ్ ఏరియా, స్టోన్ బొల్లార్డ్స్, రోడ్డుకు ఇరువైపులా నగిషీలతో తయారైన విద్యుత్ దీపాలు, పూల కుండీలతో 6 మీటర్ల బీటీ క్యారేజ్ వే వంటి ప్రత్యేకతలు పులివెందుల పట్టణ సరికొత్త జీవనశైలికి నాంది కానున్నాయి.
- పులివెందుల మోడల్ టౌన్ ప్రాజెక్టులో భాగంగా పట్టణ నడిబొడ్డున రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన గాంధీ జంక్షన్‌ను సీఎం జగన్ ప్రారంభించారు. ఈ సర్కిల్‌లో అత్యంత సుందరంగా, జీవకళ ఉట్టి పడేలా నెలకొల్పిన మహాత్మాగాంధీ విగ్రహం, పూలమొక్కలతో ల్యాండ్ స్కేప్, లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ముఖ్యమంత్రి పర్యటనలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, జిల్లా ఇంచార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో పాటు వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఎంటీ కృష్ణబాబు, కలెక్టర్ వి.విజయ్ రామరాజు, ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, పాడ ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు బలరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తోపాటు పలువురు అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. పర్యటన పూర్తి చేసుకుని తిరిగి తాడేపల్లి బయలుదేరిన సీఎం జగన్‌కు కడప విమానాశ్రయంలో సాదరంగా వీడ్కోలు పలికారు. డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ అమర్‌నాథరెడ్డి, శాసనమండలి వైస్ చైర్మన్ జకియాఖానం, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్సీలు పి.రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, డీసీ గోవిందురెడ్డి, రమేష్‌యాదవ్, ఎమ్మెల్యేలు దాసరి సుధా, పి.రవీంద్రనాథరెడ్డి, ఎస్.రఘురామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాదరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, మేయర్ సురేష్‌బాబు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.



పులివెందులలోని ఆదిత్య బిర్లా గార్మెంట్స్ లిమిటెడ్‌లో రెడీమేడ్ సూట్స్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా రూ.175 కోట్ల పెట్టుబడితో 16.63 ఎకరాల్లో నిర్మించిన ఆదిత్య బిర్లా రెడీమేడ్ సూట్స్ తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పరిశ్రమ స్థాపనతో ఇప్పటికే 500 మంది ఉద్యోగాలను పొందగా మొత్తం 2,100 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.



ఇడుపులపాయలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ పార్క్‌లో 48 అడుగుల వైఎస్సార్ విగ్రహం

ఇడుపులపాయ ఎస్టేట్‌లో రూ.39.13 కోట్లతో 16 ఎకరాల్లో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ పార్క్‌ను సీఎం జగన్ ప్రారంభించారు. నెమళ్ల పార్కు, పచ్చదనంతో ఆకట్టుకుంటున్న ఇడుపులపాయ ఎస్టేట్ దీనిద్వారా పర్యాటక శోభను సంతరించుకుంది. 48 అడుగుల వైఎస్ఆర్ విగ్రహం, ఆడియో విజువల్ బ్లాక్, ఫోటో గ్యాలరీ, ఎంట్రన్స్ బ్లాక్, పెవిలియన్ బ్లాక్, చిల్డ్రన్ పార్క్, ట్రాపికల్ గార్డెన్ లోటస్ పాండ్, ఫ్లోరల్ పార్క్, పాదయాత్రకు సంబంధించి 21 విగ్రహాల సమూహం ఉన్నాయి.



పులివెందులలో డాక్టర్ వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌ను ప్రారంభిస్తున్న సీఎం జగన్

పులివెందుల మోడల్ టౌన్ ప్రాజెక్టులో భాగంగా రూ.65.99 కోట్లతో వంద ఎకరాల్లో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌ను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. ఇందులో ఎంట్రన్స్ ప్లాజా, ఎంట్రన్స్ వాటర్ ఫౌంటెన్, ఐ లవ్ పులివెందుల, ఎలివేటెడ్ స్టెప్స్, ఓ.ఏ.టి. ఏరియా, బ్రిడ్జి, మ్యూజికల్ లేజర్ ఫౌంటెన్, మేజ్ గార్డెన్, కిడ్స్ ప్లే ఏరియా, కనెక్టింగ్ బ్రిడ్జి, బోటింగ్ జెట్టీ, అర్బన్ ఫారెస్ట్ తదితర ప్రత్యేక సదుపాయాలు కల్పించారు.

చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలయ్యాయా?

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: చంద్రబాబు ఇప్పుడు మూడు పార్టీలతో పొత్తు అంటున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 'ఈ మూడు పార్టీలు 2014లో కూడా ఇలాగే కలిసి మీటింగ్‌లు పెట్టి, ప్రజలకు హామీలు ఇచ్చాయి. తర్వాత చంద్రబాబు సంతకం చేసిన పాంప్లెట్‌ను ఇంటింటికీ పంపారు. అందులో రైతులకు, డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ అని, మహిళల రక్షణ కోసం ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ అని రకరకాల వాగ్దానాలు చేశారు. కానీ అందులో ఇచ్చిన హామీలు అమలయ్యాయా?' అంటూ సోమవారం ట్వీట్ చేశారు.

సీఎం జగన్ ఆదేశాలతో ఆర్థిక సాయం





రత్తమ్మకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, అబ్దుల్ కరీంకు చెక్కు అందజేస్తూ..

రెండు కుటుంబాలకు చెక్కులు అందజేసిన కలెక్టర్

ఒంగోలు అర్బన్: సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన భరోసా మేరకు 24 గంటల్లోనే బాధితులకు ఊరట లభించింది. సోమవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ రెండు కుటుంబాలకు రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం బాపట్ల జిల్లా మేదరమెట్లలో జరిగిన 'సిద్ధం' బహిరంగ సభకు వచ్చిన వారిలో ఇద్దరు సీఎంను కలిసి వారి సమస్యలను విన్నవించుకున్నారు. మార్కాపురానికి చెందిన షేక్ నాసర్‌వలీ కుమారుడు అబ్దుల్ కరీం తాను నిరుద్యోగిని.. ప్యాంక్రియాటిక్ సమస్యతో బాధపడుతున్నానని తెలిపాడు. వైద్యం కోసం నెలకు రూ.4 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని విన్నవించాడు. కాగా.. పొదిలి మండలం ఏలూరు గ్రామానికి చెందిన రమణారెడ్డి భార్య రత్తమ్మ తన కుమార్తె, కుమారుడికి తరుచుగా ఫిట్స్ వస్తున్నాయని వైద్యం చేయించే స్థోమత లేదని సీఎం ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. చలించిపోయిన సీఎం జగన్ ఆ రెండు కుటుంబాలకు సాయం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ సాయం అందించారు.

నేడే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభం

- రూ.3,793 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్న సీఎం జగన్
- వీటిలో జువ్వలదిన్నె హార్బర్ మొదటిది
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌చే వర్చువల్‌గా ప్రారంభం
- రూ.289 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం
- 1,250 మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లు నిలిపే సామర్థ్యం
- 25వేల మత్స్యకార కుటుంబాలకు ప్రయోజనం
- ఏడాదికి 41,250 టన్నుల మత్స్య ఉత్పత్తికి అవకాశం
- ఓఎన్‌జీసీ పైప్‌లైన్‌తో జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు రూ.161.86 కోట్ల పరిహారం
- బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్న సీఎం జగన్



సాక్షి, అమరావతి: సముద్రాన్ని ఆధారంగా చేసుకొని చేపల వేట సాగించే రాష్ట్ర మత్స్యకారుల స్థితిగతులు పూర్తిగా మారిపోనున్నాయి. చేపల వేటకు పొరుగు రాష్ట్రాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానికంగానే వేట కొనసాగించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.3,793 కోట్లతో నిర్మిస్తున్న పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండ్‌సెంటర్లలో మొదటిది అందుబాటులోకి వచ్చింది. నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద రూ.289 కోట్లతో నిర్మించిన ఫిషింగ్ హార్బర్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంగళవారం ప్రారంభించనున్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా జువ్వలదిన్నె హార్బర్‌ను ప్రారంభించనున్నారు. ఈ హార్బరు ద్వారా 25,000 మత్స్యకార కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుంది.1250 మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లు నిలిపేలా ఈ హార్బర్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దారు. ఈ హార్బర్ ద్వారా ఏటా 41,250 టన్నుల మత్స్య సంపద అదనంగా అందుబాటులోకి వస్తుంది. హార్బర్‌లోనే కోల్డ్ చైన్, ఐస్‌ప్లాంటు, చిల్ రూమ్ వంటి మౌలిక వసతులు, బోట్ రిపేర్ వర్క్ షాపులు, గేర్‌షెడ్‌లు, నెట్ మెండింగ్ షెడ్లు వంటి సౌకర్యాలు ఉన్నాయి. ఈ ఫిషింగ్ హార్బర్లతో పాటు రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే విధంగా రూ.16,000 కోట్లతో చేపట్టిన నాలుగు పోర్టుల నిర్మాణ పనులు అత్యంత వేగంగా సాగుతున్నాయి. ఈ పోర్టుల నిర్మాణంతో పెద్ద ఎత్తున ఉపాధి, తక్కువ రవాణా వ్యయంతో ఎగుమతులు చేసుకునే అవకాశం వస్తుంది.

23,458 మత్స్యకార కుటుంబాలకు రూ.161.86 కోట్ల పరిహారం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ కారణంగా ఓఎన్‌జీసీ పైప్‌లైన్ నిర్మాణం ద్వారా జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు లబ్ధి చేకూరనుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన 23,458 మత్స్యకారుల కుటుంబాలకు ఒక్కొక్కరికి నెలకు రూ.11,500 చొప్పున పరిహారం ఇప్పించేలా ఓఎన్‌జీసీని ప్రభుత్వం ఒప్పించింది. ఐదో విడత నష్ట పరిహారం విడుదలలో భాగంగా ఆరు నెలల కాలానికి ఒక్కొక్కరికి రూ.69,000 చొప్పున మొత్తం రూ.161.86 కోట్ల ఆర్థిక సాయాన్ని సీఎం క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కడం ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఐదు విడతల కింద ఇప్పటివరకు రూ.647.44 కోట్ల పరిహారాన్ని మత్స్యకారులకు ఈ ప్రభుత్వం అందజేసింది. ఈ 58 నెలల కాలంలో మత్స్యరంగానికి వివిధ పథకాల ద్వారా రూ.4,913 కోట్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది.

కనిపించిన నెలవంక

నేటినుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంతో పాటు దేశవ్యాప్తంగా నెలవంక కనిపించిందని, కాబట్టి ఈ నెల 12 నుంచి రంజాన్ నెల ప్రారంభమవుతుందని రుహియతే హిలాల్ కమిటీ (నెలవంక నిర్ధారణ కమిటీ) కన్వీనర్ సయ్యద్ ఇబ్రహీం హుస్సేని సజ్జాద్ పాషా తెలిపారు. హైదరాబాద్‌లోని మొజంజాహీ మార్కెట్‌లోని కమిటీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, సోమవారం నెలవంక నగరంలో కనబడినట్లు నిర్ధారణ అయ్యాకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముస్లింలు మంగళవారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించాలని సూచించారు.

ముస్లింలకు సీఎం జగన్ రంజాన్ మాసం శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమవుతున్న సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. నెల పాటు నియమనిష్టలతో కఠిన ఉపవాసం ఆచరించే ఈ పుణ్య రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైనదన్నారు. మహనీయుడైన మహ్మద్ ప్రవక్త ద్వారా దివ్య ఖురాన్ ఆవిర్భవించినది రంజాన్ మాసంలోనే కావడంతో ముస్లింలు ఈ నెలకు అత్యంత ప్రాముఖ్యతనిస్తారన్నారు. మనిషి లోని చెడు భావాల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపుతూ మానవాళికి హితాన్ని బోధించే గొప్ప పండుగ రంజాన్ అని పేర్కొన్నారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే జీవితమని రంజాన్ మాసం గొప్ప సందేశం ఇస్తుందని తెలిపారు. కఠిన ఉపవాస దీక్ష ఆచరిస్తూ, దైవ చింతనతో గడిపే ముస్లింలు తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు దానధర్మాల ద్వారా ఖర్చు చేస్తుంటారన్నారు. వారికి అల్లాహ్ దీవెనలు లభించాలని సీఎం జగన్ ఆకాంక్షించారు.

'సిద్ధం' సభలతో విపక్షాల్లో వణుకు

- మేదరమెట్ల సభ జనసంద్రాన్ని ముందే ఊహించి చీప్‌ట్రిక్స్‌కు బరితెగించిన పచ్చ ముఠా
- ఉదయం ఫొటోలు తీసుకుని జనం మొహం చాటేశారంటూ పైశాచికానందం
- అందుకే 45 నిముషాల ఆలస్యంగా ప్రత్యక్ష ప్రసారాలు ఇస్తున్నారంటూ విచిత్ర విమర్శలు
- వాటిని అందిపుచ్చుకుని ఊగిపోయిన ఎల్లో మీడియా
- ఈ సభను వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా వీక్షించిన 1.50 కోట్ల మంది
- ఘోర పరాజయం భయంతోనే చౌకబారు ఆరోపణలంటూ ఏకిపారేస్తున్న రాజకీయ విశ్లేషకులు



ఆదివారం మేదరమెట్ల 'సిద్ధం' సభకు తరలివచ్చిన జన సందోహంలో ఓ భాగం

సాక్షి, అమరావతి : సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు భీమిలి, దెందులూరు, రాప్తాడులలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన 'సిద్ధం' సభలకు ప్రజాసముద్రం పోటెత్తింది. ఉమ్మడి రాష్ట్రం, తెలుగు రాష్ట్రాల చరిత్రలో అతి పెద్ద ప్రజాసభగా రాప్తాడు సభ నిలిచింది. పేదంటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చే పరిపాలన తెచ్చేందుకు వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపిచేందుకు సిద్ధమా అని సీఎం జగన్ పిలునిస్తే.. మేం సిద్ధమే అంటూ లక్షలాది మంది ఒక్కసారిగా పిడికిళ్లు పైకెత్తి మేం సిద్ధమే అంటూ చేసిన సింహనాదంతో దిక్కులు పిక్కటిల్లాయి. ఈ మూడు సభలు ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ కావడం.. టీడీపీ-జనసేన పొత్తు లెక్కతేలాక తాడేపల్లిగూడెంలో ఉమ్మడిగా నిర్వహించిన జెండా సభకు జనం మొహం చాటేయడంతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు తమకు ఘోర పరాజయం తప్పదనే భయంతో గజగజ వణికిపోయారు. ఎన్నికల్లో కనీసం ఉనికినైనా చాటుకోవాలనే లక్ష్యంతో ఢిల్లీ వెళ్లి కాళ్లబేరానికి దిగజారి బీజేపీతో జట్టు కట్టారు.

ప్రభంజనాన్ని ముందే పసిగట్టి చౌకబారు డ్రామాలు..

మరోవైపు.. బీజేపీతో టీడీపీ-జనసేన పొత్తు కుదిరాక ఆదివారం మేదరమెట్లలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన సిద్ధం చివరి సభకూ లక్షలాదిగా ప్రజలు తరలి వస్తున్నారని గ్రహించిన చంద్రబాబు తన ప్రావీణ్యానికి మరింత పదును పెట్టారు. సభా ప్రాంగణంలో ఉ.11 గంటలకు ముందు ఫొటోలు తీయించారు. ఆ తర్వాత.. నవ్విపోదురు గాక నా(రా)కేంటి సిగ్గు అనే రీతిలో జనం పలుచగా ఉన్నారని, సిద్ధం సభ ఫెయిల్ అంటూ సామాజిక మాధ్యమాల్లో పచ్చముఠా వీరంగం వేసింది. తండ్రికి తగ్గ తనయుడినని లోకేశ్ కూడా ఎక్కడా తగ్గకుండా చౌకబారు డ్రామాకు తెరతీసి రెచ్చిపోయారు. ఇక సభకు హాజరయ్యే ప్రజలు కూర్చోవడం కోసం కింద గ్రీన్‌మ్యాట్ వేస్తే.. జనం హాజరుకాకున్నా హాజరైనట్లు చూపేలా గ్రాఫిక్స్ సృష్టించేందుకు వాటిని వేసినట్లు హోరెత్తించారు. అందుకే సభ ప్రత్యక్ష ప్రసారాలను 45 నిముషాలు ఆలస్యంగా ఇస్తున్నారంటూ ఇష్టమొచ్చినట్లు చౌకబారు ఆరోపణలు చేశారు. సభ పూర్తయిన తర్వాత ఉదయం తాము తీసిన ఫొటోలను గ్రాఫిక్స్ ద్వారా మాయచేసి జనం హాజరుకాకున్నా హాజరైనట్లు వైఎస్సార్‌సీపీ చిత్రీకరించిందంటూ ఎల్లో మీడియా శివాలెత్తింది. తద్వారా కూటమి శ్రేణులు డీలాపడకుండా చేసేందుకు ఈ ముఠా ఆపసోపాలు పడింది.

లైవ్‌లో 1.50 కోట్ల వ్యూస్‌తో రికార్డు..

ఇక మేదరమెట్ల సిద్ధం సభకు దక్షిణ కోస్తాలోని తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో 44 నియోజకవర్గాల నుంచి 15 లక్షల మందికి పైగా హాజరయ్యారని అంచనా. వందలాది ఎకరాల సువిశాల మైదానంలో ఏర్పాటుచేసిన సభా ప్రాంగణం ఇసుకేస్తే రాలనంత రీతిలో జనంతో కిక్కిరిసిపోయింది. మేదరమెట్ల నుంచి రేణంగివరం మధ్య సుమారు 18 కిమీల పొడవున జనప్రవాహం కొనసాగడం.. కోల్‌కత-చెన్నై జాతీయ రహదారితోపాటు అద్దంకి-నార్కాట్‌పల్లి జాతీయ రహదారిపై కిలోమీటర్ల కొద్దీ వాహనాలు ఆగిపోయాయి. ఎక్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్ చానెళ్లు, డిజిటల్, కేబుల్ టీవీలు, జాతీయ మీడియా ద్వారా కోట్లాది మంది ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఇలా 1.50 కోట్ల వ్యూస్‌తో మేదరమెట్ల సభ చరిత్ర సృష్టించింది. ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని తేలడంతో కూటమి నేతలు వణికిపోతున్నారు. ఆ భయంతోనే ఎల్లో ముఠా ఇలా చీప్‌ట్రిక్స్ ప్రయోగిస్తోందని రాజకీయ విశ్లేషకులంటున్నారు.

ఇదండీ సంగతి



మీరు పదే పదే మోదీ అంటుంటే జపం చేస్తున్నారనుకుని మేడం మీకు భోజనం పెట్టలేదు!

క్లుప్తంగా...

అందరి ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నా

- నా ప్రయాణానికి మీరూ జత కడతారని ఆశిస్తున్నా
- మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం



కిర్లంపూడి: అందరి ఆశీస్సులతో ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నానని కాపు రిజర్వేషన్ పోరాట సమితి నేత, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం పునరుద్ఘాటించారు. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా సోమవారం లేఖ విడుదల చేశారు. సీఎం జగన్ పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టడానికి ఎటువంటి కోరికలూ లేకుండా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి వచ్చిన తరువాత పేదవారికి మరెన్నో సంక్షేమ పథకాలతో పాటు, వీలైనంత అభివృద్ధి చేయించాలనే ఆశతో ఉన్నానన్నారు. తాను ఎప్పుడూ తప్పు చేయలేదని, చేయబోనని ముద్రగడ తన లేఖలో పేర్కొన్నారు. కాగా.. ఈ నెల 14న తాడేపల్లి వెళ్తున్నానని.. ఆ రోజు ఉదయం 8 గంటలకు కిర్లంపూడిలో బయలుదేరి ప్రత్తిపాడు, జగ్గంపేట, లాలాచెరువు, వేమగిరి, రావులపాలెం, తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ మీదుగా తాడేపల్లి చేరుకుంటానని వివరించారు. అవకాశాన్ని బట్టి తన ప్రయాణంలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వచ్చే నెలలో టోఫెల్ పరీక్ష

- 16.24 లక్షల మంది విద్యార్థులు హాజరు: ప్రవీణ్ ప్రకాశ్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో 3 నుంచి 9 తరగతుల్లో విద్యాభ్యాసం చేస్తున్న బాలబాలికలకు ఏప్రిల్‌లో టోఫెల్ రెడీనెస్ టెస్ట్ నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు ఉన్న స్కూళ్లలో రెండు విభాగాల్లోను మొత్తం 16,24,100 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక విద్యార్థులకు ఏప్రిల్ 10న జూనియర్ విద్యార్థులకు 12న పరీక్ష ఉంటుందన్నారు. ప్రైమరీ విభాగంలో 27 ప్రశ్నలు ఉంటాయని, 14 వినేవి, మరో 13 చదివేందుకు వీలైన ప్రశ్నలు ఉంటాయన్నారు. 6 నుంచి 9 తరగతుల విద్యార్థుల పరీక్షలో 10 విని రాసేవి, మరో 10 రీడింగ్ ప్రశ్నలు ఉంటాయన్నారు. ఈ టెస్ట్‌ను పూర్తి చేసిన విద్యార్థులకు ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ ఈటీఎస్ సర్టిఫికెట్ ప్రదానం చేస్తుందన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించడంతో పాటు డిజీ లాకర్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా డిజిలాకర్ యాప్‌ను తమ స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకునేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని డీఈవోలను ప్రవీణ్ ప్రకాశ్ ఆదేశించారు.

నూతన ఆర్టీఐ కమిషనర్ల ప్రమాణ స్వీకారం

సాక్షి, అమరావతి: రాష్ట్ర సమాచార కమిషన్‌కు నూతనంగా నియమించిన ముగ్గురు సమాచార కమిషనర్లు చావలి సునీల్, రెహానా బేగం, అల్లారెడ్డి ఉదయ భాస్కర్ రెడ్డిచే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి సమాచార కమిషనర్లుగా ప్రమాణం చేయించారు. ఈ మేరకు సోమవారం సీఎస్ క్యాంపు కార్యాలయంలో సమాచార కమిషనర్ల ప్రమాణ స్వీకారం జరిగింది. రాష్ట్ర సమాచార కమిషన్ ముఖ్య సమాచార కమిషనర్ మెహబూబ్ భాషా, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సమాచార కమిషనర్లు ఐలాపురం రాజా, శామ్యూల్ జొనాతన్, కాకర్ల చెన్నారెడ్డి, సమాచార కమిషన్ లా సెక్రటరీ జి.శ్రీనివాసులు, ప్రభుత్వ సలహాదారు (పబ్లిక్ పాలసీ) నేమాని భాస్కర్, నూతన సమాచార కమిషనర్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రధానితో మడకశిర మహిళ ముఖాముఖి

అరుదైన అవకాశం దక్కించుకున్న అనురాధ



మడకశిర: ప్రధాని నరేంద్రమోదీతో ముఖాముఖి మాట్లాడే అరుదైన అవకాశాన్ని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మహిళకు దక్కింది. స్వశక్తి నారీ–వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఢిల్లీలో లక్‌పతి దీదీ (లక్షాధికారి మహిళ) కార్యక్రమాన్ని నేషనల్ రూరల్ లైవ్లీవుడ్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశంలోని వివిధ రాష్ట్రాల మహిళలతో మాట్లాడారు. ఇందులో భాగంగా మడకశిరకు చెందిన అనురాధ దాదాపు ఏడు నిమిషాల పాటు ప్రధానితో మాట్లాడారు. ఏ విధంగా మీరు లక్షాధికారి మహిళగా ఎదిగారని ప్రధాని ఆమెను అడిగి తెలుసుకున్నారు. తాను తొలుత ఎస్‌హెచ్‌జీ (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్)లో రూ.వంద రుణం పొందానని, క్రమంగా రుణ పరపతి పెంచుకుంటూ పోయాయని వివరించారు. అలా తీసుకున్న రుణంతో చీరల వ్యాపారాన్ని ప్రారంభించి, విజయవంతంగా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. అనురాధ ప్రస్తుతం దేశంలోని ఏడు రాష్ట్రాల్లో ఎస్‌ఆర్‌ఎల్‌ఎం తరఫున టీఓటీ (ట్రైనర్ ఆఫ్ ట్రైనర్)గా పని చేస్తున్నారు. తనకు ప్రధానితో మాట్లాడే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె 'సాక్షి'కి తెలిపారు.

బెంగళూరు-కడప-విజయవాడ.. ఎక్స్‌ప్రెస్ వేకు శంకుస్థాపన

రూ. 14వేల కోట్ల విలువైన ప్రాజెక్టు పనులకు శ్రీకారం

- రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన 35 జాతీయ రహదారులు సైతం ప్రారంభం
- దేశవ్యాప్తంగా రూ.లక్ష కోట్ల విలువైన 112 జాతీయ రహదారుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు కూడా..
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ
- ఏపీ ప్రభుత్వం అద్భుతమైన సహకారం అందిస్తోందని కితాబు



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి : రాష్ట్రంలో రూ.14వేల కోట్లతో చేపట్టే బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వేకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం శంకుస్థాపన చేశారు. అలాగే, దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థలను మెరుగుపరచడం, ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు వీలుగా రూ.లక్ష కోట్లతో నిర్మించే 112 జాతీయ రహదారులకు కూడా ప్రధాని ఈ సందర్భంగా హర్యానాలోని గురుగామ్ నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన 35 జాతీయ రహదారులను కూడా ఆయన ప్రారంభించారు. మొత్తం రూ.29,395 కోట్లతో 1,134 కి.మీ.మేర ఈ జాతీయ రహదారులను రాష్ట్రంలో నిర్మించారు. ఇక బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే పనులను 14 ప్యాకేజీలుగా విభజించి చేపట్టనున్నారు. జాతీయ రహదారుల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడంతో పాటు, ఉద్యోగావకాశాలను పెంపొందించడంలో, స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రోత్సహించడంలో ఇవి దోహదం చేయనున్నాయి.

యూపీ తర్వాత ఏపీకే ఎక్కువ ప్రాజెక్టులు : మోదీ

ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. జాతీయ రహదారుల ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం అద్భుతమైన సహకారం అందిస్తోందని ప్రశంసల వర్షం కురిపించారు. అందుకే దేశంలో ఉత్తరప్రదేశ్ తరువాత ఏపీలోనే అత్యధికంగా జాతీయ రహదారుల ప్రాజెక్టులను చేపట్టామన్నారు. విజయవాడ-బెంగళూరు ఎకనామిక్ కారిడార్‌తోపాటు అన్ని ప్రాజెక్టుల ద్వారా ఏపీ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధితో పారిశ్రామికాభివృద్ధి కూడా సాధ్యపడుతుందన్నారు.

ప్రధాని మోదీ ప్రారంభించిన రహదారుల ప్రాజెక్టుల్లో ప్రధానమైనవి.. (వ్యయం రూ.కోట్లలో)

ప్రాజెక్టు	కి.మీ.	వ్యయం
ఆనందపురం-పెందుర్తి-అనకాపల్లి ఆరులేన్ల రహదారి	51	2,957
గురజానపల్లి-అవనిగడ్డ రెండులేన్ల రహదారి	127	1,185
గుండుగొలను-కలపర్రు ఆరులేన్ల రహదారి	27	666
విజయనగరం టౌన్ నాలుగు లేన్ల బైపాస్	17	429
ముర్కంబట్టు-చెర్లోపల్లి నాలుగులేన్ల రహదారి	7	89
దేవరాపల్లి-జీలుగుమిల్లి రెండులేన్ల రహదారి	23	85
శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల్లో ముఖ్యమైనవి..		
విజయవాడ-కడప-బెంగళూరు 6లేన్ల జాతీయ రహదారి	344	14,060
కర్నూలు-ఆత్మకూరు నాలుగు లేన్ల రహదారి	66	1,714
తమిళనాడు సరిహద్దు నుంచి పుత్తూరు 4లేన్ల రహదారి	37	1,347
పుట్టపర్తి-కోడూరు నాలుగు లేన్ల రహదారి	47	1,319
మైదుకూరు-బద్వేలు నాలుగు లేన్ల రహదారి	45	1,064
ఓడరేవు-చిలకలూరిపేట నాలుగు లేన్ల రహదారి	47	1,064
బి.కొత్తపల్లి జంక్షన్-గోరంట్ల నాలుగు లేన్ల రహదారి	57	840

విజయవాడ ఈస్ట్ బైపాస్, భోగాపురం ప్రాజెక్టులను త్వరగా చేపట్టండి..

రాష్ట్రాభివృద్ధికి కీలకమైన విజయవాడ ఈస్ట్ బైపాస్, విశాఖపట్నం–భోగాపురం ఆరులేన్ల రహదారుల నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రధానిని కోరింది. వర్చువల్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనగా తాను ఈ విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బ్రెయిలీ ప్రెస్‌లో2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు

సాక్షి, అమరావతి: గుంటూరు కేంద్రంగా నిర్వహించే బ్రెయిలీ ప్రెస్‌లో ప్రూఫ్ రీడర్ పోస్ట్–1, బైండర్ పోస్ట్–1 ఖాళీలను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఏ కుమార్‌రాజా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 42 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. పూర్తి వివరాలు www.apdascac.ap.gov.in నుంచి పొందవచ్చు.

మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు ఊరట

సాక్షి, హైదరాబాద్: అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసం చేసిన కేసులో రెండేళ్ల క్రితం సీబీఐ కోర్టు విధించిన ఐదేళ్ల జైలుశిక్షపై స్టే విధించింది. బ్యాంక్‌ను మోసం చేసి రూ.42.76 కోట్ల రుణం తీసుకున్నారని సీబీఐ 2015లో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. తప్పుడు పత్రాలతో బ్యాంకు నుంచి రుణం తీసుకుని ఆ నిధులను సొంత అకౌంట్లలోకి మళ్లించారని అభియోగాలు వచ్చాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు మాజీ ఎంపీ గీత భర్త రామకోటేశ్వరరావు కాగా.. గీత ఏ–4గా ఉన్నారు. ఈ కేసులో విచారణ చేపట్టిన సీబీఐ ప్రత్యేక కోర్టు రెండేళ్ల క్రితం తీర్పునిచ్చింది.గీతకు ఐదేళ్ల జైలుశిక్ష విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆమె హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుగా సీబీఐ కోర్టు విధించిన శిక్షపై స్టే ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పోటీకి వీలుగా స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. 2014లో వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన గీత ప్రస్తుతం బీజేపీలో ఉన్నారు.

ప్రధాని విశాఖ పర్యటన రద్దు!

- ఉదయం బహిరంగ సభ ప్రకటన
- సాయంత్రానికి రోడ్డు షోగా మార్పు
- రాత్రికి ఆ రెండూ రద్దయినట్లు వెల్లడి

సాక్షి, విశాఖపట్నం : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటన రద్దయింది. టీడీపీ, జనసేనలతో బీజేపీ పొత్తు పెట్టుకున్న తర్వాత ప్రధాని రాష్ట్రంలో పర్యటిస్తారని వార్తలు వెలువడ్డాయి. మూడు రోజుల పాటు రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ఆయన బహిరంగ సభల్లో పాల్గొంటారని ఆ మూడు పార్టీల నేతలు హడావుడి చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 16న విశాఖలో మోదీ ఎన్నికల బహిరంగ సభలో పాల్గొంటారని స్థానిక బీజేపీ నేతలకు సమాచారం వచ్చింది. దీనిపై బీజేపీ నాయకులు సమాలోచనలు చేస్తుండగా మోదీ బహిరంగ సభ రద్దయిందని, ఒక రోజు ముందుగానే 15వ తేదీన విశాఖలో రోడ్డు షో నిర్వహిస్తారని సాయంత్రానికి కబురు అందింది. దీంతో రోడ్డు షో నిర్వహణపై వీరు సమావేశమై సమాలోచనలు చేశారు. ఎన్ఏడీ జంక్షన్–కంచరపాలెం వరకు గాని, బీచ్ రోడ్డులో కోస్టల్ బ్యాటరీ/నోవాటెల్ హోటల్ జంక్షన్ నుంచి పార్క్ హోటల్/వుడా పార్క్ వరకు గాని రోడ్డు షో నిర్వహించాలని నిర్ణయించారు. దానికి సంబంధించిన ఏర్పాట్లపై చర్చిస్తుండగానే రోడ్డు షో కూడా రద్దయిందని రాత్రి 9 గంటలకు సమాచారం వచ్చింది. ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దయిందని సమాచారం అందిందని బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర సోమవారం రాత్రి 'సాక్షి'కి చెప్పారు.

దూదేకులను దూషిస్తే శిక్ష తప్పదు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సీఎం జగన్‌కు ముస్లిం దూదేకుల జేఏసీ అధ్యక్షుడు దస్తగిరి కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి/నెల్లూరు(వేదాయపాళెం): నూర్ బాషా(దూదేకుల)ను కులం పేరుతో దూషిస్తే శిక్ష తప్పదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దూదేకులను అసభ్య పదజాలంతో విమర్శలు చేస్తే ఐపీసీ సెక్షన్ 1860 ప్రకారం చర్యలు తీసుకుంటామని ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ముస్లిం దూదేకుల పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ విజ్ఞప్తి మేరకు రజకులకు మాదిరిగానే దూదేకులకు కూడా చట్టాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని శాఖల అధిపతులకు, జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు ఏపీ బీసీ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తమ విజ్ఞాపనను పరిగణనలోకి తీసుకుని పెద్ద మనసుతో ఉత్తర్వులు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ముస్లిం దూదేకుల పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ దస్తగిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు దశాబ్దాలుగా ఈ విషయమై అనేక పోరాటాలు చేశామన్నారు. తమ ఆవేదనను సీఎం వైఎస్ జగన్ అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు తమ కులాన్ని చంద్రబాబు మాయమాటలతో మోసం చేశారని, సీఎం జగన్ ఆదరించి అండగా నిలిచారన్నారు. ఇకపై సినిమాల్లోను, సమాజంలోను దూదేకులను తిడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకునేలా ఉత్తర్వులు జారీచేయడంపై సీఎం వైఎస్ జగన్‌కు దస్తగిరి కృతజ్ఞతలు తెలిపారు. నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు షేక్ సలీమ్ కూడా మరో ప్రకటనలో సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రంలో వైద్యసేవలు భేష్

- ప్రపంచ బ్యాంక్ ఐటి బృందం ప్రశంస
- పెనమలూరు ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన సభ్యులు



వైద్య శాఖ యాప్‌ల వివరాలు అడిగి తెలుసుకుంటున్న బృంద సభ్యులు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య ఆరోగ్యసేవలు నిరుపేదలకు మరింత దగ్గరయ్యేలా ఉన్నాయని ప్రపంచ బ్యాంక్ ఐటీ బృందం సభ్యులు ప్రశంసించారు. కృష్ణా జిల్లా పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ప్రతినిధుల బృందం సందర్శించింది. అనంతరం ప్రభుత్వం వైద్య శాఖలో అమలు చేస్తున్న వివిధ యాప్‌ల పని తీరును బృంద సభ్యులు పరిశీలించారు. ప్రధానంగా ఎంవో ఏపీ హెల్త్ యాప్, ఈహెచ్ఆర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యాప్, ఏఎన్ఎం యాప్, ఈ ఔషధి, ఈ ఆశా యాప్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. యాప్‌లు వినియోగించే విధానాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య శాఖలో అమలు చేస్తున్న పథకాలు, యాప్‌ల పనితీరు పట్ల సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధి డాక్టర్ జమ్మి, మల్లర్, సభ్యులు, మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాసరావు, డాక్టర్లు రాజా, సాయిలలిత ,సుష్మా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ఈ ఏడాదీ లేదు

- గతేడాది చార్జీల్లో ఎలాంటి పెంపు లేకుండా 2024–25 సంవత్సరం టారిఫ్
- విజయవాడలో విడుదల చేసిన ఏపీఈఆర్సీ చైర్మన్
- వైఎస్ జగన్ ప్రభుత్వ నిర్ణయంతో 2 కోట్ల కుటుంబాలకు మేలు
- ప్రజలపై భారం లేకుండా రూ.13,589.18 కోట్లు సబ్సిడీ భరించనున్న ప్రభుత్వం
- ప్రభుత్వంపై ఈ ఏడాది అదనంగా రూ.3,453.96 కోట్ల భారం

సాక్షి, అమరావతి: అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో సామాన్యులకు ఎలాంటి విద్యుత్ చార్జీలు పెంచకపోవడమే కాకుండా రైతులకు 9 గంటల పాటు వ్యవసాయానికి పగటిపూట ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది వైఎస్ జగన్ ప్రభుత్వం. వివిధ వర్గాల పేదలకు సైతం పరిమిత యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్‌ను ఇస్తోంది. మరికొన్ని వర్గాలకు రాయితీలూ కల్పిస్తోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో 2024–25 ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని దాదాపు రెండుకోట్ల మంది వినియోగదారులకు, వారి కుటుంబాలకు మేలుకలిగేలా ఎలాంటి విద్యుత్ చార్జీల భారం లేకుండా టారిఫ్ ఆర్డర్‌ను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆమోదించింది. ఇంధనం, విద్యుత్ కొనుగోలు సర్దుబాటు చార్జీలు (ఎఫ్‌పీపీసీఏ) రూపంలో వినియోగదారులపై భారం పడకుండా ఉండేందుకు కమిషన్ వద్ద అందుబాటులో ఉన్న తాజా సమాచారం ఆధారంగా అన్ని ఖర్చులను, ప్రత్యేకించి విద్యుత్ కొనుగోలు ఖర్చులను వాస్తవిక ప్రాతిపదికన కమిషన్ తీసుకుంది. భవిష్యత్తులో ఎఫ్‌పీపీసీఏ ఖర్చుల్లోని వ్యత్యాసాలను కనిష్ట స్థాయికి తగ్గించేందుకు కమిషన్ కృషి చేసింది. ఈ మేరకు విద్యుత్ టారిఫ్‌ను ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి సోమవారం విజయవాడలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఆర్సీ సభ్యులు ఠాకూర్ రామసింగ్, పి.వెంకట రామరెడ్డి, ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్ బాబు, సీపీడీసీఎల్ సీఎండీ కె.సంతోష్ రావు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి వెల్లడించిన వివరాలు..

రూ.3,453.96 కోట్లు అదనంగా భారం

2024–25 ఆర్థిక సంవత్సరానికి క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్ (సీఎస్ఎస్) ప్రతిపాదనలు, మొత్తం ఆదాయ అవసరాలు (ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనల (ఎఫ్‌పీటీ) ఆమోదం కోరుతూ డిస్కంలు ఏపీఈఆర్సీ వద్ద పిటిషన్లు దాఖలు చేశాయి. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి అభ్యంతరాలు, సూచనలను స్వీకరించింది. వివిధ వాటాదారుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, అభిప్రాయాలు, సూచనలను పరిశీలించిన తర్వాత, చట్టప్రకారం ఏఆర్ఆర్, టారిఫ్ రూపకల్పన జరిగింది. ఈ క్రమంలో వార్షిక ఆదాయ అవసరాల నిమిత్తం ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్ రూ.56,573.03 కోట్లకు ప్రతిపాదనలు పంపగా రూ.56,501.81 కోట్లకు కమిషన్ ఆమోదం తెలిపింది. ఇందులో అంతరం కేవలం రూ.71.22 కోట్లు మాత్రమే. ఫైలింగ్‌లో చూపిన రూ.13,624.67 కోట్ల రెవెన్యూ గ్యాప్‌తో పోల్చితే, 2024–25 ఆర్థిక సంవత్సరంలో మూడు డిస్కంలకు రూ.15,299.18 కోట్ల ఆదాయ వ్యత్యాసాన్ని కమిషన్ నిర్ధారించింది. వివిధ తరగతుల వినియోగదారులకు ప్రభుత్వం అందించిన టారిఫ్ రాయితీలు రూ.1,529.34 కోట్లను డిస్కంలు నివేదికల్లో చూపకపోవడమే ఈ తేడాకు కారణం. ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్‌తో పాటు అన్ని తరగతుల వినియోగదారులకు రాయితీలు అందించడానికి కట్టుబడి ఉందని పబ్లిక్ హియరింగ్ ముగింపులో ప్రభుత్వ ప్రతినిధి స్పష్టం చేశారు. దీంతో ఆ మొత్తాన్ని కూడా కమిషన్ అంచనా వేసిన రెవెన్యూ గ్యాప్‌లో చేర్చింది. గత సంవత్సరాల తాత్కాలిక సర్దుబాట్లు తరువాత 2024–25 సంవత్సరానికి



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

మూడు డిస్కంలకు ప్రభుత్వం నుండి అవసరమైన సబ్సిడీ రూ.13,589.18 కోట్లుగా నిర్ధారించారు. ఈ మొత్తం సబ్సిడీ భారాన్ని భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. తద్వారా చార్జీలు పెంచుతారేమోనన్న వివిధ వర్గాల భయాందోళనలు అన్నింటినీ ప్రభుత్వం తొలగించింది. ప్రభుత్వం గతేడాది చెల్లించడానికి అంగీకరించిన సబ్సిడీ రూ.10,135.22 కోట్లతో పోలిస్తే ఈ ఏడాది రూ.3,453.96 కోట్లు ఎక్కువ. దీనివల్ల పంపిణీ సంస్థల ఆదాయ లోటు భర్తీ అవుతుంది. వినియోగదారుల చార్జీలను పెంచాల్సిన అవసరం రాలేదు. తద్వారా ప్రజలపై ఆర్థిక భారం తప్పింది.

అన్ని వర్గాలకూ ఊరట

2020–21 నుండి రైల్వే ట్రాక్షన్‌కు టారిఫ్‌లో పెంపుదల లేనందున, వాస్తవ సేవా ఖర్చు, ద్రవ్యోల్బణాన్ని ప్రతిబింబించేలా ఇంధన చార్జీలు యూనిట్‌కు రూ.5.50 నుంచి రూ.6.50కి పెంచడానికి కమిషన్ ఆమోదించింది. సగ్గు బియ్యం తయారీ మిల్లులకు, పౌల్ట్రీ ప్లాంట్లకు ఉపశమనం కలిగించింది. సగ్గు బియ్యం మిల్లులను సీజనల్ పరిశ్రమల విభాగంలో చేర్చింది.

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మొత్తం సబ్సిడీ వివరాలు (రూ.కోట్లలో)

కేటగిరీ	సబ్సిడీ
ఎల్‌టీ డొమెస్టిక్	3,194.57
ఉచిత వ్యవసాయ విద్యుత్	9,242.94
ఆక్వాకల్చర్, యానిమల్ హస్బెండరీ	1,320.27
ఇతరాలు	12.06
మొత్తం	13,769.84

వివిధ వర్గాల విద్యుత్ వినియోగదారులకు డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నేరుగా ప్రభుత్వం అందించే సబ్సిడీలు (రూ.కోట్లలో)

పథకం	సబ్సిడీ
ఎస్సీ సబ్సిడీ	634.00
ఎస్టీ సబ్సిడీ	143.34
ఆక్వా రైతులకు టారిఫ్ రాయితీ	738.00
చేనేత, సెలూన్, రజక, గోల్డ్ స్మిత్ బీపీఎల్, ఎంబీసీ వర్గాలు	14.00
మొత్తం	1,529.34

ఏపీఈఆర్సీ మార్గదర్శకాలు

- ఉచిత వ్యవసాయ విద్యుత్ కేటగిరీ కింద, ఫీడర్‌వారీ వ్యవసాయ విక్రయాలను వెబ్‌సైట్లలో ఉంచాలి. వ్యవసాయ వినియోగదారులకు సబ్సిడీ చెల్లింపు ఆలస్యమయ్యే అంశాల్లో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను డిస్కంలు అనుసరించాలి.
- డిస్కంలకు ప్రభుత్వం ద్వారా సబ్సిడీలను సకాలంలో చెల్లించేలా చూసేందుకు ఆలస్యంపై వడ్డీని చెల్లించాలని కమిషన్ మొదటిసారిగా ఉత్తర్వులు జారీ చేసింది.
- విద్యుత్ కొనుగోలు ఖర్చులు ఆప్టిమైజ్ చేయడానికి, స్వల్పకాలిక సరైన పవర్ ప్లానింగ్‌ని నిర్ధారించడానికి, 15 నిమిషాల టైమ్ బ్లాక్ విశ్లేషణ ఆధారంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ సేకరణ ప్రణాళికను కూడా కమిషన్ తొలిసారిగా సూచించింది. ఇది వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాకు ఉపయోగపడుతుంది.
- వినియోగదారులకు ప్రభుత్వం ఇచ్చిన ఒక్కో యూనిట్ సబ్సిడీ వివరాలను కూడా కమిషన్ ఆర్డర్లో పొందుపరిచింది.
- సోలార్ మాడ్యూల్ తయారీ పరిశ్రమ కోసం హెచ్‌టీ3(సి) ఎనర్జీ ఇంటెన్సివ్ ఇండస్ట్రీస్‌లో ప్రత్యేక ఉప–కేటగిరీని సృష్టించి కొంచెం తక్కువ ధరకు విద్యుత్ విక్రయించాలన్న డిస్కంల ప్రతిపాదనను, సమాచారం సరిగా లేనందున కమిషన్ ఆమోదించలేదు.
- స్మార్ట్ మీటర్ ఇన్‌స్టలేషన్‌పై భయాలను తొలగించేందుకు వాటిపై ఆర్డర్‌లో స్పష్టతనిచ్చింది.

జనసేన సీట్లలో కోత

- బీజేపీకి సీట్ల సర్దుబాటుకు జనసేన అసెంబ్లీ స్థానాల్లో 3 తగ్గించిన బాబు
- చంద్రబాబు, పవన్, గజేంద్రసింగ్ షెకావత్ చర్చల తర్వాత ఉమ్మడి ప్రకటన

సాక్షి, అమరావతి: బీజేపీ, జనసేన, టీడీపీ మధ్య ఎట్టకేలకు సీట్ల సర్దుబాటు జరిగింది. బీజేపీ ఎక్కువ స్థానాలు కోరడంతో ఆ పార్టీకి సీట్ల సర్దుబాటు చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు జనసేన సీట్లలో కోత వేశారు. ఇప్పటివరకు జనసేనకిచ్చే 24 అసెంబ్లీ స్థానాల్లో మూడు సీట్లు తగ్గించి 21 స్థానాలతో సరిపెట్టారు. మొత్తంమీద బీజేపీ, జనసేనకు కలిపి 31 ఎమ్మెల్యే, 8 ఎంపీ సీట్లను చంద్రబాబు కేటాయించారు. టీడీపీ 144 అసెంబ్లీ స్థానాల్లో 17 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయనుంది. ఈ మేరకు మూడు పార్టీల ఉమ్మడి ప్రకటనను చంద్రబాబు సోమవారం రాత్రి ఎక్స్ (ట్విటర్)లో విడుదల చేశారు. 31 ఎమ్మెల్యే సీట్లలో 21 స్థానాల్లో జనసేన, 10 స్థానాల్లో బీజేపీ పోటీ చేయనున్నాయి. అంతకు ముందు జనసేనకు కేటాయించిన మూడు ఎంపీ సీట్లలోనూ ఒకటి తగ్గిపోయిన విషయం తెలిసిందే. అంటే 2 లోక్‌సభ స్థానాల్లో మాత్రమే జనసేన పోటీ చేయనుంది. 6 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుంది. ఈ సీట్ల సర్దుబాటులో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పూర్తిగా చంద్రబాబుకు లొంగిపోయినట్లు స్పష్టమైంది. బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, పార్టీ ముఖ్య నేత బైజయంత్ పాండా సోమవారం విజయవాడ వచ్చి, ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చారు. పవన్ కళ్యాణ్ కూడా అక్కడికి వెళ్లారు. వారి మధ్య రాత్రి వరకు చర్చలు జరిగాయి. తొలుత బీజేపీ పెద్దలు తమకు, జనసేనకు కలిపి 45 ఎమ్మెల్యే, 10 ఎంపీ సీట్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. సుదీర్ఘంగా చర్చలు జరిపిన చంద్రబాబు ఎట్టకేలకు వారిని 10 ఎమ్మెల్యే సీట్లు 6 ఎంపీ సీట్లకు ఒప్పించారు. రెండురోజుల క్రితం ఎన్డీఏతో పొత్తు ఖరారైన రోజే సీట్ల పంపకం కూడా పూర్తయినట్లు చంద్రబాబు పార్టీ నేతలకు చెప్పింది నిజం కాదని తాజా చర్చలతో స్పష్టమైంది. బీజేపీ, జనసేనకు కలిపి 30 అసెంబ్లీ, 8 ఎంపీ స్థానాలు కేటాయించినట్లు చంద్రబాబు ఆరోజు పార్టీ నేతలకు చెప్పారు. వాస్తవానికి ఢిల్లీలో ఎన్డీఏలో టీడీపీ చేరడం మాత్రమే జరిగింది. సీట్లపై అసలు చర్చ కూడా జరగలేదు. కానీ చంద్రబాబు తనకు అనుకూలంగా ఎల్లో మీడియా ద్వారా సీట్ల పంపకం కూడా పూర్తయినట్లు ప్రచారం చేయించారు. సీట్ల పంపకం పూర్తయిన నేపథ్యంలో ఆయా పార్టీలు.. తమ కేటాయించిన సీట్లకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

సోము వీర్రాజుకు రాజమండ్రి అర్బన్ సీటు !

బీజేపీ ప్రతిపాదించిన స్థానాల్లో కొన్నింటిని ఇప్పటికే జనసేనకు కేటాయించడం, కొన్నింటికి టీడీపీ అభ్యర్థులను ప్రకటించడంతో ఇప్పుడు ఏం చేయాలనే దానిపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ప్రధానంగా బీజేపీ ముఖ్య నేత సోము



వీర్రాజుకు రాజమండ్రి అర్బన్ సీటు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడటంతో టీడీపీ ఇరకాటంలో పడింది. అది టీడీపీ సిట్టింగ్ సీటు కావడంతో అక్కడ ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ భర్త వాసుకు టికెట్ ఖరారు చేశారు. దీన్ని మార్చితే ఇబ్బందులు వస్తాయని చంద్రబాబు భావిస్తుండగా, ఆ సీటు తమకు ముఖ్యం కాబట్టి ఇవ్వాల్సిందేనని బీజేపీ పట్టుబడుతోంది. విశాఖ ఎంపీ స్థానాన్ని బీజేపీ కోరుతుండగా దానిపైనా టీడీపీ స్పష్టత ఇవ్వలేదని తెలిసింది. ఈ చర్చలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని దూరంగా ఉంచడం విశేషం.

సీట్ల సంఖ్య ముఖ్యం కాదు: పవన్

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే లోక్‌సభ, శాసన సభ ఎన్నికల్లో బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి పని చేస్తాయని జనసేన అధ్యక్షుడు సోమవారం తన ఎక్స్ (ట్విటర్) ఖాతాలో పోస్టు చేశారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సీట్ల పంపకం జరిగిందన్నారు. సీట్ల సంఖ్యలో హెచ్చుతగ్గులకంటే రాష్ట్ర శ్రేయస్సు ముఖ్యమని స్పష్టం చేశారు. మూడు పార్టీలూ దృఢ సంకల్పంతో ముందడుగు వేశాయన్నారు. ఈ కూటమి ఆవిర్భావంతో రాష్ట్ర పురోభివృద్ధికి బలమైన పునాది పడిందని విశ్వసిస్తున్నట్టు చెప్పారు. ఎన్డీఏలో భాగస్వాములుగా సేవ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని అన్నారు. ఈ రోజు చర్చల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పాండా, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు జనసేన పార్టీ కార్యాలయం కూడా సీట్ల పంపకంపై ఉమ్మడి ప్రకటన విడుదల చేసింది.



నా ఆలోచనలో, పనిలో ఎవరైనా తప్పును చూపిస్తే, నేను తప్పకుండా మార్చుకుంటాను. నాకు సత్యం కావాలి; అది ఎవరికీ హాని కలిగించలేదు. హాని తమను తాము మోసపుచ్చుకోవడంలో, అజ్ఞానంలో ఉంది.

– మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 12 మార్చి 2024

సరైన కార్యాచరణ ఎక్కడ?!

నటన ఒక స్థాయికి మించితే బెడిసికొడుతుంది. తెరపై అతిగా నటిస్తే ఓవరాక్షన్ అంటారు. ఆ పనే నిజజీవితంలో చేస్తే వంచన అంటారు. గాజాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండ 157 రోజులుగా అంతూ దరీ లేకుండా సాగుతోంది. ముస్లింలు ఎంతో పవిత్రంగా పరిగణించే రంజాన్ మాసం మొదలైనా మారణకాండ, విధ్వంసం ఆగటంలేదు. ఆకలితో అల్లాడుతున్న ప్రజానీకం అడపా దడపా వచ్చిపడుతున్న క్షిపణులకూ, బాంబులకూ పిట్టల్లా రాలుతున్నారు. ఇప్పటికి 31,000 మంది పౌరులు ఈ దాడుల్లో మరణించారని పాలస్తీనా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు చెబుతుండగా అందులో 13,000 మంది ఉగ్రవాదులున్నారని ఇజ్రాయెల్ ప్రకటిస్తోంది. 'సంపూర్ణ విజయం' సాధించేవరకూ విశ్రమించబోమని ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ చెబుతున్నారు. నిరుడు అక్టోబర్ 7న ఇజ్రాయెల్ భూభాగంలోకి ప్రవేశించిన హమాస్ మిలిటెంట్లు 1,200 మంది ఇజ్రాయెల్ పౌరులను హతమార్చి, 250 మంది పౌరులను అపహరించినప్పటినుంచీ గాజాపై దాడులు సాగుతూనేవున్నాయి. కిడ్నాప్ చేసినవారిలో 150 మందిని హమాస్ విడుదలచేసింది. ఇంకా 100 మంది వారి చెరలోనేవున్నారు. ఈ మానవ హననాన్ని నిలువరించటానికి తన పలుకుబడిని వినియోగించాల్సిన అగ్రరాజ్యం అమెరికా అందుకు భిన్నంగా ద్విపాత్రాభినయం చేస్తూ తన నటనావైదుష్యాన్ని ప్రదర్శిస్తోంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దేశ ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగంలో గాజాపై దాడులు నిలపాలనీ, కనీసం రంజాన్ మాసంలోనైనా కాల్పుల విరమణకు అంగీకరించాలనీ నెతన్యాహూను కోరారు. మంచిదే. కానీ ఆయన లక్ష్యపెట్టిందెక్కడ? తన మాటకు విలువీయని దేశానికి బైడెన్ ఆయుధ సరఫరా ఎలా కొనసాగిస్తున్నారు?

అమెరికాయే కాదు... దాని మిత్రదేశాలు కూడా ఈ ద్విపాత్రాభినయాన్ని అలవాటు చేసుకున్నాయి. ఇదే సమయంలో యుద్ధం ఆపాలంటూ వర్ధమాన దేశాలు తీసుకొస్తున్న తీర్మానాలకు భద్రతామండలిలో అమెరికా తన వీటో అధికారంతో గండికొడుతోంది. నెతన్యాహూపై బైడెన్ తరచు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రఫాపై దాడికి పూనుకుంటే లక్ష్మణరేఖ దాటినట్టేనని హెచ్చరిస్తున్నారు. ఎవరిని వంచించటానికి ఈ హెచ్చరికలు? గాజా ప్రజల క్షేమంపై ఆయనకు నిజంగా ఆందోళనవుంటే దాని పొరుగు దేశమైన ఈజిప్టును ఒప్పించి గాజా పౌరులు సరిహద్దుదాటి తలదాచుకునేందుకు అనుమతించమని అడగొచ్చు. కానీ ఆయన ఆ పని చేయటం లేదు. ఈజిప్టుకు ఏటా అమెరికా 103 కోట్ల డాలర్ల విలువైన సైనిక సాయాన్ని అందిస్తోంది. ఆ దేశాధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్ సిసితో బైడెన్‌కు మంచి సంబంధాలున్నాయి. అయినా ఈ ప్రతిపాదన చేయరు. ఇందుకు బదులు ఆహార పొట్లాలు అందించటం మొదలెట్టారు. ఆ ఉద్దేశం వెనకున్న ఆంతర్యాన్ని కూడా అనేకులు తప్పుబడుతున్నారు. దేశప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగంలో గాజాలో పోర్టు నిర్మాణాన్ని మొదలుపెడతామని బైడెన్ ప్రకటించారు. ఇది ఆహార సరఫరా సులభం చేయటం కోసమని ఆయన చెబుతున్నా ఆ వంకన అక్కడ తిష్టవేయటమే అమెరికా లక్ష్యమన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇజ్రాయెల్‌కు ఆత్మరక్షణ చేసుకునే హక్కుందని బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ మాట్లాడే మాటలు 31,000 మంది మరణించాక కూడా చెల్లుబాటవుతాయా? అయిదు నెలలు గడిచాక కూడా ఇంకా హమాస్‌ను అంతం చేయటమే లక్ష్యమంటూ ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధాన్ని అమెరికా చూసీ చూడనట్టు వదిలేయటం సరైందేనా? హమాస్ తన దుందుడుకు చర్యలతో గాజా ప్రజలకు తీరని నష్టం చేసింది. దానిపై దాడి పేరుతో అదే పని ఇజ్రాయెల్ కూడా కొనసాగిస్తోంది. కానీ ఒకరి దాడిని ఉగ్రవాదంగా చిత్రీకరిస్తూ మరొకరిని అనునయిస్తూ, వేడుకుంటూ అదే సమయంలో వారికి కావలసిన ఆయుధ సామగ్రి అందిస్తూ కాలం గడపటం సరైందేనా?

గాజాలో నాగరిక సమాజాలు ఏమాత్రం అంగీకరించటం సాధ్యంకాని ఉదంతాలు చోటుచేసుకుంటున్నాయి. గాజా పౌరులు ఆకలికి తట్టుకోలేక ఆకులు అలములు తింటున్నారు. కడుపు నింపుకోవటానికి పశుదాణా సైతం వినియోగిస్తున్నారు. నెలలు నిండకమునుపే గర్భిణులకు ప్రసవాలవుతున్నాయి. ఆ నవజాత శిశువులకు అవసరమైన సంరక్షణ కూడా సాధ్యం కావటం లేదు. అధిక రక్తస్రావంతో తల్లులు కన్నుమూస్తున్నారు. సకాలంలో మేల్కొని ఆపకపోతే ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా కూడా దోషిగా నిలబడాల్సివస్తుంది. రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధంలో దినదిన గండంగా బతుకుతున్న ఉక్రెయిన్‌కు ఇంతవరకూ అమెరికా ఒక్కటే 7,500 కోట్ల డాలర్ల సాయం అందించింది. నాటో సభ్య దేశాలు తమ వంతుగా మరింత సాయం అందిస్తున్నాయి. ఇందువల్ల రష్యా ఎక్కడా తగ్గిన దాఖలా లేదు. అటు ఉక్రెయిన్‌కు కూడా ఒరిగేదేమీ వుండటం లేదు. లాభపడేది అమెరికా రక్షణ ఉత్పత్తుల కంపెనీలే. సాయం పేరుతో అందించేదంతా తిరిగి ఆ కంపెనీలకు చేరుతోంది. ఉక్రెయిన్ ఆ డబ్బుతో అమెరికా ఆయుధాలు, క్షిపణులు వగైరాలు కొంటున్నది. అటు ఉక్రెయిన్, ఇటు గాజా ఏకకాలంలో శ్మశానాలను మరపిస్తుండగా... రక్షణ ఉత్పత్తుల కంపెనీలు మాత్రం పచ్చగా వెలుగుతున్నాయి. పోనీ అమెరికా అయినా ప్రశాంతంగా వుంటున్నదా? కొన్ని దశాబ్దాలక్రితం పౌరహక్కుల కోసం చేతులు కలిపిన నల్లజాతీయులు, యూదులు ఇప్పుడు పరస్పరం దూషించుకుంటున్నారు. యూదులపై అక్కడక్కడ దాడులు కూడా జరుగుతున్నాయి. దీన్నంతటినీ ఆపాలంటే గాజాతోపాటు ఉక్రెయిన్‌లోనూ ప్రశాంతత నెలకొనాలి. అది అమెరికా అధ్యక్షుడు బైడెన్ చేతుల్లోనేవుంది. ఇప్పుడు కావాల్సింది నటన కాదు... సరైన కార్యాచరణ.

పాక్ నాయకత్వానికి అసలు పరీక్ష

విశ్లేషణ



మలీహా లోధి

ఎన్నికలపై రాజకీయ గందరగోళం, వివాదాలతో కూడిన వాతావరణంలో పాకిస్తాన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రధానిగా తన రెండవ పదవీ కాలంలో, షెహబాజ్ షరీఫ్ బలహీనమైన ఆరు పార్టీల సంకీర్ణానికి నాయకత్వం వహిస్తున్నారు. ఇది పాలనాపరమైన పని నుండి ప్రభుత్వ దృష్టిని మరల్చగలదు. ఆందోళనా రాజకీయాలను ఆశ్రయించాలని 'పీటీఐ' భావించడం కూడా పాలక కూటమికి సవాలే. పరిపాలనలో సైనిక వ్యవస్థ అజమాయిషీ కూడా ప్రభుత్వ అధికారాన్ని పరిమితం చేసేదే. ఇక ఆర్థిక సవాలు, అత్యంత ముఖ్యమైనది. పాక్ దారుణమైన సంక్షోభంలో ఉంది. అయితే, కఠినమైన ఆర్థిక చర్యల ద్వారా భారత్ సహా పలు దేశాలు భయంకరమైన ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కాయని గుర్తుంచుకోవాలి.

పూర్తి మెజారిటీ లేని నాయకుడిగా షెహబాజ్ షరీఫ్ తన ప్రభుత్వ మనుగడ కోసం పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ)పై ఆధారపడ్డారు. ఈ పార్టీ కేబినెట్‌లో చేరడానికి నిరాకరిస్తూ ప్రభుత్వానికి మద్దతునిచ్చింది. దీని అర్థం ఏమిటంటే, పీపీపీ, ఇతర మిత్రపక్షాలను సంతోషంగా ఉంచడానికీ, వారి డిమాండ్లను నెరవేర్చడానికీ ప్రభుత్వం నిరంతర ప్రయత్నాలలో నిమగ్నమై ఉంటుంది. ఆందోళనా రాజకీయాలను ఆశ్రయించాలని పాకిస్తాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ (పీటీఐ) భావిస్తున్నందున ఇది పాలక కూటమికి నిరంతరం సవాలును విసురుతుంది. జాతీయ అసెంబ్లీలో ప్రతిపక్షం పెద్ద కూటమిగా ఏర్పడినందున పార్లమెంటరీ వ్యవహారాలను నిర్వహించే పనిని అది మరింత కష్టతరం చేస్తుంది. అసెంబ్లీ ప్రారంభ సెషన్లలో పీటీఐ మద్దతుగల జాతీయ అసెంబ్లీ సభ్యుల విఘాతకరమైన ప్రవర్తన, రాబోయే పరిణామాల స్వరూపాన్ని సూచిస్తోంది. ప్రత్యేకించి వారు ప్రతి సెషన్‌లోనూ నిరసనలు తెలుపుతామని తేల్చి చెప్పారు. ఈ ఘర్షణ శాసన నిర్మాణానికి అడ్డంకులుగా మారుతుంది. పైగా పార్లమెంట్ కార్యకలాపాలను కూడా స్తంభింపజేస్తుంది.

పరిపాలనలో సైనిక వ్యవస్థ అజమాయిషీ కూడా ప్రభుత్వ అధికారాన్ని పరిమితం చేస్తుంది. తన మునుపటి పదవీకాలంలో, షెహబాజ్ షరీఫ్ సైనిక వ్యవస్థకు చాలా ప్రాధాన్యతనిచ్చారు. ఇప్పుడు ఏదైనా ముఖ్యమైన మార్గంలో దానిపై తిరగబడడం లేదా దాని పాత్రను తగ్గించడం అసంభవం. కాబట్టి దేశం ఎలా నడుస్తుందనే అంశంపై సైన్యం అజమాయిషీ కొనసాగుతుందని దీని అర్థం.

తర్వాత క్లిష్టమైన ప్రాదేశిక ముఖచిత్రం కూడా ఉంది. రాష్ట్రాలకు సంబంధించి పీఎమ్ఎల్–ఎన్ ఒక ప్రావిన్స్‌ను మాత్రమే నియంత్రిస్తోంది. మిగిలిన మూడు ప్రావిన్సులను వేర్వేరు పార్టీలు నియంత్రిస్తున్నాయి. పైగా ఖైబర్ పఖ్తూన్‌క్వాలో పూర్తిగా వ్యతిరేకమైన ప్రభుత్వం కొనసాగుతోంది. ఇది కూడా కొత్త ప్రభుత్వానికి పరిమితులు విధిస్తుంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలను నిర్వహించడం ఒక స్పష్టమైన సవాలుగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఆచరణాత్మకమైన తత్వం, దృఢంగా వ్యవహరించడం మధ్య తెలివైన కలయిక అవసరం.

అయితే దేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను ఎదుర్కోవడానికి ఈ పరిమితులు ఏవీ ప్రభుత్వాన్ని నిరోధించకూడదు. ఏదేమైనా, అది ప్రభుత్వ బాధ్యత. దీని కోసం, ప్రధానమంత్రి తన మునుపటి పదవీకాలంలో నియమించిన విచిత్రమైన, సంఖ్యారీత్యా పెరిగిపోయిన క్యాబినెట్‌ను కాకుండా, ఒక సమర్థమైన బృందాన్ని ఎంచుకోవాలి. స్పష్టమైన, పొందికైన విధాన ఎజెండాను రూపొందించాలి.

ఆర్థిక సవాలు, వాస్తవానికి అత్యంత ముఖ్యమైనది. పాకిస్తాన్ భారీ విదేశీ రుణ సేవా బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుండి కోరుకోవాల్సింది పొందేందుకు షరీఫ్ ప్రభుత్వం కఠినమైన, రాజకీయంగా బాధాకరమైన నిర్ణయాలను తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలి. ఆర్థిక సవాలు తీవ్రమైనది అయినప్పటికీ ఈ సంక్షోభంలోనూ ప్రభుత్వం ఒక అవకాశాన్ని చూడాలి. ఎక్కువ రుణాలు తీసుకోవడం, ఉద్దీపనలు, సంస్కరణలను వాయిదా వేయడం, అధిక స్థాయి రుణాలను తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని సృష్టించకుండా ఎక్కువ రుణాలు సేకరించడం– ఇవన్నీ పాక్ రహదారిపై మరొక సంక్షోభానికి మాత్రమే హామీ ఇస్తాయి. వృద్ధి, పెట్టుబడులను ప్రోత్సహించడానికి లేదా రికార్డు స్థాయి ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే విషయంలో ఏమీ చేయదు.



సంకీర్ణ ప్రభుత్వంలో పాకిస్తాన్‌కు రెండోసారి ప్రధాని అయిన షెహబాజ్ షరీఫ్

కాబట్టి రోగాన్ని దాచిపెట్టే బ్యాండ్ ఎయిడ్ విధానం, ఏ విధంగానూ ఇప్పుడు ఆమోదయోగ్యం కాదు. ప్రత్యామ్నాయంగా ఈ సంక్షోభాన్ని విస్తృత శ్రేణి నిర్మాణాత్మక సంస్కరణలను ప్రారంభించడానికీ, ఆర్థిక వ్యవస్థను విష వలయం నుండి బయటపడేయటానికీ ఉపయోగించవచ్చు. నిలకడలేని ఆర్థిక అసమతుల్యతలు, భారీ దేశీయ, విదేశీ రుణాలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, తక్కువ పొదుపులు, పెట్టుబడి, స్తంభించిన వృద్ధి– ఇవన్నీ ఈ విషవలయంలో భాగమే.

ప్రపంచంలోని పలు దేశాలు పాకిస్తాన్ ఎదుర్కొంటున్న దానికంటే భయంకరమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. కానీ అవి సంక్షోభాన్ని బలంగా, మరింత స్థితిస్థాపకంగా తిరిగి లేచినిలబడేలా ఉపయోగించుకోగలిగాయి. 1997లో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్న ఆగ్నేయాసియా దేశాలు ప్రాథమిక సంస్కరణలను చేపట్టడం ద్వారా, కఠినమైన ఆర్థిక చర్యలతో నిర్మాణాత్మక సమస్యలను పరిష్కరించడం ద్వారా గట్టెక్కాయి. అదేవిధంగా, 1990లలో భారతదేశం, 1980లు, 1990లలో అనేక లాటిన్ అమెరికన్ దేశాలు కూడా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొన్నాయి. అవి తర్వాత కోలుకోవడమే కాకుండా పటిష్ఠమైన వృద్ధి బాటలో పయనించగలిగాయి. ఆర్థిక స్థిరత్వాన్ని సాధించాయి. ప్రతి సందర్భంలోనూ, దీర్ఘకాల నిబద్ధత చూపుతూ, స్థిరమైన విధానాలను ఈ దేశాల నాయకులు అమలుపరిచారు. అతుకుల బొంత పరిష్కారాలు నిజానికి పరిష్కారాలే కావనీ, నిర్మాణాత్మక సర్దుబాట్లు, కఠినమైన ఆర్థిక విధానం, ఇతర సంస్కరణ చర్యలు ముందుకు సాగడానికి చాలా అవసరమనీ విశ్వసించిన సమర్థ బృందాల దన్నుతో నాయకులు తగు చర్యలు ప్రారంభించారు.

స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని నెలకొల్పడానికి తక్షణ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉన్నప్పటికీ, మరొక సంక్షోభం కూడా షరీఫ్ ప్రభుత్వానికి సవాలుగా నిలుస్తుంది. ఇది మానవాభివృద్ధిలో సంక్షోభం. అక్షరాస్యత, విద్య, ఆరోగ్యం, పేదరికం, సామాజిక న్యాయం, మానవ సంక్షేమానికి సంబంధించిన ఇతర అంశాలు ఇటీవలి సంవత్సరాలలో క్షీణిస్తున్నాయి. ప్రపంచ మానవాభివృద్ధి ర్యాంకింగ్స్‌లో పాకిస్తాన్ గణనీయంగా పడిపోవడంతో ప్రపంచ బ్యాంక్ దీనిని 'నిశ్శబ్ద, లోతైన మానవ మూలధన సంక్షోభం'గా పేర్కొంది.

అత్యధిక సంఖ్యలో బడి మానేసిన 2 కోట్లకు పైగా పిల్లలతో ప్రపంచంలోనే పాకిస్తాన్ రెండవ స్థానంలో ఉందనే భయంకరమైన వాస్తవం, దాని విద్యా అత్యవసర పరిస్థితిని ప్రతిబింబిస్తుంది. 40 శాతం మంది నిరక్షరాస్యులతో అక్షరాస్యత స్థాయిలు నిలిచిపోయాయి. అంతకుముందటి సంవత్సరంతో పోలిస్తే 2023లో 1.25 కోట్ల మంది ప్రజలు పేదరికంలోకి నెట్టబడ్డారని అంచనా. మానవ అభివృద్ధికి సంబంధించిన పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఇది దేశ స్థిరత్వం, ఆర్థిక పురోగతి గొప్ప ప్రమాదంలో పడనుందనే వాస్తవాన్ని తెలియజేస్తోంది. పాకిస్తాన్ నిద్రలో నడుచుకుని వెళ్తూ విపత్తులో పడిపోవచ్చని సూచిస్తుంది.

ఈ సవాళ్లను నిండు రాజకీయ వాతావరణంలోనే పరిష్కరించవలసి ఉంటుందనీ, ప్రభుత్వ అధికారంపై ఉన్న పరిమితులు, ప్రధాన విధాన చర్యలను అమలు చేయగల దాని సామర్థ్యంపై భారంగా పడతాయనీ అంగీకరించాలి. రాజకీయ ఉద్రిక్తతలను తగ్గించడానికీ, కీలక చర్యలపై రాజకీయ ఏకాభిప్రాయాన్ని ఏర్పరచడానికీ ప్రభుత్వం మార్గాలను అన్వేషించాలి. ఇది సులభం కాదు. ప్రభుత్వ సంకీర్ణ భాగస్వాములు కఠినమైన ఆర్థిక చర్యల నుండి తమను తాము దూరం చేసుకోవాలనుకుంటున్నారు. ఇమ్రాన్ ఖాన్ పార్టీకి చెందిన నాయకులను వారి పోరాట మార్గం నుండి తప్పించడం కూడా అంతే కష్టం. అందుకే, షెహబాజ్ షరీఫ్‌కు ఇది నాయకత్వ పరీక్ష.

వ్యాసకర్త పాకిస్తాన్ దౌత్యవేత్త; ఐరాసలో పాక్ మాజీ ప్రతినిధి

('ద డాన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మొదలైన ఉపవాసం



ఉదయం నాలుగ్గంటలకు నా సహర్ (ఉపవాస ప్రారంభానికి ముందు చేసే భోజనం) ఇదీ: గ్రనోలా (ఓట్స్‌తో కూడిన పదార్థం), యోగర్ట్ (పెరుగు లాంటిది), తేనె, ఇంకా ఎటూ చాలా మంచినీళ్లు. రమదాన్ మొదటిరోజు (ఊహించినట్టే కఠినంగా ఉంటుంది) మీకూ, మీ సంబంధీకులకూ బాగా జరుగుతుందని ఆశిస్తాను.

– హమ్జా యూసఫ్, స్కాట్‌లాండ్ ఫస్ట్ మినిస్టర్

అన్నీ హెడ్‌లైన్లే!



పార్లమెంట్‌లో అంగీకారం పొందిన నాలుగేళ్ల తర్వాత, సాధారణ ఎన్నికల నేపథ్యంలో మోదీ ప్రభుత్వం సీఏఏ (సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్)ను అమలు చేస్తామని ప్రకటించింది. పొద్దుటి పతాక శీర్షిక ఎన్నికల బాండ్లు, సాయంత్రం పతాక శీర్షిక సీఏఏ.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

సందడే సందడి



నా తోబుట్టువులు అద్భుతమైన ఇండియాకు రావడం ఎంతో సంతోషం. మేము ఎర్రకోట, లోటస్ టెంపుల్ దర్శించాం. ఢిల్లీ మార్కెట్లు గాలించాం. స్ట్రీట్ ఫుడ్ రుచి చూశాం. అలాగే గురుగ్రామ్‌లోని ఆంబియెన్స్ మాల్‌కు వెళ్లాం.

– గై నీర్, 'ఇండియాలో ఇజ్రాయిల్' ప్రతినిధి

ఎందుకని?



స్విస్ బ్యాంక్ వివరాలు బయటపెడతానని అధికారంలోకి వచ్చిన బీజేపీ, ఎస్బీఐ వివరాలు బయటపెట్టడానికి భయపడుతోంది.

– మహువా మొయిత్రా, తృణమూల్ నేత

నిజంగా చేయాల్సింది



బాహ్య ప్రపంచపు లోతుల్లోకి నువ్వు వెళ్లాల్సిన అవసరం లేదు. నీ లోకీ, నీ చైతన్యం లోకీ లోతుగా వెళ్లాల్సి ఉంటుంది. అదే జీవితంలో అత్యంత ముఖ్యమైన అన్వేషణ.

– కామ్యా బుచ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

వేదాతీతు(వు)లు

అభిప్రాయం



పి. విజయబాబు

''వీరబ్రహ్మేంద్ర స్వామి వారు వెంపలి చెట్లకు నిచ్చెనలు వేసే వాళ్ళు వస్తారని చెప్పారట! నోస్ట్రడామస్ ప్రళయం వస్తుందని చెప్పారట! వాటి సంగతి ఏమో తెలియదు కానీ, భగవద్గీతకు వక్ర భాష్యం చెప్పే నయాభాష్యకారులు వచ్చేశారు. తీతువు పిట్టలు పిచ్చి కూతలు కూస్తున్నాయి. శిష్టుల(ఇష్టుల)ను రక్షించడానికి ధర్మ రథాలు సిద్ధం చేయాలట!

ఇక మనకు చాగంటి కోటేశ్వరరావు, సామవేదం షణ్ముఖ శర్మ, గరికపాటి వంటి వారి ప్రవచనాలు విననవసరం లేదు కాబోలు! ఇప్పుడు రాజకీయ వితర్దిపై భాష్యకారులు తయారయ్యారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ అట! శిష్టులంటే ఇష్టులనీ (అంటే మనాళ్ళని), దుష్టులంటే పేద జనానికి ఇష్టులని ఈ పిచ్చి బుర్రకు అర్థం కాలేదు సుమీ'' ఆనందరావు ఏదేదో మాట్లాడేస్తున్నాడు.



అతడి మాటలకు అడ్డు తగులుతూ, ''ఏమిటిరా వచ్చిన దగ్గర్నుంచి ఏదేదో పిచ్చిపిచ్చిగా వాగుతున్నావ్'' అన్నాను మందలింపు స్వరంతో. ''అవున్రా పూర్తిగా మతిపోయింది. ఇన్నేళ్లు నువ్వు చెప్తే నాకు అర్థం కాలేదు రాజకీయాలు వేరు, ఆధ్యాత్మికత వేరు. రాజకీయాలకు భక్తి రంగు పులమకు అని నువ్వు చెప్పినా నేను అర్థం చేసుకోలేకపోయాను'' అన్నాడు ఆనందరావు నిస్పృహతో.

ఆనందరావు విద్యార్థి దశ నుంచి ఏదో సంఘం, పరివారం అంటూ తిరిగేవాడు. తదనంతర కాలంలో తన భావజాలానికి దగ్గరగా ఉండే జాతీయ పార్టీలో చేరాడు. చాలా క్రియాశీలకంగా వ్యవహరించేవాడు.

''ఇప్పుడు ఇంతకీ ఏమైందిరా?'' మళ్ళీ రెట్టిస్తూ అడిగాను ఆనందరావుని.

''భావజాలానికి వాస్తవానికి చాలా తేడా ఉంటుంది అని నువ్వు చెప్తే నాకు అర్థం కాలేదు. కానీ నిన్నటితో బాగా అర్థమైంది'' అన్నాడు ఆనందరావు.

''సరే ఏం అర్థమైందో ఏంటో సస్పెన్స్‌తో చంపక పాయింట్‌కి వచ్చేయ్! అన్నాను'' విసుక్కుంటూ.

ఏముంది? ఏకపత్నీ వ్రతం, అంటూ దశాబ్దాలుగా మా భావజాలాన్ని నమ్ముకుని మేము పని చేస్తుంటే మా నెత్తి మీద పచ్చి అవకాశవాదుల్ని నాయకులుగా తీసుకొచ్చి రుద్దుతున్నార్రా! వాళ్ల వికృత ప్రసంగాలు భరించటం చాలా కష్టంగా ఉంది.

నిన్నటికి నిన్న బస్సుయాత్ర ప్రారంభిస్తూ మా నాయక శిఖామణి దుష్ట శిక్షణకు శిష్ట రక్షణకు మనం సన్నద్ధం కావాలి, ఇది ధర్మపోరాటం! అంటూ స్టేట్మెంట్ ఇచ్చేసింది. అంటే ఆమెగారి ఉద్దేశంలో ఆమె నాన్నగారు ఎవరినైతే దుష్టుడు, దుర్మార్గుడు అని తిట్టాడో ఆయన ఈమెకు శిష్టుడిగా కనిపిస్తున్నాడు. మేమంతా ఆయన కోసం పోరాటం చేయాలట! పైగా అది ధర్మపోరాటం అట! ఈరోజు మా పిల్లలిద్దరూ మంచి చదువులు చదువు కుంటున్నారన్నా, నా భార్యకు ఆపరేషన్ జరిగి బతికి బట్ట కట్టిందన్నా జగనన్న చలవే! మాబోటి ఎంతోమందికి ఆయన దేవుడు. కానీ ఆమె దృష్టిలో దుష్టుడు. తన తండ్రిని వంచించి, స్వయంగా తమను దారుణంగా అవమానించిన వాడు, ఈ రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకొని, కొద్దిమంది సంపన్న వర్గాలకు దోచిపెట్టిన వాడు ఈరోజు ఆమెకు శిష్టుడిగా కనిపిస్తున్నాడు. ఇది మా పార్టీలో 'నమస్తే సదా వత్సలే మాతృభూమే ...' అంటూ భరతమాతను కీర్తించే మాబోటి వాళ్లకు జీర్ణించుకోలేని పరిస్థితి'' అంటూ అసలు విషయాన్ని బయట పెట్టాడు .

''ఓస్ అదా సంగతి? ఎవరు దుష్టులు ?ఎవరు శిష్టులో చెప్ప డానికి ఆమె తండ్రి బతికి లేకపోయినా, ఆయన్ని ప్రగాఢంగా అభిమానించే వారిని అడిగితే అసలు వాస్తవం చెబుతారు. ఇష్టులు దుష్టులైనా శిష్టులుగానే కనిపిస్తారు. యతో దృష్టి తతో మనహా... యతో మనః తతో భావః''!

వ్యాసకర్త పూర్వ సంపాదకులు

కూటమికి ఓటమి తప్పదు!

అభిప్రాయం



వి.వి.ఆర్. కృష్ణంరాజు

రెండో ప్రపంచ యుద్ధం గొప్ప సైన్యాధ్యక్షుడైన జనరల్ మెకార్థర్ ఒక సందర్భంలో ''నిజమైన నాయకుడు ఆత్మవిశ్వాసంతో ఒంటరిగా నిలబడతాడు, కఠిన నిర్ణయాలకు వెనుకాడడు, ప్రజా సంక్షేమమే తన కర్తవ్యంగా భావిస్తాడు'' అంటారు. మార్చి పదో తేదీ మేదరమెట్ల సిద్ధం సభలో జగన్ ప్రసంగం విన్న వారు, 58 నెలల పాలన చూసిన వారు జనరల్ మెకార్థర్ చెప్పిన ధీరోధాత్తుడి లక్షణాలు ఆయనలో చూస్తారు. మూడు పార్టీలు కాదు ముప్పై పార్టీలు కలిసి కట్టుగా వచ్చినా ప్రజా బలం ఉన్న తనను ఏమీ చేయలేరన్న ఆత్మవిశ్వాసం ఆయనలో కనిపించింది. తన స్టార్ క్యాంపైనర్లు ప్రజలే నంటూ ఒంటరిగానే 175 సీట్లు గెలుస్తామన్న ధీమాను ఆయన మరోసారి వ్యక్తం చేశారు.

కూటమిలోని పార్టీల గత ఎన్నికల ఫలితాలు, తాజా పరిణామాలు, సంక్షేమాభివృద్ధి రంగాల్లో రాష్ట్రం సాధించిన ప్రగతి పరిశీలిస్తే మరోసారి వైసీపీ అధికారంలోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది.

కూటమిలోని ప్రధాన పార్టీ తెలుగుదేశం క్రమంగా ప్రజాదరణ కోల్పోతోంది. ఎన్టీ రామారావు అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తెలుగుదేశం పార్టీ నాలుగు సార్లు అసెంబ్లీ ఎన్నికలకు వెళ్ళి సగటున 43.22 శాతం ఓట్లు పొందగా చంద్రబాబు హయాంలో ఐదు సార్లు దేశం పార్టీ ఎన్నికలకు వెళ్ళి 36.20 శాతం ఓట్లు పొందింది. చంద్రబాబు హయాంలో సుమారు 7.02 శాతం ఓట్ బ్యాంక్ కోల్పోయిన ఆ పార్టీ ప్రతి ఎన్నికల్లోనూ గతంలో కన్నా తక్కువ ఓట్లు పొందడం విశేషం. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్టీ రామారావు అధ్యక్షతన తెలుగు దేశం పార్టీ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కొద్దినెలలకే చంద్రబాబు నాయుడు ఆయన ప్రభుత్వాన్ని కూల్చి వేశారు. ఆ ఏడాదితో పోల్చితే 1999 ఎన్నికల నాటికి చంద్రబాబు నాయకత్వంలోని పార్టీ సుమారు ఒక శాతం, 2004 ఎన్నికల్లో 6.55 శాతం, 2009 ఎన్నికల్లో 9.47 శాతం, 2014 ఎన్నికలో 15.41 శాతం, 2019 నాటికి 3.54 శాతం ఓట్లు కోల్పోయింది. చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ ఐదు సార్లు ఎన్నికలకు వెళితే రెండు సార్లు మాత్రమే విజయం సాధించింది. అంతేకాక గత 20 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ 40 అసెంబ్లీ స్థానాల్లో ఒక్క సారి కూడా గెలవలేకపోయింది.

పొత్తు వల్ల తాను తిరిగి అసెంబ్లీకి ముఖ్యమంత్రిగా వెళతాననే భావనతో చంద్రబాబు ఉన్నారు. అయితే ఆయనకు మద్దతునిస్తున్న మిత్రుల వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ జరిగినా ఆశ్చర్యపోనక్కర లేదు. కాపుల చిరకాల వాంఛ రాజ్యాధికారం. గతంలో చిరంజీవిని నమ్ముకున్న కాపులు నట్టేట మునిగారు. పవన్‌ను తమ ఆశయ సాధకుడిగా సామాన్య కాపులతో పాటు చేగొండి హరిరామ జోగయ్య, ముద్రగడ పద్మనాభం వంటి సీనియర్లు కూడా ఆశించారు. అయితే పవన్ కమ్మ పాలకవర్గ ప్రతినిధైన చంద్రబాబుతో చేతులు కలిపి ఆయననే ముఖ్యమంత్రి చేయాలనే కృతనిశ్చయంతో ఉండడంతో కాపు సామాజిక వర్గం మరో సారి నిరాశకు గురయింది.



వైసీపీ ప్రజాబలానికి నిదర్శనం 'సిద్ధం' సభలు

అంతే కాక పవన్ గత ప్రసంగాల్లో పట్టుమని పదివేల ఓట్లు తెచ్చుకోలేని వారు కూడా టికెట్లు కావాలంటున్నారని నాయకులను ఎద్దేవా చేశారు. జనసేన పార్టీని కాపుల కోసం మాత్రమే పెట్టలేదంటూ ఆ వర్గాన్ని దూరం చేసుకునే విధంగా మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో కులాల ప్రభావం అతిగానే ఉంది. కాపులు– కమ్మల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం రంగా హత్యానంతరం ప్రారంభమైంది. చంద్రబాబుతో పవన్ చేతులు కలపడం, టికెట్ల విషయంలో దిగజారుడు తనాన్ని ప్రదర్శించడం; పవన్‌కు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పదవులపై లోకేష్ చేసిన ప్రకటన తదితరాలను చాలామంది కాపులు జీర్ణించుకోలేకపోతున్నారు.

గత ఎన్నికల్లో జనసేన, బీజేపీలకు 20 లక్షల ఓట్లు మాత్రమే వచ్చాయి. బీజేపీకి 'నోటా' కన్నా తక్కువ ఓట్లు వచ్చాయి. అయినా ఆ పార్టీతో పొత్తుకు చంద్రబాబు తహతహలాడారు. ఆయన తన లక్ష్యమైతే నెరవేర్చుకున్నారుగానీ ఆ పార్టీ వల్ల సంభవించబోయే నష్టాన్ని అంచనా వేయలేకపోయారనిపిస్తోంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ముస్లింలు బీజేపీ పట్ల అనుమానంతో, అభద్రతా భావంతో ఉన్నారు. ఈ అభద్రతా భావమే వారిని ఏకం చేస్తోంది. కర్ణాటకలో హిజాబ్ వివాదం తర్వాత ముస్లిం పెద్దలందరూ ఏకమై బీజేపీని ఓడించడానికి కాంగ్రెస్‌కు మద్దతునిచ్చి ఆ పార్టీ విజయానికి దోహదపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే పరిస్థితి తలెత్తినా ఆశ్చర్యపోనక్కర లేదు. ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల్లో ముస్లిమ్‌లకు మూడు నుంచి 17 శాతం ఓట్లు ఉన్నాయి. 40 అసెంబ్లీ స్థానాల్లో, ముఖ్యంగా కర్నూలు (17 శాతం), కడప (16 శాతం), గుంటూరు (12 శాతం), అనంతపురం (11 శాతం), నెల్లూరు (10 శాతం), చిత్తూరు (10 శాతం) కృష్ణా (7 శాతం), ప్రకాశం (7 శాతం) జిల్లాల్లో జయాప జయాలపై వీరి ప్రభావం ఉంటుంది. జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ముస్లిమ్ కుటుంబాల్లో 90 శాతం మంది లబ్ధిపొందారు. అందువల్ల వారిలో ఎక్కువ మంది వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికే మద్దతునిచ్చే అవకాశం ఉంటుంది.

జగన్ ప్రభుత్వం కాలం మహిళలు, పేదలకు స్వర్ణయుగంగా మారింది. రాష్ట్రంలోని 90 శాతం గృహాలకు సంక్షేమ ఫలాలు అందాయి. గత 58 నెలలుగా ఈ ప్రభుత్వం వీరికి రూ. 12.75 లక్షల కోట్ల సంపద సమకూర్చింది. వీరికి నగదు బదిలీ, సంక్షేమ పథకాల రూపంలో సుమారు రూ. 4 లక్షల కోట్ల రూపాయలు, గృహాల రూపంలో లక్ష కోట్ల రూపాయల లబ్ధి చేకూర్చింది. అంతేకాక మహిళలకు 31 లక్షల ఇళ్ళ స్థలాలు ఉచితంగా అందజేసింది. ఒక్కో ఇంటి స్థలం కనీస విలువ రెండున్నర లక్షల రూపాయలు అనుకుంటే ఆ 31 లక్షల ఇళ్ళ స్థలాల విలువ సుమారు రూ. 7.75 లక్షల కోట్ల రూపాయలు అవుతుంది. అంటే జగన్ ప్రభుత్వం ఇచ్చిన మొత్తం సంక్షేమ పథకాల విలువ రూ. 12.75 లక్షల కోట్లుగా భావించాలి. ఈ మొత్తం రాష్ట్ర బడ్జెట్ కన్నా దాదాపు ఐదు రెట్లు ఎక్కువ. దేశంలోని మరే రాష్ట్రం పేదలకు, మహిళలకు ఇంత పెద్ద మొత్తంలో సంపద సమకూర్చలేదు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ విజయానికి వారే నిర్ణయాత్మక శక్తిగా మారే అవకాశం ఉంది.

వ్యాసకర్త ఎ.పి. ఎడిటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్

మొబైల్: 89859 41411

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.విదియ ఉ.10.50 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** రేవతి రా.12.34 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** ప.1.21 నుండి 2.49 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.35 నుండి 9.23 వరకు, తదుపరి రా.10.58 నుండి 11.46 వరకు, **అమృతఘడియలు:** రా.10.22 నుండి 11.52 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.16, **సూర్యాస్తమయం:** 6.04.

క్లుప్తంగా...

హామీలు అమలు చేయలేని అసమర్థ కూటమి

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిపై ఉప ముఖ్యమంత్రి కొట్టు విమర్శలు



తాడేపల్లిగూడెం అర్బన్: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 2014 ఎన్నికల సమయంలో వందల హామీలిచ్చి.. అమలు చేయలేకపోయిందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో సోమవారం ఏర్పాటు చేసిన చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు తన హయాంలో వేల కోట్ల రూపాయలు దోచేశాడని విమర్శించారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేకపోయాడని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులన్నింటినీ తప్పుదారి పట్టించిన అవినీతిపరుడు చంద్రబాబు అని స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీనే చెప్పారని మంత్రి ధ్వజమెత్తారు. రాష్ట్రం విడిపోయిన సందర్భంలో ప్రత్యేక హోదా ఇవ్వని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించలేకపోయిన తెలుగుదేశం పార్టీకి, దానికి వత్తాసు పలుకుతున్న జనసేన పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. మళ్లీ ఆ మూడు పార్టీలు ఒక కూటమిగా వచ్చే ఎన్నికల్లో వస్తున్నాయని, అయినా వారిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి కొట్టు తెలిపారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోగా ఇప్పుడు జగన్ అందిస్తున్న సంక్షేమాన్ని తామూ ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు.

సిద్ధం సభలతో ప్రతిపక్షాల్లో వణుకు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకు అర్బన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభలకు వెల్లువెత్తిన జన సునామీని చూసి ప్రతిపక్ష పార్టీ నేతల వెన్నులో వణుకు మొదలైందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఒక్కటై సభలు నిర్వహిస్తున్నా ప్రజానీకం ముఖం చాటేస్తుండడం ఆ పార్టీలపై ప్రజలకు ఉన్న విశ్వాసం ఏపాటిదో బహిర్గతమయ్యిందని ఎద్దేవా చేశారు. 2024 ఎన్నికల్లో మరొకసారి జగన్ సునామీ రాబోతున్నదని ఇప్పటికే వారికి అర్థమై.. దొంగ సర్వేలు ప్రకటించి చంద్రబాబు మైండ్‌గేమ్ ఆడుతున్నారని దుయ్యబట్టారు.

తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి మాకొద్దు

శంకర్ స్వగ్రామంలో మహిళల ధర్నా



బి.కొత్తకోట: అన్నమయ్యజిల్లా తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి తమకు వద్దంటూ మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ స్వగ్రామం పెద్దతిప్పసముద్రం మండలం టీ.సదుంలో సోమవారం మహిళలు ధర్నా నిర్వహించారు. బస్టాండ్ వద్దకు తరలివచ్చిన మహిళలు శంకర్‌కు మద్దతుగా, అభ్యర్థి జయచంద్రారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టికెట్ శంకర్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. జయచంద్రారెడ్డి ఎవరో తమకు తెలియదని, అతన్ని ఇప్పటి వరకు చూడలేదని పేర్కొన్నారు. పార్టీకోసం కష్టపడి పనిచేసిన శంకర్‌ను కాదని పార్టీ శ్రేణులకు కనీస పరిచయం లేని వ్యక్తికి ఎలా టికెట్ ఇస్తారని చంద్రబాబును నిలదీశారు.

కేసుల భయంతోనే బీజేపీతో పొత్తు: సీపీఎం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పాలకొల్లు సెంట్రల్: అవినీతి, అక్రమాలు, కేసుల నుంచి తప్పించుకోవడానికే తెలుగుదేశం, జనసేన పార్టీలు.. బీజేపీకి లొంగిపోయి పొత్తులు పెట్టుకున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్‌ను దెబ్బతీసిన బీజేపీతో పొత్తు పెట్టుకుని భాగస్వామ్యం అని బీరాలు పోతున్నాయని, దానిని లొంగుబాటుతనం అంటారని శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో ఆలోచన చేయలేని స్థితిలో రాజకీయ పార్టీలు ఉన్నాయన్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయడం ఆశ్చర్యంగా ఉందని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీను, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కుంభకర్ణ నిద్ర మీదే రామోజీ

వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.1,078.36 కోట్ల పెట్టుబడి సాయం

- సున్నా వడ్డీ రాయితీ కింద రూ.215.98 కోట్ల చెల్లింపు
- కరువు, మిచాంగ్ తుపాన్ సాయం రూ.1,294.58 కోట్లు
- వారం రోజుల వ్యవధిలోనే రూ.2,588.92 కోట్ల లబ్ధి



సాక్షి, అమరావతి: నిత్యం కుట్రపూరిత ఆలోచనలు, విషపూరిత రాతలు.. అక్షరాలకు అందని ఆక్రోశం.. ఇదీ ఈనాడు రామోజీరావు పరిస్థితి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పదేపదే అబద్ధాలను అచ్చేస్తూ వయోభారానికి తోడు తనకున్న అల్జీమర్స్ వ్యాధి ముదిరి పోయిందని సోమవారం మరోసారి రుజువు చేసుకున్నాడు. దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో ఖరీఫ్‌తో పాటు రబీలో పంటల సాగు తగ్గిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు వీలుగా ఒకే వ్యవసాయ సీజన్‌లో నాలుగు సార్లు సబ్సిడీపై విత్తనాలు ప్రభుత్వం అందించిన విషయాన్ని తన రాతల్లో మరుగున పరిచారు. 103 కరువు మండలాల పరిధిలో పంటలు నష్టపోయిన రైతులతో పాటు డిసెంబర్‌లో విరుచుకుపడిన మిచాంగ్ తుపాన్ వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకూ పెట్టుబడి రాయితీని నాలుగు రోజుల క్రితమే విడుదల చేసిన విషయాన్ని మరచిపోయారు. మూడో విడత రైతు భరోసా, సున్నా వడ్డీ రాయితీలు కలిపి ఏకంగా 75.96 లక్షల మందికి రూ.2588.92 కోట్లు లబ్ధి చేకూర్చిన అంశం ఈ కబోదికి కన్పించలేదు.

ఆరోపణ: ఖరీఫ్, రబీలో కలిపి 45 లక్షల ఎకరాల్లో బీడు

వాస్తవం: ఖరీఫ్, రబీ పంట కాలాల్లో సాధారణ విస్తీర్ణం 140.24 లక్షల ఎకరాలకు గాను 104.94 లక్షల ఎకరాల్లో సాగైంది. బెట్ట పరిస్థితుల వలన 35.30 లక్షల ఎకరాలలో పంటలు వేయలేదు. కానీ ఉద్యాన పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పండ్లు, ప్లాంటేషన్ తోటలు, కూరగాయలు, వాణిజ్య పూలు, ఇతర ఉద్యాన పంటల విస్తీర్ణం ఖరీఫ్, రబీల్లో 7,87,621 ఎకరాలకు చేరింది. సాధారణం కన్నా కేవలం 27.42 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు తగ్గింది. కానీ ఈనాడుకు మాత్రం ఏకంగా 45 లక్షల ఎకరాల్లో తగ్గినట్టుగా కన్పించింది.

ఆరోపణ: కరువు, తుపానులతో మరో 43 లక్షల ఎకరాల్లో పంట నష్టం

వాస్తవం: వర్షాభావ పరిస్థితుల వల్ల ఏడు జిల్లాల్లో 103 కరువు మండలాలను ప్రకటించారు. ఈ మండలాల్లో 14,24,245 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టుగా గుర్తించారు. ఇందులో ఉద్యాన, వ్యవసాయ పంటలున్నాయి. రబీ సీజన్ ఆరంభంలో విరుచుకుపడిన మిచాంగ్ తుపాన్ భారీ వర్షాల వలన 6,64,380 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టుగా గుర్తించారు. కరువు, మిచాంగ్ తుపాన్ వల్ల 20,88,625 ఎకరాలు పంటలు దెబ్బతింటే ఈనాడుకు మాత్రం 43 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టుగా కన్పించింది.

ఆరోపణ: వెంటాడిన పొడి వాతావరణం

వాస్తవం: దేశ వ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు ఖరీఫ్‌తో పాటు రబీలోనూ కొనసాగింది. కానీ పొడి వాతావరణం కన్పించినంత మాత్రాన కరువు ఉన్నట్టు కాదన్న విషయం రామోజీకి తెలియంది కాదు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు ఏదైనా ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా గుర్తించాలంటే ఆరు ప్రామాణికాల ఆధారంగా తీసుకుంటారు. తొలుత ప్రాథమిక అంచనా, క్షేత్ర స్థాయి పరిశీలన, తర్వాత నిబంధనల మేరకు 33 శాతానికి పైగా మునిగిపోయి దెబ్బతిన్న పంటలను పరిగణనలోకి తీసుకొని నష్టం తుది అంచనాలను రూపొందిస్తారు. ఆ మేరకు పంటలవారీగా లెక్కించి పరిహారాన్ని (ఇన్‌పుట్ సబ్సిడీ) అందిస్తారు.

ఆరోపణ: పడిపోయిన 3 కోట్ల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి

వాస్తవం: కరువు, మిచాంగ్ ప్రభావం ఉన్నప్పటికీ 2023–24లో ఆహార ధాన్యాల దిగుబడి 154.73 లక్షల టన్నులు నమోదవుతున్నట్టు డైరెక్టర్ ఆఫ్ స్టాటస్టిక్స్ (కేంద్ర గణాంక శాఖ) రెండో ముందస్తు అంచనా వేసింది. ఈ దిగుబడులు గడిచిన ఐదేళ్ల సగటు దిగుబడులతో పోలిస్తే తక్కువేమీ కాదు. వరితో సహా జొన్న, సజ్జ, రాగి, పెసలు, మినుము, ఉలవలు వేరుసెనగ, నువ్వులు, పత్తి పంటల ఎకరా దిగుబడి గత ఏడాదితో పోలిస్తే పెరిగింది. 2023–24 సీజన్‌లో 57.87 లక్షల ఎకరాలకు 48.93లక్షల ఎకరాల్లో వరి సాగైంది. వాస్తవాలు ఇలా ఉంటే ఏకంగా 3 కోట్ల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి తగ్గిందంటూ కాకిలెక్కలు అచ్చేశారు.

ఆరోపణ: కరువు విజృంభిస్తున్నా ఉపశమన చర్యలేవీ

వాస్తవం: ఒకే సీజన్‌లో నాలుగు సార్లు సబ్సిడీపై విత్తనాలు అందించారు. బెట్ట పరిస్థితులు నెలకొన్న సమయంలో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలకు అనుగుణంగా ఆర్బీకేల ద్వారా 80 శాతం సబ్సిడీపై విత్తనాలను సరఫరా చేశారు. 2023లో జూలై– ఆగస్ట్ నెలల్లో కురిసిన అధిక వర్షాలకు వరి నారుమళ్ళు దెబ్బతిని నష్టపోయిన రైతులు మరలా విత్తుకునేందుకు 1479 క్వింటాళ్ళ స్వల్పకాలిక వరి రకాలు అందించారు. బెట్ట పరిస్థితుల వల్ల ఖరీఫ్ 2023లో పంటలు దెబ్బతిన్న రైతులకు 30వేల క్వింటాళ్ల ఉలవలు, అలసంద, మినుము, పెసర, కంది, రాగి, జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు విత్తనాలను రూ.26.02 కోట్ల సబ్సిడీతో 1.14 లక్షల మందికి ఇచ్చారు. 2023 డిసెంబర్‌లో మిచాంగ్ తుపాను వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు 49,758 క్వింటాళ్ల శనగ, వేరుశనగ, మినుములు, పెసర, నువ్వులు, రాగి, తక్కువ పంట కాల వరి రకాలను రూ. 31.06 కోట్ల సబ్సిడీతో 71415 మందికి పంపిణీ చేశారు. మిచాంగ్ తుపాన్ వేళ రంగుమారిన, తడిసిన 6.79లక్షల టన్నుల ధాన్యాన్ని 1.11లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు చేసి వారికి జీఎల్‌టీతో సహా రూ.1483.61 కోట్లు జమ చేశారు.

ఆరోపణ: కరువు, తుపాన్ వేళ సాయమేది?

వాస్తవం: కరువు, మిచాంగ్, అకాల వర్షాల వల్ల అందించిన సాయానికి అదనంగా 2023–24 సీజన్‌లో వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7226.08 కోట్ల పెట్టుబడి సాయంతో పాటు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా రూ.1117.21కోట్లు, వై.ఎస్.ఆర్. సున్నావడ్డీ పంట రుణాల పథకం ద్వారా రూ.215.98 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేసింది అంతేకాకుండా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు రూ.326.14 కోట్ల ఖర్చుతో ఆర్బీకేల ద్వారా రైతులకు అందించారు. ఇవేమీ ఈనాడుకు కన్పించకపోవడం విడ్డూరంగా ఉంది.

ఆరోపణ: సాయంపై సర్కార్ మీనమేషాలు

వాస్తవం: ఖరీఫ్ 2023 పంటకాలంలో మే–ఆగస్ట్ మధ్య కురిసిన వర్షాలు, వరదల వల్ల 12,198.62 ఎకరాల్లో దెబ్బతిన్న అరటి, కూరగాయలు, బొప్పాయి, తమలపాకు, మామిడి తదితర ఉద్యాన పంటల రైతులు 11,373 మందికి పెట్టుబడి రాయితీగా రూ.11 కోట్లు అందించారు. 2023 మార్చి–మే మధ్య కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న మొక్కొజొన్న, జొన్న పంటలకు సంబంధించి 1892 మంది రైతులకు క్వింటాలుకు రూ. 500 చొప్పున రూ.5 కోట్ల ప్రత్యేక పెట్టుబడి రాయితీ ఇచ్చారు. 2023లో కరువు వల్ల నష్టపోయిన 6.96 లక్షల మంది రైతులకు రూ.847.23 కోట్లు, మిచాంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన 4.61 లక్షల మంది రైతులకు రూ.442.36 కోట్లు పెట్టుబడి రాయితీని రైతుల ఖాతాలకు ఇటీవలే విడుదల చేశారు. దీనికోసం జీవో ఎంఎస్ నెం.5 జారీ చేశారు. ఈ జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శించారు. తమ పేరు లేదని కానీ, ఇన్‌పుట్ సబ్సిడీ రాలేదని ఒక్కరంటే ఒక్క రైతూ ఫిర్యాదు చేసిన దాఖలాలు లేవు. అదే ఈనాడుకు కంటగింపుగా ఉంది.

గతంలో ఎన్నడూ లేనంత దుర్భిక్షం

చంద్రబాబు పాలనలో ఏటా సగటున 324 మండలాల్లో కరువు తాండవించేది. కరువు మండలాలను సీజన్‌కు అనుగుణంగా ప్రకటించిన దాఖలాలు లేవు. 2014 ఖరీఫ్ కరువు మండలాలను 2015 నవంబర్‌లో, 2015వి 2016 నవంబర్‌లో, 2016వి 2017 జూన్‌లోనూ, 2017వి 2018 ఆగష్టులోనూ ప్రకటించారు. 2018 ఖరీఫ్, 2018–19 రబీ సీజన్‌లలో ఏర్పడిన కరువు మండలాలను అసలు ప్రకటించనే లేదు. తన ఐదేళ్ల పాలనలో 24,79,985 మంది రైతులకు చెల్లించాల్సిన రూ.2558 కోట్లు ఎగ్గొట్టిన ఘనత చంద్రబాబుదే.

ప్రజలను మరోసారి మోసగించాలనే చంద్రబాబు పొత్తులు

- 14 ఏళ్లు సీఎంగా ఉండి ప్రజలకు ఏం చేశారో చెప్పలేకపోతున్నారు
- మంచి చేస్తేనే ఓటేయాలని చెప్పిన ఏకైక సీఎం జగన్ : మంత్రి బొత్స



సాక్షి, విశాఖపట్నం: బీజేపీతో పొత్తుల కోసం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తెగ వెంపర్లాడారని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. పొత్తులు పెట్టుకున్న పార్టీలు గతంలో ఎలా తిట్టుకున్నాయో రాష్ట్ర ప్రజలే చూశారని, కాగా బీజేపీ నేతలు చంద్రబాబుని కట్టప్పతో పోల్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇక్కడ సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అంటే కట్టప్ప. చంద్రబాబు అంటే వెన్నుపోటుదారుడు.. అంటూ చంద్రబాబు గురించి బీజేపీ నేతలు మాట్లాడిన వీడియోను బొత్స ప్రదర్శించారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఏం చేశారో చెప్పలేని స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. 2014లో మాదిరి ప్రజలను మోసం చేసి ఎలాగైనా అధికారాన్ని చేపట్టాలని చంద్రబాబు పొత్తుల కోసం అందరి గుమ్మం ఎక్కుతున్నారని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బీజేపీ ప్రైవేటీకరిస్తుంటే.. అలాంటి పార్టీతో పొత్తుపెట్టుకుని రాష్ట్ర ప్రజలకు ఏం చెబుతారని ప్రశ్నించారు. రైల్వేజోన్, ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీలివ్వకుండా రాష్ట్రాన్ని ఏకాకిని చేసిన బీజేపీతో కలిసి ప్రజలకు ఏం చెబుతారని చంద్రబాబు, పవన్‌లను ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ, జనసేన పార్టీలున్నాయా? అని ప్రశ్నిస్తూ.. ఎన్నికల తర్వాత టీడీపీ కూడా భూస్థాపితం కానుందని జోస్యం చెప్పారు. ఐదేళ్ల పాలనలో మేలు జరిగితేనే ఓటు వేయండని ధైర్యంగా చెప్పిన ఏకైక సీఎం వైఎస్ జగన్ ఒక్కరేనని కొనియాడారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించాలన్న కోరిక ప్రజల్లో ఉందని చెప్పారు. 175 స్థానాలకు 175 స్థానాలను వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని స్పష్టం చేశారు.

పచ్చ పత్రికలకు వాస్తవం బోధపడుతుంది

కొన్ని పత్రికలు సిద్ధం సభలకు వచ్చిన వారు గ్రాఫిక్స్ అనే భ్రమల్లో ఉన్నాయని, వాటిని అలాగే ఉండనిద్దామని.. 45 రోజుల్లో వారికి వాస్తవం బోధపడుతుందని మంత్రి బొత్స చెప్పారు. చీపురుపల్లిలో మీ మీద గంటా పోటీ చేస్తారని మీడియా ప్రశ్నించగా.. నియోజకవర్గంలో ప్రజలకు తాను మంచి చేస్తే గెలిపిస్తారని చెప్పారు. తాను భీమిలి నుంచి పోటీ చేస్తానన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

బాబు అండ్‌కో గుండెల్లో రైళ్లు

1,261వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: మూడు రాజధానుల అంశం రాష్ట్రవ్యాప్తంగా మార్మోగుతుంటే బాబు అండ్ కో గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి 1,261వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ..ప్రజా క్షేత్రంలో గెలవాలంటే అన్ని ప్రాంతాలు, వర్గాల మద్దతు కావాలని.. చంద్రబాబు మాత్రం ఓ ప్రాంతంలో ఓ సామాజిక వర్గానికే దోచి పెట్టేందుకు రాజధాని అంశాన్ని వాడుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. నాయకులు మాదిగాని గురునాథం, పులి దాసు, కుమ్మరవల్లి కిషోర్ బాబు, ఈపూరి ఆదాం, బొలిమేర శ్యామ్యూల్, కారుమూరు పుష్పరాజు, బోదాల సలోమీ, బోదాల సౌమ్య, పల్లె బాబు, నూతక్కి జోషి పాల్గొన్నారు.

విశాఖ ఉత్తరం నుంచి నేనే పోటీ చేస్తా

నియోజకవర్గ నేతలతో టీడీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త భరత్

సాక్షి, విశాఖపట్నం : 'పొత్తుల్లో భాగంగా విశాఖ ఉత్తరం సీటు బీజేపీకి ఇస్తే.. చంద్రబాబు చెప్పినా సహకరించే ప్రసక్తే లేదు' అంటూ నియోజకవర్గ టీడీపీ నేతలు కుండబద్దలు కొట్టారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఉత్తర నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. పార్టీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త భరత్ మాట్లాడుతూ.. ఈసారి తాను ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నానని చెప్పారు. పలువురు నేతలు మాట్లాడుతూ ఇప్పటికే బీజేపీకి ఈ సీటు కేటాయించినట్లు ప్రచారం జరుగుతోందనీ, బీజేపీ నేత విష్ణుకుమార్‌రాజు పార్టీ కార్యాలయం ప్రారంభించి తిరగడం మొదలు పెట్టారని, ఇప్పుడు మీరు పోటీ చేస్తున్నామంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. కాగా.. ఈ సీటును బీజేపీకి ఇస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించబోమని కార్యకర్తలు తెగేసి చెప్పారు.

తాయిలాలకు తెర లేపిన టీడీపీ

- ఓటర్లకు పంచేందుకు ఆటోలో తరలిస్తున్న కుక్కర్లు పట్టుకున్న పోలీసులు
- పెదకూరపాడు నియోజకవర్గంలోని పీసపాడు వద్ద 200 కుక్కర్లు, ఆటో స్వాధీనం



పట్టుబడిన ఆటోలో ఉన్న కుక్కర్లు

పెదకూరపాడు: ఎన్నికల షెడ్యూల్ కూడా రాకముందే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తెలుగుదేశం పార్టీ ప్రలోభాలకు తెరలేపింది. అడ్డదారిలో గెలిచేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఓటర్లు తమ వైపు లేరని తెలిసి తాయిలాలు అందిస్తోంది. ఈ క్రమంలో పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మండలం పీసపాడు గ్రామ శివారులో ఆదివారం రాత్రి క్రోసూరు ఎస్‌ఐ షేక్ షఫీ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా... ఏపీ 39 యూహెచ్ 6378 నంబరు టాటా ఏస్ ఆటోలో సుమారు 200 కుక్కర్లు తరలిస్తున్నట్లు గుర్తించారు. పోలీసులను చూసి ఆటోను వదిలి డ్రైవర్ పారిపోయాడు. పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ టికెట్ ఆశిస్తున్న భాష్యం ప్రవీణ్ మూడు రోజులుగా బెల్లంకొండ మండలంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు కుక్కర్లు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో పీసపాడు వద్ద పట్టుబడిన కుక్కర్లు కూడా ఓటర్లకు పంపిణీ చేసేందుకు ప్రవీణ్ తరలిస్తున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐని వివరణ కోరగా, కుక్కర్లు ఎక్కడికి తరలిస్తున్నారనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాబు ఊ..అన్నా... జనం ఊహూ...!

అనంతలో ఇక అంతేనా?

- నారా కుటుంబం మొత్తం అనంతపురం జిల్లాలోనే మకాం
- నిజం గెలవాలంటూ భువనేశ్వరి.. శంఖారావం పేరుతో లోకేశ్ పర్యటనలు
- రా కదలి రా అంటూ బాబు వేడుకున్నా పట్టించుకోని జనం
- అధినాయకుల సభలకు డుమ్మా కొట్టిన పార్టీ అసమ్మతి నేతలు
- ఉమ్మడి జిల్లాలో వ్యతిరేక పవనాలతో అయోమయంలో అధిష్టానం



కళ్యాణదుర్గంలో ఆదివారం లోకేశ్ నిర్వహించిన శంఖారావం సభ వెలవెలబోయిన దృశ్యం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం జిల్లాలో వైఎస్సార్‌సీపీపై ఎలాగైనా గెలవాలన్న టీడీపీ ఆశలు రాబోయే ఎన్నికల్లో నెరవేరేలా కనిపించడం లేదు. కొన్ని రోజులుగా నారా కుటుంబం మొత్తం జిల్లాలో మకాం వేసి ప్రచారం చేస్తున్నా ప్రజల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడమే దీనికి నిదర్శనమని ఆ పార్టీ వర్గాలే నిరాశలో మునిగిపోతున్నాయి. తమకు స్టార్ క్యాంపెయినర్లు అనుకునేవారే వచ్చినా జనం రాకపోతే ఇక తమ పరిస్థితి ఏమిటని స్థానిక నేతలు తలలు పట్టుకొనే పరిస్థితి ఏర్పడింది. చంద్రబాబు..లోకేశ్.. భువనేశ్వరి ముగ్గురూ కాలికి బలపం కట్టుకుని తిరిగినా ప్రయోజనం ఉండడం లేదనే విషయం టీడీపీ శ్రేణుల్లో ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

సభలకు జనం కరువు

రెండు నెలల క్రితం యువగళం పేరుతో లోకేశ్ శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో పాదయాత్ర చేశారు. ప్రతి నియోజకవర్గంలోనూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను దూషించడమే పనిగా ప్రసంగాలు చేశారు. ఆ యాత్రలకు ప్రజల నుంచి స్పందన కరువైంది. ఆ తర్వాత ఇప్పుడు శంఖారావం పేరుతో ఎనిమిది నియోజకవర్గాల్లో సభలు నిర్వహించారు. సోమవారం అనంతపురంలో సభ జరిగింది. ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, మడకశిర, కదిరి తదితర నియోజకవర్గాల్లో లోకేశ్ సభలకు ప్రజల నుంచి నామమాత్రపు స్పందనైనా రాలేదు. పల్చగా ఉన్న జనాల ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

అధినేత వచ్చినా అదే సీను

చంద్రబాబు ఇప్పటికే 'రా కదలిరా' అంటూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో సభలు పెట్టారు. కదిరి, ఉరవకొండ, పెనుకొండ తదితర నియోజకవర్గాల్లో పర్యటించినా ఎక్కడా ఆశించిన మేర ప్రజలు హాజరుకాలేదు. అన్ని నియోజకవర్గాల నుంచి జనాలను తరలించినా పదివేలకు మించి రాకపోవడం గమనార్హం. అదేవిధంగా కదిరి, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 'నిజం గెలవాలి' అంటూ టీడీపీ అధినేత సతీమణి భువనేశ్వరి స్వయంగా పర్యటించినా స్పందన రాకపోవడం పార్టీ శ్రేణులను నిరాశపరిచింది.

లోకేశ్ సభలకు అసమ్మతి నేతల డుమ్మా

అనంతపురం జిల్లాలో లోకేశ్ నిర్వహించిన సభలకు అసమ్మతి నేతలు డుమ్మా కొట్టారు. మడకశిరలో జరిగిన శంఖారావం సభకు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వర్గ నేతలు హాజరుకాలేదు. తన వర్గానికి టికెట్ ఇవ్వలేదన్న కారణంగా ఆయన సహకరించడం లేదని తెలిసింది. కళ్యాణదుర్గం సభకు సీనియర్ నేతలు ఉమామహేశ్వరనాయుడు, ఉన్నం హన్మంతరాయ చౌదరి వర్గాలు డుమ్మా కొట్టాయి. భువనేశ్వరి కళ్యాణదుర్గం వచ్చినప్పుడు కూడా ఈ రెండు వర్గాల నేతలు గైర్హాజరవడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో ఇక టీడీపీ పని అయిపోయిందని నాయకులు చర్చించుకుంటున్నారు.

నాడు విమర్శించి.. నేడు పొత్తులా !

- రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పార్టీగా ఏపీ యునైటెడ్ ఫ్రంట్
- టీడీపీ, జనసేన పార్టీలను ప్రశ్నించిన జేడీ లక్ష్మీనారాయణ



తిరుపతి సిటీ: బీజేపీ పార్టీని నాడు నోటికొచ్చినట్లు విమర్శించి నేడు ఢిల్లీకి వెళ్లి టీడీపీ, జనసేన పార్టీలు పొత్తులు పెట్టుకోవడం ఎంతవరకు సమంజసమని జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. సోమవారం తిరుపతి ఆఫీసర్స్ క్లబ్ వేదికగా ఏపీ రిపబ్లికన్ ఫ్రంట్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం అనంతరం ఆయన లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్‌తో కలసి మీడియాతో మాట్లాడారు. టీడీపీ, జనసేన పార్టీలు ఢిల్లీ పెద్దలతో పొత్తులు పెట్టుకోవడం ఎవరి కోసమని, ప్రత్యేక హోదా, విభజన చట్టాల అమలు, రైల్వే జోన్, విశాఖ స్టీల్ సాధనపై ఢిల్లీ పెద్దలు లిఖిత పూర్వకంగా లేఖ రూపంలో హామీ ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా వద్దు ప్యాకేజీ ముద్దు అన్న పార్టీల కారణంగానే నిరుద్యోగ యువత పెరిగిపోయి వలసబాట పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పార్టీగా రానున్న ఎన్నికలలో పోటీ చేస్తున్నదని ఆదరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. అనంతరం లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎంపీ అభ్యర్థి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏపీ యునైటెడ్ ఫ్రంట్ తరఫున తిరుపతి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. బీజేపీ ప్రభుత్వ కనుసన్నల్లో కేంద్ర ఎన్నికల సంఘం నడుస్తుండడం దారుణమన్నారు. ఆల్ తెలుగు పార్టీ నాయకులు కే శివభాగ్యరావు, ఏటీపీ పార్టీ నాయకులు పి పరమశివన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన వర్గీయుల బాహాబాహీ

- లోకేశ్ సభ సాక్షిగా విభేదాలు బట్టబయలు
- 'అనంత'లో జనసేన నాయకులను అడ్డుకున్న టీడీపీ వర్గీయులు
- ఒక్క సీటు గెలిచిన మీకు ప్రాధాన్యం ఇవ్వాలా అంటూ హేళన



వైకుంఠం ప్రభాకర చౌదరిని నిలదీస్తున్న జనసేన నాయకులు

అనంతపురం క్రైం: టీడీపీ, జనసేన పార్టీల మధ్య పొత్తు కుదిరినా క్షేత్రస్థాయిలో కార్యకర్తల మధ్య మాత్రం చిచ్చు రాజుకుంటోంది. సోమవారం అనంతపురంలో నారా లోకేశ్ శంఖారావం సభ వద్ద టీడీపీ, జనసేన వర్గీయులు బాహాబాహీకి దిగారు. నగర శివారులోని పీవీకేకే కళాశాల ఆవరణలో సభా ప్రాంగణంలోకి వెళ్లేందుకు జనసేన నేతలు యత్నించగా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. అనంతపురం అర్బన్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వైకుంఠం ప్రభాకర్ చౌదరి వర్గీయులు 'ఒక్క సీటు గెలిచిన మీకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలా' అంటూ హేళనగా మాట్లాడారు. 'అనంతపురం అర్బన్ సీటుపై ఆశలు వదులుకోండి. చౌదరికి అడ్డొస్తే మీ ఇష్టం' అంటూ హెచ్చరించారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ప్రభాకర్ చౌదరి జోక్యం చేసుకుని జనసేన నేతలను ప్రాంగణం బయటకు తీసుకొచ్చేందుకు యత్నించారు. ఆయనను జనసేన నేతలు నిలదీశారు. సీటు కావాలంటే మీ అధిష్టానాన్ని అడగాలి కానీ, తమను చులకనగా చూడడం ఏమిటని ప్రశ్నించారు. అవమానభారంతో బయటకు వెళ్లిపోయారు. సభ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంలోనూ రెండువర్గాల మధ్య వివాదం జరిగింది. ఓ డ్రైవరుపై గుత్తిరోడ్డుకు చెందిన గోవిందు అనే టీడీపీ నేత చేయి చేసుకున్నాడు. మా ఫ్లెక్సీకి అడ్డుపడతావా అంటూ దాడి చేశాడు.

జనం లేక శంఖారావం వెలవెల

నారా లోకేశ్ నిర్వహించిన శంఖారావం సభ జనం లేక వెలవెలబోయింది. ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సభ జనం లేకపోవడంతో 10.30 దాటినా మొదలు కాలేదు. దీంతో లోకేశ్‌ను కొంత సేపు వాహనంలోనే ఉండాలని నాయకులు సూచించారు. ఎంతసేపటికీ సభా ప్రాంగణంలో రెండువేలమందికి మించి కనిపించలేదు. చిన్న ప్రాంగణంలోనూ జనం లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. దీంతో లోకేశ్ స్థానిక నేతలపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

అమల్లోకి సీఏఏ

వివాదాస్పద చట్టంపై కేంద్రం నిర్ణయం
- నియమ నిబంధనలతో నోటిఫికేషన్ జారీ
- లోక్‌సభ ఎన్నికల ముంగిట కీలక పరిణామం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆ క్రమంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. వివాదాస్పద పౌరసత్వ (సవరణ) చట్టం–2019ను దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకొచ్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. తద్వారా సీఏఏను అమలు చేస్తామన్న గత లోక్‌సభ ఎన్నికల హామీని బీజేపీ నిలబెట్టుకున్నట్టయింది. సీఏఏకు నాలుగేళ్ల క్రితమే పార్లమెంటు, రాష్ట్రపతి ఆమోదముద్ర పడ్డా దేశవ్యాప్త వ్యతిరేకత, పూర్తి నిబంధనలపై సందిగ్ధత తదితరాల నేపథ్యంలో అమలు వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో చట్టం తాలూకు నియమ నిబంధనలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. మతం ప్రాతిపదికగా భారత పౌరసత్వం కల్పిస్తున్న తొలి చట్టమిది! పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు ధ్రువీకరణ పత్రాలతో నిమిత్తం లేకుండా పౌరసత్వం కల్పించడం దీని ఉద్దేశం. 2014 డిసెంబర్ 31కి ముందు ఆ దేశాల నుంచి భారత్‌కు వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలకు దీని ప్రకారం ఎలాంటి రుజువులు, ధ్రువీకరణలతో నిమిత్తం లేకుండా పౌరసత్వం మంజూరు చేస్తారు. వీటిని పౌరసత్వ (సవరణ) నిబంధనలుగా పిలుస్తారని కేంద్ర హోం శాఖ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ''సీఏఏ చట్టం–2019 ప్రకారం అర్హులైన వారంతా భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వాటిని ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక విండో అందుబాటులో ఉంచాం''అని ఆయన వెల్లడించారు.

బీజేపీ హర్షం, విపక్షాల ధ్వజం

సీఏఏ అమలు, నిబంధన జారీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా హర్షం వెలిబుచ్చారు. రాజ్యాంగ నిర్మాతల హామీని ప్రధాని మోదీ అమల్లోకి తెచ్చి చూపారంటూ అభినందించారు. పాక్, బంగ్లా, అఫ్గాన్లలో మతపరమైన ఊచకోతకు గురైన ముస్లిమేతర మైనారిటీలు భారత పౌరసత్వం పొందేందుకు ఈ నిబంధనలు ఉపకరిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. విపక్షాలు మాత్రం కేంద్రం నిర్ణయంపై మండిపడ్డాయి. ఇది దేశ సమగ్రతకు సీఏఏ విఘాతమంటూ కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్, ఆప్, సమాజ్‌వాదీ, వామపక్షాలు, మజ్లిస్ తదితర పార్టీలు దుయ్యబట్టాయి. దీన్ని కేవలం బీజేపీ ఎన్నికల లబ్ధి ఎత్తుగడగా అభివర్ణించాయి. ముఖ్యంగా పశ్చిమబెంగాల్, అసోంలలో మతపరమైన విభజన తెచ్చి ఓట్లు కొల్లగొట్టేందుకే ఈ చర్యకు దిగిందని ఆరోపించాయి. ఆమ్నెస్టీ ఇండియా కూడా కేంద్రం నిర్ణయాన్ని తప్పుబట్టింది. ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించనందుకు ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు అక్షింతలు వేసిన వైనం మీడియా హెడ్‌లైన్లలో రాకుండా చూసేందుకు బీజేపీ ఈ పని చేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. సీఏఏను కేరళలో అమలు చేయబోమని సీఎం పినరయి విజయన్ స్పష్టం చేశారు. ఇది సమాజంలో మతపరంగా విభజనకు దారి తీస్తుందదన్నారు. ప్రజల హక్కులను హరించే ఎలాంటి మత, కుల, సామాజికపరమైన వివక్షనైనా తుదికంటా వ్యతిరేకించి తీరతామని పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. అసోంతో పాటు పలు ఈశాన్య రాష్ట్రాల్లో విద్యార్థి సంఘాలు ఆందోళనలకు పిలుపునిచ్చాయి. పాక్ తదితర దేశాల నుంచి వచ్చిన ముస్లిమేతర శరణార్థులు మాత్రం దీన్ని స్వాగతించారు. ముస్లింల పట్ల సీఏఏ పూర్తిగా వివక్షపూరితమంటూ ఈ చట్టానికి వ్యతిరేకంగా 2019లోనే దేశవ్యాప్తంగా ఆందోళనలు, ఘర్షణలు, అల్లర్లు చెలరేగాయి. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం నుంచి ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా పలుచోట్ల భద్రతను కట్టుదిట్టం చేశారు. సీఏఏ అమలు నిర్ణయం వెలువడ్డ నిమిషాల్లోనే సంబంధిత ఇ–గెజిట్ వెబ్‌సైట్ క్రాషైంది. దాన్ని కాసేపటికి పునరుద్ధరించారు.

సీఏఏలో ఏముంది...!

- సీఏఏ–2019 చట్టం ప్రకారం మతపరమైన ఊచకోత బాధితులైన మైనారిటీలకు భారత పౌరసత్వం కల్పిస్తారు.
- 2014 డిసెంబర్ 31కి ముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులు ఇందుకు అర్హులు.
- అంతకుముందు కనీసం ఏడాది నుంచి భారత్‌లో ఉంటున్నవాళ్లకు, 14 ఏళ్లలో కనీసం ఐదేళ్లు ఉన్నవాళ్లకు పౌరసత్వం కల్పిస్తారు. గతంలో 11 ఏళ్లుండగా ఐదేళ్లకు తగ్గించారు.
- ఇందుకు వీరు ఎలాంటి శరణార్థి తదితర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరముండదు. ఈ మేరకు పౌరసత్వ చట్టం–1955కు మోదీ సర్కారు సవరణలు చేసింది.
- అసోం, మేఘాలయ, మిజోరం, త్రిపురల్లోని గిరిజన ప్రాంతాలను ఈ చట్టం పరిధి నుంచి మినహాయించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

అమ్ములపొదిలో దివ్యాస్త్రం


అగ్ని–5 పరీక్ష దిగ్విజయం
- విజయవంతంగా లక్ష్యాల ఛేదన
- స్వదేశీ ఖండాంతర అణు క్షిపణి
- అత్యాధునిక ఎంఐఆర్‌వీ సామర్థ్యం
- 5,000 కిలోమీటర్ల పైగా రేంజ్
- పరిధిలోకి చైనాతో పాటు యూరప్‌లో పలు ప్రాంతాలు
- డీఆర్‌డీఓ సైంటిస్టులకు మోదీ అభినందనలు
- ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు మహిళ సారథ్యం

బాలాసోర్/న్యూఢిల్లీ: మన అమ్ముల పొదిలోకి తిరుగులేని 'దివ్యాస్త్రం' చేరింది. భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో అద్భుతం చేసింది. ఒకటికి మించిన లక్ష్యాలను ఒకేసారి అత్యంత కచ్చితత్వంతో ఛేదించగల అత్యాధునిక ఖండాంతర అణు క్షిపణి అగ్ని–5ను తొలిసారి ప్రయోగించింది. నిర్దేశించిన ఒకటికి మించిన లక్ష్యాలను అది విజయవంతంగా ఛేదించింది! శత్రు దేశాలకు వణకు పుట్టించగల ఈ 'దివ్యాస్త్రం' ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతమిచ్చేలా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందింది. దీనిలో తొలిసారిగా వాడిన మల్టిపుల్ ఇండిపెండెంట్ టార్గెటబుల్ రీ ఎంట్రీ వెహికిల్ (ఎంఐఆర్‌వీ) సాంకేతికత ద్వారా ఒకే క్షిపణితో వేర్వేరు లక్ష్యాలపై అనేక వార్‌హెడ్లను పూర్తి కచ్చితత్వంతో ప్రయోగించవచ్చు. 5,000 నుంచి 5,800 కిలోమీటర్ల లోపు లక్ష్యాలను అగ్ని–5 ఛేదించగలదు. తక్కువ బరువున్న వార్‌హెడ్లను అమర్చే పక్షంలో క్షిపణి రేంజ్ ఏకంగా 8,000 కి.మీ. దాకా పెరుగుతుంది! 'మిషన్ దివ్యాస్త్ర' పేరిట జరిగిన ఒడిశా తీర సమీపంలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి సోమవారం జరిగిన ఈ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వెలిబుచ్చారు. ''మిషన్ దివ్యాస్త్రను దిగ్విజయం చేసిన డీఆర్‌డీఓ సైంటిస్టులకు హృదయపూర్వక అభినందనలు. వారి ఘనతను చూసి గర్విస్తున్నా''అంటూ ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

అతి కొద్ది దేశాల సరసన...

అగ్ని–5 పరీక్ష విజయవంతం కావడంతో ఎంఐఆర్‌వీ సామర్థ్యమున్న అతి కొద్ది దేశాల సరసన భారత్ చేరిందని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ''దేశ దీర్ఘకాలిక రక్షణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అగ్ని–5ని అభివృద్ధి చేశాం. భారత శాస్త్ర, సాంకేతిక నైపుణ్యానికి ఇది మచ్చుతునక. ఈ ప్రాజెక్టు డైరెక్టర్ మహిళ కావడం విశేషం. రక్షణ రంగంలోనూ దేశ ప్రగతికి నారీ శక్తి ఎంతగా దోహదపడుతోందో చెప్పేందుకు ఇది తాజా తార్కాణం'' అని వివరించాయి. అగ్ని–1 నుంచి అగ్ని–4 దాకా ఇప్పటిదాకా అభివృద్ధి చేసిన క్షిపణుల రేంజ్ 700 కి.మీ. నుంచి 3,500 కి.మీ. దాకా ఉంది. ఇవి ప్పటికే రక్షణ దళంలో చేరాయి. భూ వాతావరణ పరిధిలోనూ, దాని ఆవల కూడా ఖండాంతర క్షిపణులను ప్రయోగించడంతో పాటు విజయవంతంగా అడ్డగించే సామర్థ్యాల సముపార్జనలో భారత్ ఏటేటా ప్రగతి సాధిస్తూ వస్తోంది. మొత్తం ఆసియా ఖండంతో పాటు యూరప్‌లో కూడా పలు ప్రాంతాలు అగ్ని–5 పరిధిలోకి వస్తాయి! అణు దాడులు చేయడమే గాక వాటిని అడ్డుకునే సత్తా దీని సొంతం.





జరిపిన పరీక్షలు	అగ్ని–1 2012	అగ్ని–2 2013	అగ్ని–3 2015	అగ్ని–4 2015
దూరం	700 కి.మీ.	2,000 కి.మీ.	3,500 కి.మీ.	4,000 కి.మీ.

*1,500 కిలోల వార్‌హెడ్‌తో 5,550 కి.మీ., తేలికైన వార్‌హెడ్‌తో 8,000 కి.మీ.

ఐసీబీఎం జోన్: అగ్ని–5 5,550 కిలోమీటర్ల పై చిలుకు రేంజ్‌తో కూడిన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి. ఇలాంటి క్షిపణులు అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ వద్ద మాత్రమే ఉన్నాయి.

శత్రువుకు వణుకే...!

ఖండాంతర లక్ష్యాలను అతి కచ్చితత్వంతో ఛేదించగల రేంజ్, బహుళ సామర్థ్యం. అత్యాధునిక పరిజ్ఞానం. వీటన్నింటి మేలు కలయికగా అగ్ని–5 క్షిపణి రూపుదిద్దుకుంది. ఇందుకోసం డీఆర్‌డీఓ సైంటిస్టులు ఏళ్ల తరబడి నిరంతర తపస్సే చేశారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కొన్నేళ్లుగా భారత్ సాధిస్తున్న అద్భుత ప్రగతి ఇందుకు తోడైంది. 5,000 కిలోమీటర్ల పై చిలుకు రేంజ్‌తో కూడిన అగ్ని–5 క్షిపణి రాకతో దేశ రక్షణ వ్యవస్థ దుర్నిరీక్ష్యంగా మారింది...

ఆద్యంతం ఆత్మనిర్భర్...

- చైనా వద్ద ఉన్న డాంగ్‌ఫెంగ్ తదితర క్షిపణుల రేంజ్ 10 వేల నుంచి 15 వేల కి.మీ. దాకా ఉంది!
- వాటిని దృష్టిలో ఉంచుకుని, లక్ష్యఛేదనలో కచ్చితత్వానికి పెద్దపీట వేస్తూ అగ్ని–5ని అభివృద్ధి చేశారు.
- దీని తయారీకి అవసరమైన వైమానిక వ్యవస్థలను పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేశారు.
- అంతేగాక అత్యంత కచ్చితత్వంతో కూడిన సెన్సర్లను కూడా ఈ వ్యవస్థలో అమర్చారు.
- వీటి సాయంతో అణు వార్‌హెడ్లు లక్ష్యాన్ని అణు మాత్రమైనా తేడా లేకుండా ఛేదించగలవు.

గురి తప్పదంతే!

అగ్ని–5లో వాడిన మల్టిపుల్ ఇండిపెండెంట్ టార్గెటబుల్ రీ ఎంట్రీ వెహికిల్ (ఎంఐఆర్‌వీ) సాంకేతికత దీన్ని మరింత విధ్వంసకంగా, ప్రమాదకారిగా మారుస్తోంది. ఒకే క్షిపణి ప్రయోగంతో ఒకటికి మించిన లక్ష్యాలను ఛేదించేందుకు వీలు కల్పించడం దీని ప్రత్యేకత. ఈ టెక్నాలజీ 1960ల్లో తొలుత తెరపైకి వచ్చింది. 1968లో అమెరికా దీన్ని అభివృద్ధి చేసింది. మైన్యూట్‌మ్యాన్–3 క్షిపణి వ్యవస్థలో దీన్ని వాడింది. 1970ల నుంచి ఎంఐఆర్‌వీ సాంకేతికత ఖండాంతర క్షిపణుల్లో పూర్తిస్థాయిలో వాడకంలోకి వచ్చింది.

- ఖండాంతర క్షిపణుల తయారీ, పేలోడ్ వ్యవస్థ తదితరాల్లో విప్లవాత్మక మార్పులకు ఎంఐఆర్‌వీ శ్రీకారం చుట్టింది.
- ఈ పరిజ్ఞానం సాయంతో ఒకే క్షిపణి ద్వారా ఒకటికి మించిన సంఖ్యలో సంప్రదాయ, అణు వార్‌హెడ్లను ప్రయోగించవచ్చు.
- ఇందుకోసం ఒకే పెద్ద వార్‌హెడ్ బదులుగా పలు చిన్న చిన్న వార్‌హెడ్లను క్షిపణికి సంధిస్తారు.
- వీటిలో ప్రతి వార్‌హెడ్ స్వతంత్రంగా భిన్న లక్ష్యంపై దాడి చేయగలదు.
- తద్వారా ఒకే క్షిపణి ద్వారా ఒకటికి మించిన లక్ష్యాలను ఛేదించవచ్చు.
- ఒకటికి మించిన వార్‌హెడ్ల కారణంగా శత్రు దేశాల మిసైల్ డిఫెన్ వ్యవస్థలను ఏమార్చడంతో పాటు వాటి ఖండాంతర క్షిపణి విధ్వంస దాడులను తట్టుకుని లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఛేదించే సంభావ్యత ఎంతగానో పెరుగుతుంది.
- అంతేగాక లక్ష్యఛేదన కచ్చితత్వంతో జరిగేలా చూడటం ఎంఐఆర్‌వీ ప్రత్యేకత.
- అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనా వద్ద మాత్రమే ఈ సాంకేతికత ఉంది.
- పాకిస్తాన్ కూడా ఈ సాంకేతికతను అందిపుచ్చుకునే ప్రయత్నంలో ఉంది. ఇటీవల అబాబీల్ మధ్య శ్రేణి క్షిపణి ప్రయోగంలో దీన్ని ప్రయత్నించి చూశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇద్దరు ఈసీల ఎంపిక.. 14న ప్రధాని కమిటీ భేటీ

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘంలోని ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఎంపిక కోసం ప్రధాని మోదీ సారథ్యంలోని అత్యున్నత స్థాయి కమిటీ ఈ నెల 14వ తేదీనే సమావేశం కానుంది. వాస్తవానికి ఈ కమిటీ ఈ నెల 15న సాయంత్రం 6 గంటలకు సమావేశం కావాల్సి ఉంది. తాజా షెడ్యూల్ ప్రకారం 14న మధ్యాహ్నం సమావేశమవుతుందని అధికారవర్గాలు తెలిపాయి. కమిటీలోఒక కేంద్ర మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి సభ్యులు. ఇటీవల రాజీనామా చేసిన అరుణ్ గోయెల్, 14న రిటైర్ కానున్న అనూప్ చంద్ర పాండేల స్థానంలో ఈ కమిటీ కొత్త కమిషనర్లను ఎంపిక చేయనుంది.

కాంగ్రెస్‌లోకి బీజేపీ ఎంపీ

జైపూర్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో టిక్కెట్ నిరాకరించడంతో రాజస్తాన్‌లోని చురుకు చెందిన బీజేపీ ఎంపీ రాహుల్ కస్వాన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీకి, లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఆయన ప్రకటించారు. చురు లోక్‌సభ స్థానం నుంచి రెండు పర్యాయాలు ఎంపీగా పనిచేసే అవకాశం కల్పించిన ప్రధాని మోదీ, బీజేపీ చీఫ్ నడ్డాలకు కస్వాన్ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సీఎం అశోక్ గెహ్లాట్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దోస్తారా కాంగ్రెస్‌లోకి ఆయనకు స్వాగతం పలికారు. వచ్చే ఎన్నికలకు గాను చురు నియోజకవర్గానికి గాను పారాలింపిక్ బంగారు పతక విజేత దేవేంద్ర ఝఝూరియాకు బీజేపీ టిక్కెట్ ఇచ్చింది.

గాల్లో కుదిపేసిన విమానం

సిడ్నీ: ఆస్ట్రేలియా నుంచి చిలీకి వెళ్తున్న ఒక విమానం మార్గమధ్యంలో ఒక్కసారిగా కుదుపులకు లోనై ప్రయాణికులకు చుక్కలు చూపించింది. విమాన ప్రయాణికులు కుదుపులకు సీట్లలోంచి చెల్లాచెదురుగా పడి గాయాలపాలయ్యారు. విమానంలో తలెత్తిన ఒక సాంకేతికత సమస్య దీనికి అసలు కారణం. దాదాపు 50 మంది ప్రయాణికుల రక్తం కళ్లజూసిన ఈ ఎల్ఏ800 లాటన్ విమానం.. ఘటనకు ముందు సిడ్నీ నుంచి చిలీ దేశంలోని శాండిగో నగరానికి సోమవారం బయల్దేరింది. మార్గమధ్యంలో షెడ్యూల్ ప్రకారం ఆక్లాండ్‌లో దిగాలి. ఆ లోపే ఆకాశంలో కుదుపులకు లోనైందని ఎయిర్‌లైన్స్ వెల్లడించింది. విమానంలో గాయపడిన వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించేందుకు అక్లాండ్ ఎయిర్‌పోర్ట్ వద్ద 10 అత్యయిక వాహనాలను సిద్ధంగా ఉంచారు. విమానం ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే గాయపడిన ప్రయాణికులను ఆస్పత్రులకు తరలించారు. అందరికీ మోస్తరు దెబ్బలే తగిలాయి. ఒక వ్యక్తికి మాత్రం తీవ్రమైన గాయాలయ్యాయని ఎయిర్‌లైన్స్ సంస్థ పేర్కొంది.

నారీశక్తి నూతనాధ్యాయం లిఖిస్తా

సశక్తి- నారీశక్తి కార్యక్రమంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

సాక్షి, న్యూఢిల్లీ/గురుగ్రామ్: ఎన్‌డీఏ ప్రభుత్వం మూడో దఫా కొలువుతీరడం ఖాయమని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. హ్యాట్రిక్ పాలనలో మహిళల సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం పాటుపడుతుందని ప్రకటించారు. నారీశక్తి అభివృద్ధిలో నూతన అధ్యయనం లిఖిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సోమవారం ఢిల్లీలో జరిగిన 'సశక్తి–నారీశక్తి' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. 'గత కాంగ్రెస్ ప్రభుత్వాలు మహిళల కష్టాలు, కన్నీళ్లను ఏమాత్రం లెక్కలోకి తీసుకోలేదు. మా ప్రభుత్వాలు మహిళలను ప్రతిదశలోనూ చేయి అందించిమరీ వారి అభ్యున్నతికి పాటుపడ్డాయి. మరుగుదొడ్ల లేమి, శానిటరీ ప్యాడ్ల వాడకం, వంటచెరకు వాడకంతో వంటగదుల్లో పొగచూరిన మహిళల బతుకులపై మాట్లాడిన ఏకైక ప్రధాని మంత్రిని నేనే. మహిళలందరికీ బ్యాంక్ ఖాతాలు ఉండాలని ఎర్రకోట వేదికగా పిలుపునిచ్చా'' అని మోదీ వ్యాఖ్యానించారు.

1,000 మంది 'నమో డ్రోన్ దీదీ'లకు డ్రోన్లు సశక్తి–నారీశక్తి కార్యక్రమంలో భాగంగా స్వయంసహాయక బృందాలకు దాదాపు రూ.8,000 కోట్ల బ్యాంక్ రుణాలను మోదీ అందజేశారు. ఈ సందర్భంగా వారిలో కొందరితో మోదీ స్వయంగా మాట్లాడారు. స్వావలంబనతో అభివృద్ధిలోకి వచ్చిన వారిని మెచ్చుకున్నారు. దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన–నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కార్యక్రమం మద్దతుతో లక్షాధికారులుగా మారిన 'లఖ్‌పతి దీదీ'లను ఈ సందర్భంగా మోదీ సత్కరించారు. వ్యవసాయం, సాగు సంబంధ పనుల్లో డ్రోన్లను వినియోగించడంలో ఇప్పటికే తర్ఫీదు పొందిన 1,000 మంది 'నమో డ్రోన్ దీదీ'లకు మోదీ డ్రోన్లను పంపిణీచేశారు. మూలధన సంబంధ నిధి కింద స్వయం సహాయక బృందాలకు మరో రూ.2,000 కోట్లను మోదీ పంపిణీచేశారు.

ప్రతికూల మనస్తత్వానికి ప్రతిబింబం.. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు సానుకూల మనస్తత్వం ఏ కోశానా లేదని మోదీ విమర్శించారు. దేశ వ్యాప్తంగా రవాణా వ్యవస్థలను మెరుగుపరచడం, ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు వీలుగా 112 జాతీయ రహదారులకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.



ఐఏఆర్ఐలో వ్యవసాయ డ్రోన్ల పనితీరును ప్రధానికి వివరిస్తున్న నమో డ్రోన్ దీదీలు



భూమికి సంబంధించి అత్యంత స్పష్టతతో కూడిన ఫొటో ఇది. ఇన్సాట్ 3–డీఎస్ ఉపగ్రహం తాలూకు అత్యాధునిక పేలోడ్లు తీసిన ఈ ఫొటోను ఇస్రో సోమవారం విడుదల చేసింది. ఇందులో భారత్‌ను స్పష్టంగా చూడొచ్చు.

40 మందితో కాంగ్రెస్ మలి జాబితా

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థులను గాను కాంగ్రెస్ పార్టీ మరో 40కి పైగా అభ్యర్థులను సోమవారం ఖరారు చేసింది. మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, ఉత్తరాఖండ్, అస్సాంలలోని 60కిపైగా సీట్లకు అభ్యర్థిత్వాలను ఖరారు చేసేందుకు అత్యున్నత నిర్ణాయక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సోమవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో సమావేశమైంది. చింద్వారా నుంచి మాజీ సీఎం కమల్‌నాథ్ కుమారుడు నకుల్ నాథ్, రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ కుమారుడు వైభవ్, తాజాగా బీజేపీ నుంచి పార్టీలో చేరిన రాహుల్ కస్వాన్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. తొలి జాబితాలో రాహుల్ గాంధీ సహా 39 మందికి చోటు దక్కడం తెలిసిందే.

ఇన్ని రోజులు ఏం చేశారు?

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించనందుకు ఎస్‌బీఐపై సుప్రీంకోర్టు మండిపాటు
- నేటి సాయంత్రంలోగా ఎన్నికల సంఘానికి వివరాలు ఇవ్వాల్సిందేనని ఆదేశాలు
- వాటిని 15వ తేదీ సాయంత్రంలోగా వెబ్‌సైట్‌లో ఉంచాలని ఈసీకి నిర్దేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు పొందిన విరాళాల వివరాలను మంగళవారం సాయంత్రంకల్లా కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)కి సమర్పించాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. దీంతో మరింత గడువు కావాలంటూ కోర్టు మెట్లెక్కిన భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ)కి న్యాయస్థానంలో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ''రాజకీయ పార్టీలు పొందిన విరాళాల సమగ్ర వివరాలను 12వ తేదీ పనిగంటలు ముగిసేలోగా ఈసీకి వెల్లడించాలి. తర్వాత అందరికీ బహిర్గతం చేయాలి'' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల రాజ్యాంగ ధర్మాసనం ఎస్‌బీఐను ఆదేశించింది. మరోవైపు, మార్చి 15వ తేదీ సాయంత్రం ఐదు గంటలలకల్లా తమ అధికారిక వెబ్‌సైట్‌లో సమగ్ర వివరాలను పొందుపరచాలని ఈసీకి కోర్టు సూచించింది. బ్యాంక్‌కు ఆదేశాలు, గడువుకు సంబంధించి ఫిబ్రవరి 15వ తేదీన ఇచ్చిన ఉత్తర్వుల ఉల్లంఘనకు బ్యాంక్ పాల్పడితే బ్యాంక్‌పై చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎలక్టోరల్ బాండ్ల విధానం రాజ్యాంగవిరుద్ధమని పేర్కొంటూ ఆ పద్ధతిని రద్దుచేస్తూ ఐదుగురు సభ్యుల రాజ్యాంగధర్మాసనం ఫిబ్రవరిలో చరిత్రాత్మక తీర్పునివ్వడం తెల్సిందే. 2019 ఏప్రిల్ 12వ తేదీ నుంచి ఎస్‌బీఐ ద్వారా జరిగిన ఎలక్టోరల్ బాండ్ల అధికారిక కొనుగోలు, డిపాజిట్ లావాదేవీల వివరాలను మార్చి ఆరో తేదీలోపు ఈసీకి ఇవ్వాలని కోర్టు గతంలోనే ఆదేశించడం తెల్సిందే. దీంతోజూన్ 30వ తేదీకా గడువు పొడిగించాలని ఎస్‌బీఐ కోర్టును కోరడం, అలా గడువు కోరడాన్ని కోర్టు ధిక్కారణగా పరిగణించాలంటూ కోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలవడం తెల్సిందే. ఎస్‌బీఐ తరఫున సీనియర్ లాయర్ హరీశ్ సాల్వే వాదించారు. '' బాండ్లను కొనుగోలు చేసిన వారు, డిపాజిట్ చేసుకున్న వారి వివరాలు వేర్వేరుగా ఉన్నాయి. వాటిని సరిపోల్చి నివేదించాల్సిఉంది. వేర్వేరు చోట ఉన్న బ్రాంచీల్లో నిక్షిప్తమైన డేటాను సరిపోల్చేందుకు చాలా సమయం పడుతుంది. అందుకే గడువు పెంచండి' అని కోరారు. '' విరాళాల దాతలు, గ్రహీతల వివరాలను సరిపోల్చి మ్యాచింగ్ వివరాలని ఇవ్వాలని మేం అడగలేదు. మీ దగ్గర ఉన్నది ఉన్నట్లుగా సీల్డ్ కవర్ లోంచి తీసి ఈసీకిస్తే చాలు'' అని ఆదేశించింది. '' ఫిబ్రవరి 15న తీర్పు ఇచ్చాం. అంటే ఈ 26 రోజుల నుంచి ఏం చేసినట్లు? ఇంతకాలం మౌనం వహించి ఇప్పుడొచ్చి గడువు పెంచమంటారా? కోర్టు ఉత్తర్వులపై ఇంత నిర్లక్ష్యమా?'' అని దుయ్యబట్టింది.

స్వాగతించిన కాంగ్రెస్

సుప్రీంకోర్టు తీర్పును కాంగ్రెస్ స్వాగతించింది. భారీ కాంట్రాక్టులను సంపాదించేందుకు బీజేపీకి భారీగా విరాళాలిచ్చిన వారి వివరాలూ బయటికొచ్చేలా ఉత్తర్వులిస్తే బాగుండేదని పేర్కొంది. ''స్విస్ ఖాతాల నుంచి కోట్ల నల్లధనం తెస్తామన్న వాళ్లే తమ సొంత ఖాతాల వివరాలు సుప్రీం కంటబడకుండా దాచేస్తున్నారు'' అని ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు.

కేర్ వర్కర్లు కుటుంబీకుల్ని తీసుకురావద్దు

ఈ వారం నుంచి నిషేధాన్ని అమల్లోకి తెస్తున్న బ్రిటన్

లండన్: ఇంటి పనుల్లో సాయపడే కేర్ వర్కర్లు ఇకపై తమ వెంట కుటుంబసభ్యులను బ్రిటన్‌కు తీసుకురావడానికి వీల్లేదంటూ బ్రిటన్ ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఈ నూతన వలస విధానాన్ని ఈ వారం నుంచే అమలుచేసే అవకాశముంది. ఈ విషయమై బ్రిటన్ హోం శాఖ మంత్రి జేమ్స్ క్లెవెర్లీ మాట్లాడారు. '' కేర్ వీసా విధానం ద్వారా గత ఏడాది 1,00,000 మంది కేర్ వర్కర్లను బ్రిటన్‌లోకి అనుమతిచ్చాం. అయితే వారి వెంట 1,20,000 మంది డిపెండెంట్‌లు వచ్చారు. ఇది వీసా దుర్వినియోగాలపై మేం తీసుకుంటున్న చర్యలకు విఘాతం కల్గిస్తోంది. ఇలాంటి పరిస్థితిని అనుమతించబోం' అని అన్నారు. దీనికి సంబంధించిన నూతన వలస విధానాన్ని గురువారమే ప్రభుత్వం పార్లమెంట్ ముందుంచనుంది.

చైల్డ్ పోర్నోగ్రఫీపై ఆ తీర్పు దుర్మార్గం: సుప్రీం

న్యూఢిల్లీ: చైల్డ్ పోర్నోగ్రఫీని డౌన్‌లోడ్ చేయడం, చూడటం నేరం కాదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు దుర్మార్గంగా అభివర్ణించింది. ఆ తీర్పుపై విచారణ జరిపేందుకు అంగీకరించింది. చెన్నైకి చెందిన ఎస్.హరీశ్(28) పిల్లలతో కూడిన పోర్నోగ్రఫీ కంటెంట్‌ను తన సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాడంటూ పోలీసులు కేసు పెట్టారు. దీనిపై హరీశ్ మద్రాస్ హైకోర్టుకు వెళ్లాడు. విచారణ చేపట్టిన ఏకసభ్య ధర్మాసనం పోక్సో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాల ప్రకారం చైల్డ్ పోర్నోగ్రఫీ కంటెంట్‌ను డౌన్‌లోడ్ చేయడం, చూడటం నేరం కాదని పేర్కొంటూ జనవరి 11వ తేదీన తీర్పు వెలువరించింది. దీనిని సవాల్ చేస్తూ ఫరీబాద్‌కు చెందిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయెన్స్, ఢిల్లీకి చెందిన బచ్‌పన్ బచావో ఆందోళన్ అనే ఎన్‌జీవోలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం పిటిషన్‌పై విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పు చట్టాలకు వ్యతిరేకం, దుర్మార్గమని పేర్కొంది. ఏకసభ్య ధర్మాసనం ఇలాంటి తీర్పు ఎలా ఇవ్వగలదని ప్రశ్నించింది.

ప్రొఫెసర్ సాయిబాబా విడుదల సబబే: సుప్రీం

న్యూఢిల్లీ: ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాను జైలు నుంచి విడుదల చేయడంపై స్టే ఇవ్వాలని కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. సరైన ఆరోపణలను చూపలేకపోయినందున సాయిబాబాను విడుదల చేయాలంటూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రాథమికంగా సరైందిగానే భావిస్తున్నట్లు అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ అంశంపై జోక్యం చేసుకోలేమని తెలిపింది. అయితే, పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నట్లు సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ దీపక్ మెహతా ధర్మాసనం తెలిపింది.

'సందేశ్‌ఖాలి'పై మమత సర్కార్‌కు సుప్రీం షాక్

న్యూఢిల్లీ: సందేశ్‌ఖాలిలో ఈడీ అధికారులపై దాడి కేసులో పశ్చిమబెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. కేసును సీబీఐకి అప్పగిస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను కోర్టు సోమవారం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులపై తీర్పులో చేసిన వ్యాఖ్యలను తొలగిస్తున్నట్లు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం పేర్కొంది. జనవరి 5వ తేదీన దాడి ఘటన చేసుకోగా సస్పెండైన టీఎంసీ నేత షాజహాన్ షేక్‌ను వెంటనే ఎందుకు అరెస్ట్ చేయలేదని, ఈ కేసు దర్యాప్తు ఎందుకు ఆలస్యమైందని నిలదీసింది.

ప్రధాని మోదీ రంజాన్ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: మంగళవారం నుంచి ప్రారంభం కానున్న రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ''అందరికీ శుభ రంజాన్ శుభాకాంక్షలు. ఈ పవిత్ర మాసం అందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, సంపద తేవాలి''అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
మంగళవారం : 12 : మార్చి : 2024

నీట్ పరీక్షల దరఖాస్తు గడువు పొడిగింపు



తిరువొత్తియూరు: నీట్ పరీక్షలకు మార్చి 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సంబంధిత అధికారులు తెలిపారు. మే 5వ తేదీ నీట్ పరీక్ష జరుగుతున్న క్రమంలో తొలుత మార్చి 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించారు. తాజాగా దీన్ని 16వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పరీక్ష విభాగం అధికారులు సూచించారు.

న్యూస్‌రీల్

రోగులకు సమగ్ర సంరక్షణ తప్పనిసరి



పునరావాస కేంద్రం లోగోను ఆవిష్కరిస్తున్న నటుడు సత్యరాజ్, నక్కీరన్‌గోపాల్

సాక్షి చెన్నై: రోగులకు సమగ్ర పునరావాస సంరక్షణ అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నటుడు సత్యరాజ్ కోరారు. చెన్నైలో జేహెచ్ పునరావాస ఆసుపత్రిని ఏర్పాటులో భాగంగా లోగోను సోమవారం నటుడు సత్యరాజ్, ప్రముఖ సంపాదకుడు నక్కీరన్ గోపాల్ ఆవిష్కరించారు. జేహెచ్ పునరావాస కేంద్రం ఎండీ డాక్టర్ ఇగ్నేషియస్ జాకబ్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన పునరావాస చికిత్స అందించేలా ఇక్కడ అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. వైద్యుల మార్గదర్శకంలో మల్టీ డిసిప్లినరీ బృందం ఇక్కడ ఉన్నట్టు పేర్కొన్నారు. నటుడు సత్యరాజ్ మాట్లాడుతూ ఈ పునరావాస చికిత్స కేంద్రం అద్భుతమైన సేవలను రోగుల అందించాలని సూచించారు.

రూ.2 కోట్ల ఆస్తిని లాక్కునే ప్రయత్నం

- సినీ నిర్మాత సహా ఇద్దరు అరెస్టు

అన్నానగర్: చెన్నై తిరువొత్తియూర్‌లో ఉన్న రూ.2 కోట్ల విలువైన ఆస్తులను కాజేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని గత వారం చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఓ ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అధికారులను ఆదేశించారు. దీంతో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సీజారాణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముందుగా నిందితుడు ముఖేష్‌ను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం అమీర్ జాన్, షాజాఖాన్ అనే మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరిద్దరూ రియల్ ఎస్టేట్ ఏజెంట్లుగా పనిచేస్తున్నట్లు తెలిసింది. అలాగే అమీర్‌జాన్ సినిమా నిర్మాతగా ఉన్నట్లు సమాచారం.

400 కిలోల గంజాయి స్వాధీనం

అన్నానగర్: శ్రీలంకకు అక్రమంగా తరలించేందుకు యత్నిస్తున్న 400 కిలోల గంజాయిని పుదుకోట్టై సమీపంలో కస్టమ్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. మిమ్సల్ సమీపంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతోందని రామనాథపురానికి చెందిన కస్టమ్స్ అధికారులకు సోమవారం రహస్య సమాచారం అందింది. దీంతో అధికారులు మిమ్సల్‌లో తనిఖీలు చేసి గంజాయిని రామనాథపురం జిల్లాలోని ఓ స్వచ్ఛంద సంస్థ శ్రీలంకకు తరలిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు.

జంట హత్యల కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

అన్నానగర్: జంట హత్యల కేసులో ఐదుగురు నిందితులకు యావజ్జీవకారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. వివరాల్లోకి వెళితే.. కన్యాకుమారి జిల్లా భూతపాండి సమీపంలోని దిట్టువిలై ప్రాంతానికి చెందిన రైతు నేశమణి, అతడి బంధువు జ్ఞాన సిగామణి మధ్య ఆస్తి వివాదం నెలకొంది. ఈ విషయమై జరిగిన వివాదంలో నేశమణి కుమారుడు ముత్తురాజ్, జ్ఞాన సిగామణిపై దాడి చేశాడు. దీంతో ప్రతీకారం తీర్చుకోవాలని జ్ఞాన సిగామణి కుమారులు ప్లాన్ చేశారు. ఈ నేపథ్యంలో 2005 ఆగస్టు 29వ తేదీన జ్ఞాన సిగామణి కుమారులు సెల్వన్ (33), సెల్వసింగ్ (32), అతని స్నేహితులు సురేష్ (32), రషీద్ (23), దురై (28)సహా తొమ్మిది మంది కలిసి నేశమణి కుమారులు ముత్తురాజ్ (34), గోపాల్ కృష్ణన్ (35)ను కొడవళ్లతో నరికారు. దీంతో సంఘటన స్థలంలో ముత్తురాజ్ మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన గోపాలకృష్ణను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఇద్దరి హత్యలకు సంబంధించి భూతపాండి పోలీసులు ప్రత్యేక కేసు నమోదు చేసి, 9 మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో సెల్వన్, అతని సోదరుడు సెల్వసింగ్, అతని స్నేహితులు సురేష్, రషీద్, దురైకు యావజ్జీవశిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మిగిలిన నలుగురిలో ఇప్పటికే ఒకరు చనిపోగా మరో ముగ్గురికి విముక్తి లభించింది. అలాగే గోపాలకృష్ణ హత్యకు సంబంధించిన కేసు నాగర్‌కోయిల్ కోర్టులో కొనసాగుతోంది.

మహిళ ఆత్మహత్య

అన్నానగర్: చెన్నైలోని కాశిమేడు గార్డెన్ 3వ వీధికి చెందిన సబీనా బేగం (35). ఆమెకు, రఘుమాన్‌తో 17 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్తతో గొడవల కారణంగా విడాకులు తీసుకుంది. ఆ తర్వాత ఆమె మజార్‌ను రెండో పెళ్లి చేసుకుని గత 3 సంవత్సరాలుగా అతనితో ఉంటోంది. అయితే ఇటీవల తన ఇద్దరు కుమారులతో కలిసి ఒంటరిగానే జీవిస్తోంది. ఈ క్రమంలో సబీనాబేగం డిప్రెషన్‌తో బాధపడుతూ.. సోమవారం తన ఇంటి 2వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. కాశిమేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోదీ చర్యలన్నీ ఎన్నికల స్టంటే..!

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల స్టంట్లను మళ్లీ మొదలెట్టారని సీఎం స్టాలిన్ ఆరోపించారు. గత కొన్నేళ్లలో గ్యాస్ సిలిండర్ ధర రూ. 500కు పైగా పెంచి, ఇప్పుడేమో కంటి తుడుపు చర్యగా రూ.100 తగ్గించారని విమర్శించారు. తమిళనాడులోని ప్రజలంతా తన కుటుంబం అని, వారి సంక్షేమమే కాకుండా, సమగ్ర ప్రగతితో దేశానికే మార్గదర్శకంగా ఈ రాష్ట్రాన్ని నిలబెడతానని స్పష్టం చేశారు.

- గ్యాస్ సిలిండర్ ధర రూ.500 పెంచి రూ. 100 తగ్గిస్తారా?
- ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం స్టాలిన్
- ప్రగతిలో తమిళనాడు దేశానికే తలమానికం అని వ్యాఖ్య



కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం ధర్మపురిలో పర్యటించారు. ఇందులో భాగంగా ధర్మపురి, కృష్ణగిరి, సేలం జిల్లాల్లో కొత్తగా చేపట్టనున్న ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, పూర్తి చేసిన పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే 8,736 మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను పంపిణీ చేశారు. సేలం – ధర్మపురి – కృష్ణగిరి జిల్లాలకు ఈ ఏడాదిలో తొలి పండుగ రోజు ఇదే అన్నట్లుగా బ్రహ్మాండ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ, ధర్మపురికి స్వయంగా తానే రావడం ఆనందంగా ఉందన్నారు. ఆ మేరకు ఈ జిల్లాలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఇక్కడి ప్రజలకు తాగునీరు అందించే హొగ్నెకల్ ఉమ్మడి నీటి ప్రాజెక్టు సాధనే లక్ష్యంగా గతంలో తాను ముందుకెళ్లినట్లు గుర్తుచేశారు. అలాగే, ధర్మపురి నుంచే కలైంజ్ఞర్ మహిళా హక్కు పథకాన్ని ప్రారంభించామని, ఈ పథకం ద్వారా కోటి 15 లక్షల మంది మహిళలకు ప్రతి నెలా క్రమం తప్పకుండా రూ.1000 నగదు అందజేస్తున్నామన్నారు. ప్రజల కష్టాలు తీర్చే క్రమంలో ఒకటి తర్వాత మరొకటి అన్నట్లు పథకాలను అమలు చేస్తున్నామని, సమస్యలకు పరిష్కారాలు చూపుతున్నామని వివరించారు.

పదేళ్ల పాటు దోచుకున్నారు..

మహిళలు, విద్యార్థులు, యువత, వృద్ధులు.. ఇలా అన్ని వర్గాల వారి ప్రయోజనమే లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నామని వివరించారు. అయితే రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన అన్నాడీఎంకే నాయకులు దోపిడీయే లక్ష్యంగా ముందుకెళ్లారని మండిపడ్డారు. తమిళనాడులోని ప్రజలంతా తన కుటుంబంగా భావించి పథకాలను అమలు చేస్తున్నానని వివరించారు అయితే గత పాలకులు దోచుకోవడంతో పాటు అనేక ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని, ఇందులో హొగ్నెకల్ ఉమ్మడి తాగునీటి పథకం కూడా ఉందని పేర్కొన్నారు. అన్నాడీఎంకే వర్గాలు రూపంలో ఈ జిల్లాకు చెందిన వ్యవసాయ కళాశాల విద్యార్థుల కుటుంబాలకు తీవ్ర అన్యాయం జరిగిన విషయాన్ని ప్రత్యేకంగా తాను చెప్పనక్కర్లేదని గుర్తు చేశారు. ధర్మపురి జిల్లాతోపాటు పక్కనే ఉన్న కృష్ణగిరి, మరో పక్కన ఉన్న సేలం జిల్లాల సమగ్రాభివృద్ధిని ద్రవిడ మోడల్ ప్రభుత్వం కాంక్షిస్తూ పథకాలను విస్తృతం చేసినట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలు, పట్టణాలలో అర్బన్ హెల్త్ సెంటర్లను మరింత విస్తృతం చేశామన్నారు. ఎల్లప్పుడూ ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం తమదని, అన్ని జిల్లాలనూ సమానంగా భావించి, ప్రగతి పనులకు నిధులను కేటాయిస్తున్నామన్నారు. అయితే, కేంద్రంలోని బీజేపీ పాలకులు అన్ని రాష్ట్రాలనూ సమానంగా చూడడం లేదని, తమిళనాడుపై సవతితల్లి ప్రేమను చూపుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాలనే సర్వనాశనం చేయడమే లక్ష్యంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. తమిళ భాష, జాతి, సంస్కృతిని నాశనం చేయడానికి కూడా కుట్ర చేస్తున్నారని మండి పడ్డారు. రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక సాయం కరువైందని, ఉన్న వనరులతోనే ప్రభుత్వాన్ని, పథకాలను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు.

లేని ప్రేమను ఒలకబోస్తూ..

లోక్ సభ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రధాని నరేంద్ర మోదీ తరచూ తమిళనాడు పై ప్రేమను ఒలక బోసే విధంగా పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందుగా ఇదే విధంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు పునాదులు వేశారని, వాటి పరిస్థితి ఏమిటో ప్రజలు గ్రహించాలని సూచించారు. ఇప్పుడు కూడా అదేబాటలో శంకుస్థాపనల పేరుతో ఎన్నికల స్టంట్లు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లుగా గ్యాస్ సిలిండర్‌పై రూ.500కు పైగా ధరను పెంచి, ఇప్పుడేమో రూ.100 తగ్గిస్తున్నట్టు ప్రకటిస్తున్నారని, ఇలాంటివి మరెన్నో ప్రకటనలు మున్ముందు చూడాల్సి ఉంటుందన్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే ధరల తగ్గింపుపై దృష్టి పెట్టి, ఆ తదుపరి వడ్డీతో సహా ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేసేలా ధరలను అమాంతం పెంచేస్తారని ఆరోపించారు. ఇలాంటి ప్రకటనలు నమ్మవద్దని, వరద విలయంలో చిక్కుకున్న తమిళ ప్రజలను పరామర్శించేందుకు కూడా రాని ఈ ప్రధాని నరేంద్ర మోదీకి ఎన్నికలలో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలోనే తమిళం, తమిళ ప్రజలు మోదీకి గుర్తుకు వస్తారని, ఈ విషయాన్ని తమిళనాడు ప్రజలు గ్రహించాలని సూచించారు. ప్రజలు, ప్రభుత్వం ద్రవిడ మున్నేట్ర కళగం(డీఎంకే) ఒకే కుటుంబం అని, దీనిని కుటుంబ పాలన అని ఎలా విమర్శిస్తారని బీజేపీ వర్గాలను ప్రశ్నించారు. తమిళనాడులోని కోట్లాది కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా ద్రవిడ మోడల్ పాలన జరుగుతోందన్నారు. ప్రజలను ఆర్థిక బలోపేతం చేసి, వారికి ఆరోగ్యకర జీవితాన్ని అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ పర్యటనలో సీఎం వెంట మంత్రులు కేఎస్ నెహ్రూ, ఏవీ వేలు, ఎంఆర్‌కే పన్నీరుసెల్వం, చక్రపాణి, ఎం. సుబ్రమణియన్, ఎంపీలు సెంథిల్‌కుమార్, పార్తీబన్, చెల్లకుమార్, ఎమ్మెల్యేలు జీకే మణి, వెంకటేశ్వరన్, ప్రకాష్, మదియళగన్, రామచంద్రన్, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేస్తూ..

నియోజకవర్గానికి ఇద్దరు ప్రత్యేక పర్యవేక్షకులు

- కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ వెల్లడి
- ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులతో భేటీ



మాట్లాడుతున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్

సాక్షి, చెన్నై: తమిళనాడులోని 39 లోక్‌సభ నియోజకవర్గాలకు ఒక్కో నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున ప్రత్యేక పర్యవేక్షకులను నియమించనున్నామని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ తెలిపారు. అవసరం అయితే అదనంగా నియమించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా సోమవారం రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులతో ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్‌కుమార్ సమావేశమయ్యారు. సచివాలయంలోని నామక్కల్ కవింజర్ మాళిగైలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహూ నేతృత్వంలో జరిగింది. అందరూ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గానికి ఎన్నికల ఏర్పాట్ల పరిశీలనకు జనరల్ అబ్జర్వర్, అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై నిఘా ఉంచేందుకు మరో అబ్జర్వర్‌ను నియమించనున్నామని ఈసందర్భంగా రాజీవ్‌కుమార్ పేర్కొన్నారు. అవసరం అయితే, అదనపు అబ్జర్వర్లను నియమించేందుకు సిద్ధంగా ఉన్నామని సూచించారు. సమసాత్మక నియోజకవర్గాలు, పోలింగ్ బూత్‌లకు ప్రత్యేకంగా ఐపీఎస్‌ల నేతృత్వంలో అబ్జర్వర్లను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు తమ అభిప్రాయాలను, సూచనలను కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

రాజేష్ దాస్‌కు లుక్ అవుట్ నోటీసులు


సాక్షి, చెన్నై: విధుల్లో ఉన్న మహిళా ఐపీఎస్ అధికారినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో జైలు శిక్ష ఖరారు కావడంతో అజ్ఞాతంలోకి వెళ్లిన మాజీ స్పెషల్ డీజీపీ రాజేష్ దాస్‌కు సోమవారం సీబీసీఐడీ లుక్ అవుట్ నోటీసు జారీ చేసింది. 2021 సంవత్సరం ఫిబ్రవరిలో ప్రత్యేక డీజీపీగా ఉన్న రాజేష్ దాస్ విధుల్లో ఉన్న జూనియర్ మహిళా ఐపీఎస్ అధికారిని తన కారులో ఎక్కమని ఆదేశించి, చివరకు ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టుగా వెలువడిన సమాచారం హోంశాఖలో తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసులో గత ఏడాది విల్లుపురం నేరవిభాగం కోర్టు తీర్పు వెలువరించింది. రాజేష్‌దాస్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధించారు. తనకు పడ్డ శిక్షను వ్యతిరేకిస్తూ రాజేష్ దాస్ అప్పీల్ పిటిషన్ దాఖలు చేయగా కోర్టు తిరస్కరించింది. శిక్షను ఖరారు చేసింది. దీంతో ఆయన లొంగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయన్ని అరెస్టు చేయడానికి శనివారం సీబీసీఐడీ అధికారులు వెళ్లారు. ఆయన ఐదురోజులుగా ఇంటి వైపే రాలేదని తేలింది. ఆయన కోసం గాలింపు జరిగింది. జాడ కానరాక పోవడంతో విదేశాలకు పారిపోకుండా అన్ని విమానాశ్రయాలకు లుక్ అవుట్ నోటీసును సీబీసీఐడీ జారీ చేసింది.

రహదారుల విస్తరణ పనులకు ప్రధాని శంకుస్థాపన

సాక్షి, చెన్నై: తమిళనాడులో 5 జాతీయ రహదారుల విస్తరణ పనులకు ప్రధాని నరేంద్రమోదీ సోమవారం శంకుస్థాపన చేశారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో వీటితో పాటు పూర్తి చేసిన మరి కొన్ని పనులనూ ప్రారంభించారు. రూ. 3,260 కోట్లతో 157 కి.మీ దూరం ఈ పనులు చేపట్టనున్నారు. ఇందులో చెన్నై – తిరుపతి మార్గంలోని తిరువళ్లూరు నుంచి ఆంధ్రా సరిహద్దుల వరకు రూ. 1,376 కోట్లతో 44 కి.మీ దూరం ఫోర్ వే పనులు జరగనున్నాయి. ధర్మపురి – సేలం మార్గంలోని తొప్పూరు వద్ద రూ. 905 కోట్లతో 7 కి.మీ దూరం రోడ్డు పనరుద్ధరణ పనులు చేపట్టనున్నారు. కోయంబత్తూరు – చిదంబరం మార్గంలోని (ఎన్‌హెచ్ 81), నామక్కల్ – తిరుచ్చి, కోయంబత్తూరు – కూడలూరు (ఎన్‌హెచ్ 67)లో 47.6 కి.మీ దూరం రూ. 275 కోట్లతో ఫోర్ వే పనులకు నిర్ణయించారు. అలాగే విరుదాచలం – సేలం మార్గంలో (ఎన్‌హెచ్32)లో 42 కి.మీ దూరం ఫోర్‌వే పనులు చేపట్టనున్నారు. వీటితో పాటు రూ. 295 కోట్లతో చేపట్టనున్న మరికొన్ని పనులు కూడా ఇందులో ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఇక మదురై – అచ్చంపట్టు– విరాడి పందు మధ్య 3.53 కి.మీ దూరం రూ. 260 కోట్లతో బైపాస్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. విల్లుపురం – పుదుచ్చేరి మార్గంలోని తెన్‌పెన్నై నది తీరంలో రూ. 27 కోట్లతో నిర్మించిన వంతెన, పెరియనాయన్ పాళయం జంక్షన్‌లో రూ. 99 కోట్లతో నిర్మించిన మరో బ్రిడ్జిని ప్రధాని ప్రారంభించారు. ఇదిలా ఉండగా చెన్నై నుంచి – బెంగళూరు మీదుగా మైసూర్‌కు వందేభారత్ రైలు సేవలు అందుతున్న విషయం తెలిసిందే. దీనికి అదనంగా మరో రైలును ఏర్పాటు చేయనున్నారు. ఈ రైలుకు మంగళవారం ఢిల్లీ నుంచి ప్రధాని జెండా ఊపనున్నారు.

పెరుగుతున్న ఎండ తీవ్రత

- నేడు, రేపు భారీ మార్పులు
- వాతావరణ కేంద్రం హెచ్చరిక



కొరుక్కుపేట: రాష్ట్రంలో భానుడి ప్రతాపం ప్రారంభమైంది. ఫలితంగా జనం ఉక్కపోతతో సతమతమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో రానున్న రెండు రోజుల పాటు వేడి తీవ్రత మరింత ఉధృతంగా ఉంటుందని చెన్నై వాతావరణ శాఖ సోమవారం వెల్లడించింది. వివరాలు.. రాష్ట్రంలో గత రెండు వారాలుగా వేడిమి తారస్థాయికి చేరుకుంది. కాగా ఈ ఏడాది చెన్నై నగరంలో వేసవి అత్యంత తీవ్రంగా ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో వేడిగాలులు కూడా వీస్తున్నాయి. దీంతో మధ్యాహ్నం పూట ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. రోడ్లు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఇంట్లో ఏసీలు, ఫ్యాన్‌లు నిర్విరామంగా నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతాల్లో 16వ తేదీ వరకు పొడి వాతావరణం ఉండే అవకాశం ఉందని చెన్నై జోనల్ వాతావరణ కేంద్రం సోమవారం తెలిపింది. చెన్నైలో వేడిగాలులు వీస్తున్నందున వేడిమిని తగ్గించేందుకు నీరు ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు తినాలని వైద్యులు సూచించారు. ప్రస్తుతం పుచ్చకాయల సీజన్ కావడంతో చెన్నైలో పుచ్చకాయల వ్యాపారం జోరందుకుంది. అదేవిధంగా ఎండ వేడిమిని తట్టుకునేందుకు జ్యూస్ దుకాణాలకు జనం బారులుదీరుతున్నారు. ఈనేపథ్యంలో మంగళ, బుధవారం రాష్ట్రంలోని కొన్ని చోట్ల సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, జనం అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించడం గమనార్హం.

తేని నుంచి లోక్‌సభ బరిలోకి..

- విజయ ప్రభాకరన్ ప్రకటన



విజయ ప్రభాకరన్

సాక్షి, చెన్నై: లోక్‌సభ ఎన్నికలలో తాను పోటీ చేయనున్నానని డీఎండీకే దివంగత నేత విజయకాంత్ తనయుడు విజయప్రభాకరన్ ప్రకటించారు. అవకాశం ఇస్తే తేని లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. తేని జిల్లా పెరియకుళంలో జరిగిన కార్యక్రమంలో విజయ ప్రభాకరన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీఎంకే, అన్నాడీఎంకే రాష్ట్రాన్ని దోచుకున్నాయని ఆరోపించారు. ఆయా పార్టీలకు చెందిన వారు బలవంతులు అవుతున్నారే గానీ ప్రజల స్థితిగతుల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదన్నారు. తమకు ఆర్థిక బలం లేకున్నా, ఆత్మస్థైర్యం ప్రజా మద్దతు ఉందని, ఇదే తన తండ్రి, దివంగత నేత విజయకాంత్‌ను రాజకీయంగా అందలం ఎక్కించాయని గుర్తుచేశారు. ఆయన బాటలోనే తన పయనం అని పేర్కొంటూ, స్వశక్తితో ఎదిగిన విజయకాంత్‌ను ఆదర్శంగా తీసుకుని డీఎండీకేకు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. ప్రజలే తమకు బలం అని, రానున్న లోక్‌సభ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఓటుకు నోటుకు ప్రజలు స్వస్తి పలకాలని, నిజమైన సేవకులను ఎన్నుకోవాలని కోరారు. తాను రానున్న లోక్‌సభ ఎన్నికలలో తేని నుంచి పోటీ చేయాలన్న ఆశతో ఉన్నానని, అవకాశం వస్తే ఇక్కడి నుంచే తన పోటీ ఉంటుందన్నారు. లేదా విరుదునగర్ లోక్ సభ నుంచి బరిలోకి దిగుతానన్నారు. సీఎం స్టాలిన్‌ను ఆయన తండ్రి కరుణానిధి, ఉదయనిధి స్టాలిన్‌ను ఆయన తండ్రి స్టాలిన్, అన్నామలైను బీజేపీ అధిష్టానం అందలం ఎక్కించాయని పేర్కొంటూ, తాను మాత్రం తన తండ్రి అడుగు జాడలలో స్వశక్తితో రాజకీయాలలో ఎదుగుతానని ధీమా వ్యక్తంచేశారు.

పొన్ముడికి భారీ ఊరట

- జైలు శిక్ష తీర్పు నిలుపుదల
- సుప్రీం ఆదేశాలతో మద్దతుదారుల్లో ఆనందం
- మళ్లీ దక్కిన ఎమ్మెల్యే పదవి
- మరి మంత్రి పదవి..?



పొన్ముడి, సుప్రీంకోర్టు

సాక్షి, చెన్నై: మాజీ మంత్రి పొన్ముడి, ఆయన సతీమణి విశాలాక్షికి విధించిన మూడేళ్ల జైలు శిక్షను నిలుపుదల చేస్తూ సోమవారం సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయన మద్దతుదారులు ఆనంద తాండవం చేశారు. ఈ ఆదేశాలతో అనర్హత వేటు నుంచి ఆయన గట్టెక్కి మళ్లీ ఎమ్మెల్యే పదవిని సొంతం చేసుకోనున్నారు. అయితే ఆయనకు మళ్లీ మంత్రి పదవిని సీఎం స్టాలిన్ కేటాయిస్తారా? అనే చర్చ జోరందుకుంది. వివరాలు.. 2006–11 కాలంలో ఉన్నత విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో రూ.1.75 కోట్లు ఆదాయానికి మించి అక్రమ ఆస్తులను పొన్ముడి గడించినట్టు గతంలో అభియోగం నమోదైన విషయం తెలిసిందే. తొలుత కింది కోర్టు విడుదల చేసినా, ఆ తదుపరి అప్పీలు పిటిషన్ రూపంలో పొన్ముడి, ఆయన సతీమని విశాలాక్షి మూడేళ్ల జైలు శిక్షను ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది చివర్లో హైకోర్టు ఇచ్చిన తీర్పుతో అనర్హత వేటు కారణంగా పొన్ముడి మంత్రి, ఎమ్మెల్యే పదవి కోల్పోవాల్సి వచ్చింది. అప్పీల్‌కు అవకాశం కల్పిస్తూ 30 రోజులు గడువును హైకోర్టు కేటాయించింది. దీంతో తీర్పును వ్యతిరేకిస్తూ అప్పీల్ పిటిషన్‌తో సుప్రీంకోర్టును పొన్ముడి దంపతులు ఆశ్రయించారు. తొలుత నిర్ణీత గడువు ముగిసినానంతరం కోర్టులో లొంగుబాటు నుంచి మినహాయింపు దక్కడం పొన్ముడి దంపతులకు ఊరటను కలిగించింది. జైలుకు వెళ్లకుండా గండం నుంచి గట్టెక్కిన ఈ దంపతులు న్యాయ పోరాటాన్ని ఉధృతం చేశారు.

శిక్ష నిలుపుదల..

జైలు శిక్ష నిలుపుదల కోసం దాఖలు చేసుకున్న అప్పీల్ పిటిషన్‌పై గత రెండు నెలలుగా విచారణ జరుగుతూ వచ్చింది. పొన్ముడి తరపున సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముందుగా శిక్ష తీర్పు అమలు నిలుపుదల చేయాలని, ఇందుకు సంబంధించి స్టే ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ వచ్చారు. సోమవారం వాదనల అనంతరం శిక్ష అమలు నిలుపుదల చేస్తూ సుప్రీంకోర్టు బెంచ్ ఆదేశాలు ఇచ్చింది. దీంతో పొన్ముడి మద్దతుదారులలో ఆనందం వెల్లివిరిసింది. ఇక తాజా ఆదేశాలను అస్త్రంగా చేసుకుని తీర్పు రద్దు కోసం మరోమారు న్యాయ పోరాటానికి ఈ దంపతులు సిద్ధం కానున్నట్లు తెలిసింది.


గట్టెక్కినట్లేనా..?

జైలు శిక్ష నేపథ్యంలో అనర్హత వేటు పడడంతో పొన్ముడి ప్రాతినిధ్యం వహించిన తిరుక్కోవిలూరు ఖాళీగా ఉన్నట్టు ఎన్నికల కమిషన్‌కు ఇటీవల అసెంబ్లీ కార్యాలయం సిఫారసు చేసింది. ఈ స్థానం ఖాళీగా ఉన్నట్టు గెజిట్‌లోనూ ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో జైలు శిక్ష నిలుపుదల కావడంతో అనర్హత వేటు నుంచి పొన్ముడి గట్టెక్కినట్టుగా పరిస్థితులు మారాయి. దీంతో కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నకలుతో తమను సంప్రదించాలని, తద్వారా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సిఫారసు చేయడం జరుగుతుందని అసెంబ్లీ కార్యాలయం ప్రకటించింది. ఇందుకు సంబంధించిన కసరత్తుల్లో పొన్ముడి నిమగ్నమయ్యారు. దీంతో ఆయనకు మళ్లీ ఎమ్మెల్యే పదవి దక్కినట్టే అన్నది స్పష్టమవుతోంది. అదే సమయంలో గతంలో ఆయన చేతిలో ఉన్న ఉన్నత విద్యా శాఖమంత్రి పదవి ప్రస్తుతం రాజకన్నప్పన్‌కు అదనంగా అప్పగించారు. ఈ నేపథ్యంలో మళ్లీ ఈ పదవి పొన్ముడికి దక్కేనా? ఈ వ్యవహారంలో సీఎం స్టాలిన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు..? అనే చర్చ జోరందుకుంది.

వేడుకగా తెప్పోత్సవాలు ప్రారంభం



పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న స్వామివారు



విశేషాలంకరణలో శ్రీదేవిభూదేవి సమేత వైద్యవీరరాఘవ స్వామి

తిరువళ్లూరు: పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వైద్యవీరరాఘవుడి ఆలయంలో ఏడాదికి ఒకసారి నిర్వహించే మాసి తెప్పోత్సవాలు ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత పుష్కరిణిలో ప్రత్యేకంగా అలంకరించిన తెప్పపైకి స్వామివారిని తీసుకొచ్చి మూడుసార్లు ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు తెప్పను లాగి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గోవిందనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

చెన్నై
మంగళవారం । 12 । మార్చి । 2024
సాక్షి

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో నడవాలి



పంచశక్తి పీఠాధిపతి శ్రీఓం సత్యేంద్రస్వామి గల్ దేవియమ్మను సత్కరిస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో నడవాలని పంచశక్తి పీఠాధిపతి శ్రీఓం సత్యేంద్రస్వామిగల్ దేవియమ్మను ఉద్బోధించారు. పెరంబూరులోని ఎస్కే ఎన్ఎస్పీఎంసీ వివేకానంద విద్యాలయ సీనియర్ సెకండరీ స్కూలులో శ్రీ ఓం పంచశక్తి పీఠాధిపతులు జగద్గురు పూజ్యశ్రీ శ్రీఓం సత్యేంద్రస్వాములు నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. శ్రీఓం సభ–చెన్నై ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులడిగిన ఆధ్యాత్మిక పరమైన ప్రశ్నలకు సత్యేంద్ర స్వాములు చక్కగా సమాధానాలిచ్చారు. సుమారు 500 మంది భక్తులకు అన్నదానం చేశారు.

చేనేత కార్మికుల అభ్యున్నతికి ప్రత్యేక నిధులు

వేలూరు: గుడియాత్తం పారతంలో చేనేత కార్మికులను ఆదుకుని, వారి అభ్యున్నతికి తోడ్పడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందని రాష్ట్రమంత్రి ఆర్ గాంధీ అన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10 చోట్ల రూ.2 కోట్లు వంతున చేనేత పరిశ్రమ ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. దీంతో వేలూరు జిల్లా గుడియాత్తంలో అధికంగా చేనేత కార్మికులు ఉండడంతో చేనేత పరిశ్రమ స్థాపనకు స్థలాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేనేత పరిశ్రమ కార్మికులు తీవ్రంగా నష్టాల్లో ఉన్నారని, దీంతోనే కార్మికులను ఆదుకునేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందని, త్వరలోనే పనులను ప్రారంభించి కార్మికులను అన్ని విధాల ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పిచ్చనూరు ప్రాంతంలోని చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ధర్మేంద్ర ప్రతాప్, ఎమ్మెల్యేలు కార్తికేయన్, నందకుమార్, వేలూరు మేయర్ సుజాత, మున్సిపల్ చైర్మన్ సౌందర్‌రాజన్, యూనియన్ చైర్మన్ సచ్చిదానందం పాల్గొన్నారు.

త్వరలో ఏడు వేల నూతన బస్సులు



తిరుత్తణి ఆర్టీఓ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు గాంధీ, శివశంకరన్

తిరుత్తణి: డొక్కు బస్సుల స్థానంలో ఏడువేల కొత్త బస్సులు అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి శివశంకరన్ పేర్కొన్నారు. తిరుత్తణి పాత బైపాస్ రోడ్డు మార్గంలో అద్దె భవనంలో రోడ్డు ట్రాన్స్‌పోర్టు అథారిటీ(ఆర్టీఏ) కార్యాలయం సేవలందిస్తుంది. ఈ క్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాలతో చెన్నై–తిరుపతి జాతీయ రహదారిలోని లక్ష్మాపురం వద్ద 1.22 ఎకరాల విస్తీర్ణంలో రూ.2.42 కోట్ల వ్యయంతో తిరుత్తణి ఆర్టీఏ కార్యాలయ నూతన భవనం నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఈ భవనాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. రోడ్డు భద్రత కమిషనర్ షణ్ముగసుందరం, తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యేలు చంద్రన్, రాజేంద్రన్ స్వాగతం పలికారు. ఇందులో చేనేత పరిశ్రమ శాఖ మంత్రి గాంధీ, ట్రాన్స్‌పోర్టు శాఖ మంత్రి శివశంకరన్ పాల్గొని, నూతన భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శివశంకరన్ మాట్లాడుతూ గత పదేళ్లలో అన్నాడీఎంకే ప్రభుత్వంలో కొనుగోలు చేసిన 15 వేల బస్సులు నాణ్యత లేకపోవడంతో శిథిలావస్థకు చేరాయని, ఈ నేపథ్యంలో వాటిలో ప్రయాణం చేయడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ నూత న బస్సులు కొనుగోలుకు సంబంధించి నిధులు కేటాయించి, టెండర్ పిలిచారని, ఈ ఏడాది చివరికి 7 వేల కొత్త బస్సులు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆర్టీఓలు మోహన్, దీప పాల్గొన్నారు.

చెత్తకుండీలో నవ జాతశిశువు

తిరువొత్తియూరు: చెన్నై ట్రిప్లికేన్‌లో లాడ్జి ముందు చెత్తకుండీలో పడి ఉన్న నవజాత శిశువును లాడ్జి ఉద్యోగులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. విచారణలో ఓ 17 ఏళ్ల బాలిక వివాహం కాకుండానే గర్భం దాల్చి ప్రసవించడంతో శిశువును చెత్తకుండీలో పడేసినట్లు తేలింది. కాగా బాలికను గర్భవతిని చేసి మోసగించిన మదురైకి చెందిన ఆటో డ్రైవర్ రాజ్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశారు. శిశువును సంరక్షణ కేంద్రానికి తరలించారు.

సమస్యల పరిష్కారానికి రేషన్ దుకాణ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రేషన్ దుకాణ కార్మికులు

వేలూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తమిళనాడు సహకార సంఘం, రేషన్ దుకాణ కార్మికులు వేలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి ధర్మలింగం మాట్లాడుతూ సహకార బ్యాంకులతో పాటు రేషన్ దుకాణాల్లో పలు సంవత్సరాలుగా పనిచేస్తున్న వారికి కమిటీ సిపారస్సు మేరకు వేతనాలు పెంచాలని, కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న వారిని సీనియారిటీ ప్రకారం పర్మనెంట్ చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సేలం, నామక్కల్ జిల్లాలో కార్యదర్శులను విధుల నుంచి తొలగించడాన్ని మానుకోవాలని, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు, కార్మికులకు వెంటనే పెన్షన్ సదుపాయం కల్పించాలని తదితర మొత్తం 26 డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఇది వరకే పలుసార్లు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా విధులను బహిష్కరించి ధర్నా నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం ఇప్పటికైనా పరిష్కరించకుంటే సమ్మెలో పాల్గొంటామన్నారు. ఈ ధర్నాలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లాల్ బహదూర్, జిల్లా కోశాధికారి వెంకటేశన్, రవి పాల్గొన్నారు.

టీఎంసీ కోశాధికారిగా ఈఎస్ఎస్ రామన్



పళ్లిపట్టు: తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే.వాసన్ అధ్యక్షతన నిర్వహించి ఆ పార్టీ జనరల్ కమిటీ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కోశాధికారిగా పళ్లిపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఈఎస్ఎస్.రామన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జీకే.వాసన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి డాక్టర్ రామన్ అభినందనలు తెలిపారు.

ప్రొఫెసర్ ఇంట్లో 38 సవర్ల నగల చోరీ

అన్నానగర్: కోయంబత్తూరులోని సింగానల్లూర్ పక్కనే ఉన్న ఉప్పిలిపాళయం ప్రాంతానికి చెందిన వ్యక్తి మోహన్ కుమార్. ఈయన పీలమేడులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఇతడు ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి కొండంపాలయంలోని బంధువుల వద్దకు వెళ్లాడు. ఆదివారం సాయంత్రం వచ్చి చూడగా..ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలోని 38.5 సవర్ల బంగారు ఆభరణాలను దుండగులు చోరీ చేసినట్లు గుర్తించారు. వీటి విలువ రూ. 18 లక్షలు ఉంటుందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నమో డ్రోన్లతో మహిళలకు శిక్షణ



డ్రోన్ శిక్షణ పొందిన విద్యార్థినులతో శ్యామ్‌కుమార్

కొరుక్కుపేట: మహిళల సాధికారత కల్పించేందుకు నమో డ్రోన్ దీదీ యోజన మహిళా రైతులకు డ్రోన్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు తీసుకుని వచ్చినట్టు గరుడ ఏరోస్పేస్ వ్యవస్థాపక సీఈఓ అగ్నిశ్వర్ జయప్రకాష్ తెలిపారు. ఆ సంస్థ సీపీఓ శ్యామ్ కుమార్‌తో కలసి అగ్నిశ్వర్ జయప్రకాష్ మాట్లాడుతూ నమో దీదీ యోజన మహిళలకు డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తోందన్నారు. మహిళా సాధికారతలో భాగంగా ఇప్పటికే 500 మంది మహిళా రైతులు ఈ టెక్నాలజీలో శిక్షణ పొందారన్నారు. 20 రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక బృందాలకు (ఎస్‌హెచ్‌జీ) 446 డ్రోన్లను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. మహిళలకు అవసరమైన నైపుణ్యాలను అందించడమే కాకుండా పురుషులకు దీటుగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ డ్రోన్‌ల శిక్షణను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం చెన్నై పక్కనే ఉన్న నావలూరు ప్రాంతంలో గరుడ ఏరోస్పేస్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామన్నారు. మహిళలు కూడా వ్యవసాయంలో స్వయం సంవృద్ధి సాధించేలా చూడాలన్నారు. ప్రస్తుతం మేరీ, లక్ష్మీదేవి, జ్యోతి, సునీత అనే విద్యార్థినిలు గరుడ ఏరోస్పేస్ ద్వారా శిక్షణ పొందినట్టు చెప్పారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని నిరసన



కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన పరేస్‌పురం, ఇలుప్పూరు గ్రామస్తులు

తిరువళ్లూరు: గత 30 ఏళ్ల నివాసం ఉంటున్న ఎస్టీలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ రెండు గ్రామాల్లోని ఎస్టీలు సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తిరువళ్లూరు జిల్లా తిరువేళంగాడు యూనియన్‌లోని పరేస్‌పురం, ఇలుప్పూరు గ్రామాల్లో సుమారు 67 ఎస్టీ కుటుంబాలు గత 30 సంవత్సరాల నుంచి జీవనం సాగిస్తున్నాయి. ప్రస్తుతం ఎస్టీలు నివాసం ఉంటున్న ప్రాంతానికి ఇంత వరకు పట్టా, మౌలిక సదుపాయాలు, ఆధార్‌కార్డుతో సహా ఇతర సదుపాయాలను ప్రభుత్వం కల్పించలేదు. ఈ విషయమై ఏళ్ల తరబడి ఎస్టీలు అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఆ రెండు గ్రామాలకు చెందిన ఎస్టీలు ఆందోళన చేపట్టారు. తమకు ఇళ్ల పట్టాలు మంజూరుతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరుతూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని సముదాయించి కలెక్టర్‌కు వద్దకు తీసుకెళ్లారు. కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ ఆందోళనకారుల సమస్యలను అడిగి తెలుసుకుని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న శిక్షణ పొందిన నిరుద్యోగులు

తిరువళ్లూరు: దక్షిణ మధ్య రైల్వే, ఐసీఎఫ్ తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో శిక్షణ(అప్రెంటీస్) పూర్తి చేసిన వారికి వెంటనే ఉద్యోగ అవకాశాలను కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద బాధితులు నిరసన వ్యక్తం చేశారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 17 వేల మంది నిరుద్యోగ యువత ఐసీఎఫ్, దక్షిణ మధ్య రైల్వే తదితర సంస్థల్లో అప్రెంటీస్ శిక్షణ పూర్తి చేశారు. శిక్షణను పూర్తి చేసిన వారికి దశల వారీగా ఉద్యోగాలు కల్పించాల్సి ఉంది. ఉత్తర భారతదేశంలో 2020 వరకు శిక్షణ పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు కల్పించారు. అయితే తమినాడు, కేరళ, కర్ణాటక, తెలుగు రాష్ట్రాల్లో శిక్షణ పూర్తి చేసిన వారికి గత 15 ఏళ్లుగా ఉద్యోగాలు కల్పించలేదు. ఈ విషయమై పలువురికి వినతిపత్రం సమర్పించడంతోపాటు ఆందోళన నిర్వహించినా ఫలితం లేదు. కాగా అప్రెంటీస్ పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న 17 వేల మందికి దశల వారీగా ఉద్యోగం కల్పించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

22న ప్రపంచ వ్యాప్తంగా తెరపైకి

‘ది గోట్ లైఫ్. ఆడు జీవితం’



పృథ్వీరాజ్ సుకుమారన్, అమలాపాల్

తమిళ సినిమా: స్టార్ నటుడు, దర్శకుడు, నిర్మాత పృథ్వీరాజ్ సుకుమారన్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం ది గోట్ లైఫ్. ఆడు జీవితం. అమలాపాల్ నాయకిగా నటించిన ఈ చిత్రంలో హాలీవుడ్ నటుడు జిమ్మీ జీన్ లూయిస్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. దీనికి ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందించారు. బ్లెస్సీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమం పూర్తి చేసుకుని ఈ నెల 22వ తేదీన ప్రపంచవ్యాప్తంగా తమిళం, మలయాళం, కన్నడం, తెలుగు, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. చిత్ర ట్రైలర్‌లు ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ ఇది పదేళ్ల సుదీర్ఘ పయనంతో పోయిన అసాధారణ కథాచిత్రం అని చెప్పారు. పదేళ్ల ఎదురుచూపుల తర్వాత తమ కఠిన శ్రమకు ఫలితాన్ని ప్రేక్షకులు చూడబోతున్నారన్నారు. కోవిడ్ కాలం నుంచి ఇప్పటివరకు ఈ చిత్రం అనూహ్యమైన, మరిచిపోలేని పయనంగా ఉంటుందన్నారు. దర్శకుడు బ్లెస్సీ దృష్టిలో ఒక భాగంగా ఈ చిత్రం ఉంటుందన్నారు. ఏఆర్ రెహమాన్ వంటి మాస్ట్రో సంగీతం చిత్రానికి ప్రాణం పోయడం ఘనతగా భావిస్తున్నానన్నారు. ది గోట్ లైఫ్.ఆడు జీవితం ఒక చిత్రంగా కాకుండా మన మనసు హత్తుకునేలా ఉంటుందన్నారు. మలయాళ సాహిత్య రంగంలో ప్రాచుర్యం పొందిన, అత్యధిక విక్రయం జరిగిన ఆడు జీవితం అనే నవల ఆధారంగా రూపొందించిన కథా చిత్రం ఇదని చెప్పారు. ప్రముఖ రచయిత బెన్యామిన్ ఒక యథార్థ సంఘటన ఆధారంగా రాసిన నవలను చిత్రంగా నచ్చినట్లు చెప్పారు. ఈ నవల 12 భాషల్లో అనువదింపబడి పాఠకుల ఆదరణను పొందిందని చెప్పారు. కేరళలోని సముద్ర తీర ప్రాంతానికి చెందిన ఒక యువకుడు విదేశాలకు వెళ్లి తన అదృష్టాన్ని పరీక్షించుకునే ఇతివృత్తంతో సాగే కథాచిత్రం ది గోట్ లైఫ్. ఆడు జీవితం అని చెప్పారు.

కోలీవుడ్ టాక్స్



వివేక్ మెర్విన్‌లో ప్రైవేట్ ఆల్బమ్ రెడీ

తమిళ సినిమా: ఇప్పుడు ప్రైవేట్ ఆల్బమ్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. దీంతో పలువురు సంగీత కళాకారులు తమ ప్రతిభను నిర్మించుకునేలా ఇలాంటి ఆల్బమ్‌ను రూపొందిస్తున్నారు. ఇంకా యువ సంగీత దర్శక ద్వయం వివేక్ మెర్విన్ ద్వయం. ఓ పక్క సినిమాలకు పని చేస్తూనే మరో పక్క ప్రైవేట్ ఆల్బమ్‌పై మక్కువ చూపుతున్నారు. అలా ఇప్పటికే పలు ప్రైవేట్ ఆల్బమ్‌లను రూపొందించి సంగీత ప్రియులను అలరించారు. తాజాగా వీఎం ఒరిజినల్స్ పేరుతో 5 పాటలతో ప్రైవేట్ ఆల్బమ్ రూపొందించారు. ఈ పాటలను గాయనీగాయకులు శివంగి, హర్షవర్ధన్, నిత్యశ్రీ, వెంకటరమణన్, ఆదిత్య ఆర్కే, ఎమ్మెస్ కృష్ణ తదితరులు పాడారు. ఐదు పాటలతో కూడిన వీడియో ఆల్బమ్‌ను సంగీత దర్శక విజయం వివేక్ మెర్లిన్‌లు, లైవ్ పెర్ఫార్మెన్స్‌తో రూపొందించడం విశేషం. ఈ ఆల్బమ్ తొలి సింగిల్‌ను ఈ నెల 15వ తేదీన విడుదల చేయనున్నట్లు తెలిపారు. అలాగే మరో 15 రోజుల తర్వాత తదుపరి పాటలతో కూడిన ఆల్బమ్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. మ్యూజికల్ వీడియో ఆల్బమ్ దర్శకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

బ్రేక్ మంచిదే..!



తమిళ సినిమా: ఒక్కోసారి మనం ఏంటో తెలుసుకోవడానికి, ఇతరుల గురించి తెలుసుకోవడానికి కాస్త వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం అవసరం అవుతుంది. నటి సమంత కూడా ఇలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దక్షిణాదిలో అగ్ర కథానాయకిగా రాణిస్తున్న నటి ఈ చెన్నై బ్యూటీ. తెలుగు, తమిళం భాషల్లో పలు విజయాలను తన ఖాతాలో వేసుకున్న సమంత వెబ్ సిరీస్ ద్వారా బాలీవుడ్‌తో పాటు ప్రపంచ సినీ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అలాంటిది అనూహ్యంగా మయోసైటిస్ అనే అరుదైన వ్యాధికి గురికావడం ఆమెనే కాకుండా ఆమె అభిమానులను తీవ్రంగా బాధించింది. అయితే ఆ వ్యాధితో పోరాడి, దాని నుంచి బయటపడిన సమంత ఇప్పుడు మళ్లీ నటించడానికి సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా ఆమె ఒక భేటీలో పేర్కొంటూ గట్టిగా బిజీగా నటిస్తున్న సమయంలో విశ్రాంతి తీసుకోవడం అనేది ఉత్తమమైన నిర్ణయం అని పేర్కొన్నారు. కఠినమైన విషయం అయినా అలాంటి సమయంలో అదే సరైన నిర్ణయం అని భావిస్తున్నానన్నారు. ఆత్మ స్థైర్యం కోల్పోవడం లాంటి పరిస్థితుల్లో మళ్లీ తనను తాను తీర్చిదిద్దుకోవడానికి సమయంగా తాను దీన్ని తీసుకున్నానని చెప్పారు. 13 ఏళ్లుగా శ్రమిస్తున్న తనకు ఈ బ్రేక్ ఆనందాన్ని కలిగించిందన్నారు. నటిగా కొనసాగడం వల్ల కొన్ని సమయాల్లో ప్రపంచం చాలా చిన్నదిగా కనిపించిందన్నారు. ప్రస్తుతం ట్రోలింగ్‌ను, విమర్శలను వేరు వేరుగా చూడగలుగుతున్నానన్నారు. సద్విమర్శలకు తన కళ్లు, చెవులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. ఇది తనకు చాలా ముఖ్యమైన అభిప్రాయమని నటి సమంత వ్యక్తం చేశారు.

నాన్న లేరు..అన్నా లేరు





శివ కార్తికేయన్

తమిళ సినిమా: హాలీవుడ్‌లో స్వయం కృషితో స్టార్‌గా ఎదిగిన నటుడు శివ కార్తికేయన్. ఒక టీవీ యాంకర్‌గా కెరియర్‌ను ప్రారంభించిన ఈయన ఆ తర్వాత నటుడిగా పరిచయమై సపోర్టింగ్ పాత్రలు చేస్తూ ఆపై కథానాయకుడుగా ఎదిగారు. ధనుష్ కథానాయకుడిగా నటించిన 3 చిత్రంలో శివ కార్తికేయన్ ఆయనకు ఫ్రెండ్‌గా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత మనం కొత్తి పరవై చిత్రం ద్వారా హీరోగా అవతారం ఎత్తారు. అలా ఇప్పటికి 20 చిత్రాల్లో కథానాయకుడుగా నటించడం విశేషం. ఇందులో పలు చిత్రాలు సూపర్ హిట్ కాగా అభిమానులు మెచ్చిన స్టార్‌గా ఎదిగారు. తాజాగా నటిస్తున్న 21వ చిత్రం అమరన్. నటి సాయి పల్లవి నాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని నటుడు కమలహాసన్ తన రాజ్ కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్ర నిర్మాణ కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్నాయి. ఇందులో శివ కార్తికేయన్ సైనిక కమెండోగా నటిస్తున్నారు. ఈ పాత్ర కోసం చాలా కసరత్తులు చేశారు. చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్ర ఓటీటీ హక్కులను నెట్ ఫ్లిక్స్ సంస్థ రూ.60 కోట్లకు సొంతం చేసుకోవడం విశేషం. శివ కార్తికేయన్ నటించిన చిత్రాలన్నింటిలో అత్యధిక మొత్తానికి ఓటీటీ హక్కులు అమ్ముడుపోయిన చిత్రం ఇదే అవుతుంది. ఇంతకుముందు శివ కార్తికేయన్ నటించిన మావీరన్ చిత్రం ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్ రూ.33 కోట్లు చెల్లించింది. దీంతో అమరన్ చిత్రంపై అభిమానుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. కాగా శివ కార్తికేయన్ ఆదివారం తన అభిమానులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ ‘మీరు దేని గురించి ఆలోచించకండి. మీ కోసం నేనున్నాను. నాకు అంతా మీరే. జీవితాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నాను. వాటి బాధ ఉంటుంది. కొన్ని మీకు తెలిసినా, చాలా విషయాలు తెలియదు. సమస్యలు చెప్పుకోవడానికి నాకు నాన్న లేరు. సపోర్ట్ చేయడానికి అన్నయ్య లేరు. నాకిప్పుడు బ్రదర్స్ అండ్ సిస్టర్స్ అయినా అంతా మీరే’. అంటూ నటుడు శివకార్తికేయన్ భావోద్రేకాలకు గురయ్యారు.

అలాంటి మాటకే తావు లేదు



తమిళ సినిమా: నిత్యం వార్తల్లో ఉండే నటి నయనతార. ఆమె సినీ పయనం ఒక సంచలనం. అవమానాలు, ఆరోపణలు, వివాదాలమయ జీవితం. అయితే అందులోనూ ఆనందాన్ని వెతుక్కుంటూ అకుంఠిత శ్రమతో నంబర్ వన్ నటి అనే అంతస్తులో నిలిచారు. సూపర్ స్టార్‌గా అత్యంత అధిక పారితోషికం తీసుకుంటున్న ఇండియన్ నాయకిగా రాణిస్తున్నారు. రెండు మూడు సార్లు ప్రేమలో ఓడిపోయి చివరికి దర్శకుడు విగ్నేష్ శివన్ ప్రేమను పొంది, ఆయనతో గత రెండేళ్ల క్రితం ఏడు అడుగులు వేశారు. ఇప్పుడు వీరికి ఉయిర్, ఉలగం అనే కవల పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం కథానాయకిగా, నిర్మాతగా, వ్యాపారవేత్తగా రాణిస్తున్న నయనతార తనకు సంబంధించిన సినీ, వ్యక్తిగత విషయాలను ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేస్తూ అభిమానులను ఎంటర్ టైన్ చేయడంతో పాటు అప్పుడప్పుడు వివాదాస్పదమైన విషయాలను పొందుపరుస్తూ షాకింగ్‌కు గురి చేస్తుంటారు. భర్త విగ్నేష్ శివన్, పిల్లలు ఉయిర్, ఉలగంతో ఎంతో అన్యోన్యంగా ఉండే నయనతార ఇటీవల తాను ఓడిపోయాను అంటూ ఇన్‌స్టాగామ్‌లో చేసిన పోస్ట్ అందరిని షాక్‌కు గురి చేసింది. దర్శకుడు విగ్నేశ్ శివన్‌తో మనస్పర్థలా? ఇద్దరు విడిపోతున్నారా? అసలు వీరి మధ్య ఏం జరుగుతోంది? అంటూ పలు ప్రశ్నలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆ వెంటనే తన భర్త పిల్లలతో ఆనందంగా గడుపుతున్న ఫొటోలను ఆమె పోస్ట్ చేశారు. దీంతో అదంతా ఒక పబ్లిసిటీ స్టంట్ అని తేలిపోయింది. కాగా నయనతార విగ్నేష్ శివన్ విడిపోతారనే పదానికే తావు లేదని విశ్లేషకులు అంటున్నారు. నయనతార ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టించడానికి సలహాలు ఇచ్చిందే విగ్నేష్ శివన్ అని, ఎంతో కష్టపడి కూడబెట్టిన ఆస్తులు, చేస్తున్న వ్యాపారాలకు ఆమె భర్త విగ్నేష్ శివన్ ఫౌండర్‌గానో, కో ఫౌండర్‌గానో ఉన్నారని, కాబట్టి విడిపోయే ఛాన్సే లేదని విశ్లేషకులు చెబుతున్న మాట.

బీజేపీలోకి అమ్మ పార్టీ

బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలోకి అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం చేరింది. ప్రధాని నరేంద్రమోదీ మూడోసారిగా అధికార పగ్గాలు చేపట్టడంలో ఉడతా సాయంగా తమ పనితీరు ఉంటుందని ఆ పార్టీ నేత దినకరన్ ప్రకటించారు.

- అన్నామలైతో శరత్ భేటీ
- మిత్రులతో సీట్ల చర్చ
- పది స్థానాలపై కమలం గురి

సాక్షి, చెన్నై: బీజేపీ కూటమిలో తమిళ మానిల కాంగ్రెస్, తమిళనాడు మక్కల్ మున్నేట్ర కళగం, ఇండియ జననాయగ కట్చి, పుదియ నీది కట్చి, ఇండియా మక్కల్ కల్వి మున్నేట్ర కళగం, కామరాజర్ మక్కల్ కట్చి, ఉలైప్పాలర్ కట్చిలు, సినీ నటుడు శరత్‌కుమార్ నేతృత్వంలోని సమత్తువ మక్కల్ కట్చి(ఎస్ఎంకే) చేరిన విషయం తెలిసిందే. సోమవారం తమ మద్దతును అన్నాడీఎంకే నుంచి చీలికతో ఆవిర్భవించిన అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రకటించింది. అలాగే అజిత్‌పవార్ దేశీయ వాద కాంగ్రెస్ తమిళనాడు విభాగం సైతం మద్దతు ప్రకటించింది. ఆ పార్టీ నేత పీకే రమేష్ నేతృత్వంలో బృందం అన్నామలైను కలిసి కూటమిలో చేరుతూ ప్రకటన చేశారు.

ఉడత సాయంగా..

అమ్మ మక్కల్ మున్నేట్రకళగం నేత టీ టీవీ దినకరన్ మీడియాతో మాట్లాడుతూ తనతో బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, వీకే సింగ్ మాట్లాడినట్టు పేర్కొన్నారు. తమ డిమాండ్లు, తమకు కావాల్సిన సీట్ల వివరాలను వారి దృష్టికి లిఖిత పూర్వంగా ఇప్పటికే తీసుకెళ్లామన్నారు. అధికార పూర్వకంగా బీజేపీకి తమ మద్దతును తాజాగా ప్రకటిస్తున్నట్టు పేర్కొన్నారు. సీట్ల చర్చ అనంతరం మిగిలిన వివరాలను వెల్లడిస్తామని, ప్రధానిగా మూడో సారి మోదీ బాధ్యతలు చేపట్టడం లక్ష్యంగా తమిళనాడులో కూటమికి ఉడతా సాయంగా తమ పనితీరు ఉంటుందన్నారు.



బీజేపీలో చేరిన రాజలక్ష్మికి సభ్యత్వ కార్డు అందజేస్తున్న కిషన్‌రెడ్డి, వీకే సింగ్, అన్నామలై, నయనార్ నాగేంద్రన్

అన్నామలైతో శరత్ భేటీ..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైతో సోమవారం ఎస్ఎంకే నేత శరత్‌కుమార్ భేటీ అయ్యారు. తమ మద్దతును ఇప్పటికే ప్రకటించిన శరత్ సీట్ల పంపకాలపై చర్చలు జరిపారు. అలాగే తమిళనాడు మక్కల్ మున్నేట్ర కళగం నేత జాన్ పాండియన్ సైతం సీట్ల సర్దుబాటుపై చర్చలు జరిపారు. ఈ రెండు పార్టీలకు తలా ఓ సీటు ఇవ్వడానికి బీజేపీ అధిష్టానం నిర్ణయించినట్టు సమాచారం. అయితే శరత్ కుమార్ తిరునల్వేలి లేదా తెన్‌కాశి సీటును ఆశిస్తుండడం బీజేపీని సందిగ్ధంలో పడేసి ఉంది. ఈ రెండు స్థానాలు బీజేపీ పోటీకి సిద్ధమై ఇప్పటికే కార్యక్రమాలు విస్తృతం చేయడం గమనార్హం.

పది స్థానాలకు అభ్యర్థులు రెడీ

బీజేపీ ప్రధానంగా కన్యాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి, రామనాథపురం, కోయంబత్తూరు, నీలగిరి, తిరుప్పూర్, పొల్లాచ్చి, నామక్కల్, సేలంలో పోటీ చేయడానికి సిద్ధమవుతూ, ఇప్పటికే అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసి ఉంది. త్వరలో సేలం వేదికగా జరగనున్న బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ ద్వారా ఈ అభ్యర్థులను పరిచయం చేయడానికి సిద్ధమైనట్టు సంకేతాలు వెలువడ్డాయి. ఇదిలా ఉండగా బీజేపీ కూటమిలో చేరడానికి మాజీ సీఎం పన్నీరు సెల్వం ఇప్పటికే సిద్ధమైన విషయం తెలిసిందే. ఆయన ఐదు సీట్లు ఆశిస్తుండగా మూడు ఇవ్వడానికి బీజేపీ నిర్ణయించినట్టు సమాచారం. పీఎంకే, డీఎండీకేలు సైతం బీజేపీ కూటమిలోకి వచ్చే అవకాశాలు ఉన్నట్టు చర్చ ఊపందుకున్నాయి. అన్నాడీఎంకేను ఒంటరి చేసే దిశగా ఈ రెండు పార్టీలో బీజేపీ ఢిల్లీ పెద్దలు రంగంలోకి దిగి చర్చలు జరుపుతున్నట్టు సమాచారం వెలువడింది. తమ కూటమికిలోకి ఎన్ని పార్టీలు వచ్చినా, ముందుగా ఎంపిక చేసిన స్థానాల్లో మాత్రం తమ అభ్యర్థులే పోటీలో ఉంటారన్న విషయాన్ని బీజేపీ వర్గాలు స్పష్టం చేస్తుండడం గమనార్హం. ఇదిలాఉండగా చెన్నై మైలాపూర్ అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే రాజలక్ష్మి బీజేపీలో చేరారు. ఆమెను ఆ పార్టీ నేతలు కిషన్‌రెడ్డి, వికే సింగ్, అన్నామలై, నయనార్ నాగేంద్రన్ ఆహ్వానిస్తూ సభ్యత్వ కార్డును అందజేశారు.

క్లుప్తంగా

శ్రీరంగం ఆలయంలో భక్తుల నిరసన

కొరుక్కుపేట: శ్రీరంగం రంగనాథ ఆలయంలో హనుమంతుడి విగ్రహాన్ని తొలగించారంటూ భక్తులు ఆకస్మికంగా నిరసనకు దిగారు. తిరుమల్ అడియార్ బృందం తరఫున శ్రీరంగం ఆలయంలోని ధ్వజవృక్షం ముందు 3 వేల ఏళ్లుగా ఒకే స్థలంలో ఉన్న హనుమంతుని విగ్రహాన్ని తొలగించారు. మూలవర్ రంగనాథర్ విగ్రహాన్ని పాత స్థలంలోనే మార్చాలని డిమాండ్ చేస్తూ రామానుజ తిరుమల్ అడియార్స్ గ్రూప్ తరఫున ఆకస్మిక నిరసన చేపట్టారు. తిరువణ్ణామలై, విల్లుపురం, కళ్లకురిచ్చి, కడలూరు, విరుదునగర్, తిరుచ్చి తదితర ప్రాంతాల నుంచి శ్రీరంగం రంగ రంగ గోపురం ఎదుట 300 మందికి పైగా మహిళలు, పురుషులు గుమిగూడారు. స్వామివారి నామాన్ని జపిస్తూ శ్రీరంగం ఆలయంలోని ధ్వజస్తంభం ముందున్న స్తంభం వద్దకు చేరుకున్నారు. అక్కడ అంజనేయర్ ఎదుట నిరసనకు దిగారు. హిందూ ధార్మిక సంక్షేమ శాఖ జాయింట్ కమిషనర్ దేవాలయంలో నిరసన గురించి తెలుసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కూడా అక్కడికి చేరుకున్నారు. అనంతరం నిరసనలో పాల్గొన్న వారితో చర్చలు జరిపారు. 2 వారాల్లోగా వివరణ ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

బావిలో మునిగి ఇద్దరి మృతి

అన్నానగర్: బావిలో మునిగి కళాశాల విద్యార్థి సహా ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. దిండిగల్ జిల్లా కోడైరోడ్ సమీపంలోని కల్లడిప్పట్టికి చెందిన ప్రవీణ్ (34) ఇటుక బట్టీ కార్మికుడిగా జీవిస్తున్నాడు. అదే పట్టణానికి చెందిన ముత్తుకృష్ణన్ (24) ఆ బట్టీలో ప్రవీణ్ పనిచేసేవాడు. అతని స్నేహితుడు అరవింద్ (20) మధురైలోని ఓ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం ప్రవీణ్, ముత్తుకృష్ణన్, అరవింద్ కోడై రోడ్ సమీపంలోని తోట బావిలో స్నానానికి వెళ్లారు. దాదాపు 80 అడుగుల లోతు ఉన్న బావి పైభాగంలో ప్రవీణ్ నిలబడి ఉన్నాడు. ముత్తుకృష్ణన్, అరవింద్ బావి లోపల మెట్లు దిగారు. ముత్తుకృష్ణన్ స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి బావిలో పడిపోయాడు. ఇది చూసిన ప్రవీణ్ భయాందోళనకు గురై పరిగెత్తుకుంటూ వచ్చి ఇరుగు పొరుగు వారిని రక్షించాల్సిందిగా కోరాడు. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది బావిలోకి దిగి వారి కోసం వెతికారు. సుమారు గంటపాటు శ్రమించిన అనంతరం ముత్తుకృష్ణన్, అరవింద్ ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు.

విద్యార్థి హఠాన్మరణం

తిరువొత్తియూరు: వాటర్ క్యాన్ మోసుకు వెళుతున్న సమయంలో ఓ పాఠశాల విద్యార్థి హఠాన్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. చెన్నై వ్యాసార్పాడి ఏ.కళ్యాణపురం ప్రాంతంలో నివాసం ఉంటున్న కార్తీపన్ (46) ఓ సంస్థ ఐటీ విభాగంలో పనిచేస్తున్నాడు. ఇతనికి కుమార్తె విజయ, కుమారుడు విజయ్ దిలీపన్ (16) ఉన్నారు. కుమారుడు విజయ్ దిలీపన్ అదే ప్రాంతంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం తండ్రీకుమారులు బైక్‌పై రెండు వాటర్ క్యాన్‌లను తీసుకొని ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఒక వాటర్ క్యాన్‌ను తీసుకువస్తున్న విజయ్ దిలీపన్ మొదటి అంతస్తుకు ఎక్కాడు. ఆ తర్వాత బైకును పెట్టి కార్తీపన్ మరో వాటర్ క్యాన్ ఎత్తుకొని పైకి వచ్చాడు. ఆ సమయంలో విజయ్ దిలీపన్ స్పృహ తప్పి పడి ఉన్నాడు. దీంతో దిగ్భ్రాంతి చెందిన కార్తీపన్ వెంటనే కుమారుడిని స్టాండ్లీ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు విజయ దిలీప్ మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడి మృతదేహం చూసి కార్తీపన్ కన్నీరు మున్నీరయ్యారు. శవ పరీక్ష అనంతరం మృతికి కారణం తెలుస్తుందని వైద్యులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

తిరువొత్తియూరు: పూందమల్లి సమీపంలో ప్రభుత్వ బస్సు ఢీకొని 80 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. పూందమల్లి సమీపంలోని శరత్‌పేట ఆరుముగం వీధికి చెందిన చెల్లమ్మ (80) కుమార్తె రేవతితో కలసి నివాసం ఉంటున్నారు. చెల్లమ్మ మరో కుమార్తె పూందమల్లి సమీపంలోని సిద్ధుకాడులో ఉంటున్నారు. ఆమెను చూడడానికి ప్రతి వారం చెల్లమ్మ వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో పూందమల్లి బస్‌స్టేషన్‌కు వచ్చారు. ఆ సమయంలో పూందమల్లి నుంచి బ్రాడ్‌వేకు వెళుతున్న ప్రభుత్వ బస్సు స్టాండ్ నుంచి బయటకు వస్తున్న సమయంలో చెల్లమ్మను ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చెల్లమ్మ సోమవారం ఉదయం మృతి చెందారు. ఈ మేరకు పూందమల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేత్ర వైద్యరంగంలో రాణిస్తాం

సాక్షి, చెన్నై : నేత్ర వైద్య రంగంలోనూ రాణిస్తామని రోచే ఫార్మా ఇండియా ఎండీ వి సిమ్సన్ ఇమ్మాన్యుయేల్ తెలిపారు. కంటి వ్యాధుల బాధితుల కోసం సరికొత్త చికిత్సగా తాము తీసుకొచ్చిన వాబిస్మోను మందు గురించి స్థానికంగా జరిగిన కార్యక్రమంలో వివరించారు. నేత్ర వైద్య రంగంలో తమ ప్రస్థానానికి శ్రీకారం చుడుతూ నియోవాస్కులర్, రెటీనా సమస్యలను పరిష్కరించేందుకు ఈ వాబిస్మో మందు దోహద పడుతుందన్నారు. కంటి సంబంధిత రుగ్మతలకు బలమైన అవగాహన కల్పించడంతో పాటు నేత్ర వైద్య రంగంలో రాణిస్తామన్నారు. అత్యుత్తమ కంటి వైద్య ఆవిష్కరణలను విస్తృతం చేస్తామన్నారు. రోగులకు మెరుగైన దృష్టి ఫలితాలను కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తాము సిద్ధం చేసిన మందు పూర్తిగా భారత్‌లోనే తయారు చేశామన్నారు.

పోలీసుల దాడితోనే డ్రైవర్ మృతి

అన్నానగర్: పోలీసుల దాడి చేయడంతోనే డ్రైవర్ మురుగన్ మృతి చెందాడని ఆరోపిస్తూ అతడి బంధువులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. తెన్‌కాసి జిల్లాలోని శంకరన్ కోవిల్ సమీపంలోని ఉత్తర పుదూర్‌కు చెందిన మహాలింగం కుమారుడు మురుగన్ (37) వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు గత 8వ తేదీ సాయంత్రం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అచ్చంపట్టి నుంచి శంకరన్ కోవిల్‌కి వ్యాన్‌లో భక్తులను తీసుకెళ్లాడు. శంకరన్‌కోవిల్ – రాజపాళయం ప్రధాన రహదారిపై వెళుతుండగా వ్యాను ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో మురుగన్‌కు రెస్క్యూ మిషన్ పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన పోలీసులు మురుగన్‌పై దాడి చేసి, అతడితోపాటు వ్యానును శంకరన్‌కోవిల్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ స్థితిలో ఆదివారం అపస్మారక స్థితికి చేరుకున్న మురుగన్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసుల దాడితోనే మురుగన్ మృతి చెందాడని పేర్కొంటూ.. అతని మృతదేహాన్ని తీసుకెళ్లకుండా బంధువులు రోడ్డుపై బైఠాయించారు. సోమవారం తెల్లవారుజాము వరకు ఆందోళనకారులతో పోలీసు అధికారులు చర్చలు జరిపారు. ఆ తర్వాత బంధువులు ఆందోళన విరమించారు. అనంతరం మురుగన్ మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం నెల్‌లై ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మేజిస్ట్రేట్ సమక్షంలో అతని మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. శంకరన్‌కోయిల్ టౌన్ పోలీసులు గుర్తు తెలియని ముగ్గురు పోలీసులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. తరువాత మృతదేహాన్ని తీసుకోకుండా బంధువులు, ప్రజాప్రతినిధులు నార్త్ పుదూరులోని ఆయన ఇంటి ముందు, అక్కడి ఆలయం ఎదుట నిరాహార దీక్షకు కూర్చున్నారు.

రూ.50 లక్షల గంజాయి స్వాధీనం

అన్నానగర్: థాయ్‌లాండ్ నుంచి చెన్నైకి అక్రమంగా తరలించి విక్రయిస్తున్న రూ.50 లక్షల గంజాయిని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకుని, ఇందుకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చెన్నై శివారు ప్రాంతాల్లో గంజాయి, కొకైన్‌తో కూడిన డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేక బలగాల పోలీసులు ఆదివారం నిఘా పెట్టారు. అప్పుడు ఉన్నతస్థాయి గంజాయి విక్రయిస్తున్న మాంగాడుకు చెందిన షణ్ముగరాజ్ (65)ను ప్రత్యేక పోలీసులు అరెస్టు చేశారు. ఇతడు ఇచ్చిన సమాచారం మేరకు అతడికి సహకరించిన ఇలైయంకుడికి చెందిన యాసర్ అరాఫత్ (30), మహ్మద్ జైనుల్ రియాజ్ (30)ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో షణ్ముగరాజ్ కుమారుడు కార్తీక్, అతని స్నేహితుడు ఇబ్రహీం ఇద్దరూ థాయ్‌లాండ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. వారు థాయ్‌లాండ్‌లో హై గ్రేడ్ గంజాయిని కొనుగోలు చేసి, అక్కడి నుంచి చెన్నైకి విమానంలో పంపుతున్నారు. థాయ్‌లాండ్‌లో రూ.వెయ్యికి లభించే ఈ నాణ్యమైన గంజాయిని చెన్నైలో రూ. 5 వేల నుంచి రూ.7 వేల వరకు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన ముగ్గురు వ్యక్తుల నుంచి 1.51 కిలోల ఓజీ, గంజాయిని ప్రత్యేక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేసిన ముగ్గురిని పోలీసులకు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.


మోటార్ సైకిల్ చోరీ.. 30 నిమిషాల్లో స్వాధీనం

తిరువొత్తియూరు: ఇంటి ముందు ఆపిన మోటార్‌సైకిల్ చోరీకాగా కేవలం 30 నిమిషాల్లో తిరిగి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పూందమల్లికి మేల్ మానగర్ ప్రాంతానికి చెందిన అరుణ్ (25) తన ఖరీదైన మోటార్ సైకిల్‌ను ఇంటి ముందు నిలిపాడు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిల్ చోరీ చేశారు. ఇది చూచిన ఇరుగుపొరుగు వారు శబ్దం చేశారు. ఈలోపు వారు మెరుపు వేగంతో తప్పించుకుని పారిపోయారు. దీంతో అరుణ్ తన మోటార్ సైకిల్‌కు అమర్చిన జీపీఎస్ పరికరాన్ని తన సెల్‌ఫోన్‌లో కనెక్ట్ చేశాడు. దీంతో దుండగులు మోటార్ సైకిల్ తీసుకుని వేలప్పన్ చావడి మార్గంగా వెళుతున్నట్లు తెలిసింది. వెంటనే అరుణ్ స్నేహితులతో వెంబడించి మధురవాయల్ సర్వీస్ రోడ్‌లో నిలిపి ఉంచిన మోటార్ సైకిల్‌ను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో దుండగులను పట్టుకోడానికి ప్రయత్నించగా ఇద్దరు పారిపోయారు. అరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు.

శీతల పానీయాల దుకాణంలో అగ్నిప్రమాదం

అన్నానగర్: శీతల పానీయాల దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కేరళ రాష్ట్రానికి చెందిన ఇస్మాయిల్ (53) కోయంబేడు వంద అడుగుల రోడ్డులో శీతల పానీయం, టీ దుకాణం నడుపుతున్నాడు. ఆదివారం రాత్రి దుకాణం మూసేసి వెళ్లిపోయాడు. ఆయన దుకాణంలో సోమవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. దుకాణంలో నుంచి పొగలు రావడంతో ఇరుగుపొరుగు వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే కోయంబేడు, జేజే నగర్‌లోని అగ్నిమాపక కేంద్రాల నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి కొన్ని గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. షాపులో ఐదుకు పైగా సిలిండర్లు ఉండడంతో అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అయినా షాపులోని రూ.7 లక్షల విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ ఘటన గురించి కోయంబేడు పోలీసులు విచారణ చేపట్టారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



కొరుక్కుపేట: మార్గళి ఉత్సవాలను పురస్కరించుకుని ఆన్‌లైన్ సెల్ఫీ రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతును ప్రదానం చేశారు. శ్రీలెదర్స్ సంస్థ నేతృత్వంలో ఏటా భారతీయ సంస్కృతి సంప్రదాయాలు తెలిపే రీతిలో పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పోటీల్లో 2000 మందికిపైగా పాల్గొని ఆకర్షణీయమైన రంగ వల్లులను వేసి సెల్ఫీ తీసి పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చాటిన 50 మందిని ఎంపిక చేసి వారికి బహుమతులు అందించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజకీయ నాయకులు డాక్టర్ ఎస్ఆర్ శ్యామ్ పాల్, శ్రీలెదర్స్ పార్ట్నర్ సుషాంత్ డేయ్ పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు.

అవార్డుల ప్రదానం



మహిళలు, అణగారిన వర్గాల ప్రజల హక్కుల కోసం, మానవత్వం, పర్యావరణం, జంతు సంరక్షణ తదితర రంగాల్లో సేవలను అందిస్తున్న వారిని గుర్తించి, పాత్ బ్రేకర్ అచీవ్‌మెంట్ అవార్డులతో సోమవారం సేవ్‌శక్తి ఫౌండేషన్ సత్కరించింది. సేవ్ శక్తి నిర్వాహకురాలు ఛాయాదేవి, నటి సుహాసిని మణిరత్నం, సత్యభామ వర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ మరియా జీనా జాన్సన్, సవేరా గ్రూప్ ఎండీ నీనా రెడ్డి ఈ అవార్డులను అందజేశారు. - సాక్షి, చెన్నై

రిమాండ్ ఖైదీ ఆత్మహత్యాయత్నం

కొరుక్కుపేట: రిమాండ్ ఖైదీ ఆత్మాహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పుదుచ్చేరి సెంట్రల్ జైలులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పుదుచ్చేరిలో 9 ఏళ్ల బాలికపై లైంగిక దాడి, హత్య కేసులో అదే ప్రాంతానికి చెందిన కరుణాస్(19), వివేకానందన్ (57)ను పోలీసులు అరెస్టు చేసి, పుదుచ్చేరి సెంట్రల్ జైలులో ఉంచారు. విచారణ ఖైదీలను జైలులో ఒకే సెల్‌లో ఉంచడం సాధారణం. అయితే ఒక్కటిగా ఉంచితే నిందితుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని భావించడంతో వివేకానందన్, కరుణాస్‌ను పుదువై కాలాపట్టు సెంట్రల్ జైలులో వేర్వేరుగా ఉంచారు. ఈ స్థితిలో ఖైదీ వివేకానందన్ చొక్కా తీసి దానితో గొంతు నులుముకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. అదే సెల్‌లో ఖైదీగా ఉన్న కరుణాస్ ఇది చూసి కేకలు వేశాడు. దీంతో జైలు వార్డెన్లు పరుగున వచ్చి అతన్ని అడ్డుకున్నారు. జైలు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. వివేకానందన్ అప్పటికే సబ్బు తిన్నాడు. అనంతరం ఆత్మహత్య చేసుకోవాడానికి ప్రయత్నించాడు. దీంతో వార్డెన్లు అతడిని హెచ్చరించారు. అతన్ని నిర్బంధించిన గదిని జైలు వార్డెన్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

మహిళా సన్యాసినిపై కేసు నమోదు

తిరువొత్తియూరు: ఉత్తరాదికి చెందిన మహిళా సన్యాసినిపై పరమకుడి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యువ మహిళా సన్యాసిని అయోధ్య నుంచి రామేశ్వరం పుణ్యక్షేత్రానికి ఇటీవల కాలంలో పాదయాత్రగా వచ్చారు. ఆ సమయంలో కొందరు ఆమెపై దాడి చేసినట్టుగా పరమకుడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. కానీ అలాంటి సంఘటన జరిగినట్లు విచారణలో తెలియలేదు. దీంతో మహిళా సన్యాసిని ఇచ్చిన ఫిర్యాదు అసత్యమని తేలింది. దీంతో ఆధారాలు లేకుండా ఫిర్యాదు చేసిన మహిళా సన్యాసినిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడు హత్య

అన్నానగర్: కోయంబత్తూరు సమీపంలో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఓ యువకుడిని ఆ మహిళ భర్త హత్య చేశాడు. పోలీసుల కథనం మేరకు.. మధురై జిల్లాకు చెందిన పాండియన్ కుమారుడు జైగణేష్ (35) సుబ్రమణ్యపాళెంలో ఉంటూ కూలీ పనులు చేసుకునేవాడు. కోయంబత్తూరు పన్నిమడైకి చెందిన లారీ డ్రైవర్ సామినాథన్(45) భార్యకు, మృతుడు జైగణేశ్‌కు మధ్య వివాహేతర సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 6 గంటలకు కేపీజీ పుత్తూరు డివిజన్‌లో నడిచి వెళుతుండగా బైకులో వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి అకస్మాత్తుగా కత్తి తీసి, జైగణేష్‌ను పొడిచి పారిపోయాడు. జైగణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరా రికార్డులను పరిశీలించి, దర్యాప్తు చేపట్టారు. కోయంబత్తూరు పన్నిమడైకి చెందిన లారీ డ్రైవర్ సామినాథన్(45) భార్యకు, మృతుడు జైగణేశ్‌కు మధ్య వివాహేతర సంబంధం ఉన్నట్టు తేలింది. సామినాథన్ దీన్ని వదులుకోవాలని జైగణేశ్‌ను చాలాసార్లు ఖండించినట్లు తెలిసింది. అయితే వారు వదులుకోవడానికి నిరాకరించడంతో తీవ్ర ఆవేశానికి గురైన సామినాథన్ ఆదివారం జైగణేష్‌ను కత్తితో పొడిచి చంపాడని తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని సామినాథన్ కోసం గాలిస్తున్నారు.

ఎలక్ట్రానిక్ దుకాణం దగ్ధం

తిరువొత్తియూరు: చెన్నై రామాపురంలో ఎలక్ట్రానిక్ దుకాణానికి మంటలు అంటుకొని దగ్ధమైంది. చెన్నై కార్పొరేషన్ వలసరవాక్కం మండలం 154వ వార్డు రామాపురం పూతపేడు పెరుమాళ్ ఆలయం వీధిలో ఓ ప్రైవేటు ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయ దుకాణం ఉంది. ఇక్కడ భవన నిర్మాణానికి వినియోగించే వస్తువులు కూడా విక్రయిస్తున్నారు. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి ఎప్పటిలానే వ్యాపారం పూర్తి చేసి, దుకాణం మూసి వేసి వెళ్లారు. ఈ స్థితిలో అర్ధరాత్రి ఈ దుకాణం నుంచి దట్టమైన పొగలు వెలువడ్డాయి. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అగ్నిమాపక సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పారు. ఈ లోపు మంటల్లో పూర్తిగా దుకాణం కాలిపోయింది. రాయల్ నగర్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కలెక్టర్‌ను బెదిరించిన నకిలీ న్యాయవాది అరెస్టు

అన్నానగర్: తేని కలెక్టర్‌కు వాట్స్–అప్ ద్వారా మెసేజ్ పంపి, బెదిరించిన నకిలీ ప్రభుత్వ న్యాయవాదిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. తేని జిల్లా కలెక్టర్ ఈమెయిల్ చిరునామాకు జనవరి 30వ తేదీన ఫిర్యాదు అందింది. మదురై సమ్మతిపురం భారతియార్ నగర్‌లో నివాసం ఉంటున్న రామకృష్ణన్ పేరిట ఫిర్యాదు అందింది. అందులో తనను తాను న్యాయవాదిగా గుర్తించాడు. అలాగే తేని జిల్లాలోని ఓ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తనపై, తన బంధువులపై దుష్ప్రచారం చేస్తున్నాడని, పిటిషన్‌లో పేర్కొన్నారు. అనంతరం గత 5వ తేదీ మళ్లీ రామకృష్ణన్ కలెక్టర్‌కు వాట్సప్‌లో తన ఫిర్యాదుపై చర్యలు తీసుకోకపోతే మదురై హైకోర్టులో హాజరు కావల్సి ఉంటుందని బెదిరించాడు. ఈ విషయమై కలెక్టర్ జరిపిన విచారణలో మధురై వద్ద అలాంటి ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎవరూ లేరని తేలింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటర్వ్యూ అసిస్టెంట్ (జనరల్) సింధు శనివారం తేని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ప్రభుత్వ న్యాయవాదిగా నటిస్తూ ప్రభుత్వ పనులను అడ్డుకుని కలెక్టర్‌ను బెదిరించిన రామకృష్ణన్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు అతడిని విచారిస్తున్నారు.

ప్రభుత్వ, పోరంబోకు భూముల డిజిటలైజేషన్

కొరుక్కుపేట: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోరంబోకు, ప్రభుత్వ భూములకు సంబంధించిన పత్రాలను డిజిటలైజేషన్ చేయనున్నట్లు భూసర్వే విభాగం పేర్కొంది. ఈమేరకు భూసర్వే విభాగం డైరెక్టర్ బి.మధుసూదన్‌రెడ్డి కలెక్టర్లందరికీ లేఖ రాశారు. రాష్ట్రంలో 2014 నుంచి భూ రికార్డుల డిజిటలైజేషన్ జరుగుతోంది. ప్రస్తుత భూ పన్ను ప్రకారం భూములకు సంబంధించి 1.42 కోట్ల భూముల నంబర్లు డిజిటలైజ్ చేశారు. ఈ–సేవ వెబ్‌సైట్ ల్యాండ్ డాక్యుమెంట్‌లను పబ్లిక్ వీక్షించవచ్చు. పత్రాలు డిజిటల్ మార్పిడి దరఖాస్తులను ఈ–సేవ కేంద్రాల ద్వారా నమోదు చేసేందుకు తగిన మార్పులు చేశారు. గ్రామ పరిపాలనా అధికారి ముందుగా వివిధ స్థాయిల్లోని అధికారులు ఏం చేయాలన్న విషయంపై మార్గదర్శకాలున్నాయి. అధికారులు ఈ కొత్త మార్గదర్శకాలను పాటించేలా కలెక్టర్లు చూడాలని ఆ లేఖలో పేర్కొన్నారు. పోరంబోకు భూముల పట్టా మార్పు కోసం ప్రజలు ఈ–సేవ కేంద్రాలు, తాలూకా కార్యాలయాలకు వచ్చేందుకు ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్త ప్లాంట్‌లో 130 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

కొరుక్కుపేట: ఉత్తర చెన్నైలో కొత్తగా ప్రారంభించిన 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రస్తుతం 130 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని అధికారులు చెప్పారు. ఉత్తర చెన్నై సమీపంలోని ఎన్నూర్‌లో తమిళనాడు ప్రభుత్వానికి చెందిన థర్మల్ పవర్ స్టేషన్ నడుస్తోంది. ఇక్కడ ఇప్పటికే 2 స్థాయిలున్నాయి. ఈ స్థాయిలో, 3వ అంచె కూడా నిర్మాణంలో ఉంది. 2010లో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి హయాంలో దీని నిర్మాణ పనులు ప్రారంభించారు. 2015 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించారు. 2011లో ప్రభుత్వం మారడంతో జాప్యం జరిగింది. అయితే, 2019లో అప్పటి ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి త్వరగా పూర్తి చేయాలని ప్రణాళికలు రూపొందించారు. మొత్తం పని పూర్తి కాకముందే 2021లో పవర్ ప్లాంట్ ప్రారంభించారు. అయితే, విద్యుత్ ఉత్పత్తి జరగలేదు. ఈ పరిస్థితిలో మళ్లీ పెండింగ్‌లో పడింది. ఇలాంటి పరిస్థితుల్లో గత గురువారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ ప్లాంట్‌ను మళ్లీ ప్రారంభించారు. ఈ పవర్ ప్లాంట్ సామర్థ్యం 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికాగా ప్రస్తుతం 130 మెగావాట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అవుతోందని అధికారులు వెల్లడించారు.

ప్రియురాలి సజీవదహనానికి యత్నం

కొరుక్కుపేట: ప్రియురాలి సజీవదహనానికి ఓ కార్మికుడు యత్నించిన సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. చెంగల్పట్టు జిల్లా వండలూరు అప్పూర్‌నగర్‌కు చెందిన జోసెఫ్ ప్రభాకర్ కుమారుడు సూర్యప్రకాష్ అలియాస్ సూర్య(32) సింగ పెరుమాళ్ ఆలయం సమీపంలోని మఠం ప్రాంతంలో ఉన్న ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఇతడు ఒరగడమ్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. అక్కడే రుక్మిణి అనే వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. ఆమెకు 13 ఏళ్ల కుమార్తె ఉంది. ఈ క్రమంలో సూర్య, రుక్మిణి, ఆమె 13 ఏళ్ల కుమార్తెతో సహా ముగ్గురు ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. సూర్య ప్రియురాలు రుక్మిణి కుమార్తెపై మనసు పడ్డారు. దీంతో సూర్య, రుక్మిణి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సూర్య, రుక్మిణిని, బాలికను కొట్టాడు. కోపోద్రిక్తురాలైన రుక్మిణి తన కూతురి గురించి ఇంకోసారి గొడవ చేస్తే చంపేస్తానని సూర్యను బెదిరించింది. దీంతో అతడు రుక్మిణిపై పెట్రోల్ పోసి, నిప్పంటించాడు. మహిళ శరీరంపై మంటలు వ్యాపించడంగా ఆమె కేకలు పెట్టింది. కేకలు స్థానికులు ఆమెను రక్షించి, చికిత్స నిమిత్తం చెంగల్‌పట్టు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రుక్మణి ప్రస్తుతం 70 శాతం కాలిన గాయాలతో చెంగల్‌పట్టు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ముమ్మరంగా విచారణ జరిపి, పరారీలో ఉన్న సూర్యను అదుపులోకి తీసుకున్నారు.

గ్రీవెన్స్ శిబిరంలో విద్యార్థులకు సహాయకాలు



విద్యార్థులకు ప్రభుత్వ సహాయకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ కలైసెల్వి

కాంచీపురం(పళ్లిపట్టు): గ్రీవెన్స్‌డేలో కలెక్టర్ కలైసెల్వి విద్యార్థులకు ప్రభుత్వ సహాయకాలు పంపిణీ చేశారు. కాంచీపురం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ కలైసెల్వి అధ్యక్షతన గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఇందులో ప్రజలు, దివ్యాంగులు, విద్యార్థులు జిల్లా నలుమూలల నుంచి వచ్చి, అర్జీలు అందజేశారు. అధికారుల బృందం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించింది. శిబిరంలో 540 అర్జీలు స్వీకరించగా అయా శాఖల అధికారులు వాటిపై పరిశీలన చేసి, అర్హులకు వెంటనే న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానంగా పాఠశాల విద్యార్థులు సహా దివ్యాంగులకు రూ.6.56 లక్షల విలువైన ఉపకరణాలను కలెక్టర్ కలైసెల్వి అందజేశారు. అదే సమయంలో ప్రపంచ మహిళా దినోత్సవంలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనభరిచిన మహిళా అధికారులను కలెక్టర్ సత్కరించారు. డీఆర్వో వెంకటేష్, జీసీ సంక్షేమ శాఖ అధికారి కల్యాణి పాల్గొన్నారు.

రూ.30 లక్షల విలువైన ఈ-సిగరెట్లు స్వాధీనం

- ఐదుగురు నిందితుల అరెస్టు

అన్నానగర్: చెన్నై ప్యారిస్ డిప్యూటీ కమిషనర్ శ్రేయా గుప్తా నేతృత్వంలోని ప్రత్యేక పోలీసు బలగాలు బార్మా బజార్‌లోని కొన్ని దుకాణాలపై ఆదివారం రాత్రి దాడులు నిర్వహించాయి. ఆ సమయంలో చెన్నై చేపాక్కంకు చెందిన మహమ్మద్ అజీక్ (31) నిర్వహిస్తున్న దుకాణంలో ఈ–సిగరెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతడిని నార్త్ కోస్ట్ పోలీసులకు అప్పగించారు. మహ్మద్ అజీక్ అరెస్ట్ చేసిన పోలీసులు అతను ఇచ్చిన సమాచారం మేరకు యాసిం రాజా, అబ్దుల్లా, సయ్యద్ అబూ తాహిర్, అబ్దుల్ కరీం, అబ్దుల్ అనే ఐదుగురిని అరెస్ట్ చేశారు. తదుపరి విచారణలో వారు మలేషియా, ఇండోనేషియా, చైనా దేశాల నుంచి ఈ–సిగరెట్లను దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నట్లు తేలింది. వారి నుంచి రూ.30 లక్షల విలువైన 1300 ఈ–సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు.

టీడీపీ, జనసేన ఆన్‌లైన్ మృగాల వికృత క్రీడ..

ఓ చెల్లెమ్మను చంపేశారు!

ఇంటి పట్టాలపై పట్టలేని పగ.. కిరాయి మూక వేధింపులతో తెనాలిలో వివాహిత గీతాంజలి బలవన్మరణం

సాక్షి ప్రతినిధి, గుంటూరు, తెనాలి, అమరావతి

ఆమె చేసిన తప్పల్లా... తన సంతోషాన్ని దాచుకోలేకపోవటమే. జగనన్న తన పేరిటే ఇంటి పట్టా ఇచ్చారని, తన పిల్లల్ని చదివించుకోవటానికి అమ్మ ఒడి కూడా వస్తోందని పట్టలేని సంతోషంతో చెప్పిందామె. కళ్లలో మెరుపులతో, పట్టలేని ఆనందంతో ఆమె చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల సోషల్ మీడియా మూకలు దీన్ని జీర్ణించుకోలేకపోయాయి. వీధికుక్కల్లా వెంటాడాయి. మారుపేర్లతో సంచరించే నీతీజాతీ లేని ఈ ఆన్‌లైన్ మారీచులు.... తాము మనుషులమన్న సంగతే మరిచిపోయి ప్రతి వేదిక మీదా ఆమెను నానా దుర్భాషలాడారు. అక్కచెల్లెళ్లుంటారని, తమ ఇళ్లలోనూ ఆడపిల్లలు ఉంటారని గ్రహింపే లేని రీతిలో ఆ బీసీ మహిళ గీతాంజలిని వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. ఆమె వేషభాషలను ఎగతాళి చేస్తూ, అసభ్యంగా దూషించారు. సమాజం సిగ్గుపడే కామెంట్లతో రంపపు కోత కోశారు. భరించలేని ఆ ఆడబిడ్డ మరణమే శరణ్యమనుకుంది. రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. లోతుగా చూస్తే ఇది ఆత్మహత్య కాదు. టీడీపీ, జనసేన సోషల్ మీడియా మూకలు వెంటాడి వెంటాడి చేసిన దారుణమైన హత్య.

గొల్తి గీతాంజలి (30) భర్త చంద్రశేఖర్ తెనాలిలోని వహాబ్ పార్క్ ప్రాంతంలో బంగారం పని చేస్తుంటారు. వాళ్లకిద్దరు పిల్లలు. గీతాంజలి కొద్దిరోజుల కిందట ఓ యూట్యూబ్ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చింది. తనకు ఇంటి పట్టా ఇచ్చారని, పిల్లలకు అమ్మ ఒడి వస్తోందని, అత్త మామలకు చేయూత, పింఛన్ కానుక అందుతున్నాయని చెబుతూ సీఎం వైఎస్ జగన్‌కు, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు ధన్యవాదాలు తెలియజేసింది. జగనన్నకు తప్ప ఇంకెవరికి ఓటు వేస్తామంటూ.. ఆమె ఎదురు ప్రశ్నించిన తీరు సోషల్ మీడియాలో వైరల్ అయింది. అదే ఆమెకు శాపమైంది. ఐటీడీపీ, జనసేన కిరాయి మూకలు సోషల్ మీడియాలో ఆమెను తీవ్రంగా వేధించాయి. ఆమెను కించపరుస్తూ విపరీతంగా ట్రోల్స్ చేశాయి. వాస్తవానికి గీతాంజలికి గతంలోనే ఇంటి స్థలం మంజూరైంది. ఇటీవల ప్రభుత్వం ఆమెకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందచేసింది. ఈ నెల 4న కొత్తపేటలోని తాలూకా కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరైనప్పుడు ఈ ఇంటర్వ్యూ వ్యవహారం చోటుచేసుకుంది. ఉదయమే సభా ప్రాంగణానికి వచ్చిన గీతాంజలి అందరితోపాటు ఎమ్మెల్యే శివకుమార్‌కు షేక్ హ్యాండ్ ఇచ్చి ఎంతో ఉత్సాహంగా కనిపించింది. ఎమ్మెల్యే చేతుల



గీతాంజలిని సోషల్ మీడియాలో వేధిస్తూ జనసేన, ఐటీడీపీ కార్యకర్తలు పెట్టిన అసభ్యకర పోస్టులు

మీదుగా రిజిస్ట్రేషన్ పట్టాను అందుకున్నాక తన సంతోషాన్ని ఓ యూట్యూబ్ చానల్‌తో పంచుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్న తమకు ఇంటి స్థలం పొందడం ద్వారా కల నెరవేరిందంటూ ఉద్వేగంగా మాట్లాడింది. జగనన్నను గెలిపించుకోవటం తమ బాధ్యతని పేర్కొంది. ఫీజులు కట్టలేని తమకు అమ్మఒడి ఆసరాగా నిలిచిందని, తన పిల్లలిద్దరూ ఈ కార్యక్రమానికి వస్తే జై జగన్.. అని నినదించేవారని ఉత్సాహంగా చెప్పింది. ఈ క్రమంలో కొంత భావోద్వేగానికి గురి కావడం, మీడియా ఎదుట మాట్లాడే అలవాటు లేకపోవడంతో తడబాటుకు గురైంది. దీన్ని అవకాశంగా మలుచుకున్న టీడీపీ, జనసేన 'సోషల్ మాఫియా' బాధితురాలిని దారుణంగా ట్రోల్ చేసింది. ఉచ్చం నీచం లేకుండా అసభ్యంగా దూషిస్తూ, ఆమె వ్యక్తిత్వాన్ని తప్పు పడుతూ, రాయలేని భాషలో దుర్భాషలాడుతూ కొందరు కామెంట్లు పెట్టారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన గీతాంజలి శనివారం తెనాలి రైల్వే ట్రాక్‌పై ఎదురుగా వస్తున్న రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు హుటాహుటిన ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. తెనాలి జీఆర్పీ పోలీసులు గుంటూరు జీజీహెచ్‌కు చేరుకుని కుటుంబ సభ్యులను విచారించగా సోషల్ మీడియాలో అసభ్యకర సందేశాల కారణంగా ఆమె మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల తాను, తన కుటుంబం లబ్ధి పొందినట్లు గతంలో కూడా ఆమె కొన్ని వీడియోల్లో పేర్కొన్నారు. గీతాంజలిని ఆత్మహత్యకు పురిగొల్పేలా దారుణ వ్యాఖ్యలతో వికృతంగా వ్యవహరించిన సోషల్ మీడియా ఖాతాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

పచ్చ మీడియాపై బాధిత కుటుంబం ఆగ్రహం

ఇద్దరు చిన్నారులతో ఎంతో చలాకీగా అందరితో కలిసిమెలసి ఉండే గీతాంజలిని సోషల్ మాఫియా పొట్టన పెట్టుకుందని బాధితురాలి కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్ మార్చురీ వద్ద కన్నీరు మున్నీరయ్యారు. తల్లి మృతి చెందడంతో ఇద్దరు ఆడపిల్లల గతి ఏం కావాలంటూ విలపించారు. సోషల్ మీడియా ఆమెను పొట్టనపెట్టుకుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చ సోషల్ మీడియా కళ్లు ఎప్పుడు పచ్చగానే ఉంటాయని, పేదింటి మహిళకు ఇంత సంతోషం దక్కడం వారికి ఇష్టం లేదంటూ మండిపడ్డారు. గీతాంజలికి తల్లితండ్రి దూరంగా ఉండటంతో అమ్మమ్మ, తాతయ్య, మేనమామ కలిసి వివాహం చేశారని, గీతాంజలి సంతోషం పచ్చ సోషల్ మీడియాకు కంటగింపుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తల్లిని చూసి తల్లడిల్లిన చిన్నారులు

ఐటీడీపీ, జనసేన సోషల్ మీడియా ట్రోలింగ్‌తో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన గీతాంజలి అంతిమ సంస్కారాలు సోమవారం రాత్రి జరిగాయి. గుంటూరు జీజీహెచ్‌లో శవపరీక్ష అనంతరం చినరావూరుతోటలోని



గీతాంజలి భౌతికకాయం వద్ద రోదిస్తున్న ఆమె పిల్లలను ఓదారుస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

హిందూ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలను భర్త బాలచంద్ర నిర్వహించారు. తల్లి భౌతికకాయాన్ని చూసి చిన్నపిల్లలైన కుమార్తెలు రిషిత, రిషిక హృదయ విదారకంగా విలపించడం అందరినీ కలచివేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచన మేరకు స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అక్కడకు చేరుకుని గీతాంజలి భౌతికకాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సీఎం ఆదేశానుసారం మంగళవారం వారి ఇంటికి వచ్చి బిడ్డల భవిష్యత్ కోసం ఏం చేయాలనే అంశంపై మాట్లాడతానని హామీ ఇచ్చారు.

టీడీపీ, జనసేన అరాచకత్వానికి బీసీ మహిళ బలి: పద్మ

సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో లబ్ధి పొందిన బీసీ మహిళ గీతాంజలి సంతోషాన్ని చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన పార్టీలు ఆమె ప్రాణాన్ని బలి తీసుకున్నాయని ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. విచక్షణ మరచిన పచ్చ మూకలు అరాచకంగా ట్రోల్ చేయడంతో తట్టుకోలేక గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు.

ఆప్యాయంగా పలకరించేది..



మా ఇంటికి ఎదురుగా నివసించే గీతాంజలి ఎప్పుడూ సంతోషంగా, చలాకీగా ఉంటుంది. ఎక్కడ కనిపించినా మామ్మగారూ... అంటూ చాలా ఆప్యాయంగా పలకరించేది. రెండు రోజులుగా కనిపించకపోతే శివరాత్రి కావడంతో ఎటైనా వెళ్లిందేమో అనుకున్నా. ఇలా జరుగుతుందని అనుకోలేదు. చాలా బాధనిపిస్తోంది.

– అవ్వారు పద్మావతి, ఇస్లాంపేట, తెనాలి

జీవితంలో మర్చిపోలేనంటూ..



మేం ఇస్లాంపేటలో సోడాలు విక్రయిస్తాం. గీతాంజలితో కొద్ది రోజుల పరిచయమే అయినా చాలా కలివిడిగా మాట్లాడేది. ఇటీవలే చిన్నపిల్లల్లా ఆడుకున్నాం. ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రం తీసుకున్నానని ఎంతో సంతోషంగా చెప్పింది. నా పేరు మీద ఇచ్చారు... జీవితంలో మర్చిపోలేనని చెప్పి మురిసిపోయింది. ఈ ప్రభుత్వం చాలా బాగా చేస్తోందని చెబుతుండేది. ఆమె చనిపోయిందని తెలిసి ఎంతో బాధపడుతున్నా.

– షేక్ రేష్మా, ఇస్లాంపేట, తెనాలి

భయపడొద్దు.. భరతం పడతాం

బాధితులకు పోలీసు శాఖ భరోసా

సైబర్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక వేదికలు



సాక్షి, అమరావతి: పచ్చ మూకల కిరాతకానికి తెనాలి మహిళ గీతాంజలి దారుణంగా బలైపోయిన నేపథ్యంలో 'సోషల్ మాఫియా' దాడులపై బాధితులు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని, ఇందుకు పలు వేదికలను వినియోగించుకునే వీలుందని నిపుణులు సూచిస్తున్నారు. టీడీపీ, జనసేన పార్టీల సోషల్ మీడియా విభాగాల వేధింపులు కొన్నాళ్లుగా వెర్రి తలలు వేస్తున్నాయి. సొంత వ్యక్తిత్వం, తమవైన అభిప్రాయాలు కలిగి ఉండటం మహానేరం అన్నట్లు కిరాయి మూకలు దారుణంగా వ్యవహరిస్తున్నాయి. మహిళలు, చిన్నారులని కూడా చూడకుండా అసభ్యకర పదజాలంతో దూషిస్తూ తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నాయి. అయితే వీటికి జంకితే మరింత దారుణంగా తెగబడటం ఖాయం. బాధితులకు తక్షణమే రక్షణ కల్పించడం, వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసు శాఖ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా చట్టాలు చేశాయి. బాధితులు ఫిర్యాదు చేస్తే చాలు వెంటనే కేసు నమోదు చేసి నిందితులపై చర్యలు తీసుకుంటారు. తమ సన్నిహితులు, స్నేహితుల ద్వారా కూడా బాధితులు ఫిర్యాదు చేసే వీలుంది.

ఫిర్యాదు చేయడం ఇలా...

- ట్రోలింగ్‌కు గురయ్యేవారు, బాధితులు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చు. గ్రామ, వార్డు సచివాలయంలోని మహిళా పోలీసు ద్వారా కూడా పోలీసులను ఆశ్రయించవచ్చు.
- సైబర్ నేరాలు, సోషల్ మీడియా వేధింపులపై ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు సంప్రదించాల్సిన వేదికలు..

సైబర్ క్రైమ్ పోర్టల్: https://cybercrime.gov.in/
సైబర్ మిత్ర వాట్సాప్ నంబర్: 9121211100
సైబర్ బుల్లీయింగ్ 4ఎస్4యు: 9071666667

రాజకీయంగా వైరిపక్షాలైన కాంగ్రెస్, టీడీపీలు కుమ్మక్కై ఒక మనిషిని, ఒక పార్టీని అణగదొక్కడానికి చేయని కుట్ర లేదు.. పన్నని కుతంత్రం లేదు. నలువైపుల నుంచి ఊపిరి సలపనివ్వని రీతిలో దాడులు చేశాయి. అయినా సరే ఆ మనిషి.. ఆ పార్టీ వెనక్కు తగ్గలేదు. ఇచ్చిన మాటను వీడలేదు. ప్రజల పక్షాన పోరాటాన్ని ఆపలేదు. విలువలకు ప్రాధాన్యం ఇచ్చే, విశ్వసనీయతకు ప్రాణం ఇచ్చే ఆ మనిషి.. ఆ పార్టీ వెంట జనం నడిచారు. ప్రభంజనం సృష్టించారు. ప్రజల హృదయాలు గెలుచుకున్న ఆ మనిషి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. జనం గుండెల్లో నాటుకుపోయిన ఆపార్టీ వైఎస్సార్‌సీపీ. సవాళ్లే సోపానాలుగా మలుచుకుని.. ఇద్దరితో మొదలై తిరుగులేని శక్తిగా ఆవిర్భవించిన వైఎస్సార్‌సీపీ 13 ఏళ్లు పూర్తి చేసుకుని మంగళవారం 14వ వసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో ఆపార్టీ ప్రస్థానాన్ని ఓ సారి తరచి చూద్దాం.

విశ్వసనీయతకు ప్రతీక

సవాళ్లనే సోపానాలుగా మలుచుకుని తిరుగులేని శక్తిగా వైఎస్సార్‌సీపీ..

నేడు 13 సంవత్సరాలు పూర్తి చేసుకుని.. 14వ వసంతంలోకి అడుగులు

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్ జగన్ పోరాటం
- 2019 ఎన్నికల్లో 50 శాతం ఓట్లు, 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించి చరిత్ర సృష్టించిన వైఎస్సార్‌సీపీ
- ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి విశ్వసనీయతను చాటుకున్న సీఎం వైఎస్ జగన్
- వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడం ఖాయమంటోన్న డజనుకుపైగా సర్వేలు



సాక్షి, అమరావతి

వరుస ఓటములతో జీవచ్ఛవంలా మారిన కాంగ్రెస్‌కు 'ప్రజాప్రస్థానం' పాదయాత్రతో జీవం పోసి.. టీడీపీ దుర్మార్గపు పాలనకు తెరదించుతూ 2004 ఎన్నికల్లో ఇటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికీ, అటు కేంద్రానికీ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఒంటిచేత్తో అధికారాన్ని అందించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రజల మనసు దోచుకున్న ఆయనకు దన్నుగా నిలుస్తూ 2009 లోనూ తిరిగి అధికారాన్ని కట్టబెట్టారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్న క్రమంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2009, సెప్టెంబరు 2న హెలీకాప్టర్ ప్రమాదంలో హఠాన్మరణం చెందారు. ఈ విషాదాన్ని తట్టుకోలేక వందలాది మంది అభిమానులు మరణించడం వైఎస్ జగన్‌ను, ఆయన కుటుంబీకులను కలచివేసింది. వారిని పరామర్శించేందుకు ఓదార్పు యాత్ర చేపడతానని కర్నూలు జిల్లా నల్లకాలువ వద్ద 2009, సెప్టెంబరు 25న నిర్వహించిన వైఎస్ రాజశేఖరరెడ్డి సంస్మరణ సభలో వైఎస్ జగన్ ప్రకటించారు.

ప్రజలకు ఇచ్చిన మాట కోసం

నల్లకాలువ సభలో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడిన వైఎస్ జగన్ 2010, ఏప్రిల్ 9న ఓదార్పు యాత్రను పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ప్రారంభించారు. యాత్రను ఆపేయాలని కాంగ్రెస్ అధిష్టానం ఆదేశించింది. ఓదార్పు యాత్ర ఉద్దేశాన్ని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకి వైఎస్ జగన్ వివరించినా లాభం లేకపోయింది. ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్ జగన్ ఓదార్పు యాత్ర కొనసాగించారు. ఓదార్పు యాత్రకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. ఓర్వలేకపోయిన కాంగ్రెస్‌లోని కొన్ని శక్తులు, టీడీపీతో కుమ్మక్కై కుట్రలకు తెరతీశాయి. వైఎస్ జగన్ ఆస్తులపై విచారణ జరిపించాలని నాటి కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్‌రావుతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కాంగ్రెస్ అధిష్టానం లేఖ రాయిస్తే.. కాంగ్రెస్ కనుసైగల మేరకు నాటి ఎంపీ కె.ఎర్రన్నాయుడితో టీడీపీ లేఖ రాయించింది. కాంగ్రెస్, టీడీపీ కుమ్మక్కై కుట్రలు చేస్తుండటంతో తన తల్లి విజయమ్మతో కలిసి వైఎస్ జగన్ కాంగ్రెస్‌కు, పులివెందుల ఎమ్మెల్యే, కడప ఎంపీ స్థానాలకు రాజీనామాలు చేశారు. ఆ తర్వాత ఓ వైపు ఓదార్పు యాత్రను కొనసాగిస్తూనే.. మరో వైపున ప్రజా సమస్యల పరిష్కారం కోసం జగన్ ఉద్యమబాట పట్టారు. ఈ క్రమంలోనే రైతులు, చేనేత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ 2010, డిసెంబర్ 21న విజయవాడలో కృష్ణా నదీ తీరాన 'లక్ష్యదీక్ష' చేపట్టారు.

మహానేత ఆశయ సాధనే లక్ష్యంగా

కాంగ్రెస్‌ను వైఎస్ జగన్ వీడిన తర్వాత జగతి పబ్లికేషన్స్‌కు ఆదాయపు పన్ను శాఖతో నోటీసులు జారీ చేయించడం ద్వారా సోనియాగాంధీ వేధింపుల పర్వాన్ని ప్రారంభించింది. అయినా వాటిని లెక్క చేయని వైఎస్ జగన్.. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనే లక్ష్యంగా.. రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా 2011, మార్చి 11న వైఎస్సార్‌సీపీ పేరును ప్రకటించారు. ఆ మరుసటి రోజే వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో మహానేత వైఎస్ సమాధి వద్ద వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరించి.. పార్టీని స్థాపిస్తున్నట్లు ప్రకటించారు.

మొగ్గలోనే తుంచేందుకు కుట్రలు

వైఎస్ జగన్, విజయమ్మల రాజీనామాతో ఖాళీ అయిన కడప లోక్‌సభ, పులివెందుల శాసనసభ స్థానానికి ఎన్నికలు నిర్వహించడానికి 2011, ఏప్రిల్ 12న కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. కడప లోక్‌సభ స్థానం నుంచి వైఎస్ జగన్, పులివెందుల శాసనసభ స్థానం నుంచి వైఎస్ విజయమ్మ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పోటీ చేశారు. రెండు చోట్లా రికార్డు మెజార్టీతో గెలిచారు. ఈ రికార్డు విజయాలతో వైఎస్సార్‌సీపీ బలీయమైన శక్తిగా ఎదుగుతుందని గ్రహించిన కాంగ్రెస్ అధిష్టానం, టీడీపీ అధినేత చంద్రబాబుతో కుమ్మక్కై... మొగ్గలోనే తుంచేందుకు కుట్రలు చేసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్‌రావుతో వైఎస్ జగన్‌పై హైకోర్టులో కేసు వేయించారు. ఈ కేసులో టీడీపీ నేతలు ప్రతివాదులుగా చేరడంతో.. దానిపై హైకోర్టు విచారణ చేపట్టింది. 2011, ఆగస్టు 10న జగన్ ఆస్తులపై సీబీఐ విచారణకు హైకోర్టు ఆదేశించింది.

నైతిక విలువలే పునాదిగా

నైతిక విలువలతో రాజకీయాలు చేయాలన్నది వైఎస్ జగన్ సిద్ధాంతం. వైఎస్సార్‌సీపీలో ఎవరైనా చేరాలంటే.. వారు తామున్న పార్టీకి, ఆ పార్టీ ద్వారా సంక్రమించిన పదవులకు రాజీనామా చేసి రావాలని షరతు విధించారు. దానికి కట్టుబడిన 19 మంది ఎమ్మెల్యేలు, ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ ద్వారా సంక్రమించిన పదవులకు రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఖాళీ అయిన 19 శాసనసభ, నెల్లూరు లోక్‌సభ స్థానాలకు ఎన్నికలను నిర్వహించడానికి 2012, ఏప్రిల్ 24న కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలో 19 శాసనసభ, నెల్లూరు లోక్‌సభ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో, ఉప ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదని గ్రహించిన కాంగ్రెస్–టీడీపీ అధిష్టానవర్గాలు కుమ్మక్కై కుట్రకు తెరతీశాయి. ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్న వైఎస్ జగన్‌ను విచారణ పేరుతో పిలిపించిన సీబీఐ 2012, మే 27న అరెస్టు చేసింది. అయినా ఉప ఎన్నికల్లో 17 శాసనసభ, నెల్లూరు లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించింది.

ప్రజలపక్షాన ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్

రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014లో ఎన్నికల్లో ఒంటరిగా వైఎస్సార్‌సీపీని వైఎస్ జగన్ బరిలోకి దించారు. టీడీపీ–బీజేపీ–జనసేన జట్టుకట్టి బరిలోకి దిగాయి. నరేంద్ర మోదీ ప్రభంజనంలో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారానికి దూరమైంది. 67 శాసనసభ స్థానాలు, ఏడు లోక్‌సభ స్థానాలు గెలుచుకున్న వైఎస్సార్‌సీపీ బలమైన ప్రతిపక్షంగా అవతరించింది. టీడీపీ అరాచకాలను నిలదీస్తూ ప్రజల పక్షాన ప్రతిపక్ష నేతగా ఇటు శాసనసభలోనూ అటు బయటా రాజీలేని పోరాటాలు చేశారు.

చరిత్రాత్మకం.. ప్రజాసంకల్పం

తన తండ్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నుంచి 2017, నవంబర్ 6న ప్రజా సంకల్ప పాదయాత్రను వైఎస్ జగన్ ప్రారంభించారు. ఎముకలు కొరికే చలిలో.. మండుటెండలో.. కుంభవృష్టిలో 14 నెలలపాటు 3,648 కి.మీ.ల దూరం సాగిన పాదయాత్రను 2019, జనవరి 9న శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం వద్ద ముగించారు. రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్రల్లో పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. టీడీపీ దుర్మార్గపు పరిపాలనను కూకటివేళ్లతో పెకలిస్తూ.. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అఖండ విజయాన్ని ప్రజలు అందించారు. 50 శాతానికిపైగా ఓట్లతో 151 శాసనసభ(87 శాతం), 22 లోక్‌సభ(88 శాతం) స్థానాలను గెలుచుకుంది.

సామాజిక న్యాయమంటే ఇదీ

వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించడంతో 2019, మే 30న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. తొలి మంత్రివర్గంలో 56 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చి 2022, ఏప్రిల్ 11న పునర్వ్యవస్థీకరణ ద్వారా ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో ఏకంగా 70 శాతం పదవులు ఆ వర్గాలకు సామాజిక మహా విప్లవాన్ని సీఎం వైఎస్ జగన్ ఆవిష్కరించారు. ఐదు డిప్యూటీ సీఎం పదవుల్లో నాలుగు ఆ వర్గాలకే ఇచ్చి.. హోంశాఖ మంత్రిగా తొలి సారిగా ఎస్సీ మహిళను నియమించారు. నామినేటెడ్ పదవుల్లో, పనుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు.. మహిళలకు రిజర్వు చేసేలా చట్టం తెచ్చి మరీ ఆయా వర్గాలకు పదవులు ఇచ్చారు. ఎమ్మెల్సీ, రాజ్యసభ, స్థానిక సంస్థల పదవుల్లోనూ ఆ వర్గాలకే పెద్దపీట వేశారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశారు. ఈ అయిదేళ్లలో అది 99 శాతానికి చేరింది. దీంతో వైఎస్ జగన్‌కు జనం జేజేలు పలుకుతున్నారు. స్థానిక సంస్థల అన్ని ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీకి భారీ విజయాలను అందించారు.

16 నెలల అక్రమ నిర్బంధం

ఏ కేసులోనైనా అరెస్టయిన వారికి 90 రోజుల్లో బెయిల్ ఇవ్వాలన్నది నిబంధన. కానీ.. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ జగన్‌కు బెయిల్ ఇవ్వకుండా కాంగ్రెస్–టీడీపీలు కుట్రలు చేశాయి. చివరకు 2013, సెప్టెంబరు 24న వైఎస్ జగన్‌కు కోర్టు బెయిల్ ఇచ్చింది. 16 నెలలపాటు వైఎస్ జగన్‌ను జైలులో అక్రమంగా నిర్బంధించడం వల్ల ప్రజల్లో ఆయనకు ఉన్న ఆదరణ మరింత పెరిగిందేగానీ మసకబారలేదు. జైలు నుంచి విడుదలయ్యాక రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ 2013, అక్టోబర్ 5న వైఎస్ జగన్ హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో ఆమరణ దీక్ష చేపట్టారు. విభజనకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ ఉద్యమాలు చేపట్టారు.

ఎన్నికలకు ముందే కన్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభంజనం

ఇచ్చిన మాటను నిలబెట్టుకుని.. సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ అంటే ప్రజలకు ఆకాశమంత నమ్మకం. వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలకు పోటెత్తిన ప్రజాసముద్రమే అందుకు నిదర్శనం. వచ్చే ఎన్నికల్లో 21 నుంచి 22 లోక్‌సభ స్థానాలను చేజిక్కించుకుని వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధిస్తుందని టైమ్స్ నౌ–ఈటీజీ సర్వే వెల్లడించింది. డజనుకుపైగా ప్రముఖ జాతీయ మీడియా సంస్థల సర్వేల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయమని స్పష్టమైంది. ఇద్దరితో మొదలైన రాజకీయ పార్టీ చరిత్రలో ఏపార్టీ ఎదుర్కోనన్ని సవాళ్లు, ఆటుపోట్లు, దాడులకు ఎదుర్కొని నిలబడి.. తిరుగులేని రాజకీయ శక్తిగా ఆవిర్భవించిన దాఖలాలు ప్రపంచ చరిత్రలో ఎక్కడా లేవని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కేంద్ర కార్యాలయం పిలుపు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు పలు సేవా కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. పార్టీ ముఖ్య నేతలు పాల్గొనే ఈ కార్యక్రమాలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. పార్టీ మంగళవారం 14వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో సూచించింది. నియోజకవర్గాల్లో పార్టీ జెండాలు ఎగురవేయడంతో పాటు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను పూలతో అలంకరించి, సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చింది. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, జేసీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్లు, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు, సమన్వయకర్తలు పార్టీ ఆవిర్భావ గొప్పతనాన్ని చాటిచెప్పాలని సూచించింది.

జతకట్టిన జెండాలన్నీ కనుమరుగు: అప్పిరెడ్డి

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ రాజ్యాన్ని నడిపిస్తోందని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం పర్యవేక్షకుడు, శాసనమండలిలో విప్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ఆయన పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రపంచ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ ఎదుర్కోనన్ని సవాళ్లు, దాడులను వైఎస్సార్‌సీపీ ఎదుర్కొందని తెలిపారు. వాటన్నింటినీ ఎదుర్కొంటూ వైఎస్ జగన్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక సంక్షేమాభివృద్ధి పథకాలు, విప్లవాత్మక సంస్కరణలతో సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో జతకట్టిన జెండాలన్నీ కనుమరుగవుతాయని అప్పిరెడ్డి జోస్యం చెప్పారు. 2019కి మించిన మెజారిటీతో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందన్నారు.



విద్యుత్ దీపాల వెలుగులో తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం



● మైత్రి రావు

తెలుగు నేల మీద తుళు అడుగులు

మహిళలు చదువుకుంటున్నారు.
మహిళలు ఉద్యోగాలు చేస్తున్నారు.
మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు.
మహిళలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారు.
మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు.
మహిళలు అభిరుచిని కెరీర్‌గా మలుచుకోగలుగుతున్నారు.
మహిళలు సాధికారత లక్ష్యంలో విజేతలవుతున్నారు.

‘సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి నాట్యమే నా మాధ్యమం’ అంటున్నారు మైత్రి రావు. భరతనాట్యం ద్వారా ప్రదర్శించగలిగేది పౌరాణిక ఐతిహాసిక కథనాలనే కాదు, సామాజిక అంశాల్లో సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి కూడా ఇది దీటైన మాధ్యమం అన్నారామె. సమాజం పెట్టే పరీక్షలను ఎదుర్కొంటూ విజేతగా నిలిచే ప్రతి మహిళా ఒక శక్తిస్వరూపిణే అన్నారామె. అందుకే ప్రతి భావాన్నీ లోతుగా వ్యక్తీకరించే ఈ మాధ్యమం ద్వారా తన వంతు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నట్లు చెబుతూ, నాట్యాన్నే కెరీర్‌గా మలుచుకున్న వైనాన్ని సాక్షితో పంచుకున్నారు స్త్రీ శక్తి పురస్కార గ్రహీత మైత్రి రావు.

‘‘మహారాష్ట్రలోని మాలేగావ్‌లో పుట్టాను. మా మూలం దక్షిణ కర్ణాటకలోని ధర్మస్థల. నేను పెరిగింది, చదువుకున్నది మైసూర్‌లో. ఇప్పటికీ ఇంట్లో తుళు భాష మాట్లాడతాం. మైసూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ నుంచి ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ చేశాను. డాన్స్, యోగాలను పూర్తి స్థాయి కెరీర్‌గా మార్చుకోవడానికి ముందు నోకియా కంపెనీలో రెండేళ్లపాటు డెవలపర్‌గా బెంగళూరులో ఉద్యోగం చేశాను.

డాన్స్ మీద ఆసక్తి నాలుగేళ్ల వయసులోనే బయటపడింది. నా ఆసక్తిని గమనించి మా అమ్మానాన్న నాకు ఎనిమిదవ ఏట నుంచి భరతనాట్యంలో శిక్షణ ఇప్పించారు. 2010లో అరంగేట్రం జరిగింది. నాట్యంలో ఉన్న గొప్పదనం ఏమిటంటే... ప్రతి చిన్న పెద్ద క్లిష్టమైన కీలకమైన సున్నితమైన లోతైన భావాలన్నింటినీ చాలా స్పష్టంగా, సునిశితంగా వ్యక్తీకరించగలిగిన మాధ్యమం ఇది. సాధన ద్వారా సాధించిన ఈ నైపుణ్యాన్ని దూరం చేసుకోవడానికి కళాకారులెవ్వరూ ఇష్టపడరు. అందుకే ఎంత పెద్ద ఉద్యోగమైనా సరే కళాసాధన ద్వారా వచ్చే సంతృప్తికి సమానం కాదు, కాలేదు.

మయూరి, మాధురి ఉపాధ్యాయ ఇద్దరూ నాకు ఇష్టమైన నాట్యకారిణులు, స్ఫూర్తిప్రదాతలు కూడా. మా డాన్స్ టీచర్‌లు, సీనియర్ స్టూడెంట్స్ నుంచి కూడా స్ఫూర్తి పొందాను. ఒక్కొక్కరిలో ఒక్కో అంశం మనల్ని ప్రభావితం చేస్తుంది. నేర్చుకోవాలన్నంత ఆసక్తిగా గమనిస్తే ప్రతి వ్యక్తిలోనూ గురువు కనిపిస్తారు. భరతనాట్యంతోపాటు కలరియపట్టు, అట్టక్కలరి, వ్యాలికవల్ రీతులను కూడా సాధన చేశాను. నాట్యాన్ని విస్తరింపచేయడమే నా బాధ్యత అనుకున్నాను. బెంగళూరులో శివాన్ష్ స్కూల్ ఆఫ్ డాన్స్ 2017లో స్థాపించాను. ఆ తర్వాత శివాన్ష్ శాఖలను హైదరాబాద్‌లోని సన్‌సిటీ, కిస్మత్‌పూర్, కొండాపూర్, బంజారా హిల్స్‌లకు విస్తరించాను. శాస్త్రీయ నాట్యాన్ని మాధ్యమంగా చేసుకుని సమాజంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలతోపాటు అరుదైన ఇతివృత్తాలతో రూపకల్పన చేశాను. కళలనే కెరీర్‌గా తీసుకున్న మహిళలే నాతోపాటు మా ‘టీమ్ శివాన్ష్’లో ఉన్నారు.

సాధించాం... ఇంకా ఉంది

నాట్యం నాకు చాలా ఇచ్చింది. టీవీ రియాలిటీ షోలలో విజేత కావడం ఒక సరదా. అయితే మైసూర్ లిటరరీ అండ్ కల్చర్ ఫౌండేషన్ నుంచి యువశ్రీ పురస్కారం, ఉత్కళ యువ సాంస్కృతిక సంఘ్ నుంచి నృత్యమణి, హైదరాబాద్ డాన్స్ ఫెస్టివల్ నుంచి ప్రైడ్ ఆఫ్ తెలంగాణతోపాటు జాతీయ స్థాయిలో స్త్రీ శక్తి పురస్కారాలందుకోవడం గర్వకారణం. నాట్యం ఇతివృత్తంగా రెండు సినిమాలు చిత్రీకరించారు. వాటికి అంతర్జాతీయ పురస్కారం లభించింది. ఇక నా వంతుగా నాట్యం మాధ్యమంగా సమాజానికి తిరిగి ఇవ్వాలనుకున్నాను. సమాజంలో మహిళలు తమకెదురైన సమస్యలను ఎదుర్కొంటూ శక్తిమంతులుగా మారుతున్నారు. మహిళ సాధికారత కోసం ఎన్‌జీవోలు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఒక తరానికి మరో తరానికి ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు సమాజంలో మహిళల స్థితి చాలా మెరుగైంది. మహిళల్లో అక్షరాస్యత పెరగడం తొలి విజయం. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వాలు కచ్చితంగా ఉంటున్నాయి, అలాగే శిక్షల విషయంలోనూ కఠినంగా వ్యవహరిస్తున్నాయి. వీటన్నింటి దృష్ట్యా మహిళాభివృద్ధి పురోగమనంలో సాగుతోందనే నాకనిపిస్తోంది. అయితే ‘మనం సాధించేశాం’ అని సంతృప్తి చెందగలిగిన స్థితికి మాత్రం చేరలేదు. కానీ... సమానత్వ స్థాయిని మా తరంలోనే చూడగలమనే భరోసా కలుగుతోంది’’ అని మహిళాభివృద్ధి పట్ల తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు మైత్రి రావు.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సంరక్షణ

తాబేలు గెలవాలి

కుందేలు, తాబేలు కథలో
తాబేలు మెల్లగా అయినా సరే
రేస్ పూర్తి చేసి గెలుస్తుంది.
కాని గెలవాలంటే తాబేళ్లు ఉండాలి కదా.
కాలుష్యం వల్ల, వలలకు చిక్కుకుని,
గుడ్లు పెట్టే ఏకాంతం కోల్పోయి..
సముద్ర తాబేళ్లు ప్రమాదంలో పడ్డాయి.
ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒరిస్సా
రాష్ట్రాల్లో తాబేళ్ల సంరక్షణ కోసం
పని చేస్తున్న డాక్టర్ సుప్రజ ధారిణి కృషి.



● తాబేళ్లను సంరక్షిస్తున్న డాక్టర్ సుప్రజ ధారిణి

‘సముద్ర తీరానికి వెళ్లి చూస్తే అంతా ప్రశాంతంగా అనిపిస్తుంది. నీలి ఉపరితలం, ఒడ్డుకు వచ్చి వెళ్లే కెరటాలు... ఎంత బాగుందో కదా అని మనసు ఆహ్లాదపడుతుంది. కాని సముద్ర గర్భంలో ఏం జరుగుతున్నదో మనకు తెలియదు. మనిషి చర్యల వల్ల సముద్రం లోపల ఎంత ధ్వంసమవుతోందో తెలుసుకోవాలి. జలధి పర్యావరణాన్ని కాపాడుకోవాలి’ అంటుంది డాక్టర్ సుప్రజ ధారిణి.

చెన్నైలో స్థిరపడ్డ ఈ తెలుగు పర్యావరణ కార్యకర్త ఇప్పుడు సముద్ర తాబేళ్లకి రక్షకురాలిగా మారింది. లక్షలాది తాబేళ్ల మృత్యువాత పడకుండా తిరిగి సముద్రానికి చేరేలా చూడగలిగింది. చెన్నై తీరం, ఆంధ్రా తీరం, ఒడిశా తీరంలో ఆమె తయారు చేసిన దళాలు గస్తీ తిరుగుతూ తాబేళ్లను కాపాడుతున్నాయి.

అంతులేని విధ్వంసం

‘సముద్ర ఆరోగ్యం బాగుంటే మత్స్యకారుల జీవితాలు బాగుంటాయి. ఎందుకంటే సముద్రమే వారి జీవనాధారం కాబట్టి. సముద్ర ఆరోగ్యం, అందులోని పర్యావరణం ఎలా ఉందో తెలియాలంటే తాబేళ్ల ఉనికి, వాటి జనాభా ఒక కొండ గుర్తు. ఎందుకంటే సముద్రగర్భంలో ఉండి నేల మీదకు వచ్చే ఏకైక జలచరం అదే. తాబేళ్లలో ఒక ముఖ్యలక్షణం ఏమిటంటే అవి గుడ్డు పగిలి ఏ నేల మీద ప్రాణం పోసుకున్నాయో ఆ నేలను గుర్తు పెట్టుకుని పెరిగి పెద్దవై గుడ్లు పెట్టడానికి అదే నేలకు వస్తాయి. అంటే పుట్టింటికి వచ్చినట్టే. కాని అవి మనుషుల మీద నమ్మకంతో పెట్టిన గుడ్లను మత్స్యకారులు నిర్లక్ష్యం చేయడం నేను చూశాను. ఇక కుక్కలు దాడి చేసి గుడ్లు తవ్వుకుని తినేస్తాయి. కొన్ని పిల్లలు బయటకు తీసి ఆడుకుంటారు. వాటి వల్ల తాబేళ్ల సంఖ్య తగ్గి సముద్ర జీవ సమతుల్యత దెబ్బ తింటుంది. అందుకని మొదట మేము మత్స్యకారులను చైతన్యవంతం చేశాం. తాబేళ్లను కాపాడితే సముద్రం బాగుంటుంది.... సముద్రం బాగుంటే మీ జీవితాలు బాగుంటాయి అని చెప్పాం. వారిప్పుడు కార్యకర్తలుగా మారి తాబేళ్లను కాపాడుతున్నారు’ అని తెలిపింది సుప్రజ ధారిణి.



మచిలీపట్నం సొంతూరు

సుప్రజది మచిలీపట్నం. ముప్పై ఏళ్ల క్రితం వాళ్ల కుటుంబం చెన్నై తరలి వెళ్లింది. ఫిలాసఫీలో పిహెచ్‌డి చేసిన సుప్రజ చెన్నైలోనే ఒక ఆర్ట్ స్టుడియో స్థాపించుకుంది. అయితే 25 ఏళ్ల క్రితం ఆమె చెన్నైలోని నీలాంకరై బీచ్‌కు మార్నింగ్ వాక్‌కు వెళ్లినప్పుడు అక్కడ తాబేలు చచ్చిపడి ఉంది. దాపునే పిల్లలు తాబేలు గుడ్లు ఇసుక నుంచి బయటకు లాగి ఆడుకుంటూ ఉన్నారు. మత్స్యకారులు చూసినా వారించడం లేదు. ఇదంతా చూసి బాధపడింది సుప్రజ. తాబేళ్లు ఒడ్డుకొచ్చి పడి చనిపోవడానికి కారణాలు తెలుసుకోవడానికి నిపుణులను సంప్రదించింది. ఆలివ్ రిడ్లే జాతి తాబేళ్లు చేపల వలల వల్ల గాయపడి చనిపోతున్నాయని, వాటి గుడ్ల సంరక్షణ సరిగ్గా జరగక సంతతి తరిగిపోతున్నదని తెలుసుకుంది. మొదట మత్స్యకారుల్లో చైతన్యం తెచ్చి తర్వాత సమాజంలో మార్పు తేవాలని నిశ్చయించుకుంది. అలా 2002లో ఆమె తాబేళ్ల సంరక్షణ, సముద్ర పర్యావరణ సంరక్షణ లక్ష్యంగా ‘ట్రీ ఫౌండేషన్’ అనే సంస్థను ప్రారంభించింది.

33 లక్షల తాబేలు పిల్లల రక్షణ

తమిళనాడులోని కంచి నుంచి ఒరిస్సాలోని గంజాం వరకు తీర ప్రాంతంలో దాదాపు 700 కిలోమీటర్ల మేర తీర ప్రాంత సంరక్షణ, తాబేళ్ల గుడ్ల పరిరక్షణ, గాయపడిన తాబేళ్లకు చికిత్స చేసి మళ్లీ సముద్రంలో ఒదిలిపెట్టడం, గుడ్లకు గస్తీ కాయడం వంటి చర్యల కోసం గార్డ్‌లను ఏర్పాటు చేసింది సుప్రజ. ఇందుకు అవసరమైన గుర్తింపు కార్డులను తమిళనాడు ప్రభుత్వం నుంచి ఇప్పించగలిగింది. కొందరికి గౌరవ భత్యాలు కూడా అందుతున్నాయి. తాబేళ్లు గుడ్లు పెట్టే సీజన్‌లో వాటిని ఒకచోట చేర్చి వెదురు దడి కట్టి కాపాడటం వల్ల ఈ ఇరవై ఏళ్లలో దాదాపు 33 లక్షల గుడ్లు పొదగబడి తాబేళ్ల పిల్లలుగా సముద్రంలో చేరాయంటే అది సుప్రజ, ఆమె సేన ప్రయత్నం వల్లే. ‘సముద్రానికి నేలకూ ఉన్న అనుబంధం విడదీయరానిది. నేల మీద నివసించేవాళ్లమే సముద్రాన్ని కాపాడుకోవాలి’ అంటోంది సుప్రజ.

బ్యూటిప్స్

వేసవి ప్యాక్స్

వేసవి వేడికి ముఖ చర్మం తాజాదనం కోల్పోయినట్టుగా కనిపిస్తుంటుంది. వడలిపోయినట్టుగా ఉండే ముఖం తిరిగి కాంతిని పొందాలంటే ...

● పుచ్చకాయ గుజ్జు రసాన్ని ఫ్రీజర్ బాక్స్‌లో ఉంచి, ఐస్ అయ్యాక తీసి ముఖానికి, చేతులకు, మెడకు రాసుకోవాలి. ఆ తర్వాత చల్లని నీళ్లతో ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి.



● బంగాళదుంప, క్యారెట్‌ను ఉడికించి గుజ్జు చేయాలి. ఈ మిశ్రమంలో చిటికెడు బేకింగ్ సోడా, చిటికెడు పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు ప్యాక్‌లా వేసుకోవాలి. పది నిమిషాల తర్వాత, గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఈ ప్యాక్ ముడతలను నివారించడంతో పాటు చర్మాన్ని మృదువుగా, కాంతిమంతంగా మార్చుతుంది.

● రెండు టీ స్పూన్ల రోజ్ వాటర్‌లో ఒక చుక్క గ్లిజరిన్, రెండు చుక్కల నిమ్మరసం వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని దూది ఉండతో అద్దుకుంటూ ముఖానికి, మెడకు రాసి, తుడవాలి. ఇది మాయిశ్చరైజర్‌లా ఉపయోగపడుతుంది. చర్మం పొడిబార డాన్ని రోజంతా నివారిస్తుంది. చర్మం ముడతలు తగ్గి, యవ్వనకాంతితో మెరుస్తుంది.

ఈ వేసవిలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5-8 డిగ్రీల సెల్షియస్ మేరకు ఎక్కువగా నమోదయ్యే సూచనలు ఉన్నాయని భారత వాతావరణ విభాగం కొద్ది రోజుల క్రితమే హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో 3-4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ముమ్మందు ప్రచండ వడగాడ్పులు వీచే సూచనలు ఉన్నాయంటున్నారు. ఈ నేపథ్యంలో పంటలు, తోటలను సాగు చేసే రైతులు, పశు పోషకులు గత వేసవిలో కన్నా అధికంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు..



అధిక ఉష్ణోగ్రత, వడగాడ్పులు..

పంటలు, తోటల రక్షణ ఎలా?

తీవ్రమైన ఉష్ణోగ్రతల వలన పంట పెరుగుదల, దిగుబడి గణనీయంగా తగ్గుతాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటలో పెరుగుదల మందగించడం, పురుగులు, తెగుళ్ళు పెరగడం, ఆకులు మాడిపోవడం, పువ్వులు, పండ్లు రాలిపోవడంతో పాటు పండ్ల పరిమాణంలో తగ్గుదల కనిపిస్తుంది. వేడి వాతావరణం వలన పాలు ఇచ్చే పశువుల్లో శరీర ఉష్ణోగ్రత 0.5 నుండి 3.5 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు పెరుగుతుంది. ఉష్ణోగ్రతలు పెరగడం వలన పశువులు ఎక్కువగా నీటిని తీసుకొని తక్కువ మేత తినడం వలన పాల దిగుబడి 11 శాతం వరకు తగ్గుతుంది. వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతల నుంచి పంటలను, పండ్ల తోటలను కొన్ని యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా కొంత వరకు నష్టాన్ని నివారించుకోవచ్చు.

పంటల నిర్వహణ...

● అధిక ఉష్ణోగ్రతలు తట్టుకోగల వంగడాలను, రకాలను ఎంచుకోవాలి. ● పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని పంట దశ, నేల స్వభావాన్ని బట్టి తగినంత నీటి తడులు ఇచ్చుకోవాలి.
● నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో తేమ సున్నిత దశల్లో పంటకు నీటి తడులు ఇవ్వాలి.
● వరి పంటలో పొట్ట, పూత దశల్లో (10 శాతం వెన్ను నుండి పూత బయటకు వచ్చినప్పుడు) 0.5% కె.ఎన్.03 పిచికారి చేస్తే వరి పంటలో అధిక ఉష్ణోగ్రతలతో కలిగే దిగుబడి నష్టాన్ని తగ్గించవచ్చు. ● వరి పంట దుబ్బు చేసే దశ నుంచి అంకురం దశ వరకు పొలంలో 2 సెం.మీ. ఎత్తున నీరు నిలువ ఉంచాలి. అంకురం దశ నుంచి పూత దశ వరకు నీటి లభ్యతను బట్టి పొలంలో 2 సెం.మీ. లేదా 5 సెం. మీ. నీరు నిలువ ఉంచాలి. నీటి లభ్యత బాగా తక్కువ ఉన్న ప్రాంతాల్లో ఆరుతడి పద్ధతిలో నీటి తడులు ఇవ్వాలి. ● మొక్కజొన్న పంట పూత దశ ఏర్పడే 10 రోజుల ముందు నుంచి కంకి ఏర్పడిన 25 రోజుల తర్వాత వరకు పంట బెట్ట పరిస్థితులను తట్టుకోలేదు. కాబట్టి, రైతులు పైరుకు జీవసంరక్షక నీటి తడి ఇవ్వాలి.

పండ్ల తోటల్లో ప్రత్యేక జాగ్రత్తలు...

● నీటి వసతి అధికంగా ఉన్న ప్రాంతాల్లో వడగాడ్పుల ప్రభావాన్ని తగ్గించడానికి తరచుగా నీరు ఇవ్వాలి.
● పండ్ల తోట 6 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సుదైతే, ఒక రోజుకు ఒక చెట్టుకు 150-240 లీటర్ల నీరు అవసరం. అవకాశం ఉన్నచోట సేంద్రియ పదార్థాలైన గడ్డి తదితర పదార్థాలతో మొక్కల మొదళ్లలో ఆచ్ఛాదన (మల్చింగ్) చేయటంతో పాటు బిందు సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ● ఆచ్ఛాదన చేయడం వలన నేలలో తేమ ఎక్కువ కాలం నిలువ ఉండి, మొక్కకు అందుబాటులో ఉంటుంది. వరి గడ్డి లేదా స్థానికంగా లభించే సేంద్రియ పదార్థాలు లేదా పాలిథిన్ షీట్లను మొక్కల మొదళ్ళ చుట్టూ కప్పాలి.
● మామిడి తోటలో ఏప్రిల్ – మే మాసంలో 1% పొటాషియం నైట్రేట్ (13-0-45) మందును 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. ● బెట్ట పరిస్థితుల్లో నల్లి (మైట్) ఉధృతి పెరుగుతుంది. నివారణకు 30 మి.లీ. డైకోఫోల్ లేదా 20 మి.లీ. ప్రొపార్గైట్ లేదా 20 మి.లీ. ఇథియాన్ మందును 10 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ● ఒకటి లేదా రెండేళ్ల వయస్సు గల పండ్ల తోటలు లేదా కొత్తగా నాటిన తోటల చుట్టూ వేసవిలో వడగాల్పుల ప్రభావం తగ్గించడానికి సరుగుడు లేదా వెదురు మొక్కలను నాటుకోవాలి.

కూరగాయ తోటల్లో ఏం చేయాలి?

● అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోగల కూరగాయ రకాలను ఎంచుకొని సాగు చేసుకోవాలి. ● తరచుగా నీటి తడులు ఇవ్వడం ద్వారా నేలలో తేమను సంరక్షించుకోవచ్చు. ● బిందు సేద్యం చేసే పంటల్లో ప్రతి రోజూ అరగంట (ఉదయం, సాయంత్రం) 2సార్లు నీరివ్వాలి.
● ప్రధాన పంటపై వడగాడ్పుల ప్రభావాన్ని తగ్గించడానికి, మొక్కజొన్నను 3-4 వరుసల సరిహద్దు పంటగా వేసుకోవాలి. ప్రతి 20-25 మీటర్ల దూరంలో అంతర పంటగా వేసుకోవాలి. ● 50% షేడ్ నెట్‌ను వాడి పంటలపై అధిక ఉష్ణోగ్రత, వడగాల్పుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు.

● కోళ్ళ పాడి, వేడి వాతావరణాన్ని తట్టుకోవడానికి షెడ్లల్లో ఫ్యాన్లను, ఫాగర్లను అమర్చాలి. షెడ్లను వరి గడ్డితో కప్పి స్ప్రింక్లర్లు అమర్చాలి. ● కోళ్ళు ఎక్కువ మోతాదులో దాణా తినటం కోసం మెత్తటి దాణాతో పాటు చల్లని తాగు నీటిని అందుబాటులో ఉంచాలి.

– డా. లీలారాణి, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి)– అధిపతి
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం,
వ్యవసాయ పరిశోధన సంస్థ,
రాజేంద్రనగర్, హైదరాబాద్.

సాగుబడి

పూర్వాభాద్ర కార్తె: మార్చి 16 వరకు
ఉత్తరాభాద్ర కార్తె: 17 నుంచి

పశువులను కాపాడేదెలా?

వేసవి కాలంలో ఎండల తీవ్రత, అధిక ఉష్ణోగ్రత, వేడిగాలులు వీచడం వల్ల ఉష్ణతాపానికి గురై పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ళు తీవ్ర అసౌకర్యానికి, అనారోగ్యానికి లోనుకావడమే కాకుండా వడదెబ్బకు గురవుతూ ఉంటాయి. కాబట్టి, పశుపోషకులు, గొర్రెలు–మేకల పెంపకదారులు వేసవికాలంలో కొన్ని జాగ్రత్తలు తీసుకొని పశువులు, గొర్రెలు మేకలు అనారోగ్యానికి గురికాకుండా, వడదెబ్బ బారిన పడకుండా సంరక్షించుకోవచ్చు. వాతావరణ మార్పులకు అనుగుణంగా శాస్త్రీయ యాజమాన్య పద్ధతిని పాటించడం ద్వారా ఉత్పాదక శక్తి తగ్గకుండా రైతు ఆశించిన ఫలితాలను పొందవచ్చు.



పశువుల చల్లదనం కోసం ఫాగర్లు, ఫ్యాన్లు అమర్చిన దృశ్యం

ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల సంరక్షణ ఇలా..

అధిక ఉష్ణోగ్రత, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, షెడ్లలో అధిక సంఖ్యలో కిక్కిరిసి ఉండటం, ఉక్కపోత, నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడదెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి, బలహీనంగా మారతాయి. పశువులు సరిగా నడవలేక, తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. జీవక్రియ తగ్గిపోవడం, ఆకలి మందగించడం, మేత తక్కువగా తీసుకోవడం వల్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. వ్యాధి నిరోధక శక్తి తగ్గటం వలన ఇతర వ్యాధులు, పరాన్నజీవులు ఆశించే అవకాశం పెరుగుతుంది. కొన్ని సమయాల్లో దాహంతో ఉన్న పశువులు మురికి గుంటల్లో ఉన్న నీటిని తాగడం వల్ల పొరుడు వంటి జీర్ణకోశ వ్యాధులు రావచ్చు. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవించే అవకాశాలున్నాయి. వడదెబ్బకు గురైన పశువుల్లో దాహం పెరుగుతుంది. తూలుతూ నడుస్తూ పడిపోవడం, రొప్పుతూ, శ్వాస కష్టమవడంతో ఒక్కొక్కసారి అపస్మారక స్థితికి వెళ్ళి మరణించే ప్రమాదం ఉంటుంది.

పశువుల మేపు...

వేసవి తాపంతో జీర్ణక్రియ సన్నగిల్లుతుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావ లాంటి పదార్థాలు ఇవ్వడం మంచిది. ఎక్కువ శాతం పచ్చిగడ్డి ఇవ్వాలి. ఒకవేళ మాగుడు గడ్డి సమృద్ధిగా ఉంటే అందించవచ్చు.

పచ్చిగడ్డిని ఉదయం సమయాల్లో, ఎండుగడ్డిని రాత్రి సమయాలలో వేర్వేరుగా ఇవ్వాలి. అధిక పాలిచ్చే పశువులకు దాణాను నీటితో కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మంచిది.

మేపు కొరకు పశువుల్ని ఎండవేళల్లో కాకుండా ఉ. పూట 6 నుంచి 10 గంటల వరకు, సా. 5 నుండి 7 గంటల వరకు బయటకు పంపడం మంచిది. వేసవి తాపానికి గురైన పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. వ్యాధి నిరోధక టీకాలు ఇది వరకు వేయించని పశువులు, గొర్రెలు, మేకలకు గాలికుంటు వ్యాధి, గొంతువాపు, జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. దాహంతో ఉన్న పశువులు మురుగునీరు తాగటం వల్ల పొరుడు వంటి జీర్ణకోశ రోగం వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, ఎల్లవేళలా మంచి చల్లని తాగునీరు ఇవ్వాలి. అంతర పరాన్న జీవుల నిర్మూలనకు నట్టల నివారణ మందులు క్రమం తప్పకుండా తాగించాలి.

వడదెబ్బకు గురైన పశువులకు ప్రథమ చికిత్స...

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశంలోకి తీసుకెళ్ళి శరీర ఉష్ణోగ్రత తగ్గించడానికి పలుమార్లు నీటితో కడగాలి. తల నుదుటి మీద మంచుముక్కలు ఉంచాలి లేదా చల్లని గోనె సంచిని దానిపై కప్పాలి. వెంటనే పశువైద్యుని సంప్రదించాలి. పశువైద్యుని పర్యవేక్షణలో గ్లూకోజ్ సెలైన్, సోడియం క్లోరైడ్ అందించాలి. శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి తగిన చికిత్స చేయించాలి.


– డా. జి. మంజువాణి,
సంచాలకులు, పశువైద్య, పశు సంవర్ధక శాఖ, హైదరాబాద్

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్

బోరు బావుల రీచార్జ్‌తో నీటి భద్రత!

● **22న వాటర్ అండ్ లైవ్‌లీహుడ్ ఫౌండేషన్ వెబినార్**

గత వానాకాలంలో రుతుపవనాల వైఫల్యం వల్ల భూగర్భంలోకి వాన నీరు సరిగ్గా ఇంకకపోవటంతో తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో బోరు బావులు ఎండిపోతున్నాయి. కాలువ కమాండ్ ఏరియాల్లో సైతం పొలాల్లో, నివాస ప్రాంతాల్లో కూడా పలువురు ఇప్పటికే కొత్త బోరు బావులు తవ్వుతున్నా, చాలా వాటిల్లో ఆశించినంతగా నీరు లభించని పరిస్థితి. ఎండిపోయిన బోరు బావులు, కొద్దొగొప్పో నీరు పోస్తున్న బోరు బావుల చుట్టూ వాన నీటి ఇంకుడు గుంత (రిచార్జ్ పిట్)ను నిర్మించుకోవటం ద్వారా కృత్రిమంగా భూగర్భ జలాలను పెంపొందించుకోవటమే ఈ సమస్యకు ఓ చక్కని పరిష్కారం. వీటిని నిర్మాణం ద్వారా ఈ ఎండా కాలంలోనూ కురిసే అకాల వర్షాలకు వృథాగా పోయే నీటిని సమర్థవంతంగా బోర్ల దగ్గరే భూమి లోకి ఇంకింపజేసుకోవచ్చు.





అయితే, వాననీటిని ఇంకింపజేసే ఇంకుడు గుంత నిర్మాణానికి ఎండిపోయిన బోర్లన్నీ పనికిరావు. ‘ట్యాంకర్ టెస్ట్’ చేసి నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఈ అత్యాధునిక బోర్‌వెల్ రీచార్జ్ టెక్నిక్‌ను సికింద్రాబాద్‌లోని ‘వాటర్ అండ్ లైవ్‌లీహుడ్ ఫౌండేషన్ (డబ్ల్యూ.ఎల్.ఎఫ్.)’ గత 14 ఏళ్లుగా ప్రజలకు అందిస్తోంది. ఈ అంశంపై రైతులకు, స్వచ్ఛంద సంస్థలు, ఇంజనీర్లు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు డబ్ల్యూ.ఎల్.ఎఫ్. ఈ నెల 22న ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా.. తెలుగులో ఉచితంగా వెబినార్‌ను నిర్వహిస్తోంది. ఈ క్యూ.ఆర్.కోడ్ ద్వారా స్కాన్ చేసి గూగుల్ ఫామ్ ద్వారా పేర్లను ఈ నెల 18 లోగా రిజిస్టర్ చేసుకున్న వారికి వాట్సప్ ద్వారా వెబినార్ లింక్ పంపుతారు. ప్రవేశం ఉచితం. రూ.200 చెల్లించిన వారికి బోర్ల వద్ద వాన నీటి సంరక్షణపై ఆంగ్ల పుస్తకాన్ని పంపుతారు.

వివరాలకు..
సీనియర్ జియాలజిస్ట్ రామ్‌మోహన్
– 94401 94866, 040 27014467.
wlfoundation@outlook.com

16, 17న సేంద్రియ రైతులతో ముఖాముఖి

హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఈ నెల 16, 17 తేదీల్లో గ్రామభారతి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో నాబార్డ్ తోడ్పాటుతో సేంద్రియ వ్యవసాయ, గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన ‘కిసాన్ ఎక్స్‌పో’ 2వ ఎడిషన్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సామ ఎల్లారెడ్డి తెలిపారు. ఆరోగ్యదాయక సేద్యం చేస్తున్న గ్రామీణ సేంద్రియ/ ప్రకృతి వ్యవసాయదారులను, వారి ఉత్పత్తులను ప్రత్యక్షంగా నగరవాసులకు పరిచయం చేయటం కోసం వినియోగదారుల కుటుంబాలతో ముఖాముఖి నిర్వహించటం ఈ ఎక్స్‌పో ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ప్రకృతి సేద్య రంగ ప్రముఖులు డా. జీవీ రామాంజనేయులు, విజయరామ్, కొప్పుల నరసన్న తదితరులు అతిథులుగా పాల్గొంటారు. అందరూ ఆహ్వానితులే. వివరాలకు.. 97040 66622.



రెండో రౌండ్‌లో శరత్ కమల్

సింగపూర్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో భారత స్టార్ ఆచంట శరత్ కమల్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. 41 ఏళ్ల శరత్ కమల్ క్వాలిఫయింగ్ ద్వారా పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ 87వ ర్యాంకర్ శరత్ కమల్ 11-5, 11-4, 11-6తో నికోలస్ బర్గోస్ (చిలీ)పై గెలిచాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత నంబర్‌వన్ మనిక బత్రా 4-11, 7-11, 2-11తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ యిది వాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయింది.

సూర్య చరిష్మాకు కాంస్య పతకం



జర్మన్ ఓపెన్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి తామిరి సూర్య చరిష్మా కాంస్య పతకం గెలిచింది. బెర్లిన్‌లో జరిగిన ఈ టోర్నీలో అండర్-19 మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో చరిష్మా 21-15, 20-22, 17-21తో కిమ్ మిన్ జీ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. అంతకుముందు చరిష్మా క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ సితి జులైఖా (మలేసియా)పై... రెండో రౌండ్‌లో13వ సీడ్ పిచిత్‌ప్రిచాసెక్ (థాయ్‌లాండ్)పై సంచలన విజయాలు సాధించింది.

'పారిస్' బెర్త్‌కు విజయం దూరంలో...

క్వార్టర్ ఫైనల్లో నిశాంత్ దేవ్



బుస్టో అర్సిజియో (ఇటలీ): పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందుకు భారత బాక్సర్ నిశాంత్ దేవ్ విజయం దూరంలో నిలిచాడు. ఒలింపిక్స్ వరల్డ్ క్వాలిఫయింగ్ తొలి టోర్నీలో 23 ఏళ్ల ఈ హరియాణా బాక్సర్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో నిశాంత్ 5-0తో క్రిస్టోస్ కరైటిస్ (గ్రీస్)పై గెలుపొందాడు. క్వార్టర్ ఫైనల్లో అమెరికా బాక్సర్ ఒమారి జోన్స్‌తో నిశాంత్ తలపడతాడు. ఈ బౌట్‌లో గెలిచి సెమీఫైనల్ చేరుకుంటే నిశాంత్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారవుతుంది. ఈ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్ నుంచి తొమ్మిది మంది బాక్సర్లు బరిలోకి దిగగా ఎనిమిది మంది తొలి రౌండ్‌లోనే ఓడిపోవడం గమనార్హం. ఇప్పటి వరకు భారత్ నుంచి కేవలం మహిళల విభాగంలో మాత్రమే నిఖత్ జరీన్ (50 కేజీలు), ప్రీతి పవార్ (54 కేజీలు), పర్వీన్ హుడా (57 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు) పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందారు.

బోపన్న జోడీకి షాక్



కాలిఫోర్నియా: ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ జోడీ రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. సోమవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-7 (1/7), 6-4, 8-10తో సాండర్ జిలీ-జొరాన్ వ్లిజెన్ (బెల్జియం) జోడీ చేతిలో ఓడిపోయింది. గంటా 51 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జంట నాలుగు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి రౌండ్‌లో ఓడిన బోపన్న-ఎబ్డెన్ జంటకు 18,640 డాలర్ల (రూ. 15 లక్షల 42 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

సూపర్ షబ్నమ్...

11 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టిన వైజాగ్ అమ్మాయి	గుజరాత్ జెయింట్స్‌కు రెండో విజయం	దీప్తి శర్మ పోరాటం వృథా	యూపీ వారియర్స్‌కు తప్పని ఓటమి



న్యూఢిల్లీ: వరుసగా మూడో మ్యాచ్‌లోనూ దీప్తి శర్మ (60 బంతుల్లో 88 నాటౌట్; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీతో చెలరేగినా... యూపీ వారియర్స్‌ను గెలిపించలేకపోయింది. ఫలితంగా మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో యూపీ 'ప్లే ఆఫ్స్' అవకాశాలను దాదాపుగా చేజార్చుకుంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 8 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. కెప్టెన్ బెత్ మూనీ (52 బంతుల్లో 74 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి హాఫ్ సెంచరీ సాధించగా, లౌరా వోల్‌వార్ట్ (30 బంతుల్లో 43; 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించింది. యూపీ బౌలర్లలో సోఫీ ఎకెల్‌స్టోన్ 3, దీప్తి శర్మ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం వారియర్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 144 పరుగులు చేసింది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షబ్నమ్ షకీల్ (3/11) కీలక వికెట్లతో ఆరంభంలోనే యూపీని దెబ్బ తీసింది. దాంతో స్కోరు 35/5 వద్ద నిలిచింది. అయితే దీప్తి, పూనమ్ ఖేమ్నర్ (36 బంతుల్లో 36; 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడి జట్టును విజయానికి చేరువగా తెచ్చారు. వీరిద్దరు 78 బంతుల్లో అభేద్యంగా 109 పరుగులు జోడించారు. చివరి ఓవర్లో 26 పరుగులు అవసరం కాగా, దీప్తి 2 సిక్సర్లతో సహా మొత్తం 17 పరుగులే వచ్చాయి. పట్టికలో మూడో స్థానం కోసం ఇంకా పోటీ మిగిలే ఉంది. యూపీ, బెంగళూరుకు చెరో 6 పాయింట్లు ఉండగా, యూపీ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. నేడు ముంబై ఇండియన్స్‌తో జరిగే మ్యాచ్‌లో బెంగళూరు గెలిస్తే ప్లే ఆఫ్‌కు అర్హత పొందుతుంది. ఒకవేళ భారీ తేడాతో ఓడిపోయినా బెంగళూరుకే ప్లే ఆఫ్స్ అవకాశం ఉంది. ఇక 4 పాయింట్లున్న గుజరాత్ చివరి మ్యాచ్‌లో గెలవడంతో పాటు భారీ రన్‌రేట్ సాధించాలి.

డబ్ల్యూపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	ర.రే.
ఢిల్లీ	7	5	2	10	0.918
ముంబై	7	5	2	10	0.343
బెంగళూరు	7	3	4	6	0.027
యూపీ	8	3	5	6	−0.371
గుజరాత్	7	2	5	4	−0.873

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్



యూపీ వారియర్స్‌తో మ్యాచ్‌లో బౌలింగ్‌లో సత్తా చాటిన షబ్నమ్ స్వస్థలం విశాఖపట్నం. 16 ఏళ్ల షబ్నమ్ డబ్ల్యూపీఎల్ బరిలోకి దిగిన పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందింది. వేలంలో ఆమెను గుజరాత్ టీమ్ రూ. 10 లక్షలకు తీసుకుంది. తన తొలి మ్యాచ్‌లో వికెట్ దక్కకపోయినా చక్కటి బంతులతో ఆమె ఆకట్టుకుంది. ముంబైతో జరిగిన గత మ్యాచ్‌లో ఇంగ్లండ్ స్టార్ నాట్ సివర్ బ్రంట్‌ను తొలి వికెట్‌గా అవుట్ చేసిన షబ్నమ్... ఈసారి మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చింది. గత ఏడాదే అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో షబ్నమ్ సభ్యురాలిగా ఉంది.

సాత్విక్-చిరాగ్ జోడీపైనే ఆశలు!

నేటి నుంచి ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్‌కు చివరిసారి 2001లో టైటిల్ లభించింది. ఆనాడు పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రస్తుత టీమిండియా హెడ్ కోచ్ పుల్లెల గోపీచంద్ విజేతగా నిలిచాడు. ఆ తర్వాత 2015లో మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్... 2022లో పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ ఫైనల్ చేరి రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకున్నారు. అయితే ఈసారి పురుషుల డబుల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టిలపై భారత బృందం భారీ ఆశలు పెట్టుకుంది. ఈ సీజన్‌లో వీరిద్దరు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. ఆడిన మూడు టోర్నీల్లోనూ (మలేసియా మాస్టర్స్, ఇండియా ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్) ఫైనల్ చేరారు. రెండింటిలో రన్నరప్‌గా నిలిచారు. ఆదివారం ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్‌లో టైటిల్ కూడా దక్కించుకున్నారు. అంతా సవ్యంగా సాగితే... నేడు మొదలయ్యే ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో భారత బృందం 23 ఏళ్ల టైటిల్ నిరీక్షణకు తెరదించే అవకాశాలున్నాయి. కానీ ఈసారి అన్ని విభాగాల్లోనూ భారత క్రీడాకారులకు క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. తొలి రౌండ్ దాటాక ప్రతి మ్యాచ్‌లో మేటి ప్రత్యర్థులు సిద్ధంగా ఉండనున్నారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో మాజీ చాంపియన్ మొహమ్మద్ అహ్‌సాన్-హెంద్రా సెతియవాన్ (ఇండోనేసియా)లతో సాత్విక్-చిరాగ్ తలపడతారు. సాత్విక్ ద్వయం ఈ అడ్డంకి దాటితే ప్రిక్వార్టర్ ఫైనల్లో షోహిబుల్ ఫిక్రి-మౌలానా బగస్ (ఇండోనేసియా) జోడీ.. క్వార్టర్ ఫైనల్లో ఆరోన్ చియా-సో వుయ్ యిక్ (మలేసియా) జంట ఎదురయ్యే చాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో సాత్విక్-చిరాగ్ జోడీ ప్రతి మ్యాచ్‌లో విశేషంగా రాణించాల్సి ఉంటుంది. ఇక పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో టాప్ సీడ్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో కిడాంబి శ్రీకాంత్; సు లి యాంగ్ (చైనీస్ తైపీ)తో ప్రణయ్; ఎన్జీ జె యోంగ్ (మలేసియా)తో లక్ష్య సేన్; వర్డాయో (ఇండోనేసియా)తో ప్రియాన్షు తలపడతారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో వ్యోన్ లి (బెల్జియం)తో పీవీ సింధు ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో సింధు గెలిస్తే ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆమె ప్రత్యర్థిగా ప్రపంచ చాంపియన్, వరల్డ్ నంబర్‌వన్ ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో ఉండనుంది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ; అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీలు బరిలో ఉన్నాయి.

ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి వినేశ్



పాటియాలా: వచ్చే నెలలో కిర్గిస్తాన్‌లో జరిగే పారిస్ ఒలింపిక్స్ ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ బరిలోకి దిగనుంది. ఈ టోర్నీలో పాల్గొనే భారత మహిళల జట్టును ఎంపిక చేసేందుకు సోమవారం నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో వినేశ్ 50 కేజీల విభాగంలో విజేతగా నిలిచింది. వినేశ్ రెగ్యులర్ వెయిట్ కేటగిరీ 53 కేజీలు కాగా... ఇప్పటికే ఈ కేటగిరీలో అంతిమ్ పంఘాల్ ఒలింపిక్ బెర్త్ దక్కించుకుంది. దాంతో వినేశ్ సెలెక్షన్ ట్రయల్స్ టోర్నీలో 50 కేజీలతోపాటు 53 కేజీల విభాగంలోనూ పోటీపడింది. ఒక రెజ్లర్ ఒకే రోజు ఒకే వెయిట్ కేటగిరీలో పోటీపడాలన్న నిబంధన ఉన్నా అడ్‌హక్ కమిటీ వినేశ్‌ను రెండు కేటగిరీల్లో పోటీ పడేందుకు అనుమతి ఇవ్వడం వివాదాస్పదమైంది. అయితే వినేశ్ 53 కేజీల విభాగం సెమీఫైనల్లో ఓడిపోయింది. ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో పాల్గొనే భారత జట్టులో అన్షు మలిక్ (57 కేజీలు), మాన్సి అహ్లావత్ (62 కేజీలు), నిషా దహియా (68 కేజీలు), రితిక (76 కేజీలు) కూడా ఎంపికయ్యారు.

పటిష్ట స్థితిలో ముంబై

ముంబై: విదర్భ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో ముంబై జట్టు శాసించే స్థితికి చేరుకుంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ముంబై ఓవరాల్ ఆధిక్యం 260 పరుగులకు చేరుకుంది. 119 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన ముంబై ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 50 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 141 పరుగులు సాధించింది. కెప్టెన్ అజింక్య రహానే (58 బ్యాటింగ్; 4 ఫోర్లు, 1 సిక్స్), ముషీర్ ఖాన్ (51 బ్యాటింగ్; 3 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీలు చేశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 31/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 45.3 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌటైంది. ముంబై బౌలర్లు ధవల్ కులకర్ణి (3/15), షమ్స్ ములానీ (3/32), తనుష్ కొటియన్ (3/7) విదర్భ జట్టును దెబ్బ తీశారు.

ఆసీస్ అద్భుతం

- రెండో టెస్టులో 3 వికెట్లతో విజయం
- గెలిపించిన క్యారీ, మార్ష్, కమిన్స్



క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ పర్యటనలో రెండు టెస్టుల సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అలెక్స్ క్యారీ (98 నాటౌట్; 15 ఫోర్లు), మిచెల్ మార్ష్ (80; 10 ఫోర్లు, 1 సిక్స్) అసాధారణ పోరాటంతో రెండో టెస్టులో ఆసీస్ 3 వికెట్ల తేడాతో కివీస్‌పై గెలిచింది. 279 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు 77/4 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగోరోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆసీస్ 80 పరుగులకే ఐదో వికెట్ కోల్పోయింది. దీంతో ఆసీస్‌కు పరాజయం ఖాయమనిపించింది. కానీ మార్ష్, క్యారీ ఆరో వికెట్‌కు 140 పరుగులు జోడించడంతో మ్యాచ్ ఫలితమే మారిపోయింది. 220 స్కోరు వద్ద మార్ష్ నిష్క్రమించినా, స్టార్క్ (0) డకౌటైనా... కెప్టెన్ కమిన్స్ (32 నాటౌట్; 4 ఫోర్లు), క్యారీ అభేద్యమైన ఎనిమిదో వికెట్‌కు 61 పరుగులు జోడించి ఆసీస్‌ను గెలిపించారు. 2005 నుంచి కివీస్ గడ్డపై ఆస్ట్రేలియా వరుసగా ఏడు టెస్టుల్లో గెలిచింది. టెస్టు క్రికెట్ చరిత్రలో సంయుక్తంగా ఇది రెండో అత్యుత్తమ వరుస విజయాల ఘనత. సఫారీ గడ్డపై ఇంగ్లండ్ (1889 నుంచి 1999 వరకు) 8 వరుస టెస్టుల్లో గెలిచింది. జింబాబ్వేపై కివీస్ (2000 నుంచి ఇప్పటివరకు) వరుసగా 7 టెస్టులు గెలిచింది.

అణు బాంబు సౌండ్ అదిరింది.. క్రిస్టోఫర్ కల నిజమైంది... 'ఆర్ఆర్ఆర్' నాటు నాటు ఆకర్షణగా నిలిచింది.
ఫేక్ చప్పట్లతో మెస్సీ (శునకం), ఆమిర్ ఖాన్ 'పీకే' తరహాలో జాన్ ప్రత్యక్షం కావడం చర్చలకు దారి తీసింది.
ఇలా ఆనందాలు, వింతలు, విడ్డూరాలతో ఆస్కార్ అవార్డు వేడుక జరిగింది. ఆ విశేషాలు తెలుసుకుందాం.

సినిమా

ఆస్కార్ వేదికపై అణు బాంబు మోత

- ఏడు అవార్డులతో అటామిక్ సైంటిఫిక్ థ్రిల్లర్ 'ఆపెన్‌హైమర్' హవా
- ఒక్క అవార్డుకే పరిమితమైన 'బార్బీ'



రాబర్ట్ జూనియర్, డేవైన్ జో రాండాల్ఫ్, ఎమ్మా స్టోన్, సిలియన్ మర్ఫీ

ప్రముఖ భౌతిక శాస్త్ర నిపుణుడు, అణుబాంబు సృష్టికర్తగా పేరుగాంచిన జె. రాబర్ట్ ఆపెన్‌హైమర్ జీవితంతో రూపొందిన బయోగ్రాఫికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'ఆపెన్‌హైమర్' మోత ఆస్కార్ వేదికపై బాగా వినిపించింది. దర్శకుడిగా క్రిస్టోఫర్ నోలన్‌తో ఆస్కార్ అవార్డును ముద్దాడేలా చేసింది. మార్చి 10న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్లో జరిగిన 96వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో 'ఆపెన్‌హైమర్' చిత్రం ఏడు విభాగాల్లో అవార్డులు కొల్లగొట్టి విజయఢంకా మోగించింది. మొత్తం పదమూడు నామినేషన్లు దక్కించుకున్న ఈ చిత్రానికి ఉత్తమ చిత్రంతో పాటు దర్శకుడు, నటుడు, సహాయనటుడు, ఫిల్మ్ ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ, ఒరిజినల్ స్కోర్ విభాగాల్లో అవార్డు దక్కింది. అలాగే పదకొండు నామినేషన్లు దక్కించుకున్న 'పూర్ థింగ్స్' సినిమాకు నాలుగు విభాగాల్లో, హిస్టారికల్ డ్రామా 'జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్' సినిమాకు రెండు విభాగాల్లో అవార్డులు దక్కాయి. 'ఆపెన్‌హైమర్'కు పోటీగా నిలుస్తుందనుకున్న 'బార్బీ' సినిమాకు 8 నామినేషన్లు దక్కినా, ఒక్క అవార్డు (బెస్ట్ ఒరిజినల్ సాంగ్)తో సరిపెట్టుకుంది, పది నామినేషన్లు దక్కించుకున్న 'కిల్లర్ ఆఫ్ ద ఫ్లవర్ మూన్' సినిమాకి ఒక్క అవార్డు కూడా దక్కకపోవడం చర్చనీయాంశమైంది. ఈ ఏడాది ఉత్తమ నటుడిగా నిలిచిన సిలియన్ మర్ఫీ, ఉత్తమ సహాయ నటుడు రాబర్ట్ డౌనీ జూనియర్, ఉత్తమ సహాయ నటి రాండాల్ఫ్ తొలిసారి ఆస్కార్‌ని ముద్దాడారు. గతంలో 'లా లా ల్యాండ్'కి ఉత్తమ నటిగా ఆస్కార్ అందు కున్న ఎమ్మా స్టోన్ ఇప్పుడు ఇదే విభాగానికి అవార్డుని అందుకున్నారు. భారత సంతతికి చెందిన నిషా తెరకెక్కించిన 'టు కిల్ ఎ టైగర్' డాక్యుమెంటరీ ఆస్కార్ సాధించలేకపోయింది. ఇక అవార్డు విజేతల జాబితా ఈ విధంగా...

విజేతల వివరాలు: ● ఉత్తమ చిత్రం: (ఆపెన్‌హైమర్) ● దర్శకుడు : క్రిస్టోఫర్ నోలన్ (ఆపెన్‌హైమర్) ● నటుడు: సిలియన్ మర్ఫీ (ఆపెన్‌హైమర్) ● నటి: ఎమ్మా స్టోన్ (పూర్ థింగ్స్) ● సహాయ నటుడు: రాబర్ట్ డౌనీ జూనియర్ (ఆపెన్‌హైమర్) ● సహాయ నటి: డేవైన్ జో రాండాల్ఫ్ (ది హోల్డోవర్స్) ● సినిమాటోగ్రఫీ: ఆపెన్‌హైమర్ ● డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్: 20 డేస్ ఇన్ మరియోపోల్ ● హెయిర్ స్టయిల్ అండ్ మేకప్: నడియా స్టేసీ, మార్క్ కౌలియర్ (పూర్ థింగ్స్) ● అడాప్టెడ్ స్క్రీన్ ప్లే: కార్డ్ జెఫర్‌సన్ (అమెరికన్ ఫిక్షన్) ● ఒరిజినల్ స్క్రీన్ ప్లే: జస్టిన్ ట్రైట్, అర్థర్ హరారీ (అనాటమీ ఆఫ్ ఎ ఫాల్) ● యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్: ది బాయ్ అండ్ ది హిరాన్ ● కాస్ట్యూమ్ డిజైన్: హోలీ వెడ్డింగ్‌టన్ (పూర్ థింగ్స్) ● ప్రొడక్షన్ డిజైన్: జేమ్స్ ప్రైస్, షోనా హెత్ (పూర్ థింగ్స్) ● ఇంటర్నేషనల్ ఫిల్మ్: ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ● ఎడిటింగ్: జెన్నిఫర్ లేమ్ (ఆపెన్‌హైమర్) ● విజువల్ ఎఫెక్ట్స్: గాడ్జిల్లా మైనస్ వన్ ● డాక్యుమెంటరీ (షార్ట్ సబ్జెక్ట్): ది లాస్ట్ రిపేర్ షాప్ ● ఒరిజినల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: ఆపెన్‌హైమర్ ● సౌండ్ : ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ● ఒరిజినల్ సాంగ్: వాట్ వాజ్ ఐ మేడ్ ఫర్ (బార్బీ) ● లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్: ది వండర్‌ఫుల్ స్టోరీ ఆఫ్ హెన్రీ షుగర్.

నోలన్ కల నెరవేరెగా...



ఫిల్మ్ మేకర్ క్రిస్టోఫర్ నోలన్ ఆస్కార్ చరిత్ర కాస్త ఆశ్చర్యకరంగానే ఉంటుంది. ఎందుకంటే నోలన్ తీసిన సినిమాలు ఆస్కార్ అవార్డుల కోసం 49 నామినేషన్లు దక్కించుకుని, 18 అవార్డులను సాధించాయి. కానీ క్రిస్టోఫర్ నోలన్‌కు మాత్రం 95వ ఆస్కార్ అవార్డుల వరకూ ఒక్కటంటే ఒక్క అవార్డు కూడా రాలేదు. తొలిసారి 2002లో 'మెమెంటో' సినిమాకు గాను బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్ ప్లే విభాగంలో 74వ ఆస్కార్ అవార్డ్స్‌లో నామినేషన్ దక్కించుకున్నారు నోలన్... నిరాశే ఎదురైంది. ఆ తర్వాత 83వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'ఇన్సెప్షన్' సినిమాకు బెస్ట్ పిక్చర్, బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్ ప్లే విభాగాల్లో నామినేషన్లు దక్కినా అవార్డులు రాలేదు. 90వ ఆస్కార్ అవార్డ్స్‌లో బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ పిక్చర్ విభాగాల్లో నోలన్ 'డంకిర్క్' సినిమాకు నామినేషన్లు దక్కినా ఆస్కార్ అవార్డు దక్కలేదు. చివరికి నోలన్ కల 'ఆపెన్‌హైమర్'తో నెరవేరింది.

ఈ ప్రయాణంలో నేనూ భాగం అని... - క్రిస్టోఫర్ నోలన్

ఆస్కార్ వేదికపై క్రిస్టోఫర్ నోలన్ మాట్లాడుతూ – ''మా సినిమాలో ప్రధాన పాత్ర పోషించిన మర్ఫీ, ఎమిలీ బ్లంట్, మాట్‌లతో పాటు యూనిట్ అందరికీ ధన్యవాదాలు. ఇక మా కుటుంబాన్ని, ఈ సినిమాను నిర్మించిన మా నిర్మాత ఎమ్మా థామస్‌తో (భార్య ఎమ్మా పేరును ప్రస్తావించగానే ఒక్కసారిగా నవ్వులు) పాటు నా సోదరుడికి థ్యాంక్స్ చెప్పాలి. మా సినిమాలో సత్తా ఉందని నమ్మి, డిస్ట్రిబ్యూట్ చేసిన యూనివర్సల్ స్టూడియోస్‌కు ధన్యవాదాలు. సినిమా చరిత్ర వందేళ్లకు చేరువ అవుతోంది. ఈ అద్భుతమైన ప్రయాణం ఎక్కడికి వెళ్తుందో మనకు తెలియదు. కానీ ఈ ప్రయాణం తాలూకు సినిమాల్లో నేను కూడా ఓ అర్థవంతమైన భాగం అని భావించి, నన్ను గుర్తించిన ఆస్కార్ కమిటీకి ధన్యవాదాలు'' అన్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.... భార్యాభర్త నోలన్, ఎమ్మా దర్శక-నిర్మాతలుగా ఒకేసారి ఆస్కార్ అవార్డులు సాధించారు.

అణుబాంబు విస్ఫోటనం నేపథ్యంలోని 'ఆపెన్‌హైమర్'లో నటించి, అవార్డు దక్కించుకున్న **మర్ఫీ** తన అవార్డును ప్రపంచ శాంతి ఆకాంక్షించేవారికి అంకితమిస్తున్నట్లుగా పేర్కొన్నారు.

జీవితంలో తనకు ఎంతో అండగా నిలిచిన తన భార్య సుసాన్ డౌన్‌కి అవార్డుని అంకితం ఇస్తున్నట్లుగా ఉత్తమ సహాయ నటుడు **రాబర్ట్ డౌనీ** తెలిపారు.

''నేను నా జీవితంలో మరోలా (స్లిమ్‌గా) ఉండాలనుకున్నాను. కానీ ఇప్పుడు నాకు తెలిసింది ఏంటంటే... నేను నాలానే ఉండాలి'' అంటూ ఎమోషనల్ అయ్యారు **రాండాల్ఫ్**

నేనీ సినిమా చేసి ఉండాల్సింది కాదు - ఎమ్ చెర్నోవ్



ఉక్రెయిన్ వార్ బ్యాక్‌డ్రాప్‌తో రూపొందిన డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ '20 డేస్ ఇన్ మరియోపోల్' చిత్రం ఆస్కార్ అవార్డును సాధించింది. ఈ అవార్డు యాక్సెప్టెన్సీ స్పీచ్‌లో చిత్రదర్శకుడు ఎమ్ చెర్నోవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఉక్రెయిన్ చరిత్రలో ఇది తొలి ఆస్కార్ అవార్డు. ఇందుకు గౌరవంగా భావిస్తున్నాను. అయితే ఈ సినిమాను నేను చేసి ఉండకూడదని అనుకుంటున్నాను. బహుశా ఈ వేదికపై ఇలా మాట్లాడుతున్న తొలి దర్శకుడిని నేనేమో. మా ఉక్రెయిన్‌పై దాడులు చేయకుండా, మా నగరాలను ఆక్రమించకుండా ఉండేందుకు బదులుగా రష్యావారికి ఈ అవార్డు ఇస్తాను. నేను చరిత్రను, గతాన్ని మార్చలేను. కానీ కొందరు ప్రతిభావంతులతో కలిసి ఓ కొత్త రికార్డును సృష్టించగలం. అప్పుడు నిజం గెలుస్తుంది. జీవితాలను త్యాగం చేసిన మరియోపోల్ ప్రజలు గుర్తుండిపోతారు. సినిమా జ్ఞాపకాలను ఏర్పరుస్తుంది. జ్ఞాపకాలు చరిత్రను నెలకొల్పుతాయి " అంటూ భావోద్వేగంతో మాట్లాడారు చెర్నోవ్.

స్వీట్ సర్‌ప్రైజ్



'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాటకు 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో చిత్ర సంగీతదర్శకుడు కీరవాణి, రచయిత చంద్రబోస్ ఆస్కార్ అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. 96వ అవార్డ్స్‌లో 'ఆర్ఆర్ఆర్' విజువల్స్ కనిపించాయి. వరల్డ్ గ్రేటెస్ట్ స్టంట్ సీక్వెన్స్ అంటూ ఆస్కార్ వేదికపై ప్రదర్శించిన విజువల్స్‌లో 'ఆర్ఆర్ఆర్'లోని క్లైమాక్స్ ఫైట్ సీక్వెన్స్‌లు రెండుసార్లు కనిపించాయి. 'టైటానిక్', 'మిషన్ ఇంపాజిబుల్', 'చార్లీ చాప్లిన్', 'బస్టర్ కీటన్' వంటి హాలీవుడ్ క్లాసిక్ చిత్రాల యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు 'ఆర్ఆర్ఆర్'లోని యాక్షన్ విజువల్స్ ప్లే కావడం విశేషం. అలాగే ఈ ఏడాది బెస్ట్ ఒరిజినల్ సాంగ్ 'వాట్ వాజ్ ఐ మేడ్ ఫర్?'ను విజేతగా ప్రకటించే ముందు ప్లే చేసిన కొన్ని సాంగ్స్ విజువల్స్‌లో 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాట కనిపించింది. ఈ సందర్భంగా.. ''వరల్డ్ స్టంట్ సీక్వెన్స్‌లకు నివాళిగా ప్లే చేసిన కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లలో 'ఆర్ఆర్ఆర్' స్టంట్ సీక్వెన్స్‌లు ఉండటం స్వీట్ సర్‌ప్రైజ్‌లా ఉంది'' అని 'ఆర్ఆర్ఆర్' టీమ్ స్పందించింది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య 'ఆర్ఆర్ఆర్'ను నిర్మించారు.

నా కళ్లు చెబుతున్నాయి... - అల్ పచినో



మామూలుగా విజేతలను ప్రకటించే ముందు పోటీలో ఉన్న వారి పేర్లు చెప్పి, చివరిగా విజేత పేరు చెప్పడం జరుగుతుంది. అయితే ప్రముఖ నటుడు 83 ఏళ్ల అల్ పచినో ఈ విధానాన్ని అనుసరించలేదు. ఈ 'గాడ్ ఫాదర్' మూవీ ఫేమ్ ఉత్తమ చిత్రాన్ని ప్రకటించడానికి వేదికపైకి వచ్చారు. ఈ విభాగంలో పది చిత్రాలు పోటీ పడ్డాయి. ఈ చిత్రాల పేర్లు చెప్పకుండా.. 'ఇదిగో..' అంటూ మెల్లిగా ఎన్వలప్ కవర్‌ని ఓపెన్ చేస్తూ.. నా కళ్లు చెబుతున్నాయి టైప్‌లో నా కళ్లకు 'ఆపెన్‌హైమర్' కనబడుతోంది అనగానే వీక్షకుల నుంచి కరతాళ ధ్వనులు వినిపించాయి. అయితే అల్ పచినో ఈ విధంగా ప్రకటించడంతో.. అవార్డు ఈ సినిమాకే వచ్చిందా? అనే సందేహంలో కొందరు ఉండిపోయారు. అంతలోనే 'అవును.. అవును..' అన్నారు. అయితే అల్ పచినో ఇలా ప్రకటించడం పట్ల పలువురు విమర్శించారు. ఆస్కార్ అవార్డుల జాబితాలో ప్రధానమైన విభాగంలో పోటీ పడిన చిత్రాల పేర్లు చెప్పకుండా, పైగా వేడుకలో చివరి అవార్డు కాబట్టి కాస్తయినా సస్పెన్స్ మెయిన్‌టైన్ చేయకుండా చెప్పడం బాగాలేదని అంటున్నారు. ఇలా సాదా సీదా ప్రకటనతో ఆస్కార్ అవార్డు వేడుక ముగిసింది.

ఆమిర్ 'పీకే'ని తలపించేలా జాన్ సెనా



ఆస్కార్ అవార్డు వేడుకలో జరిగిన ఓ ఘటన ఆమిర్ ఖాన్ నటించిన 'పీకే' సినిమాని గుర్తు చేసింది. ఈ చిత్రంలో ఆమిర్ ఓ సీన్లో తన శరీరానికి ముందు భాగంలో ఓ రేడియో అడ్డుపెట్టుకుని అర్ధనగ్నంగా నటించారు. ఆస్కార్ వేదికపై ఇలాంటి సీనే రిపీట్ అయింది. స్టార్ రెజ్లర్ (డబ్ల్యూడబ్ల్యూఈ) జాన్ సెనా అర్ధనగ్నంగా ప్రత్యక్షమై షాక్ ఇచ్చారు. బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ అవార్డును ప్రకటించేందుకు జాన్ సెనా ఇలా అర్ధనగ్నంగా రావడం చర్చనీయాంశంగా మారింది. తన శరీరానికి ముందు భాగంలో విజేత వివరాలు ఉండే ఎన్వలప్ కవర్‌ను మాత్రమే అడ్డుపెట్టుకొని వేదికపైకి రావడంతో సభికులందరూ తెగ నవ్వుకున్నారు. అయితే తాను ఇలా రావడానికి కారణం ఉందన్నారు జాన్ సెనా. 'పురుషుడి శరీరం కూడా జోక్ కాదని, అలానే కాస్ట్యూమ్స్ అనేవి ముఖ్యం అని తెలియజెప్పేందుకే ఇలా వచ్చా' అన్నారు సెనా. అనంతరం 'పూర్ థింగ్స్' సినిమాకి ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ విభాగంలో అవార్డును ప్రకటించారు.

1974 సీన్ రిపీట్

దాదాపు 50 ఏళ్ల క్రితం (1974) జరిగిన ఆస్కార్ వేడుకల్లో నటి ఎలిజబెత్ టేలర్‌ను పరిచయం చేస్తుండగా ఓ వ్యక్తి నగ్నంగా వేదికపైకి దూసుకు రావడం అప్పట్లో సంచలనమైంది. తాజాగా జాన్ సెనా ప్రవర్తనతో నాటి ఘటనను కొందరు గుర్తుకు తెచ్చుకున్నారు.

ఫేక్ క్లాప్‌తో శునకానందం



ఆస్కార్ వేడుకలో ఈ ఏడాది ఓ శునకం అందరి దృష్టినీ ఆకర్షించింది. సభికులతో పాటు క్లాప్స్ కొట్టిన ఈ శునకం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. ఆస్కార్ కోసం పలు విభాగాల్లో పోటీ పడిన సినిమాల్లో 'అనాటమీ ఆఫ్ ఎ ఫాల్' ఒకటి. బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే విభాగంలో ఈ చిత్రం అవార్డును సొంతం చేసుకుంది. ఈ సినిమాలో నటించిన మెస్సీ (శునకం)ని అవార్డు వేడుకకు తీసుకొచ్చింది యూనిట్. 'ఆపెన్ హైమర్'కి రాబర్ట్ డౌనీ జూనియర్ ఉత్తమ సహాయ నటుడిగా అవార్డు అందుకుంటున్నప్పుడు అందరితో పాటు మెస్సీ చప్పట్లు కొట్టడం ఆకర్షణగా నిలిచింది. అయితే ఆ శునకం కూర్చున్న కుర్చీ కింద ఓ వ్యక్తి ఉండి, ఫేక్ చేతులతో క్లాప్ కొట్టాడు. అవి శునకం కాలిని పోలి ఉండటంతో మెస్సీయే చప్పట్లు కొట్టిందని భావించారంతా.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	617	73,503
నిఫ్టీ ▽	161	22,233

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,050	▽	36
డోజోన్స్	38,713	▽	10
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,669	△	9
డాక్స్	17,746	▽	68
షాంఘై	3,138	△	22
నికాయ్	38,820	▽	868

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	65,646
బంగారం (99.5 స్వచ్ఛత)	65,383
వెండి (కేజీ)	72,547

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	80.93	84.61
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	104.94	108.82
€	యూరో	భారతీయ	88.36	92.82
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	44.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	52.37	57.20
S$	సింగపూర్ డాలర్	భారతీయ	59.91	64.60
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.16	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.63	23.43
¥	చైనా యువాన్	భారతీయ	10.40	12.47

చిన్న షేర్లలో అవకతవకలు

సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురి వెల్లడి

ముంబై: చిన్న, మధ్యతరహా స్టాక్స్‌లో అవకతవకలు జరుగుతున్నట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురి పేర్కొన్నారు. కొంతమంది అసహజ లావాదేవీలకు తెరతీసినట్లు గుర్తించామని తెలియజేశారు. చిన్న, మధ్యతరహా సంస్థల(ఎస్‌ఎంఈలు) విభాగంలో కృత్రిమంగా ధరల పెంపును చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎస్‌ఎంఈ విభాగం ఐపీవోలతోపాటు.. సెకండరీ మార్కెట్లోనూ అక్రమ లావాదేవీలు జరుగుతున్నట్లు అభిప్రాయపడ్డారు. వెరసి రిస్కులు అధికంగాగల విభాగంలో ఇన్వెస్టర్లు మరింత జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉన్నట్లు సూచించారు. ఇక్కడ నిర్వహించిన ఒక సదస్సు సందర్భంగా మహిళా పాత్రికేయులతో ముచ్చటించిన పురి పలు అంశాలను ప్రస్తావించారు. ప్రధాన విభాగంతో పోలిస్తే ఎస్‌ఎంఈ విభాగం ప్రత్యేకమైనదని ఇన్వెస్టర్లు అర్థం చేసుకోవలసి ఉన్నట్లు పురి పేర్కొన్నారు. ప్రధాన విభాగంలోని కంపెనీలు తప్పనిసరిగా సమాచారాన్ని వెల్లడించవలసి ఉంటుందని, అయితే ఎస్‌ఎంఈ విభాగం రిస్కులు విభిన్నంగా ఉంటాయని ఇన్వెస్టర్లను హెచ్చరించారు.

28 నుంచి ఆప్షనల్ పద్ధతిలో టీ+0 సెటిల్‌మెంట్

సెక్యూరిటీల టీ+0 సెటిల్‌మెంట్‌ను మార్చి 28 నుంచి ఆప్షనల్ పద్ధతిలో ప్రవేశపెట్టనున్నట్లు పురి తెలియజేశారు. గత కొద్ది నెలల్లో భారీగా దూసుకెళుతున్న స్మాల్, మిడ్ క్యాప్ విభాగం షేర్ల విలువలపై స్పందిస్తూ కొన్ని కౌంటర్లలో అసహజ లావాదేవీలు నమోదవుతున్న సంకేతాలున్నట్లు వెల్లడించారు. ధరలను మ్యానిప్యులేట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవి బుడగలవంటివని వ్యాఖ్యానించారు. ఇలాంటి బుడగలు తలెత్తేందుకు అనుమతించకూడదని, ఇవి పగలిపోతే ఇన్వెస్టర్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని స్పష్టం చేశారు. ఇది మార్కెట్లకు మంచిదికాదని అభిప్రాయపడ్డారు.

స్టాక్ బ్రోకర్లకు కఠిన నిబంధనలు

కాగా, అర్హతగల స్టాక్ బ్రోకర్(క్యూఎస్‌బీ)గా గుర్తించే మార్గదర్శకాలను సెబీ తాజాగా విస్తృతం చేసింది. తద్వారా మరింతమంది బ్రోకర్లను నిబంధనల పరిధిలోకి తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు సెక్యూరిటీల మార్కెట్లో ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంపొందించే దిశగా తాజా చర్యలకు తెరతీసింది. యాజమాన్య సంబంధ లావాదేవీల పరిమాణం, నిబంధనలు, సమస్యల పరిష్కారం తదితర అంశాలను స్టాక్ బ్రోకర్లను క్యూఎస్‌బీలుగా గుర్తించడంలో పరిగణనలోకి తీసుకోనున్నట్లు ఒక సర్క్యులర్‌లో మార్కెట్ రెగ్యులేటర్ సెబీ పేర్కొంది.



పీఎఫ్‌సీ మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. పది రూపాయలు విలువ గల ఒక్కో షేరుకు రూ.3 చొప్పున మూడో మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకు రికార్డు తేదీని మార్చి 22గా నిర్ణయించింది. ఏప్రిల్ 10 లోగా డివిడెండ్ చెల్లించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఇప్పటి వరకు మొత్తం రూ.11ల మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

పిట్టి చేతికి బగాడియా చైత్ర ఇండస్ట్రీస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పిట్టి ఇంజనీరింగ్ తాజాగా బగాడియా చైత్ర ఇండస్ట్రీస్‌లో 100 శాతం వాటాలను చేజిక్కించుకుంది. డీల్ విలువ రూ.125 కోట్లు. కర్ణాటక కేంద్రంగా ఉన్న బగాడియా చైత్ర ఇండస్ట్రీస్‌కు గృహోపకరణాలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ తదితర రంగాల్లో అనుభవం ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-3-2024	
విశాఖ	450-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	433-00
విజయవాడ	433-00
రిటైల్ ధర (డజను)	72.00
11-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణ

- ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు
- ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు అమ్మకాలు



ఎస్‌బీఐ షేరు 2% నష్టపోయి రూ.773 వద్ద ముగిసింది. ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఈసీకి వెల్లడించడంపై గడువును మరింత పొడిగించాలని కోరుతూ ఎస్‌బీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం షేరుపై ప్రతికూల ప్రభావం చూపింది.

ముంబై: జీవితకాల గరిష్ట స్థాయిల వద్ద బ్యాంకింగ్, మెటల్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు సోమవారం దాదాపు ఒకశాతం నష్టపోయాయి. అమెరికా, భారత్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడి(మంగళవారం) ముందు ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడ్డారు. ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 685 పాయింట్లు పెరిగి 74,187 వద్ద, నిఫ్టీ 195 పాయింట్లు బలపడి 22,527 వద్ద ఆల్‌టైం హై స్థాయిలు అందుకున్నాయి. రికార్డు స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలకు దిగడంతో సూచీలు క్రమంగా ఆరంభ లాభాలు కోల్పోయాయి. సెన్సెక్స్ 617 పాయింట్లు పతనమైన 73,503 వద్ద నిలిచింది. నిఫ్టీ 161 పాయింట్ల నష్టంతో 22,333 వద్ద స్థిరపడింది. కాగా, బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ 2% క్షీణించింది.

- ఆర్‌బీఐ ఆంక్షల నేపథ్యంలో జేఎం ఫైనాన్షియల్ షేరు మరో పదిశాతం నష్టపోయి రూ.79 వద్ద ముగిసింది.
- రిటైల్ ఇన్వెస్టర్ల 'ఆఫర్ ఫర్ సేల్' ప్రక్రియ ప్రారంభంతో ఎన్ఎల్‌సీ ఇండియా షేరు 7% నష్టంతో రూ.233 వద్ద స్థిరపడింది.
- రూ.2,100 కోట్ల విలువైన ఆర్డర్లు దక్కించుకోవడంతో ఆర్‌వీఎన్ఎల్ షేరు 3% లాభంతో రూ.245 వద్ద నిలిచింది.
- ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఔషధ ఉత్పత్తిని, సదుపాయాలను మెరుగుపరచుకోడానికి ఆర్థిక సహాయం అందించే- ఫార్మాస్యూటికల్స్ టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ అసిస్టెన్స్ స్కీమ్ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో ఈ కంపెనీల షేర్లు లాభాలను ఆర్జించాయి.

లాజిస్టిక్స్ విభాగంలోకి మ్యాజిక్‌పిన్

న్యూఢిల్లీ: హైపర్‌లోకల్ ఈ-కామర్స్ స్టార్టప్ సంస్థ మ్యాజిక్‌పిన్ తాజాగా లాజిస్టిక్స్ అగ్రిగేషన్ విభాగంలోకి ప్రవేశించింది. వెలాసిటీ పేరిట ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసింది. షాడోఫ్యాక్స్, డన్‌జో, ర్యాపిడో, పోర్టర్, ఓలా, జిప్ వంటి థర్డ్ పార్టీ లాజిస్టిక్స్ (3పీఎల్) భాగస్వాములకు ఇది అగ్రిగేటర్‌గా వ్యవహరిస్తుంది. అలాగే నిర్దిష్ట సెగ్మెంట్లకు సంబంధించి క్విక్ కామర్స్ సర్వీస్‌లను కూడా వెలాసిటీ అందిస్తుంది. తమ భాగస్వాములు, అధునాతన టెక్నాలజీ సహాయంతో ఇప్పటికే తాము కేఎఫ్‌సీ, బర్గర్ కింగ్ తదితర 20 పైగా వ్యాపార సంస్థలకు సేవలు అందిస్తున్నామని, రోజుకు 5,000 ఆర్డర్లను డెలివర్ చేస్తున్నామని మ్యాజిక్‌పిన్ సీఈవో అన్షు శర్మ తెలిపారు.

ఆదిత్య బిర్లా క్యాపిటల్‌లో 'ఫైనాన్స్' విలీనం!

ముంబై: అనుబంధ సంస్థ ఆదిత్య బిర్లా ఫైనాన్స్ (ఏబీఎఫ్)ను విలీనం చేసుకోనున్నట్లు ఆదిత్య బిర్లా క్యాపిటల్ (ఏబీసీ) వెల్లడించింది. విలీనం తర్వాత ఏబీసీ హోదా హోల్డింగ్ కంపెనీ స్థాయి నుంచి ఆపరేటింగ్ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీగా (ఎన్‌బీఎఫ్‌సీ) మారుతుందని తెలిపింది. ఆర్థికంగా మరింత పటిష్టమైన సంస్థగా ఎదిగేందుకు, వ్యాపారాన్ని మరింతగా విస్తరించేందుకు ఇది దోహదపడగలదని ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. రుణాలు, పెట్టుబడులు, ఇన్సూరెన్స్ తదితర కార్యకలాపాలు నిర్వహించే ఏబీసీ నిర్వహణలో రూ. 4.10 లక్షల కోట్ల విలువ చేసే అసెట్స్ (ఏయూఎం) ఉన్నాయి.

రూపాయిలో వాణిజ్యానికి పలు దేశాల ఆసక్తి

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి

న్యూఢిల్లీ: పలు వర్ధమాన దేశాలు, సంపన్న దేశాలు భారత్‌తో రూపాయి మారకంలో వాణిజ్యం చేయడానికి ఆసక్తి చూపుతున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ విధానంలో లావాదేవీల వ్యయాలు తగ్గే అవకాశాలు ఉండటమే దీనికి కారణమని పేర్కొన్నారు. శ్రీలంక, బంగ్లాదేశ్‌తో పాటు పలు గల్ఫ్ దేశాలు ఈ జాబితాలో ఉన్నట్లు ఆయన చెప్పారు. 'ఈ విధానాన్ని సత్వరం ప్రారంభించేలా బంగ్లాదేశ్, శ్రీలంక ఇప్పటికే మనతో చర్చలు జరుపుతున్నాయి. పలు గల్ఫ్ దేశాలు కూడా దీనిపై ఆసక్తి చూపుతున్నాయి. దీని వల్ల ఒనగూరే ప్రయోజనాలు తెలిసే కొద్దీ మరిన్ని దేశాలు కూడా ఇందులో చేరొచ్చు. సింగపూర్ ఇప్పటికే కొంత మేర



లావాదేవీలు జరుపుతోంది' అని మంత్రి వివరించారు. ఈ పరిణామం భారత అంతర్జాతీయ వాణిజ్యంలో కొత్త కోణాన్ని ఆవిష్కరించగలదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భారత్ ఇప్పటికే నేపాల్, భూటాన్ వంటి పొరుగు దేశాలతో రూపాయి మారకంలో వాణిజ్య లావాదేవీలు నిర్వహిస్తోంది. యూఏఈ నుంచి కొనుగోలు చేసిన క్రూడాయిల్‌కి తొలిసారిగా రూపాయల్లో చెల్లింపులు జరిపింది.

అదానీతో క్వాల్‌కామ్ సీఈవో క్రిస్టియానో భేటీ

న్యూఢిల్లీ: చిప్‌ల తయారీ దిగ్గజం క్వాల్‌కామ్ సీఈవో క్రిస్టియానో ఆర్ ఎమోన్, అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ సోమవారం సమావేశమయ్యారు. కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు మొదలైన వాటి పాత్ర గురించి ఈ సందర్భంగా చర్చించినట్లు సోషల్ మీడియా సైట్ ఎక్స్‌లో అదానీ పోస్ట్ చేశారు. చెన్నైలో రూ. 177 కోట్లతో ఏర్పాటు చేసిన కొత్త డిజైన్ సెంటర్‌ను మార్చి 14న ఎమోన్ ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. వై-ఫై టెక్నాలజీలకు అనుబంధ ఆవిష్కరణలు లక్ష్యంగా కొత్త సెంటర్ వైర్‌లెస్ కనెక్టివిటీ సొల్యూషన్స్‌ను ఈ సెంటర్ రూపొందించనుంది. మరోవైపు, తమ సొంత పోర్టులు, లాజిస్టిక్స్, విద్యుదుత్పత్తి తదితర విభాగాల అవసరాల కోసం స్వల్ప మొత్తంలో తీసుకున్న 5జీ స్పెక్ట్రంనకు సంబంధించి ఉపయోగపడే సొల్యూషన్స్ కోసం అదానీ అన్వేషిస్తోంది. ఈ నేపథ్యంలో క్రిస్టియానో, అదానీ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.



భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

రైల్వే శాఖలో 4660 ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ).. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)-రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్ (ఆర్‌పీఎస్ఎఫ్)లో ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 4660
» **పోస్టుల వివరాలు:** సబ్-ఇన్‌స్పెక్టర్-452, కానిస్టేబుల్-4208.

అర్హత

» **సబ్-ఇన్‌స్పెక్టర్:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
వయసు: 01.07.2024 నాటికి 20 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
» **ప్రారంభ వేతనం:** రూ. 35,400.
» **కానిస్టేబుల్:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
వయసు: 01.07.2024 నాటికి 18 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
» **ప్రారంభ వేతనం:** రూ. 21,700.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(పీఈటీ), ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:**15.04.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**14.05.2024
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://rpf.indianrailways.gov.in/RPF

ఏపీ ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాల్లో బ్యాక్‌లాగ్ సీట్లలో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్).. ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు; అదేవిధంగా 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన బ్యాగ్‌లాగ్ సీట్ల భర్తీకి సంబంధించి ప్రవేశ ప్రకటన వెలువడింది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి, విద్య అందిస్తారు. గిరిజన, ఆదివాసీ గిరిజన, సంచార గిరిజన తదితర కేటగిరీలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** ఆరో తరగతిలో ప్రవేశాలు పొందాలనుకొనే విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి. 7, 8, 9 తర



గతుల్లో ప్రవేశానికి వరుసగా 6, 7, 8 తరగతుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష మించకూడదు.
» **వయసు:** 31.03.2024 నాటికి ఆరో తరగతికి 10 నుంచి 13 ఏళ్లు, ఏడో తరగతికి 11 నుంచి 14 ఏళ్లు, ఎనిమిదో తరగతికి 12 నుంచి 15 ఏళ్లు, తొమ్మిదో తరగతికి 13 నుంచి 16 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.03.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 13.04.2024.
» **వెబ్‌సైట్:** https://twreiscet.apcfss.in

ఏపీ ఐటీఐల్లో 71 అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒప్పంద ప్రాతిపదికన ఉపాధి మరియు శిక్షణా శాఖ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్(ఏటీవో) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 71
» **జోన్‌ల వారీగా ఖాళీలు:** జోన్1-06, జోన్2-08, జోన్3-03, జోన్4-54.
» **ట్రేడులు:** ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్, డ్రాఫ్ట్స్‌మ్యాన్ సివిల్, వైర్‌మాన్, సీవోపీఏ, డ్రెస్ మేకింగ్, మెకానిక్ మోటార్ వెహికల్, కార్పెంటర్, వర్క్‌షాప్ కాలిక్యులేషన్ అండ్ సైన్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్.
» **కాల వ్యవధి:** 11 నెలలు.
» **వేతనం:** రూ.35,570.
» **అర్హత:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. అలాగే సంబంధిత విభాగంలో బి.వొకేషనల్/డిగ్రీ/ డిప్లొమా / ఎన్‌టీసీ/ ఎన్‌సీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డెమో, అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.
» **వయసు:** 30.09.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్లు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.03.2024.
» **వెబ్‌సైట్:** https://detrecruitments.apcfss.in

టీఎస్ ఐసెట్-2024

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి(టీఎస్‌సీహెచ్ఈ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ఐసెట్)-2024 నోటిఫికేషన్ విడుదలచేసింది. పరీక్షను వరంగల్‌లోని కాకతీయ యూనివర్శిటీ (కేయూ) నిర్వహించనుంది. ఈ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు తెలంగాణ రాష్ట్రంలో కింది పేర్కొన్న యూనివర్శిటీలలో ప్రవేశాలు పొందవచ్చు.

» **అర్హత:** ఎంబీఏకు కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. ఎంసీఏకు కనీసం 50శాతం మార్కులతో ఇంటర్/డిగ్రీ స్థాయిలో మ్యాథ్స్ సబ్జెక్ట్‌తో బీసీఏ/బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆలస్య రుసుం లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 17.05.2024 నుంచి 20.05.2024 వరకు
» **పరీక్ష తేదీలు:** 2024 జూన్ 4, 5 తేదీల్లో
» **వెబ్‌సైట్:** https://icet.tsche.ac.in

ఏపీ ఆర్‌డీసీసెట్-2024

గుంటూరులోని ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (ఏపీఆర్ఈఐఎస్).. పల్నాడు జిల్లా నాగార్జునసాగర్‌లోని రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ(ఇంగ్లిష్ మాధ్యమం) మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఆర్‌డీసీ) సెట్-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులైన విద్యార్థులు(బాలురు) నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 152
» **గ్రూపు-సీట్లు:** బీఏ(హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్)-40 సీట్లు, బీకాం-40 సీట్లు, బీఎస్సీ(మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)-36 సీట్లు, బీఎస్సీ(మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్)-36 సీట్లు.
» **అర్హత:** 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** కామన్ ఎంట్రన్స్ టెస్ట్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.03.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 25.04.2024.
» **వెబ్‌సైట్:** https://aprs.apcfss.in

రైల్వేలో టెక్నీషియన్ కొలువులు

» 9,144 పోస్టుల భర్తీకి రైల్వే శాఖ నోటిఫికేషన్
» ఆన్‌లైన్ రాత పరీక్ష ద్వారా ఎంపిక ప్రక్రియ

భారతీయ రైల్వే దేశంలోని పలు రైల్వే జోన్ల పరిధిలో.. టెక్నికల్ విభాగాల్లో.. భారీ ఎత్తున కొలువుల భర్తీకి రంగం సిద్ధం చేసింది! మొత్తం 9,144 పోస్టులతో తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిల్లో టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులు 1092 ఉండగా.. టెక్నీషియన్ గ్రేడ్ 3 పోస్టులు 8052 ఉన్నాయి. వీటికి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఏప్రిల్ 8వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఆర్ఆర్‌బీ టెక్నికల్ పోస్టులు, ఎంపిక విధానం, పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు..

రైల్వే శాఖ భారీ సంఖ్యలో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆయా పోస్టులకు వేర్వేరు అర్హతలు పేర్కొన్నారు. సంబంధిత అర్హతలున్న అభ్యర్థులు ఆన్‌లైన్ రాత పరీక్షలో ప్రతిభ చూపితే రైల్వేలో కొలువుదీరొచ్చు.

అర్హతలు

- టెక్నీషియన్ గ్రేడ్ 1సిగ్నల్ పోస్టులకు బీఎస్సీ, బీఈ/బీటెక్, డిప్లొమా (ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్‌సైన్స్/ఐటీ/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.
- టెక్నీషియన్ గ్రేడ్3 పోస్టులకు మెట్రిక్యులేషన్, ఎస్ఎస్ఎల్‌సీ,ఐటీఐ లేదా 10+2 ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

01.07.2024 నాటికి టెక్నీషియన్ గ్రేడ్ 1 సిగ్నల్ పోస్టులకు 18-36 ఏళ్ల మధ్య ఉండాలి. టెక్నీషియన్ గ్రేడ్ 3 పోస్టులకు 18-33 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ప్రారంభ వేతనం

టెక్నీషియన్ గ్రేడ్ 1 సిగ్నల్ పోస్టులకు నెలకు రూ.29,200, టెక్నీషియన్ గ్రేడ్ 3 పోస్టులకు నెలకు రూ.19,900 ప్రారంభ వేతనం లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ ఇలా

- టెక్నీషియన్ గ్రేడ్ 1 సిగ్నల్ పోస్టులకు, టెక్నీషియన్ గ్రేడ్ 3 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ అప్టిట్యూడ్ టెస్ట్) నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించిన వారికి డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా తుది ఎంపిక చేపడతారు.
- టెక్నీషియన్ గ్రేడ్-1(సిగ్నల్).. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) వంద మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్ అవేర్‌నెస్ 10 ప్రశ్నలు-10 మార్కులు,జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 15 ప్రశ్నలు-15 మార్కులు,బేసిక్స్ ఆఫ్ కంప్యూటర్స్ అండ్ అప్లికేషన్స్ 20 ప్రశ్నలు-20 మార్కులు,



మ్యాథమెటిక్స్ 20 ప్రశ్నలు-20 మార్కులు, బేసిక్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 35 ప్రశ్నలు-35 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 90 నిమిషాలు.

- టెక్నీషియన్ గ్రేడ్ 3 పోస్టులకు.. నిర్వహించే రాత పరీక్ష వంద మార్కులకు ఉంటుంది. ఇందులో మ్యాథమెటిక్స్ 25 ప్రశ్నలు-25 మార్కులు, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 25 ప్రశ్నలు-25 మార్కులు, జనరల్ సైన్స్ 40 ప్రశ్నలు-40 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 10 ప్రశ్నలు-10 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.

పదోన్నతులతో ఏఈ స్థాయికి

టెక్నీషియన్ గ్రేడ్-1 (సిగ్నల్), టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులలో నియమితులైన వారు భవిష్యత్తులో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ హోదాకు చేరుకునే అవకాశం ఉంది. తొలుత సీనియర్ టెక్నీషియన్‌గా పదోన్నతి లభిస్తుంది. ఆ తర్వాత జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్ట్ వరకు చేరుకోవచ్చు. ఇందుకోసం ఆర్ఆర్‌బీలు అంతర్గతంగా నిర్వహించే డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌లలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. సీనియారిటీ ప్రాతిపదికగా ఏఈఈ వరకు చేరుకోవచ్చు.

రాత పరీక్షల్లో రాణించేలా

మ్యాథమెటిక్స్

నంబర్ సిస్టమ్, బాడ్‌మాస్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, ఎల్‌సీఎం, హెచ్‌సీఎఫ్; రేషియో అండ్ ప్రపోర్షన్; పర్సంటేజెస్, మెన్సురేషన్; టైం అండ్ వర్క్; టైం అండ్ డిస్టెన్స్; ఇంట్రస్ట్; ప్రాఫిట్ అండ్ లాస్, ఆల్జీబ్రా, ట్రిగనోమెట్రీ, జామెట్రీ, కేలండర్ అండ్ క్లాక్‌పై పట్టు సాధించాలి. వీటికోసం తొలుత పాఠశాల స్థాయి పాఠ్యపుస్తకాల్లో ఉన్న సిలబస్‌లోని అంశాలకు సంబంధించిన ప్రాథమిక భావనలపై అవగాహన పెంపొందించుకోవాలి.అదే విధంగా బ్యాంకు, ఎస్ఎస్‌సీ, రైల్వే పరీక్షలకు సంబంధించిన పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది.

జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్

అనాలజీస్, ఆల్ఫాబెటికల్, నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, మ్యాథమెటికల్ ఆపరేషన్స్, రిలేషన్‌షిప్స్, జంబ్లింగ్, వెన్‌డయాగ్రమ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, సఫీషియెన్సీ; కన్‌క్లూజన్ అండ్ డెసిషన్ మేకింగ్; సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్; అనలిటికల్ రీజనింగ్; క్లాసిఫికేషన్; డైరెక్షన్స్ తదితర అంశాలపై దృష్టి సారించాలి.

జనరల్ అవేర్‌నెస్

- జాతీయ,అంతర్జాతీయ ప్రాధాన్యమున్న కరెంట్ అఫైర్స్, క్రీడలు, భారత చరిత్ర, సంస్కృతి, ముఖ్యమైన చారిత్రక ప్రదేశాలు, జనరల్ సైన్స్-లైఫ్ సైన్స్ (పదో తరగతి స్థాయి), స్వాతంత్ర్య ఉద్యమం, జాగ్రఫీ, రాజ్యాంగం, రాజకీయ వ్యవస్థ, సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరిక్షం, భారత అణు కార్యక్రమం, ఐక్యరాజ్యసమితి, ఇతర ముఖ్యమైన అంతర్జాతీయ సంస్థలు, పర్యావరణ అంశాలు, కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, దేశంలో రవాణా వ్యవస్థ, భారత ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ పథకాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.
- **మెంటల్ ఎబిలిటీ:** ఇందులో అనాలజీస్, నంబర్ సిరీస్, కోడింగ్, డీ కోడింగ్, రిలేషన్‌షిప్స్, సిలాజిజమ్, జంబ్లింగ్, వెన్ డయాగ్రమ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, క్లాసిఫికేషన్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్స్-ఆర్గ్యుమెంట్స్‌పై దృష్టి సారించాలి.

జనరల్ సైన్స్

యూనిట్స్, ఫోర్స్, ప్రెజర్; మెకానిక్స్, సౌండ్, హీట్, లైట్, ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజం, మోడర్న్ ఫిజిక్స్ తదితర అంశాల్లోని బేసిక్ కాన్సెప్టులు, సూత్రాలపై అవగాహన పెంచుకోవాలి. కెమిస్ట్రీలో ఆటమ్స్, మాలిక్యూల్స్, యాసిడ్స్, బేసెస్, మెటల్స్ అండ్ నాన్ మెటల్స్; కార్బన్ కాంపౌండ్స్, మెటలర్జీ తదితర అంశాలపై పట్టు సాధించాలి. అదే విధంగా లైఫ్ సైన్సెస్‌కు సంబంధించి హ్యూమన్ బాడీ, విటమిన్లు, న్యూట్రిషన్, నెర్వస్ సిస్టమ్, హార్మోన్లు, ఎంజైమ్‌లు, సూక్ష్మజీవులు, వ్యాధులు, టీకాలు, పర్యావరణం తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

బేసిక్ సైన్స్, ఇంజనీరింగ్

ఇంజనీరింగ్ డ్రాయింగ్ (ప్రొజెక్షన్స్, వ్యూస్, డ్రాయింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, లైన్స్, జామెట్రిక్ ఫిగర్స్, సింబాలిక్ రిప్రెజెంటేషన్స్), యూనిట్స్, మెజర్‌మెంట్స్; మాస్ వెయిట్ అండ్ డెన్సిటీ; వర్క్ పవర్ అండ్ ఎనర్జీ; స్పీడ్ అండ్ వెలాసిటీ; హీట్ అండ్ టెంపరేచర్; బేసిక్ ఎలక్ట్రిసిటీ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 8
- సీబీటీ-1: అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం
- సీబీటీ-2: డిసెంబర్‌లో నిర్వహించే అవకాశం
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.rrbsecunderabad.gov.in

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

పెద్ద కొడుకులా ఆదుకున్నారు



ముప్పై ఏళ్ల నుంచి రోడ్డు మార్జిన్‌లో పూరిపాకలో నివాసం ఉండేవాళ్లం. బిక్కు బిక్కుమంటూ గడిపాం. సొంతింటి కల సాకారం అవుతుందని అనుకోలేదు. గతంలో ఇంటి కోసం నాయకులు చుట్టూ తిరిగి అలసి పోయాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటికి వచ్చి మా వివరాలు తీసుకుని వెళ్లారు. ఇంటి స్థలం, ఇల్లు మంజూరైంది. జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకోగలిగాం. మాకు ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి. అందరికి పెళ్లిళ్లు చేశాం. జగన్‌మోహన్‌రెడ్డి నా పెద్ద కొడుకులా ఆదరించారు. నేను మాంసం దుకాణంలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడిని. అనుకోకుండా రెండేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. మూలన పడ్డాను. ఇప్పుడు ప్రభుత్వం అందిస్తున్న రూ.3 వేలు పింఛనే నా కుటుంబానికి ఆధారమైంది. గత ఏడాది వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో గుండె ఆపరేషన్ చేయించుకున్నాను. ఆపరేషన్ అనంతరం ఇంటికి వచ్చే సమయంలో పోషణ నిమిత్తం రూ.90 వేలు ఇచ్చారు.. నా భార్య మదీనా బీబీకి చేయూత పథకం ద్వారా మూడేళ్ల నుంచి ఏటా రూ.18,500 సాయం అందుతోంది. మాది తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం వేములూరు గ్రామం. మాలాంటి వాళ్లం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలం.

– ఎస్‌కే వల్లీ మస్తాన్,
–జీవీవీ సత్యనారాయణ, విలేకరి, కొవ్వూరు

జగనన్న సాయంతో నా కుటుంబం ఖుషీ



జగనన్న ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ సాయంతో ఇప్పుడు నా కుటుంబం హ్యాపీగానే ఉంది. మాది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణం సీతాపతిరావు పేటవీధి. నేను ఇంటి వద్దే స్వయం ఉపాధి పొందుతున్నాను. నా కుటుంబం ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాల నుంచి లబ్ధి అందుకుంటున్నారు. స్వయం సహాయక సంఘం సభ్యురాలినైన నేను ప్రస్తుతం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రగతి యూనిట్ ద్వారా ఇచ్చిన రుణంతో పేపర్ ప్లేట్ల యూనిట్‌ను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నాను. జగనన్న ప్రభుత్వం వచ్చాక మా అబ్బాయిని ఓ దారిలో పెట్టుకునే అవకాశం కూడా వచ్చింది. ప్రస్తుతం మా అబ్బాయి వార్డు సచివాలయం పరిధిలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రతీ నెలా నేను వితంతు పింఛన్ రూ.3 వేలు అందుకుంటున్నాను. ఆసరా పథకం ద్వారా కూడా లబ్ధి పొందాను. గత ప్రభుత్వంలో సాయం పొందాలంటే ఎన్నో వ్యయప్రయాసలకోర్చాల్సి వచ్చేది. ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో అందుతున్న సాయంతో సంతోషంగా ఉంటున్నాం.

– కుదుపూడి సుజాత, సీతాపతిరావుపేట వీధి
– (పరసా సుబ్బారావు, విలేకరి, అమలాపురం టౌన్)

మా కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకున్నారు



నాయీ బ్రాహ్మణ కుటుంబం మాది. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం బొంతల వీధి. తెలుగు దేశం హయాంలో ఎటువంటి పథకాలూ వర్తించలేదు. ఇంటి కోసం కాళ్లా వేళ్లా పడ్డా ప్రయోజనం లేకపోయింది. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత పలు పథకాలు మాకు వర్తిస్తున్నాయి. ఆనందంగా జీవిస్తున్నాం. జమ్ము పంచాయతీ గడ్డెయ్యపేట వద్ద మూడు లక్షల విలువైన ఇంటి స్థలం ఇచ్చారు. ఇళ్లు కట్టుకోవడానికి రూ.1.85 లక్షలు మంజూరు చేశారు. డబ్బు సరిపోకపోతే డ్వాక్రా నుంచి రూ. 50 వేలు వడ్డీలేని రుణం ఇచ్చారు. మా భార్యకు ఆసరా పథకం వర్తించింది. రూ.60 వేలు మాఫీ చేశారు. పాప 8వ తరగతి చదువుతోంది. అమ్మ ఒడి నాలుగేళ్లుగా వస్తోంది. ఈ ఏడాది ట్యాబు కూడా ఇచ్చారు. నాకు మెయిన్ రోడ్డులో సెలూన్ షాపు ఉంది. దీనికి జగనన్న చేదోడు పథకంలో రూ.10 వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు ఇచ్చారు. షాపునకు కరెంట్ బిల్లు కూడా ప్రభుత్వమే కడుతోంది. ఇంటిల్లిపాదీ అందరికీ పథకాలు అమలు చేయడంతో మాకు ఎంతో మేలు జరిగింది.

– దాసరి శ్రీరాములు, బొంతల వీధి
– మామిడి రవి, విలేకరి, నరసన్నపేట

బడుగుల భూచోరుడు చంద్రబాబే..

అమరావతిలో అసైన్డ్ భూములు కొల్లగొట్టింది పచ్చగద్దలే



- సాక్షి, అమరావతి

రాజధాని పేరిట అమరావతిలో చోటుచేసుకున్న భూదోపిడీకి కర్త, కర్మ, క్రియ అంతా చంద్రబాబు ముఠానేనని సీఐడీ తేల్చింది. ఈ కేసులో ఏ–1గా చంద్రబాబు, ఏ–2గా నారాయణలతోపాటు పలువురిపై విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో సోమవారం చార్జ్‌షీట్ కూడా దాఖలు చేసింది. ఐపీసీ సెక్షన్లు 420, 409, 506, 166, 167, 217, 120 (బి), 109 రెడ్‌విత్ 34, 35, 36, 37.. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంలోని సెక్షన్లు 3(1),(జి), 3(2), అసైన్డ్ భూముల అన్యాక్రాంత నిరోధక చట్టంలోని సెక్షన్లు 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద వారిపై అభియోగాలు నమోదు చేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతుల అసైన్డ్ భూములను చంద్రబాబు బ్యాచ్ కొల్లగొట్టిందన్నది ఆధారాలతో సహా సీఐడీ వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. కేంద్ర అసైన్డ్ భూముల అన్యాక్రాంత నిరోధక చట్టాన్ని ఉల్లంఘించి మరీ సాగించిన ఈ భూబాగోతం యావత్ దేశాన్ని విస్మయపరిచింది. ఏకంగా రూ.4,400 కోట్లు విలువైన 1,100 ఎకరాల అసైన్డ్ భూములను చంద్రబాబు, నారాయణ తమ బినామీలు, సన్నిహితుల పేరిట గుప్పెట పట్టారన్నది సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో తేలింది.

అసైన్డ్ భూ దోపిడీదారులు వీరే..

A1	నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి
A2	పొంగూరు నారాయణ, టీడీపీ ప్రభుత్వంలో మున్సిపల్, సీఆర్‌డీఏ శాఖ మంత్రి
A3	అన్నే సుధీర్‌బాబు, (అప్పటి తుళ్లూరు మండల తహసీల్దార్)
A4	కేపీవీ అంజనీకుమార్ (ఎండీ, రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్)

జీఓ-1తో భయపెట్టి.. జీఓ-41తో భూదోపిడీ

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని పేరిట భారీ భూదోపిడీకి చంద్రబాబు స్కెచ్ వేశారు. అందుకోసం పక్కా పన్నాగంతో రాజధాని కోసం భూసమీకరణ ప్యాకేజీని నిర్ణయిస్తూ 2015, జనవరి 1న జీఓ–1ను జారీచేశారు. అందులో అమరావతిలో ప్రైవేటు భూములకే భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించారు. అసైన్డ్ భూములకు ఎలాంటి ప్యాకేజీ ప్రకటించలేదు. అనంతరం.. చంద్రబాబు, నారాయణ తమ బినామీలైన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వారి ఏజెంట్లను గ్రామాల్లోకి పంపించి భయపెట్టారు. తమకు ఆ భూములు విక్రయిస్తే కొంతైనా డబ్బులు వస్తాయని చెప్పారు. తీవ్ర ఆందోళనకు గురైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులు అత్యంత తక్కువ ధరకు అంటే ఎకరాకు కేవలం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకే చంద్రబాబు, నారాయణ, ఇతర టీడీపీ పెద్దల బినామీలకు అసైన్డ్ భూములను సేల్‌డీడ్ల ద్వారా విక్రయించేలా చేశారు. చంద్రబాబు, నారాయణ తమ బినామీలైన కేపీవీ అంజనీకుమార్ (రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్), గుమ్మడి సురేశ్, కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి, కొల్లి శివరామ్‌లతోపాటు నారాయణ కుటుంబ సభ్యుల పేరిట ఆ అసైన్డ్ భూములు బదలాయించారు. అనంతరం.. మంగళగిరి తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులపై ఒత్తిడి తెచ్చి వాటిని అక్రమంగా బదలాయిస్తూ 'జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) ద్వారా రిజిస్ట్రేషన్లు చేయించారు. అసైన్డ్ భూములను అలా జీపీఏ పేరిటగానీ ఇతరత్రా విధాలుగాగానీ బదిలీ చేయడం చట్టవిరుద్ధం. ఆ తర్వాత ఆ భూములకు కూడా భూసమీకరణ ప్యాకేజీ ప్రకటిస్తూ 2016, ఫిబ్రవరి 17న జీఓ–41 జారీచేశారు. తద్వారా తాము బినామీల పేరిట హస్తగతం చేసుకున్న అసైన్డ్ భూములకు సీఆర్‌డీఏ భారీ ప్యాకేజీ దక్కేలా చేశారు.

ప్రభుత్వ ఒత్తిడితోనే అంటూ అధికారుల వాంగ్మూలం

నిజానికి.. అసైన్డ్ భూములను కొనుగోలు చేయడం చట్టవిరుద్ధం. వాటికి భూసమీకరణ కింద ప్యాకేజీ ప్రకటించడానికి వీల్లేదు. అదే విషయాన్ని స్పష్టంచేస్తూ రెవెన్యూ ఉన్నతాధికారులతోపాటు అడ్వకేట్ జనరల్ కూడా అసైన్డ్ భూముల బదలాయింపును గుర్తిస్తూ వారికి కూడా భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించడాన్ని వ్యతిరేకించారు. కానీ.. చంద్రబాబు, నారాయణ ఉన్నతాధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి తాము చెప్పినట్లు చేయమని హుకుం జారీచేశారు. నిబంధనలకు విరుద్ధం అయినప్పటికీ అప్పటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే అసైన్డ్ భూముల బదలాయింపు చేశామని నాటి రెవెన్యూ ఉన్నతాధికారులు న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక ఈ కేసులో నిందితుడిగా ఉన్న కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి తనను అప్రూవర్‌గా పరిగణించమని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

1,100 ఎకరాలు.. 1,336 మంది బినామీలు

- నారాయణ కుటుంబసభ్యుల పేరిటే 162 ఎకరాలు

- అసైన్డ్ భూదోపిడీ కోసం చంద్రబాబు ముఠా రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్‌కు తెగబడింది. రెవెన్యూ రికార్డులు, సీఆర్‌డీఏ భూసమీకరణ రికార్డులను సీఐడీ అధికారులు పరిశీలించగా మొత్తం వ్యవహారం బయటపడింది. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న పేర్లకు విరుద్ధంగా సీఆర్‌డీఏ భూసమీకరణ ప్యాకేజీ ఇచ్చిన వాటిలో 1,336 మంది బినామీల పేర్లు ఉండటం గమనార్హం.
- నారాయణ విద్యా సంస్థల బ్యాంకు ఖాతాల నుంచే రూ.16.5 కోట్ల నిధులను రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. అనంతరం ఆ నిధులను నారాయణ విద్యా సంస్థల ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించి వారి పేరున అసైన్డ్ భూములను అక్రమంగా జీపీఏ రిజిస్ట్రేషన్లు చేయించారు.
- నారాయణ కుటుంబ సభ్యుల పేరిటే అక్రమంగా 162 ఎకరాల అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేశారు. వీటి విలువ రూ.650కోట్లు. నారాయణ 16.5 కోట్లు పెట్టుబడి పెట్టి రూ.650కోట్ల భూములు కొల్లగొట్టారు.
- అంతేకాక.. దాదాపు రూ.4వేల కోట్ల విలువైన మరో 1,000 ఎకరాల వరకు చంద్రబాబు, నారాయణ బినామీల పేరిట అక్రమంగా జీపీఏ రిజిస్ట్రేషన్లు చేయించారు.

స్విమ్స్‌లో 479 నర్సు పోస్టుల భర్తీకి చర్యలు

టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి
టీటీడీ పాలకమండలి సమావేశంలో పలు అంశాలకు ఆమోదం



టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుమల: స్విమ్స్ ఆస్పత్రిలో 479 నర్సు పోస్టులు భర్తీ చేసేందుకు టీటీడీ పాలక మండలి ఆమోదించినట్లు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. సమావేశ నిర్ణయాలను చైర్మన్ భూమన మీడియాకు వెల్లడించారు. ఆ వివరాల్లో కొన్ని ఇలా.. టీటీడీలో గతంలో చాలామంది నోటిఫికేషన్, రూల్ ఆఫ్ రిజర్వేషన్(ఆర్‌వోఆర్) ద్వారా కాకుండా బోర్డు ఆమోదంతో ఉద్యోగాల్లో చేరిన కాంట్రాక్టు, పొరుగు సేవల ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి నివేదిక పంపాలని నిర్ణయించారు. టీటీడీ కళాశాలల విద్యార్థులకు అవసరమైన హాస్టళ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. రూ.1.88 కోట్లతో తిరుమలలో భక్తుల సౌకర్యార్థం పీఏసీ–1లో 10 లిఫ్టుల ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రూ.14 కోట్లతో తిరుమలలో టీటీడీ ఉద్యోగుల పాత సీ టైప్, డీ టైప్, కొత్త సీ టైప్, డీ టైప్ క్వార్టర్లలో మిగిలి ఉన్న 184 క్వార్టర్ల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఐదేళ్ల పాటు డేటా సెంటర్ల మెయింటినెన్స్ కోసం రూ.12 కోట్లు మంజూరు చేయడానికి ఆమోదం తెలిపారు. ఆలయాల్లో అభివృద్ధి పనులను శ్రీవాణి ట్రస్టు నిధుల ద్వారా చేపట్టేందుకు ఆమోదించారు. దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో వీరబ్రహ్మం పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

టీటీడీ ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుమలలో సోమవారం నిర్వహించిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సభ్యులకు సంవత్సరంలో కొన్ని సార్లు మాత్రమే వారి కుటుంబ సభ్యులతో (భార్య, పిల్లలు, తల్లిదండ్రులతో) శ్రీవారి దర్శనం చేసుకునే అవకాశం బోర్డు కల్పించిందని చెప్పారు. కొందరు సభ్యులు నిబంధనకు విరుద్ధంగా తమ కుటుంబ సభ్యులతో కాకుండా ఇతరులను వెంట బెట్టుకొని శ్రీవారి దర్శనం కోసం పదే పదే రావడం మంచి పద్ధతి కాదని చెప్పారు. భవిష్యత్తులో అలా వచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రీవారి దర్శనానికి అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

నటుడు, దర్శకుడు సూర్యకిరణ్ కన్నుమూత

తమిళ సినిమా: నటుడు, దర్శకుడు, నిర్మాత సూర్యకిరణ్ (48) కన్నుమూశారు. కొద్ది రోజులుగా పచ్చ కామెర్లతో బాధపడుతున్న ఆయన సోమవారం మధ్యాహ్నం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. సూర్యకిరణ్ అసలు పేరు సురేశ్. కేరళలోని తిరువనంతపురానికి చెందిన టి.ఎస్.మణి, రాధ సూర్యకిరణ్ తల్లిదండ్రులు. 'స్నేహికన్ ఒరు పెన్ను' (1978) అనే మలయాళ చిత్రం ద్వారా బాల నటుడిగా చిత్రపరిశ్రమలో అడుగుపెట్టారు సూర్యకిరణ్. మలయాళం, తమిళం, తెలుగు భాషల్లో దాదాపు 200కుపైగా చిత్రాల్లో బాలనటుడిగా, సహాయ నటుడిగా పాపులర్ అయ్యారు. ఆ తర్వాత తన పేరును సూర్యకిరణ్‌గా మార్చుకుని తెలుగులో సుమంత్ హీరోగా నటించిన 'సత్యం' (2003) చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యారు. నటి కల్యాణిని ప్రేమించి పెళ్లి చేసుకున్నప్పటికీ ఆ తర్వాత వారు విడిపోయారు. సూర్యకిరణ్ సోదరి సుజిత కూడా నటే. తెలుగు, తమిళ చిత్రాలు, సీరియల్స్ ద్వారా ఆమె సుపరిచితురాలే. సూర్యకిరణ్ మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

వైఎస్ వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి బెయిల్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడి (ఏ5)గా సీబీఐ పేర్కొన్న డి.శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.2 లక్షల పూచీకత్తు సీబీఐ కోర్టుకు సమర్పించాలని, ప్రతి సోమవారం సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య హాజరు కావాలని, కేసులో ప్రత్యక్షంగా, పరోక్షంగా జోక్యం చేసుకోవద్దని, కోర్టులో విచారణ ముగిసే వరకు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించొద్దని ఆదేశించింది. అలాగే పాస్‌పోర్టు ట్రయల్ కోర్టుకు సమర్పించాలని, విచారణలో కోర్టుకు సహకరించాలని, ఎలాంటి క్రిమినల్ కార్యకలాపాలకు పాల్పడవద్దని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్ వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డిని సీబీఐ 2021లో అరెస్టు చేసింది. అప్పటి నుంచి జైలులో ఉంటున్న ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గత సంవత్సరం సెప్టెంబర్ 19న సీబీఐ కోర్టు కొట్టివేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. తనకు ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదని, సీబీఐ వద్ద ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేకుండానే అరెస్టు చేసిందని, బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ జరిపి, సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు, సీబీఐ తరఫున స్పెషల్ పీపీ అనిల్ తన్వర్ వాదనలు వినిపించారు. హైకోర్టు బెయిల్ మంజూరు చేసినందున శివశంకర్‌రెడ్డి నేడు జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉంది.

ఏళ్లుగా జైలులో ఉంచడం సరికాదు

నిందితులనే పేరుతో ఏళ్ల తరబడి జైలులో ఉంచడం సరికాదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పలు సుప్రీంకోర్టు తీర్పులు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేశాయని తెలిపారు. నిందితుని తరఫు న్యాయవాది వాదనలతో పాటు ఈ విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు వివరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం నిందితులకు కూడా హక్కులు ఉంటాయని స్పష్టం చేశారు. నిందితుని తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. '2021 అక్టోబర్ 26న సీబీఐ దాఖలు చేసిన అభియోగపత్రంలో శివశంకర్‌రెడ్డిపై ఎలాంటి ఆరోపణలు లేవు. హంతకుడు దస్తగిరి (ఏ4)ని అప్రూవర్‌గా పేర్కొన్నారు. అతను చెప్పిన స్టేట్‌మెంట్‌లో శివశంకర్‌రెడ్డిపై ఆరోపణలు చేశాడు. 2022 జనవరి 31న దాఖలు చేసిన తొలి మధ్యంతర అభియోగపత్రంలో శివశంకర్‌రెడ్డిని ఏ5గా చేర్చారు. కేసులో ఇరికించడానికే నిందితుడిగా చేర్చారు. దస్తగిరి చెప్పిన సెక్షన్ 161, 164 స్టేట్‌మెంట్లలో పరస్పర విరుద్ధ అంశాలున్నాయి. కేసు తీవ్రతను గుర్తించని ట్రయల్ కోర్టు కీలక నిందితుడు దస్తగిరికి ముందస్తు బెయిల్ ఇచ్చి విడుదల చేసింది. హత్య, సాక్ష్యాల చెరిపివేతలో శివశంకర్‌రెడ్డికి సంబంధం ఉన్నట్లు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవు. అయినా 2021 నవంబర్ 17 నుంచి జైలులో ఉంచడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. 55 ఏళ్ల శివశంకర్‌రెడ్డి వెన్ను నొప్పితో బాధపడుతున్నారు. భుజానికి కూడా ఇటీవలే శస్త్రచికిత్స జరిగింది. నిరంతరం వైద్యుల పర్యవేక్షణ అవసరం. దీని మెడికల్ రిపోర్టును కూడా అందజేశాం' అని కోర్టుకు వివరించారు.

పారిశ్రామిక రాజధానిగా విశాఖ

- ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్

సాక్షి, అమరావతి: వచ్చే ఐదేళ్లలో విశాఖపట్నం దేశంలోనే ఒక ప్రధాన పారిశ్రామిక రాజధానిగా ఎదుగుతుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏఎన్‌యూ) వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ చెప్పారు. ఏఎన్‌యూలో సోమవారం 'వాయిస్ ఆఫ్ ఏపీ–ఐటీ' పేరిట రాష్ట్రంలో ఐటీ అవకాశాలు, ప్లేస్‌మెంట్స్ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ రాజధానిగా విశాఖ ఎదగడమే కాకుండా అనేక మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సీఈవో డీవీ రామకోటిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నారని, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ఏటా లక్ష మంది విద్యార్థులు ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కోర్సులు పూర్తిచేస్తే అందులో 60వేల మంది క్యాంపస్ ఇంటర్వ్యూల్లోనే ఉద్యోగాలు సాధిస్తుండటం మన విద్యార్థుల ప్రతిభకు తార్కాణమన్నారు. రాష్ట్రంలో ఏర్పాటవుతున్న పారిశ్రామిక పార్కులు, పోర్టులు, షిప్పింగ్ యార్డుల వల్ల వేలాది మంది విద్యార్థులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఏపీఎస్‌ఆర్టీఎస్ చైర్మన్ వెంకట్ ఎస్ మేడపాటి మాట్లాడుతూ విద్యార్థులు విదేశీ అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విద్యా దీవెనతోపాటు ఉచితంగా జీఆర్‌ఈ, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్ శిక్షణలను అందిస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా, ఫిక్సిటీ వంటి పలు ప్రముఖ ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొని తాము అందిస్తున్న కోర్సుల వివరాలను తెలియజేశారు.

అన్ని అసెంబ్లీ సీట్లలోనూ ఓటమి తప్పదు!

- నైరాశ్యంలో జనసైనికులు
- మాజీ ఎంపీ హరిరామజోగయ్య మరో లేఖాస్త్రం

పాలకొల్లు సెంట్రల్: పవన్‌కళ్యాణ్‌పై మాజీ ఎంపీ, రాజకీయ విశ్లేషకుడు చేగొండి హరిరామజోగయ్య మరో లేఖాస్త్రం సంధించారు. పవన్ కాకినాడ నుంచి ఎంపీగా పోటీ చేస్తారన్న ప్రచారం నిజమైతే 24 అసెంబ్లీ సీట్లలోనూ జనసేన ఓటమి తప్పేలా లేదని సోమవారం విడుదల చేసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. (సోమవారం సాయంత్రానికి జనసేన సీట్లు 21కి తగ్గాయి.) హరిరామజోగయ్య లేఖలోని ముఖ్యాంశాలు.. 'కాపు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి చేరాలంటే రాజ్యాధికారం చేపట్టాలి. వారిని శాసించే స్థాయికి తీసుకువస్తానని పవన్ ప్రకటనలు చేశారు. 24 ఎమ్మెల్యే సీట్లు గెలిపించుకుని రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పుతాడని ఆశించిన పవన్ కళ్యాణ్ కొత్త అవతారం ఎత్తనున్నట్లు వస్తున్న వార్తలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. కాకినాడ నుంచి పార్లమెంటుకు.. ఏదో ఒక అసెంబ్లీ స్థానం నుంచి కూడా పోటీ చేయనున్నట్టు ప్రచారం జరుగుతుంది. ఇదంతా చూస్తుంటే పవన్ రాష్ట్ర రాజకీయాల్లో ఉంటాడా? లేక కేంద్ర రాజకీయాల్లో ఉంటాడా? అనేది అనుమానంగా ఉంది. కేంద్ర రాజకీయాల్లో ఉంటూ రాష్ట్రంలో చక్రం తిప్పాలనుకోవడం సాధ్యం కాదు. పవన్‌ను కేంద్ర రాజకీయాల్లోకి పంపాలనేది అతని స్వయంకృతాపరాధమా? లేక ఎవరిదైనా కుట్రా?.. పవన్ ఎంపీతో పాటు అసెంబ్లీకి పోటీ చేస్తే కేంద్రానికి వెళ్తారనే ఆలోచనతో అసెంబ్లీ స్థానంలో ఓటర్లు పవన్‌ను గెలిపించే అవకాశం ఉండదు. జనసేన పోటీ చేసే 24 స్థానాల్లోనూ ఓటర్లు జనసేన అభ్యర్థులను గెలిపించడానికి ఇష్టపడరు. ఇప్పటికే టీడీపీతో పొత్తు ఇష్టపడని జనసైనికులు చెట్టుకొకరు పుట్టకొకరుగా వెళ్లిపోయే ప్రమాదం ఉంది' అని లేఖలో పేర్కొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు డ్రోన్‌ల పంపిణీ

గుంటూరు రూరల్: వ్యవసాయరంగంలో అత్యాధునిక పద్ధతులను ప్రవేశపెట్టేందుకు వీలుగా స్వయం సహాయక మహిళా సంఘాలకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ డ్రోన్‌లను అందజేయడం ఎంతో సంతోషమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా అన్నారు. సోమవారం పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేశంలోని 11 ప్రాంతాల్లో రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన కార్యక్రమాలలో ఈ డ్రోన్‌లను అందజేశారు.జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంతో పాటు వాటి అనుబంధ రంగాల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారని అన్నారు. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ నేటి వ్యవసాయరంగంలో రైతులకు ఆధునిక వ్యవసాయానికి డ్రోన్ టెక్నాలజీ ఎంతో ఉపయోగకరమన్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అరుణ్ అళప్పగన్‌లు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ ఈ కార్యక్రమంలో 200 డ్రోన్‌లను ప్రత్యక్షంగానూ, మరో 1000 డ్రోన్‌లను వివిధ ప్రాంతాల్లో ఎస్‌హెచ్‌జీల సభ్యులకు వర్చువల్‌గా అందజేయటం జరిగిందన్నారు. ఇండియన్ ఫెర్టిలైజర్స్ డైరెక్టర్ అనురాగ్ రోహిత్గి మాట్లాడుతూ దేశంలో సుప్రసిద్ధ అగ్రిసొల్యూషన్స్ ప్రదాత కోరమాండల్ ఇంటర్నేషనల్స్ నమో దీదీ పథకం ద్వారా దేశ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు భారత ప్రభుత్వ మిషన్‌లో భాగంగా డ్రోన్‌లను అందజేయటం జరిగిందన్నారు.వ్యవసాయ డ్రోన్‌లతో 15 వేల మంది మహిళల నేతృత్వంలో స్వయం సహాయక సంఘాలకు సహాయం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు.మహిళలకు డ్రోన్లను అందజేశారు. ఏపీ కమిషనరేట్ అగ్రికల్చర్ జేడీ హరిబాబుచౌదరి, డీడీఏ ప్లానింగ్ ఫామ్ మెకనైజేషన్ ఏపీ కమిషనరేట్ ఆర్‌వీవీ స్వర్ణ విజయ, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణరాజు పిల్‌పై విచారణ 19కి వాయిదా

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు దురుద్దేశాలను ఆపాదించడంతో పాటు వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిల్ తదుపరి విచారణ ఈ నెల 19కి వాయిదా పడింది. ఎన్నికల సమయం కాబట్టి ప్రచార ప్రయోజనం కోసం ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని ప్రభుత్వం ఆరోపిస్తున్న నేపథ్యంలో ఎన్నికలు ముగిసిన తరువాతనే ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టాలని రఘురామకృష్ణరాజు తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు కోర్టుకు నివేదించారు. ఈ అభ్యర్థన పరిశీలించి ఉత్తర్వులు జారీ చేస్తామని హైకోర్టు తెలిపింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943